# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 32 సంచిక 10**

**అక్టోబర్ – 2021**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

*సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్***

*సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం*

---

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

**Hyderabad - 500 020.**

Ph: 040 - 27612436, 27645538.

---

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-

విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

కార్యదర్శి : వి. ఆశారాణి

ఫోన్ : 040 – 27645536. సెల్ : 994 951 6567.

---

**LCCN 91-903060** **ISSN 2454-4329**

E-mail: **misimi90monthly@gmail.com**

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

YouTube **: Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## అక్టోబర్ నెల సూచికలు...


ఆలపాటి రవీంద్రనాథ్ : శతజయంతి... 5
కమ్మతెమ్మెరలు : ... 6
తరాలు – అంతరాలు : ఎడిటర్స్ డైరీ... 7
ఆధ్యాత్మికత – మతము : అశ్వినీకుమార్... 8
ఆధ్యాత్మికత అంటే... : ఆచార్య పప్పు వేణుగోపాలరావు... 9
ప్రవాస సాహిత్యం – 13 – చేతన్ భగత్ : డా. రమేష్‌ప్రసాద్ రావెళ్ల... 13
ఇండాలజీ – 2 – సర్ విల్లియమ్ జోన్స్ : డా. అవధానం రఘుకుమార్... 17
డా. సూరి భగవంతం : డాక్టర్ నాగసూరి వేణుగోపాల్... 22
యలవర్తి నాయుడమ్మ : కాట్రగడ్డ శేషగిరిరావు... 25
పద్యకవితా "పురుషోత్తముడు" : డా. బీరం సుందరరావు... 35
అరుణ రావెల... : పున్నా కృష్ణమూర్తి... 37
'రాజకీయ గుండమ్మకథ' : పున్నా కృష్ణమూర్తి... 38
చలనచిత్ర గీతాలలో శాస్త్రీయ సంగీతం – 9 : ఆచార్య పురుషోత్తమాచార్య... 41
దేవమణి సత్యనాథన్ : పొదిలి నాగరాజు... 48
అమృతా షేర్‌గిల్ : తంగెడ విశ్వేశ్వర ప్రసాద్... 51
పర్యావరణోద్యమాలు : పూషడపు సుబ్బారావు... 55
ఇద్దరు వ్యక్తులు : కిల్లాడ సత్యనారాయణ... 58
కాటమరాజు కథలు : తోట వెంకటస్వామి... 59
మెలోడి మారాజు రాజన్ : పిల్లా తిరుపతిరావు... 63
భాష: పరభాష ప్రభావం : సగిలి సుధారాణి... 65
"ఆమె" లేఖలు : ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ... 68
నాటకరంగ చరిత్ర : పతివాడ సూర్యనారాయణ... 69
జె.ఎం. కుట్సీ : ముక్తవరం పార్థసారథి... 76
చదవండి... : *మిసిమి*... 80


**అట్టమీద బొమ్మలు**



గాంధారి వారసి
(చిత్రకారుడు: జాన్ విలియమ్ గోడార్డ్)



వనవాసి



బాలీలో కోవెల ద్వారం



అనాఘ్రాత
(చిత్రకారుడు మెల్ విల్కీ)

# ఆలపాటి రవీంద్రనాథ్ శతజయంతి ప్రత్యేకం

**మిసిమి** వ్యవస్థాపక సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్‌గారి శతజయంతి సంవత్సరం **నవంబర్ 4, 2021** మొదలవుతుంది. ఈ సందర్భంగా **మిసిమి** ప్రత్యేక వ్యాసాలు, రవీంద్రనాథ్ జీవన గమనం, స్మృతిపథం దిశగా ప్రచురించాలని సంకల్పించాం. రచయితలకు, పాఠకులకు మా వినయపూర్వక ఆహ్వానం. తమ రచనలను, రవీంద్రనాథ్‌గారితో తమ పరిచయ సందర్భాలను, స్మృతి బంధాలను తెలియజెప్పే రచనలకు స్వాగతం.


ఆలపాటి రవీంద్రనాథ్

పూర్వం రవీంద్రనాథ్‌గారి గురించి ప్రముఖులు రాసిన అనేక వ్యాసాలలో కొన్ని ఎంచి పాఠకులకు పంచాలని మా కోరిక. క్రొత్త తరం విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థులకు ప్రత్యేకంగా ఆలపాటి రవీంద్రనాథ్ జీవితం – పత్రికలు – రచనలపై ఎమ్.ఫిల్‌గాని, పిహెచ్.డి., గాని చేయ సంకల్పం ఉండి, విశ్వవిద్యాలయం అంగీకారం ఉంటే వారికి ఆర్థిక సహకారం అందించగలం.

**మిసిమి** మాసపత్రిక ప్రచురణకు ఎటువంటి ఆటంకమూ రాకూడదని సహృదయ పాఠక మిత్రులు తమ సహకారం అందిస్తామని ముందుకు వస్తున్నారు. వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు. ఆలపాటి రవీంద్రనాథ్ వారసులు **మిసిమి** పత్రికను నిరాఘాటంగా నడవడానికి (మంచి రచనలు వచ్చినంతకాలం) కృతనిశ్చయంతో ఉన్నారు. అందుకు కావలసిన వనరులను **మిసిమి** ఫౌండేషన్ ఏర్పరచి, సమకూర్చటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**మిసిమి** ద్వారా మేము నిర్వహించదలచుకున్న మిగతా కార్యక్రమాలు ఈ విధంగా ఉంటాయి:

2. 'ఆలపాటి రవీంద్రనాథ్' జీవిత సాఫల్య సారస్వత పురస్కారం (ప్రతి సంవత్సరం)

3. ఎంపిక చేసిన పుస్తకాల ప్రచురణ (**మిసిమి** ప్రచురణలు)

4. కళాశాల, విశ్వవిద్యాలయ తెలుగు విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం

5. తెలుగు వ్యాస రచనకు బహుమతి, పారితోషికాలు (విద్యార్థులకు)

ఈ దిశగా మరిన్ని వివరాలు రాబోయే **మిసిమి** సంచికలలో – **మిసిమి** కార్యాలయంలో అందుబాటులో ఉంటాయి.

ఉత్సాహం ఉన్న పాఠకులు ఈ కార్యక్రమంలో దేనినైనా స్పాన్సర్ చేయవచ్చు.

– సంపాదకులు

# కమ్మతెమ్మెరలు

"...*మిసిమి* ఆగస్ట్ 2021 సంచిక "జీవన వస్త్రానికి పుస్తకం ఒక జరీ అంచు" అన్న ఆచార్యుల మౌక్తిక పంక్తిని తడిమి లోపలికి వెళ్ళాను. బాపట్ల వ్యవసాయ కళాశాల వజ్రోత్సవ సంచిక పై సుందరమైన సమీక్ష చదివాను. శ్రీ కందుకూరి వీరేశలింగం గారి ప్రహసనాల మాధుర్యాన్ని ఆస్వాదించాను. నిరంతర సాహితీ జన సహవాసి, పెద్దలు శ్రీ తంగెడ కిషన్‌రావుగారి "మైత్రీబంధం" దగ్గర ఆగిపోయాను. స్నేహలతలు ఒత్తుగా అల్లుకుపోయిన పురాతన మైత్రీవనంలో 50 వసంతాల రుచులాస్వాదించిన రెండు గండుకోయిలల తియ్యని – గతమది – తన చెలికాడెక్కిన భద్రగజాన్ని తానూ ఎక్కానని ముచ్చటల మూట విప్పిన ఘనతది. పరమపదవాసి ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారి దగ్గర శిష్యులైన సహాధ్యాయులిద్దరు ఒకే విశ్వవిద్యాలయానికి కులపతులు కావడం గురు ఆశీర్వాద బలంగాక మరేమిటి. ఆలోచనలకు రూపమొస్తున్న కాలంలో అంకురించిన చెలిమి ఆదేశాలిచ్చే స్థానాల్లో కూర్చున్నా కొనసాగడం పదుగురూ మెచ్చదగిన విషయం. సంసారమనే కాసారంలో మోహమనే మకరికి చిక్కిన, పది ఇంద్రియ వృత్తులకు దాసుడైన, మదగజమనే జీవుని ఆక్రందనమే గజేంద్రమోక్షము. దానిని పెద్దలు, ఆచార్య భూమయ్యగారు, "మకర హృదయం" పేరుతో వ్యంగ్య వైభవాన్ని జోడించి, మానవీయ కోణంలో ఆవిష్కరించారని ఈ వ్యాసం వలన తెలుస్తున్నది. ఏది ఏమైనా స్వాతంత్ర్య భారతికి 75 ఏండ్లు, వారి స్నేహ సామ్రాజ్యానికి 50 ఏండ్లు, శ్రీ తంగెడవారు మిత్రులతో కలసి వర్ధిల్లాలి 100 ఏండ్లు. చివరిగా మాన్యులు అశ్వినీకుమార్‌గారి "మరణమంటే భయమెందుకు" చదివాను. ఏదైనా వస్తువు లేదా కట్టడం పూర్తిగా నాశనమవ్వడాన్ని తెలుగునాట "నామరూపాల్లేకుండా పోయింది" అంటారు. ఈ పలుకుబడి, బౌద్ధ సంబంధమైనదని ఈ వ్యాసం ద్వారా తెలుసుకున్నాను. "మరణం–జీవి మరో జన్మ ఎత్తడానికి ముందు పూర్తి కావలసిన ప్రథమ లాంఛనం".... మరి భయమెందుకు?"

*– పూషడపు సుబ్బారావు, అవనిగడ్డ*

".... శతాబ్దాల, దశాబ్దాల చారిత్రిక శిథిలాల మధ్య దృఢమైన 'కలాల'తో త్రవ్వకాలు జరిపి, నలిగి, గాయాలైన మానవీయ హృదయాల – వాటి వైభవాన్ని, విస్పష్టమైన సత్యసమాచారాన్ని పెకిలించి, పేర్చిన కూర్పు *మిసిమి* ..."

*– జి. జయంతి డానియేల్, నిర్మల్/హైదరాబాద్*

".... ఆగస్టు – 2021 *మిసిమి* లో *పత్రికలు* శీర్షికన *తెలుగు హాస్య పత్రికలు* గురించి రామవరపు వేంకట రమణమూర్తిగారి వ్యాసం చదివాను. అందులో ప్రముఖ కవి, కార్టూనిస్టు అయిన 'సుధామ'గారు 'శంకు'గారి 'హాస్యప్రియ' పత్రికను మాత్రమే పేర్కొన్నారు. చిత్రకారులూ, కార్టూనిస్టు అయిన దివంగత శ్రీ 'గూటారి' ప్రభాకరరావు ఆధ్వర్యంలో 'హాస్యప్రభ' మాసపత్రిక హైదరాబాదు నుంచి ఆరు సంవత్సరాలు పాటు (1975–1981) వచ్చింది. ఆ పత్రిక సంపాదకవర్గంలో నేనూ ఉన్నాను. ఒక శీర్షిక (వికసిస్తున్న కుసుమాలు)ను కూడా నిర్వహించాను. సుప్రసిద్ధ రచయితలు డా. రావూరు వెంకట సత్యనారాయణరావుగారు (కప్పు కాఫీ) శ్రీ ఆదివిష్ణు (మందు భౌతాళీయం) శీర్షికలు నిర్వహించారు. ప్రసిద్ధ నవలా రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి తొలి హాస్య నవల (లూపికా రాణి) ఈ పత్రికలోనే సీరియల్‌గా వచ్చింది. పాఠకులే రచయితలుగా మారి నడిపించిన 'గొలుసుకట్టు సీరియల్' కూడా ఇందులోనే. అసలు విషయం – 'హాస్య ప్రభ'లోనే 'గళ్ళ నుడికట్టు శీర్షికను నిర్వహించిన శ్రీ 'సుధామ' ఆ పత్రిక పేరును ప్రస్తావించకపోవటం నాకు ఆశ్చర్యాన్నీ, విస్మయాన్నీ కలిగించింది. సమాచారం సమగ్రంగా ఉంటే బాగుంటుంది కదా!... అందుకే ఈ వివరణ.."

*– బాలం వెంకట్రావు, హైదరాబాద్*

".... సెప్టెంబర్ – 2021 *మిసిమి నాగరకత* చదివి – భావసాంద్రతకు, వాక్య నిర్మాణానికి, విషయ విశ్లేషణకు మీ *నాగరకత* చక్కటి ఉదాహరణ.."

*– వి.ఎస్.ఆర్. మూర్తి, హైదరాబాద్*

".... సెప్టెంబర్ – 2021 *మిసిమి నాగరకత* చదివి – ఎన్నో తరాలుగా మనిషి ఆలోచనలు నాగరకత పేరుతో చలామణి అవుతున్న వికృత రూపాలను విశదంగా తెలియపరిచారు. కానీ మనకు నిష్కృతి ఉన్నదా?."

*– మోదుగుల రవికృష్ణ, గుంటూరు*

## *తరాలు – అంతరాలు*

ఎక్కువగా వాట్సాప్‌లో, ఫేస్‌బుక్‌లో ఇటీవల ఒకతరం పెడుతున్న పోస్టింగులు చూస్తే ఏదో ప్రపంచంలో నైతిక విలువలు మంటగలసిపోతున్నాయి – పెద్దవాళ్లని ఎవ్వరూ పట్టించుకోవటంలేదు – జబ్బు చేసినా – చనిపోయినా సంతానమే రావటం లేదు – ఇది ఎంతో దయనీయమైన స్థితి – మేము గోచీలు పెట్టుకు తిరిగాం – గోలీలు, గోడుంబిళ్ల ఆడుకున్నాం – స్కూలుకు నడిచి వెళ్లాం – గుడ్డి దీపాలతో చదువుకున్నాం – అరుగుల మీద కూర్చుని ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం – ప్రభుత్వాలను మార్చాము – మాకు మాష్టార్లు చాలా గొప్పవారు – షేక్స్‌పియర్ – మిల్టన్ చెప్పారు – ఇప్పటి తరానికి ఈ పేర్లే తెలియదు – ఈ విధంగా వాపోతున్నారు.

ఏమిటిదంతా? స్వాతంత్ర్యానంతరం భారతంలో వచ్చిన మార్పులు గమనిస్తే ఊళ్లన్నిటికీ కరెంటు రావటానికి ముప్పైఏళ్లు పట్టింది – రోడ్లు పడి బస్సులు నడవటానికి 20 ఏళ్ల పైనే – పంటలు పది బస్తాలు మొదలు ముప్పై పైన పండటానికి యాభై ఏళ్లు పట్టింది. ప్రపంచం ఎటో పోతుంటే – మనం గుడుగుడు గుంచాలే ఆడుతున్నాం – ఇక అవినీతి జాతి నరాల్లో కూరుకుపోయింది.

ఇప్పుడు వాపోతున్న 'సీనియర్ సిటీజన్లు' తమ సంతానాన్ని ఎలా పెంచారు? తమ కష్టాలు వారు పడకూడదు – వారికి మెరుగైన జీవితాలు ఇవ్వాలి – తమలాగా బురదలో వ్యవసాయం చేయకూడదు – పెద్ద చదువులు – పెద్ద ఉద్యోగాలు – వీటి కోసం ఎన్నో త్యాగాలు చేశారు – తాము కష్టాల దారిలో నడిచి – తమ తరవాత తరాన్ని – పట్టాలెక్కించారు – వాళ్లే విదేశాలకు పంపించి, గొప్ప సంబంధాలు చూసి – మీరు అక్కడే ఉండండి – ఈ ఇండియా రావద్దని నూరిపోశారు – తర్వాత ఒకటి రెండుసార్లు వాళ్లు డెలివరీ బాయ్స్‌గా వెళ్లి, అక్కడి షోకులు – షాకులు తిని నైకీ బూట్లతో తిరిగివచ్చి మార్నింగ్‌వాక్‌లు మొదలుపెట్టారు. అంతే – వాళ్లంతా మన క్లానే – ఇదంతా మన ప్లానే – ఎవరినీ నిందించవలసిన పని లేదు. తరాలు మారిపోతుంటాయి – ఎప్పటికి ఏది రైటో – అదే నడుస్తుంది. తూయటానికి ఏ త్రాసూ లేదు – ఎవ్వరూ ఎవ్వరితో పోల్చుకుని పొగులుకోకూడదు – మిత్రమా – ఇదంతా స్వయంకృతం! మీరు బాధపడవలసిన పని లేదు – ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ దగ్గర్లో మీకు గూడు కొన్నది వాళ్ల సౌకర్యం కోసం – వచ్చినప్పుడు అరగంటలో ఇంటికి చేరడానికి మళ్లీ ఈజీగా ఎగిరిపోవడానికి –

కాని మీకు అక్కడేం పని – మీ ఊళ్లో ఒక ఎకరంలో రెల్లుపాక వేసుకుని చుట్టూ కూరగాయలు – పూలమొక్కలు – మీకు సాయపడే సామాన్యులతో, ఆవుదూడలతో – కోడిపిల్లలతో ఆడుకోక ఈ సిమెంటు జంగిల్‌లో మీకేం పని? జబ్బు చేస్తే కార్పొరేట్ హాస్పిటల్‌కోసమా? ఇప్పుడు జబ్బులు (ఈ వయసులో) నయం అవుతాయా? మిగిలిన సమయాన్ని హాయిగా గడపండి – ప్రకృతిలో – సాటి మనుషుల్తో – వారికి సాయం చేస్తూ వారి సాయం తీసుకుంటూ గడపండి – వాళ్లే మిమ్మల్ని 'గట్టె'క్కిస్తారు – మీ సంతానం రారు రాలేరు – వారికి 'శెలవు' దొరకదు – ఏదైనా 'ఆదివారమే'! మరి అప్పటివరకు 'మనం' ఉండలేము కదా. ఎవరో దీపం పెట్టి ఘంటసాల *భగవద్గీత* పెట్టకపోరు – ఇదీ అసందర్భమే, *భగవద్గీత* బ్రతుకు ఎలా నడపాలో చెప్పేది – మరి దీర్ఘనిద్రలో ఉన్నవారికి ఎందుకు వినిపిస్తారో? మీ నాస్టాల్జియా వదిలించుకొని, మనస్సు ప్రశాంతంగా ఉంచుకోండి. *పుష్పవిలాపమో, భామాకలాపమో, అమ్మా సరోజినీదేవో* లాంటివి నిద్రపోయే ముందు వినండి. మంచి కలలు రావచ్చు. గుళ్లు రద్దీలో ఒళ్లు హూనం చేసుకోకండి. భక్తి ఛానెల్ ప్రవచనాల ప్రవాహంలో కొట్టుకుపోకండి. మీ పోస్టింగ్‌లు ఆలోచించి పెట్టండి – మిమ్మల్ని మీరు నిందించుకోవటం పరనిందకంటే మహా పాపం – ఎవ్వరూ అయ్యో పాపం అనరు – మీ 'సర్కిల్' అంతా ఇందులోనే ఉందిగా. మీ సమయం వృథా చేసుకోకండి.

మీ స్మార్ట్ ఫోన్‌ను మూర్ఛ బిళ్లలా మార్చకండి.

## ఆధ్యాత్మికత – మతము

*ఆ మధ్య వచ్చిన ఒక సినిమా చివరిలో రోబో తల 'నేను ఆలోచించటం మొదలుపెట్టాను' అనే మాటలతో అంతమవుతుంది. ఆలోచించటం ఎంత ప్రమాదమో అని మనం ఆలోచించవలసిన సమయం తెలుపుతోంది – యంత్రాలు ఆలోచిస్తే, అదే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్కడకు దారితీస్తుందోనని భయపడాల్సిన పరిస్థితి వస్తుంది. సరే! ఇదిలా ఉంచుదాం.*

*మనిషి ఆలోచించటం ఎప్పుడు మొదలయ్యిందో, ప్రకృతి ఆ 'వరం' ఎందుకు ప్రసాదించిందో మరి ఇప్పుడు ప్రకృతికే ప్రమాదకారిగా తయారయిన మనిషి ఆలోచనాసరళి ఏ విధంగా పరిణామం చెందుతుందో కదా – ఇదికూడా అలా ఉంచుదాం. అనంతకోటి ప్రాణుల్లో ఎవ్వరికీ లేని ఆలోచనా జ్ఞానం ఈ మనిషికే ఎందుకున్నదో మరి – అది ఆధ్యాత్మికతకు దారితీసి వేల సంవత్సరాలు గడిచిపోయాయి – జన సంచారం ఉన్న ఈ భూగోళం మీద అతి సనాతనమైన ఆధ్యాత్మికత భారత భూమినుంచే ప్రారంభమైన విషయం వివాదం లేని నిజం – ఎన్నో వేల సంవత్సరాలుగా ఈ ఆధ్యాత్మిక చింతన చివుర్లు తొడిగిన ఈ నేలమీద ధర్మపాలనే ముఖ్యమైన కర్మగా సాగింది. అప్పటికి 'మత'మో లేక మరో విశ్వాసమో రూపుదిద్దుకోనవసరం రాలేదు. అప్పటికి గ్రీకు భూమిలో కూడా మతమో మరేదో ప్రచారంలోకి రాలేదు. పంచభూతాలే పరమ పవిత్రమైన మూలకాలు, అవెందుకు కోపగిస్తాయో తెలియని అయోమయమే మనిషి భయం అప్పటికి – ఆ భయం – మరో శక్తి కోసం (The fight of Man with more than the Man) అన్వేషణలోనే విశ్వాసం శ్వాస తీసుకుంది. దానినే మతమన్నారు. దేవుడన్నారు – దెయ్యమూ అన్నారు. అది మొదలయ్యి రెండువేల సంవత్సరాల పైమాటే. అప్పటికే జైన తీర్థంకరులు – బుద్ధుడు తమ ఆధ్యాత్మిక చింతనతో మనిషి దుఃఖాన్ని నివారించటానికి అన్వేషించారు – అందుకోసం వారు గ్రీకుల్లాగా అతీత శక్తులను ఆశ్రయించలేదు – 'నీ జీవితానికి నీవే బాధ్యుడవు' 'నీ సత్ప్రవర్తనే ధర్మమార్గం – అదే ఆనందపథం' – అని తీర్మానించారు. ఆ తర్వాత ఐరోపా ఈ ఆధ్యాత్మిక చింతనకు స్వస్తి పలికింది – సరాసరి ఒక 'దేవుని' బిడ్డని భూమి మీదకు రక్షకునిగా దిగుమతి చేసి – 'నమ్మండి' ఇది 'మతము' అని ముద్ర వేసింది – దాని పర్యవసానం ఎన్ని చిలువల పలువలుగా మారి ఎంత మారణకాండ జరిగిందో – జరుగుతున్నదో మనకు తెలియంది కాదు. ఇదీ ఇక్కడితో వదిలివేద్దాం.*




*ఇప్పుడు మనం చేయవలసింది – ఆధ్యాత్మికత అంటే ఏమిటీ? మతమంటే ఏమిటి – ఇప్పటి కాషాయాంబరధారులు రెంటినీ ఏకం చేసి – చేసే ప్రచారం పరమార్థం ఏమిటి? వారు చెప్పేది ధర్మప్రచారమే అంటారు – అందులో ఆధ్యాత్మిక పాలెంత? ఆధ్యాత్మికత, సమూహాలతో – గుంపులుగా – లక్షదీపోత్సవాలతో వీలవుతుందా? ఈ సందేహాలన్నీ మేము అయిదుగురు – అరుదైన విజ్ఞులకు విన్నవించి మీరేమంటారు? ఆధ్యాత్మికత – మతమూ – రెండూ ఒకటి కాదు కదా – అని వారి అభిప్రాయాలను వ్రాసి పంపమన్నాం – రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, అరవిందుడు, రమణ మహర్షి, సత్యసాయి, జిడ్డు కృష్ణమూర్తి, రజనీష్ – వీరంతా ఆధ్యాత్మిక చింతనాపరులే – ఏ మతాన్నీ ప్రచారం చేయలేదు – త్యాగయ్య, అన్నమయ్య, జయదేవుడు, జాయప – వీరందరూ ఆధ్యాత్మిక ఆత్మసౌందర్యాన్ని సంగీత, నృత్యరీతులలో ఆరాధించిన మహాత్ములు – ఏ మతానికీ గొడుగుపట్టిన బడుగులు కాదు – వీరిని ఈ దృష్టితోనే అర్థం చేసుకోవాలి. ఇదివరకే చెప్పినట్లు ఏ మతమూ లేని చైనా, రష్యాలో ఆధ్యాత్మిక చింతనకు లోటు లేదు – వారి సంగీతం – చిత్రకళ, నృత్యరీతులే అందుకు సాక్షి. తూర్పు దేశాలు బౌద్ధాన్ని ఔదలఁదాల్చాయి అంటే వారికి మరో విశ్వాసంతో 'అవసరం' లేక – తమ ఆధ్యాత్మిక చింతనకు తోడుగా ఉండే బౌద్ధాన్ని అనుసరిస్తున్నారు – అయితే ఆధ్యాత్మిక చింతన ఎలా ఉన్నా, విశ్వాసాలు ఎన్ని వచ్చినా 'మనిషి' స్వార్థచింతనలో మార్పు వచ్చిందా? రావాలంటే ఏమిచేయాలి? ఆలోచించటం మొదలుపెట్టండి!*

# ఆధ్యాత్మికత అంటే...

*– పప్పు వేణుగోపాలరావు*

ఆధ్యాత్మికత, మతం, ఈ రెండూ ఒకటేనా? ముందు ఓ కథ చెప్తాను.

మనందరికీ తెలిసిందే. ఆది శంకరాచార్యలు కాశీలో ఒక వీధిలో నడుస్తున్నారు. వారి వెనుక వారి శిష్యబృందం ఉన్నారు. కాషాయంలో తేజస్సుతో ప్రకాశిస్తున్నారు వారు. ఆ వీధిలో గుమ్మంమీద ఓ ముసిలి పండితుడు కూర్చుని సంస్కృత వ్యాకరణ సూత్రం ఒకటి వల్లెవేస్తున్నాడు. ఆ సూత్రం, 'ధుకృంగ్కరణే'. అదే సూత్రం పదేపదే వల్లిస్తున్నాడాయన. శంకరులవారు 'నాయనా! దీనికి బదులు గోవిందా గోవిందా అనుకో. మరణం ఆసన్నమయినప్పుడు ఈ ధుకృంగ్కరణే'. రక్షించదు' అన్నారు.

*భజ గోవిందం భజ గోవిందం – గోవిందం భజ మూఢమతే*
*సంప్రాప్తే సన్నిహితే కాలే – నహి నహి రక్షతి ధుకృంగ్కరణే*

– అన్నారు. దీనితోపాటు మరికొన్ని శ్లోకాలున్నాయి. ఈ చిన్న గ్రంథం పేరు *మోహ ముద్గర*, అంటే మోహానికి సుత్తి వేటు.

అంటే ప్రాపంచికమైన జ్ఞానం తక్కువ కాదు కాని దానికి మించిన జ్ఞానం ఉంది అది తెలుసుకోమని అర్థం.

అందులో మరో మంచి శ్లోకం, ఆనాడే కాదు ఈనాడు ఇంకా ఎక్కువగా ఉపయోగపడుతుంది.

అదేమిటంటే.. ముందు దాని భావం చెప్తాను.

కొందరు జడలుగట్టిన జుట్టువారు, కొందరు గుండువారు, కాషాయం ధరించేవారు.. వీళ్ళందరిలో చాలామంది ఏమీ తెలియని మూర్ఖులు, వాళ్ళు వేసే ఈ వేషాలు 'ఉదర నిమిత్తం బహుకృత వేషః' అన్నారు. పొట్టకూటి కోసం వేసే వేషాలు.

*జటిలో ముండీ లుంచిత కేశః – కాషాయాంబర బహుకృత వేషః*
*పశ్యన్న పి చ న పశ్యతి మూఢః – ఉదర నిమిత్తం బహుకృత వేషః*

మన సంస్కృతి ఎంత గొప్పదంటే శత్రువుని కూడా గౌరవించమని చెప్తుంది. కాషాయం వేసుకున్నవారిని చూస్తే సాగిలబడి మొక్కుతాం, పాద పూజలు చేస్తాం, తప్పు కాదు. కానీ అందులో ఎందరు నిజమైన ఆధ్యాత్మిక మార్గదర్శనం చెయ్యగాలిగినవారు, జ్ఞానం ఉన్నవారు, ఉపదేశించే అర్హత కలిగినవాళ్ళు?

లోకంలో పాపం పెరిగితే, పాపభీతి పెరుగుతుంది. పాపభీతివల్ల లేనిపోని మూఢ నమ్మకాలు, పూజలు, పరిష్కార మార్గాలు వెదకడం ప్రారంభం అవుతుంది. అలాంటి సమయంలో ఆ అవకాశాన్ని ఉపయోగించుకునే గురువులనాశ్రయించడం జరుగుతోంది. పూజలు పునస్కారాలు తప్పుకాదు. గురువులనాశ్రయించడమూ తప్పు కాదు. అలాంటి సందిగ్ధతలో మనం ఆధ్యాత్మికానికి, మతానికి, మూఢనమ్మకాలకి, అంధవిశ్వాసాలకి వ్యత్యాసం తెలుసుకోలేకపోతున్నాం.

**వేదం కొన్ని మార్గ దర్శక సూత్రాలు చెపుతోంది..**

సంస్కృతంలో ఆ సూత్రాలు చెప్పడంకన్నా, వాటిని తెలుగులో చెప్తాను.

కొందరు అజ్ఞానంవల్ల నష్టపోతారట ! తెలిసియుండి ప్రమాదవశాత్తు కొందరు నష్టపోతారట. కొందరు తెలిసి తెలియని మిడిమిడి జ్ఞానంవల్ల నష్టపోతారట. మరికొందరు చెడినవారిచే చెరుపబడి నశిస్తారట. ఇవి నాలుగు రకాల దోషాలు.

ఈ సమయంలో మనకి కావలసినది ఏమిటంటే సనాతన ధర్మాన్ని తెలుసుకోడం. దాని కోసమే ఈ ప్రశ్నలు. ఆధ్యాత్మికం అంటే ఏమిటి, మతం అంటే ఏమిటి. మనం దేనిని ఎవరిని అనుసరించాలి. అసలు ఆధ్యాత్మం అంటే సంస్కృత భాషలో ఇవి రెండు పదాల కలయిక. సుమారు ఒక 10–15 నిర్వచనాలున్నాయి ఈ మాటకి. *భగవద్గీత* 7 –29 అంటే జ్ఞాన విజ్ఞాన యోగంలోను, 8వ అధ్యాయం, అక్షరబ్రహ్మ యోగం 3వ శ్లోకంలోని శ్రీకృష్ణ పరమాత్మ ఆధ్యాత్మం అనే మాటని నిర్వచించాడు.

దీని ప్రకారం స్వభావమే ఆధ్యాత్మం అని ఒక నిర్వచనం. అంటే మనలో ఉన్న మనని తెలుసుకోడం ఆధ్యాత్మం. మనలో ఉన్న పరమాత్మను తెలుసుకోవడం.

మనకందరికీ తెలుసుననుకునే మాట మతం. మతం అంటే నమ్మకం, విశ్వాసం. మనం అందరం ఒక మతంలో పుట్టాము. మన ఇంట్లో ఆచారాలు, వ్యవహారాలు, నమ్మకాలు మనం పూజించే దేవుళ్ళు, మన పూజా మందిరం, మన సంస్కారాలు, అంటే నామకరణం, అన్నప్రాశనం నుంచి మరణం అంత్యక్రియల వరకు అన్నీ ఈ మతాన్ననుసరించే జరుగుతాయి. అందులో చాలావాటిని మనం వంశాచారంగా సంప్రదాయంగ నమ్ముతాం, ప్రశ్నించం. కొన్ని మూఢ నమ్మకాలూ, అంధ విశ్వాసాలు కూడా ఇందులో చోటుచేసుకొని ఉంటే ఉండవచ్చు.

హిందూ మతానికి అసలు మతం అని పేరు లేదు. దీని అసలు పేరు సనాతన ధర్మం.

ఈ ధర్మం అన్న మాటకు కూడా అనేక అర్థాలున్నాయి. మతపరమైన సాంఘికమైన ఆచారాలూ ధర్మమే. కర్తవ్య పాలనమూ ధర్మమే.

ఎవరికి తోచిన, నచ్చిన వంశపారంపర్యంగా వసున్న ఆచారాలు వ్యవహారాలూ, సంప్రదాయాలు అనుసరించడం వారివారి ధర్మం. మానవునికి దేవునికి ఉండే సంబంధం నిర్వచించడం ధర్మమే.

ఆధ్యాత్మికం కూడా ఒక ధర్మమే. కాకపోతే ఆ మాట మన వాడుకలో ఉపయోగించేటంత తేలికైన పదం కాదు. మనం సాధారణంగా లోకంలో ఒక వ్యక్తి దేన్నైనా సాధించడానికి, ఓ ఉద్యోగానికో, ఇల్లు కట్టడానికో, పిల్ల పెళ్ళికో కష్టపడుతూ ఉంటే పాపం ఆయన పిల్ల పెళ్లి చెయ్యడానికి చాలా 'తాపత్రయ' పడుతున్నాడు అంటాం. ఇది తెలియకుండానే మనం వాడే ఒక గొప్ప వాక్యం. 'తాపత్రయం' అంటే మూడు తాపాలు.

ఆధ్యాత్మికం, ఆది భౌతికం, ఆది దైవికం అనేవి మూడు తాపాలు, కలిపితే అది తాప – త్రయం. మన సంస్కృతిలో గొప్పతనం అదే, మనం కొన్ని చాలా గహనమైన, సాంద్రమైన పదాలు వ్యవహారంలో తేలికగా వాడేస్తూ ఉంటాం. ఇలాంటిదే మరో మాట వేదాంతం. కాకపోతే ఇక్కడ ఆధ్యాత్మికం అనే మాటకు అర్థం వేరు.

ముందు తాపత్రయం అనేది తెలుసుకుందాం. చెప్పాను కదా అవి మూడు తాపాలు, అందులో మొదటిది ఆధ్యాత్మికం. అంటే ఆత్మకు సంబంధించిన తాపం. మనస్సు శరీరం మొదలైనవాటివల్ల కలిగే శోక మోహాలు ఆధ్యాత్మిక తాపం. మిగిలిన ప్రాణులు లేదా భూతలవల్ల కలిగే తాపం ఆధి భౌతిక తాపం. ఇతరమైన గ్రహాలచేతనో, శక్తులచేతనో కలిగేది ఆధి దైవిక తాపం. ఈ మూడు కలిపితే తాపత్రయం. మనం ఇక్కడ ఆధ్యాత్మిక శబ్దం ఇలా అర్థం చేసుకోవాలి. అందుకే శాంతి మంత్రాలు చదివేటప్పుడు ఓం శాంతిః శాంతిః శాంతిః అని శాంతిని మూడుసార్లు చెప్తాం, అవి ఈ తాపత్రయాలను, ఈ మూడు తాపాలను శాంతింపజేస్తాయిగనుక.

అసలు ఆధ్యాత్మికం అనే నిత్యం వాడే పదానికి ఆంగ్లంలో ఒక మాటలో చెప్పాలంటే spiritual అని అర్థం అంటే మనిషి తన ఆత్మను ఉనికిని లౌకికమైన విషయాలతో ముడిపెట్టకుండా తెలుసుకునే మార్గం ఆధాత్మికం. ఇందులో పూజలు, ఆచారాలు వ్యవహారాలూ ఉండవు జిజ్ఞాస ఉంటుంది. తెలుసుకోవాలనే ఒక అన్వేషణ ఉంటుంది. ధ్యానమో, తపస్సో, యోగమో, జ్ఞానమో, గ్రంథపఠనమో, గురువులనాశ్రయించి మార్గదర్శన పొందడమో ఆధ్యాత్మికం.

తన భక్తి తన పూజాపునస్కారాలు ఆచార వ్యవహారాలూ మతం.

ఈ రెండూ పరస్పర విరుద్ధం కావు. నిజానికి పరస్పర దోహకాలు. ఇందులో గురువుల స్థానం విశిష్టమైనది. సరియిన గురువు దొరకాలి.

పోతనగారు *భాగవతం* లో మానవత్వానికి మించిన మతం లేదనేమాట అవకాశం వచ్చినప్పుడల్లా చెపుతూ ఉంటారు. ఒకటి రెండు ఉదాహరణలు చూస్తే మానవత్వానికి మించిన జ్ఞానం, మతం లేవని అర్థం అవుతుంది.

*చేతులారంగ శివుని పూజింపడేని*
*నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని*
*దయయు సత్యంబు లోనుగా తలపడేని*
*కలుగనేటికి తల్లుల కడుపు చేటు ..*

పూజలు పునస్కారాలు చేస్తే సరిపోదు, దయ, సత్యం అనుసరించాలి.

ఇంకోచోట సుదాముడనే పూవులమ్ముకునేవాని ఇంటికి వెళ్ళారు శ్రీ కృష్ణబలరాములు. ఆయన శ్రీకృష్ణుని ఏమి కోరాడో వినండి.

*నీ పాద కమల సేవయు*
*నీ పాదార్చకులతోడ నెయ్యమును నితాం*
*తాపార భూత దయయును*
*తాపస మందార నాకు దయసేయగదే..*

అంటాడు. ముక్తిని కోరలేదు, ధనం కోరలేదు, అపారమైన భూత దయను ప్రసాదించమన్నాడు.

మతం అనేది విశ్వాసం. ఆధ్యాత్మం అనేది జిజ్ఞాస. తాము ఆచరించి చెప్పేవారు ఆచార్యులు. అజ్ఞానాన్ని తొలగించేవారు గురువులు. మన భారతీయ సంస్కృతి మానవత్వానికిచ్చిన విలువ మతంకన్నా గొప్పది. శ్రీ కృష్ణుడు భగవద్గీతలో ఒక శ్లోకంలో ఈ సారాన్ని చక్కగా వివరించాడు.

విద్యా వినయ సంపన్నుడైన బ్రాహ్మణునియందును, ఒక ఆవుపట్ల, లేదా కుక్కయందు, ఆ కుక్కమాంసం వండుకుని తినేవాడియందు సమదృష్టి కలిగినవారే పండితులు. ఇది సర్వం భగవంతుని సృష్టి అయితే అందులో ఏది ఎక్కువ ఏది తక్కువ. అన్నిటియందు భగవంతుని చూడలేని మతమెందుకు, జ్ఞానం ఎందుకు, పాండిత్యం ఎందుకు?

ఆ పరతత్త్వాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించడమే ఆధ్యాత్మికం. అదే సనాతన ధర్మం.

మొట్టమొదట ఈ ఆధ్యాత్మ విచారం ప్రస్ఫుటంగా ఉపనిషత్తులలోను, తరువాత బ్రహ్మసూత్రాలలోను ప్రారంభం అయింది.

ఉదాహరణకి కొన్ని ముఖ్యమైన ఉపనిషత్తులను పరిశీలిద్దాం. అందులో ఒక చిన్న ఉపనిషత్తు, కేనోపనిషత్తు. కేన అంటే ఎవరిచే అని అర్థం. ఈ విశ్వం అంతా ఎవరిచే సృష్టించబడింది, ఎవరు అనే ప్రశ్నకు సమాధానం కేనోపనిషత్తు. ఈ అన్వేషణ ఇలా అన్ని ఉపనిషత్తులలో వివిధ కోణాలలో ఉంది.

ఉపనిషత్తులను మనకు అందించిన ఋషులు ఇది మేం చెప్తున్నాం అనకుండా మాకు ఇది వివరించిన మహాపురుషులు ఇలా అన్నారు అని మాత్రమే చెప్పడం ఇంకో విశేషం. అంటే నేను నాది అనే అహంకార మమకారాలకు దూరంగా ఉండడం మొదటి మెట్టు. వారే ఆచరించి చూపారు. ఈ విశ్వాన్ని నడిపించే మానవాతీతమైన శక్తి ఏదో ఉంది అది ఏమిటి, లేదా ఎవరు అనేది కేనోపనిషత్తు. అజ్ఞానం అనే చీకటికి ఆవల ఉన్న తేజస్సు గురించి చెప్పేది శ్వేతాశ్వతర ఉపనిషత్తు. అయితే దాని వెనుక ఆ వెలుగు వెనుక ఏమున్నది అనే అన్వేషణ ఈశావాశ్య ఉపనిషత్తు.

*ఈశావాస్యం ఇదగ్ం సర్వం - యత్కించిత్ జగత్యాం జగత్*
*తేన త్యక్తేన భుఞ్జీథా - మాగృధః కస్యస్విద్ ధనం*

అనేది మొదటి శ్లోకం. సంస్కృత సాహిత్య సంప్రదాయంలో మొదటి శ్లోకంలోనే గ్రంథాన్ని ఆవిష్కరించడం ఒక విశిష్టమైన ఆచారం. ఈ శ్లోకం ఏం చెపుతుందంటే.. 'మార్పు చెందే లక్షణం ఉన్న ఈ లోకంలో సమస్తమూ భగవంతునిసృష్టి, అది తెలిసి త్యాగచింతనతో జీవితాన్ని గడుపుకోవాలి, ఎవరి ధనాన్నీ ఆశించకు.'

త్యాగము, అశాశ్వతము, సర్వమూ భగవంతుని సృష్టి అనే మూడు విషయాలు ఇందులో ముఖ్యమైనవి. ఆధ్యాత్మిక మార్గంలో మొదటి సోపానాలు ఇవే.

ముండకోపనిషత్తు మరొక చిన్నదైనా ముఖ్యమైన ఉపనిషత్తు. ముండ అనే శబ్దంలోంచి ఈ పేరు వచ్చింది.

ముండ అంటే సంస్కృతంలో గుండుగలవాడని అర్థం, లేదా మంగలివాని కత్తి అని అర్థం. దీనికీ ఈ పేరు ఎందుకు

వచ్చిందంటే.. మంగలివాని కత్తి జుట్టును పూర్తిగా ఏ రకంగా కత్తిరించి వేస్తుందో, అలాగే అజ్ఞానాన్ని పూర్తిగా కత్తిరించి ఆధ్యాత్మికతను అందిస్తుంది ఈ ఉపనిషత్తు.

నీడను నిజమనుకుని దాని వెంట పరుగిడడం జీవితంలో మాయ. మనిషి, లోకం, భగవంతుడు అనేవి మూడు ముఖ్యమైన విషయాలు. మనిషి ఈ లోకంలో జీవిస్తూనే మూడో విషయం అయిన భగవంతుని అన్వేషించడమే ముండకోపనిషత్తు తెలియజేస్తుంది, ఈ అవగాహనే ఆధ్యాత్మికత.

అయితే ఈ ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణం చెయ్యడానికి ఏ మాత్రం వయస్సు ఉండాలి? ఇది విషయాలను వాయిదా వేసే మనస్తత్వంగలవారు వేసే ప్రశ్న. ఇంకా వయసుందని సర్దిచెప్పుకుంటూ ఉంటారు. తామరాకు మీద నీటిబొట్టు ఈ జీవితం. ఎప్పుడు పాదరసంలా మెరుస్తున్న ఆ నీటిబొట్టు మిగిలిన జలరాశిలో కలిసిపోయి అస్తిత్వాన్ని కోల్పోతుందో. అందుకని కఠోపనిషత్తు. ఇందులో నచికేతుడనే బాలుడు మృత్యువు తరువాత జీవితం ఏమిటో తెలుసుకునే కథ ఉంది. అంటే ఆధ్యాత్మిక మార్గంలో నడవడానికి అన్వేషణకి వయసుతో నిమిత్తం లేదు. అలాంటివారే మనకు పురాణాలలో కనిపించే ఎందరో బాలురు, ధ్రువుడు, ప్రహ్లాదుడు, మార్కండేయుడు.. ఇలా.

అనేకమైన ఉపనిషత్తులు ఈ విషయాలను వివరించాయి. ఉపనిషత్తులు సామాన్యంగా 108, వీటిలో ఒక 14 ప్రధానమైనవి. ఒక్కొక్క వేదం చివర ఇవి ఉన్నాయి, వేదమునకు అంతమందు ఉన్నాయి గనుక వీటిని వేదాంతము అంటున్నాం.

ఇందులో ఒక పది ఉపనిషత్తులకు ఆది శంకరాచార్యులు వ్యాఖ్యానం వ్రాశారు. మిగిలిన ఆచార్యులూ వ్రాశారు. దీని తరువాత వచ్చినది వ్యాస మహర్షి సృష్టించిన బ్రహ్మ సూత్రాలు. దీని ఉద్దేశమే ఆధ్యాత్మం గురించి చెప్పడం. అందుకే 555 సూత్రాలున్న ఈ గ్రంథంలో మొదటి సూత్రం అథాతో బ్రహ్మ జిజ్ఞాసా – అని అంటే అటు తరువాత, అందువలన ఇప్పుడు బ్రహ్మమును గురించి తెలుసుకొనే కోరిక అని అర్థం. ఎటు తరువాత, ఎందువలన అంటే జీవితంలో ఐహిక సుఖములు అనుభవించిన తరువాత అనుకోండి మరేదేనా అనుకోండి, ముఖ్యంగా తెలుసుకోవలసింది మనకు మించిన ఆ శక్తిని పరబ్రహ్మము అని పిలిస్తే, ఆ పరబ్రహ్మం ఏమిటో తెలుసుకొనే కోరిక అనే సూత్రంతో ప్రారంభం అవుతాయి బ్రహ్మ సూత్రాలు. వేదాంత మార్గంలో లేదా ఆధ్యాత్మిక మార్గంలో మూడు ముఖ్యమైన గ్రంథాలు ఉన్నాయి. వీటిని ప్రస్తాన త్రయం అంటారు.

1. భగవద్గీత, 2. ఉపనిషత్తులు, 3. బ్రహ్మ సూత్రాలు. ప్రస్థానం అంటే వెళ్లిపోడం అని అర్థం, ఇంకా అనేక అర్థాలున్నాయి, దేన్నయిన పొందే మార్గం అని, అంటే ముక్తిని చేరే మార్గం, లేదా ఆధ్యాత్మ మార్గానికి మూడు ముఖ్యమైన గ్రంథాలు ప్రస్థాన త్రయం.

ఇవన్నీ విన్న తరువాత ఒక సందేహం వస్తుంది. అయితే ఆధ్యాత్మిక మార్గం ఈ గ్రంథాలు చదివినవాళ్లకేనా. మిగిలిన మతాలవారికి చదవలేని వారికీ లేదా..

ఉంది. ఏమిటది? అన్వేషణ, జిజ్ఞాస, మానవత్వం, మతాలకు అతీతమైన మానవాతీత శక్తిని గ్రహించే శోధన. దానికి కుల మతాలూ లేవు, పూజా పునస్కారాల అవసరం లేదు, తీర్థయాత్రలతో పనిలేదు. ప్రాణులందరూ ఆ పరాశక్తి సృజన అని గ్రహించి అందరినీ సమానంగా చూడడం, ఆ శక్తిని తెలుసుకునే అన్వేషణ చెయ్యడం ఆధ్యాత్మికం.

నిజానికి ఈ మార్గానికి ఇది త్రోవ అని ఒక సిలబస్ లేదు. ఎవరి మార్గం వారిది. కాకపోతే కొన్ని మార్గదర్శక సూత్రాలు ఉన్నాయి, గ్రంథాలున్నాయి. పూర్వులు నడచిన మార్గాలున్నాయి, దిశానిర్దేశం చేసే గురువులున్నారు. అన్నిటికన్న ముఖ్యమైన మూడు లక్షణాలు.

1. సంకుచిత తత్త్వం వదిలిపెట్టడం,

2. సర్వ భూతములయందు సమానత్వముగలిగి యుండడం,

3. మనకు మించిన మానవాతీత శక్తిని తెలుసుకునే అన్వేషణ చెయ్యడం.

ఆచార్య పప్ప వేణుగోపాలరావు
చెన్నై. ఫోన్: 938 069 2103.



చేతన్ భగత్

## ప్రవాస సాహిత్యం – 13

# చేతన్ భగత్

– రమేష్ ప్రసాద్ రావెళ్ల

చేతన్ భగత్ ఒక ఉత్పాతము, విశేష ఘటనయా (phenomenon), లేక ఆయనదంతా వట్టి చౌకబారు సాహిత్యమా (pulp fiction)? లేక రెండూనా? పరిశీలించుదాం.

**Five Point Someone (2004)** చేతన్ భగత్ వ్రాసిన మొదటి నవల. IIT ఢిల్లీలో చదువుకొంటున్న ముగ్గురి స్నేహితుల కథ ఇది. కథకుడు హరి. మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చినవాడు. రైయన్ సంపన్న కుటుంబీకుడు. చిన్నప్పటి నుండి బోర్డింగు స్కూళ్ళలో చదువుకొన్నాడు. అలోక్ పేద కుటుంబం నుండి వచ్చాడు. తండ్రి పక్షవాతంతో మంచానికి పరిమితం అయ్యాడు. తల్లి తన టీచర్ ఉద్యోగంతో అలోక్‌ని చదివిస్తున్నది. మధ్య తరగతి నుండి వచ్చిన హరి ఈ నవలలో ముఖ్యపాత్ర, కథకుడు. కథాకాలం వారు ముగ్గురూ బి.టెక్. చదువుతున్న చివరి రెండేళ్ళు. హరి, అలోక్, రైయన్ సగటు విద్యార్థులు. వాళ్ళ గ్రేడులు అయిదు పాయింట్లలో ఉంటాయి. (ఐఐటి గ్రేడింగ్ పద్ధతిలో పది అంటే వంద శాతం కింద లెక్క.) వాళ్ళు క్లాసులు ఎగ్గొట్టి, సినిమాలకు వెళ్ళటం, త్రాగుడు పార్టీలు చేసుకోవటం, ఇతర వ్యసనాలకు అలవాటు పడతారు. హరి నేహ అనే అమ్మాయిని యాధృశ్చికంగా కలుస్తాడు. స్నేహం చిగురిస్తుంది. నెలకోసారి ఒక ఐస్‌క్రీం షాపులో కలుస్తుంటారు. నేహ తండ్రి క్రమశిక్షణాపరుడు. నేహ అబ్బాయిలతో కలవటం అతనికి ఇష్టం ఉండదు. పైగా ఆయన ఐ.ఐ.టి.లో మెకానికల్ ఇంజినీరింగు శాఖాధిపతి ప్రొఫెసర్ చెరియన్. ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఒక రోజున నేహ హరిని ఇంటికి రమ్మని పిలుస్తుంది. కబుర్ల మధ్య తన కుటుంబ రహస్యాన్ని హరితో పంచుకొంటుంది. నేహ తమ్ముడు సమీర్ కొంత కాలం క్రితం యాక్సిడెంట్‌లో రైలు క్రింద పడి, చనిపోయాడు. నేహ సమీర్ తనకు వ్రాసిన ఆత్మహత్య లేఖను హరికి చూపిస్తుంది. తండ్రి ప్రొఫెసర్ చెరియన్ ఐ.ఐ.టి. ప్రవేశ పరీక్షలు పాస్ అవ్వాలని తన మీద పెట్టుతున్న వత్తిడికి తట్టుకోలేనని, తనకు ప్యాస్ అయ్యే శక్తి లేదని, అందులో వ్రాశాడు. నేహ ఆలేఖ గురించి తల్లిదండ్రులకెన్నడూ చెప్పలేదు. హరి, నేహ సుఖాన్ని అనుభవించినాక, స్టోరుకి వెళ్లి, సిగరెట్లు పట్టుకురమ్మని నేహ హరిని పంపుతుంది, తన ఫామిలీ కారు ఇచ్చి. హరి స్టోరు నుండి వస్తూ, కారు తాళపుచెవుల చైనులో ఉన్న వాటన్నిటికీ డూప్లికేట్ తాళం చెవులు చేయిస్తాడు.

క్లాస్‌మేట్లు ముగ్గురూ చివరి సంవత్సరంలో ఎంత ప్రయత్నించినా వాళ్ళ గ్రేడులు మెరుగుపడటంలేదు. పరీక్షలకు ముందు ఒకరోజు రాత్రి ప్రొఫెసరు చెరియన్ ఆఫీసులోకి టెస్ట్ పేపర్లు దొంగిలించటానికి నిర్ణయించుకొంటారు. హరి దగ్గరున్న డూప్లికేట్ తాళం చెవితో ప్రొఫెసరు ఆఫీసు ద్వారం తెరుస్తారు. ఆఫీసులో ఆ టెస్ట్ పేపర్ల కోసం వెతుకుతుండగా, సెక్యూరిటీవాళ్ళు వచ్చి పట్టుకొంటారు. ప్రొఫెసరు చెరియన్‌తో కూడిన క్రమశిక్షణ కమిటీ వాళ్ళ ముగ్గురినీ రెండు నెలలు సస్పెండు చేస్తుంది. ఆ టర్మ్‌కి ఆ ముగ్గురికి తప్పిన గ్రేడ్లు వచ్చివుండేవి. ప్రొఫెసరు వీరా వాళ్ళమీద దయదలిచి, తాను వాళ్ళ ముగ్గురినీ తన స్పెషల్ ప్రాజెక్టులో పెడతానని, ఆ ప్రాజెక్టు విజయవంతం అయితే, కంపెనీల నుండి ఎన్నో గ్రాంట్లు, పరిశోధక నిధులు వస్తాయని, ప్రొఫెసరు చెరియన్‌ని ఒప్పిస్తాడు. నేహ సమీర్ వ్రాసిన ఆత్మహత్య లేఖను తండ్రికి

చూపిస్తుంది. ప్రొఫెసరు చెరియన్ భోరున ఏడుస్తాడు. తన తప్పిదం తెలుసుకొంటాడు. ప్రొఫెసర్ వీరాగారి ప్రాజెక్ట్ మంచి ఫలితాలను ఇస్తుంది. మొత్తానికి హరి, రైయన్, అలోక్ ప్యాసు అవుతారు, డిగ్రీలు సంపాదిస్తారు. ముగ్గరూ కార్పొరేటు ఉద్యోగాలు దక్కించుకోగలుగుతారు.

**2 States (2009)** నవలలో కూడా విద్యాసంస్థ నేపథ్యం ఉంటుంది. క్రిష్, అనన్య IIM అహ్మదాబాద్ మెన్‌హోల్‌లో కలుసుకోవడంతో నవల ప్రారంభం అవుతుంది. ఇద్దరూ అక్కడ ఎమ్.బి.ఏ.లో చేరారు. క్రిష్ ఐఐటి ఢిల్లీ నుండి వచ్చిన పంజాబీ యువకుడు. అనన్య తమిళనాడు యువతి. ఉత్తమ శ్రేణి విద్యార్థిని, సౌందర్యవంతురాలు. పరిచయం స్నేహంగా మారుతుంది. ఇద్దరూ ఉమ్మడి చదువు చేద్దామని నిర్ణయించుకొంటారు. ప్రతి రాత్రి కలిసి చదువుకోవటంతో చనువు ప్రేమగా మారుతుంది. ఇద్దరూ పెళ్లిచేసుకొందామని నిర్ణయించుకొంటారు. రెండేళ్లలో చదువు ముగుస్తుంది. అనన్యకు తన స్వంత పట్టణం చెన్నైలోనే ఒక అంతర్జాతీయ కంపెనీలో ఉద్యోగం వస్తుంది. క్రిష్‌ని వాళ్ల అమ్మ ఢిల్లీ ప్రాంతంలోనే ఉద్యోగం చూసుకోమని సూచించినా, క్రిష్ ముంబాయి కంపెనీలో చేరుతాడు. చెన్నై ప్రాంతీయ ఆఫీసులో ఉద్యోగం వేయించుకొని, అక్కడ చేరుతాడు. అనన్య కుటుంబానికి చేరువ అవ్వటానికి ప్రయత్నిస్తాడు. అనన్య తమ్ముడు మంజుకి ఐఐటి ప్రవేశపరీక్షకు ఉచితంగా రోజూ ట్యూషన్ చెప్పుతాడు. అనన్య తండ్రి స్వామినాథన్ బ్యాంక్ మానేజర్. ఆయన హెడ్డాఫీసు బాసులకు ప్రతిపాదన, ప్రెజంటేషన్ చేయాలి. కాని స్వామినాథన్‌కి ఆధునిక టెక్నాలజీ సాధనాలు తెలియవు. అందుకు క్రిష్ సహాయం చేస్తాడు. స్వామినాథన్‌ను సంతోషపరుస్తాడు. తన కంపెనీ ఫంక్షన్‌లో అనన్య అమ్మకి పాటలు పాడే అవకాశం కల్పిస్తాడు. అనన్య తల్లిదండ్రులు క్రిష్, అనన్య పెళ్ళికి సుముఖులవుతారు. అనన్యను తీసుకొని క్రిష్ ఢిల్లీ వెళ్ళతాడు. క్రిష్ పంజాబీ కుటుంబంలో ఎవరికీ అనన్య మొదట్లో నచ్చదు. వాళ్ళ సంకుచిత మనస్తత్వాలు, జ్ఞానహీన భావాలు వెల్లడి అవుతాయి. దగ్గర చుట్టాలమ్మాయి పెళ్ళికి క్రిష్ కుటుంబంతో పాటు అనన్య కూడా వెళుతుంది. కట్నం బహుమతిగా పెళ్లికొడుక్కి మంచి కారు ఇవ్వలేదని అతని తరపు వాళ్లు భీష్మించి కూర్చుంటారు. పెళ్లి పీటల మీద ఆగే పరిస్థితి. క్రిష్ తరపు యువతీయువకులతో కలిసి పెళ్ళికొడుకుని ఒకప్రక్కకు తీసుకువెళ్ళి, అనన్య అతన్ని నిలదీస్తుంది. వాళ్ళు అడిగే షరతులకు అతడు సిగ్గుపడేలా చేస్తుంది. పెళ్ళికొడుకు ధైర్యం తెచ్చుకొని తన తండ్రిని ఎదుర్కొంటాడు. పెళ్లి సజావుగా జరుగుతుంది. అనన్య చాతుర్యానికి, చొరవకు, నాయకి లక్షణాలకు, ఆగబోయే పెళ్లిని రక్షించినందుకు క్రిష్ కుటుంబం సంతసిస్తారు. తరువాత కొన్ని ఒడిదొడుకులు వచ్చినప్పటికీ, క్రిష్ అనన్యను పెళ్లి చేసుకొంటాడు. అనన్యకు కవలలు పుట్టటంతో నవల ముగుస్తుంది. చేతన్ భగత్ ఐఐటి ఢిల్లీలో ఇంజినీరింగు చదివారు. తరువాత IIM అహ్మదాబాద్‌లో ఎమ్.బి.ఏ. చదివారు. అక్కడ సహాధ్యాయురాలు అనూషతో కలిసారు. ప్రేమించి, పెళ్ళాడుకొన్నారు. అనూష తమిళ బ్రాహ్మణ యువతి. వారి పెళ్ళికి రెండువైపుల నుండి విముఖత వచ్చినప్పటికీ, వారిద్దరూ ప్రేమవివాహం చేసుకొన్నారు. ప్రత్యేకించి ఇలా వ్రాయటానికి కారణం ఏమిటంటే, పై చెప్పిన రెండు నవలలు చేతన్ నిజ జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. తన జీవితంలోని సంఘటనలనే నవలలుగా మార్చిడి చేసి, విశేషాదరణను పొందుగొన్నారు. హాంగ్ కాంగ్‌లో గోల్డ్‌మ్యాన్ శాక్స్, డోచె బాంక్ (Deutsche Bank)లలో పనిచేశారు. అక్కడ పనిచేస్తూనే, మొదటి మూడు నవలలు ప్రచురించారు. ఆ నవలలు అసమాన విజయవంతం కావటంతో, బాంకు ఉద్యోగం మానివేసి, సంపూర్ణకాల రచయతగా స్థిరపడ్డారు. ఇప్పటికి తొమ్మిది నవలలు, మూడు వ్యాస గ్రంధాలు ప్రచురించారు. ఆ నవలలు పదకొండు మిలియన్ల కాపీలు అమ్ముడు పోయినాయి. పదిహేను భాషల్లోకి అనువదింపబడ్డాయి. ఈ మధ్యకాలంలో ఇంతటి ఆర్థిక విజయాన్ని సాధించిన నవలాకారులను వేళ్ళమీద లెక్కించవచ్చును. హారీ పాటర్ పుస్తకాలు వ్రాసిన J.K. రౌలింగ్, డా విన్సి కోడ్ వ్రాసిన డాన్ బ్రౌన్ బీ కేన్ అండ్ ఏబుల్, బెస్ట్ కెప్ట్ సీక్రెట్ వంటి నవలలు వ్రాసిన జెఫ్రీ ఆర్చర్ స్థాయికి ఇండియన్ నవలారంగంలో చేతన్ భగత్ చేరారు.

**The Girl in Room 105** (2018) నవలలో కేశవ్ ఢిల్లీలో ఒక ఐఐటి ప్రవేశపరీక్షల కోచింగ్ సెంటర్‌లో ట్యూషన్లు చెప్తుంటాడు. ఐఐటిలో చదివినా, తక్కువ గ్రేడుల మూలంగా కార్పొరేట్ ఉద్యోగం రాకపోవటంతో కోచింగ్ సెంటర్‌లో చేరాడు. ఐఐటిలో పిహెచ్.డి. చేస్తున్న జారా, కేశవ్ ప్రేమించుకొంటారు. జారా కాశ్మీర్ ముస్లిమ్ యువతి. జారాను తన తల్లిదండ్రులకు పరిచయం చేయటం కోసం రాజస్థాన్‌లో ఇంటికి తీసుకు వెళ్తాడు. కేశవ్ తండ్రి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్త, స్థానిక నాయకుడు. జారాతో ఎట్టి సంబంధానికి ఒప్పుకోడు. వెంటనే ఢిల్లీకి ఆ రాత్రియే జారాను తీసుకు వెళ్ళమని కేశవ్‌కి చెప్తాడు. జారా తల్లిదండ్రులయినా సమ్మతి తెలిపితే పెళ్లి చేసుకొందామని నిర్ణయించుకొంటారు. జారా కేశవ్‌ని తన ఇంటికి తీసుకువెళ్తుంది. జారా తండ్రి కేశవ్ మతం మార్చుకోవాలని షరతు పెట్టతాడు. రెండు కుటుంబాల నుండి ఇట్టి వ్యతిరేకత రావటంతో వాళ్ళ ప్రేమ భగ్నం అవుతుంది. జారాకు రఘుతో పరిచయం అవుతుంది. వివాహం చేసుకొందామని నిర్ణయించుకొంటారు. రఘుకి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. జారా పుట్టిన రోజు రాత్రి కేశవ్‌కి ఫోను మెసేజ్ పంపుతుంది. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఎందుకు పంపలేదని అడుగుతుంది. తన హాస్టల్ రూముకి వెంటనే రమ్మని ఇంకో మెసేజ్ పంపుతుంది. కేశవ్ వెంటనే జారా రూముకి (రూమ్ 105) వెళ్తాడు. వెనకాల చెట్టు ఎక్కి తెరిచి ఉన్న కిటికీ ద్వారా రూమ్‌లోకి దిగుతాడు. జారా బెడ్ మీద నిద్రపోతున్నది. కేశవ్ జారాని కదిలించాడు. నిశ్చల స్థితిలో ఉన్నది. జారా చనిపోయిందని కేశవ్ గ్రహిస్తాడు. శరీరం మీద గాయాలేమీ లేవు. వెంటనే పోలీసులకు ఫోన్ చేస్తాడు. ఇక మిగతా నవల అంతా సాదా డిటెక్టివ్ నవల. పోలీసు ఇన్స్‌పెక్టరు స్వంత ప్రమోషన్ గొడవలు, హాస్టలు వాచ్‌మన్ నిర్దోషి అయినా అతన్ని జైలులో పెట్టటంలాంటివి జరుగుతాయి. కేశవ్ డిటెక్టివ్ అయిపోతాడు. మరి అసిస్టెంట్ ఉండాలిగదా! కేశవ్ రూమ్మేటు సౌరభ్ ఆ పాత్రను పోషిస్తాడు. ముగ్గురు నలుగురు అనుమానితులు ఉంటారు, పాఠకులను ప్రక్కదారిన మళ్ళించటానికి. విచారణ ఒక కొసకు వచ్చాక, కేశవ్ జారా తండ్రిని తన కుమార్తె స్మారక చిహ్నంగా డిన్నరు ఏర్పాటు చేయమంటాడు. అందరి సమక్షంలో కేశవ్ రఘు హంతకుడని నిరూపిస్తాడు, వివరాలు చెప్తాడు. జారా వేరే సంబంధంతో గర్భవతి అయ్యి అబార్షను చేయించుకొన్నదని తెలుసుకొని, రఘు జారాను చంపదలుచుకొన్నాడు. అందుకోసం గట్టి ఎలిజీ సృష్టించుకొంటాడు. హైదరాబాదులో రౌడీలచేత కొట్టించుకొని హాస్పిటలులో చేరతాడు. ఒకరాత్రి హైదరాబాదు నుండి, విమానంలో ఢిల్లీ వెళ్లి, చెట్టు ఎక్కి కిటికీ ద్వారా జారా రూమ్‌లోకి వెళ్లి, ఆమె గొంతు నులిమి, చంపివేస్తాడు. జారా ఫోనుతో కేశవ్‌కి మెసేజ్‌లు పంపుతాడు. తెల్లవారుజామున విమాన యానంతో హైదరాబాదు తిరిగి వెళ్లి, తన హాస్పిటలు బెడ్ పై పడుకొంటాడు. అక్కడ ఎవరికీ అనుమానం రాదు. కేశవ్ ఈ వివరాలన్నీ చెప్పగానే, పోలీసులు వచ్చి రఘుని అరెస్టు చేస్తారు.

**One Arranged Murder** (2020) పూర్తి డిటెక్టివ్ నవల. కేశవ్ డిటెక్టివ్, సౌరభ్ అసిస్టెంట్. సౌరభ్, ప్రేరణ పెళ్లి నిశ్చయమయింది. కార్తీక బహుళ చవితి సాయంకాలం ప్రేరణ సౌరభ్‌ని తన ఇంటికి రమ్మని అడుగుతుంది. వాళ్ళ మేడ టెర్రస్‌పై కలువమంటుంది. సౌరభ్ వెళ్ళేటప్పటికి ప్రేరణ వాళ్ల మేడ ముందు వీధిలో రక్తపు మడుగులో చనిపోయి ఉన్నది. ఆత్మహత్య చేసుకొన్నదా, లేక పైనుండి ఎవరయినా త్రోసివేశారా? కేశవ్ రంగంలోకి దిగుతాడు. డిటెక్టివ్ నవల ఫార్ములాతో కేసుని ఛేదిస్తాడు.

❖ చేతన్ భగత్ పేపర్ బ్యాక్ కింగ్ – *గార్డియన్*

❖ చేతన్ భగత్ విక్రమ్ సేత్, లేక అరుంధతి రాయ్ స్థాయికి ఎదగకపోవచ్చును. కాని దేశంలో భాగ్యరాశి పెరుగుతున్న తరుణంలో తాము వెనకపడిపోతున్నామనే నిరాశ నిస్పృహలను ఎదుర్కొంటున్న మధ్యతరగతి యువతకు తన గొంతు నిచ్చాడు. – *న్యూ యార్క్ టైమ్స్*

చేతన్ భగత్ వ్రాసిన నవలల్లో అయిదు బాలీవుడ్ సినిమాలుగా వచ్చాయి. హలో, 3 ఇడియట్స్, కై పో చే, 2 స్టేట్స్, హాఫ్ గర్ల్ ఫ్రెండ్ – ఈ మూవీలు విజయవంతం అయ్యాయి, ఒక్క హలో తప్ప. కొత్త నవల రివల్యూషన్

2020 కూడా మూవీగా రాబోతున్నది. చేతన్ భగత్ వ్రాసిన మొదటి ఏడు నవలలు, రెండు వ్యాసపుస్తకాలు రూప పబ్లికేషన్స్ (న్యూ ఢిల్లీ) ప్రచురించింది. ఆ పుస్తకాలు 15 భాషల్లోకి అనువదించబడ్డాయి. మొత్తం 11 మిలియన్ల కాపీలు అమ్ముడుపోయాయి. చేతన్‌తో పాటు ఆ ప్రచురణ సంస్థ కూడా బాగా లాభించినది. 2018లో చేతన్ భగత్ చెన్నైకి చెందిన వెస్ట్ లాండ్ పబ్లికేషన్స్‌తో కొత్త ఒప్పందం చేసుకొన్నారు. వెస్ట్ లాండ్ పబ్లికేషన్స్‌ను అమెజాన్ సంస్థ 2016లో కొనుగోలు చేయటంతో ఇప్పుడు ఆ చెన్నై సంస్థ అమెజాన్‌లో ప్రచురణా విభాగం అయింది. ఈ ఒప్పందం ప్రకారం అయిదు ఏళ్ళల్లో భగత్ వ్రాసే మూడు నవలు, రెండు వ్యాస పుస్తకాలు వెస్ట్ లాండ్ ప్రచురిస్తుంది. ఎన్నో మిలియన్ల డాలర్లతో కూడిన ఈ ఒప్పందంతో భగత్ పుస్తకాలు ఇండియాలోనే కాకుండా అమెజాన్ కిండిల్ ద్వారా డిజిటల్ రూపంలో ప్రపంచవ్యాప్తంగా అమ్మబడుతాయి. వ్యాపారపరంగా, పాఠక విస్తారణపరంగా చేతన్ భగత్ అంత విజయం సాధించినను, విమర్శలు లేకపోలేదు. హిందూస్తాన్ టైమ్సు భగత్‌ను పుస్తకాలు వ్రాయటం మానివేసి, సినిమా స్క్రిప్టుల మీద పూర్తి దృష్టి పెట్టుకోమని వ్రాసినది. టైమ్సు కారణాలను ఇలా సూచించినది.

❖ పాఠకులు ఏదైయినా పుస్తకం చదివేటప్పుడు, మనోరంజనం పొందటమే కాకుండా, కొత్త విషయాలు తెలుసుకోవాలని కూడా ఆశించుతారు. చేతన్ నవలల్లో కొత్త విషయాలు, భావనలు మృగ్యం. ❖ పాత్రలన్నీ మూసపోసినట్లు ఉంటాయి. ప్రాంతీయ, లింగ, సామాజిక స్థాయి ప్రధానమైన మూసల్లో పాత్రలను నింపి ఎగతాళి చేసినట్లు ఉంటుంది. ఇది అవాంఛనీయం. ❖ నవలల్లో బాలీవుడ్ సీన్లు ఎక్కువ. సినిమాలకు స్క్రిప్టు వ్రాస్తున్నట్లుంటుంది. కొత్తగా రాబోతున్న ఒక సినిమాకు నవల రాకముందేఒప్పందం కుదిరింది. అయినప్పటికీ చేతన్ కొత్త పాఠకులను నవలా సాహిత్యానికి పరిచయం చేస్తున్నారు. ఇతర రచయితల నవలలుకు కూడా మార్కెట్‌ను విస్తృత పరుస్తున్నారు. పుస్తక ప్రచురణ రంగంలో కొన్నైనా ఉద్యోగాలను కల్పించుతున్నారు. పైగా చేతన్ నవలలలో అశ్లీలత ఉండదు. కుటుంబ సభ్యులందరూ చదువుకోవచ్చును. టైమ్సు ఆఫ్ ఇండియా పత్రిక పాఠకుల నుండి వచ్చిన ప్రశ్నలను చేతన్ భగత్‌కి పంపింది. రచయిత సమాధానాలను పత్రిక ప్రచురించింది. అందులో నుండి కుదింపులతో కొన్ని.

*ప్ర: మీరు వ్రాసేటప్పుడు పాఠకులను మనస్సులో ఉంచుకొంటారా?*

స: లేదు. వ్రాసేటప్పుడు నేను కథలో, పాత్రలలో లీనమయిపోతాను.

*ప్ర: మీ రచనలు ఎవరి జీవితాలనయినా మార్చాయనుకొంటున్నారా?*

స: నా రచనలు కనీసం పాఠకులకు కొంత వినోదాన్ని కలిగిస్తాయి. వాళ్ళను ఆలోచింపచేస్తాయి.

*ప్ర: మీ రచనలకు స్ఫూర్తినిచ్చేదేమిటి?*

స: వ్రాయటం నాకు చాలా ఇష్టం. నా భావాలను, కల్పనాశక్తిని పాఠకులతో పంచుకోవటం, వారు నన్ను ఆదరించటం నాకు ఆనందాన్ని కలిగిస్తాయి.

*ప్ర: విమర్శకులు మీకెందరో ఉన్నారు. వారి విమర్శలను మీరు పరిగణిస్తారా?*

స: నిర్మాణాత్మక విమర్శలయితే పరిగణనలోకి తీసుకుంటాను. లేనిచో పట్టించుకోను.

*ప్ర: అమితావ్ ఘోష్, అరుంధతి రాయ్, తసీర్, మొహసిన్ అహ్మద్, నాదం అస్లాం వంటి గొప్ప రచయతలుండగా, మీ పుస్తకాలు ఎందుకు చదవాలి? వారు ఇండియాలోని సమస్యల గురించి వ్రాస్తారుగదా!*

స: పాఠకులు వాళ్ళ పుస్తకాలు చదవవచ్చును, నావి కూడా చదవవచ్చును. లేక వారివే చదువుకోవచ్చును. ఎవరి ఇష్టం వారిది.

*ప్ర: మీ జీవితాన్ని మార్చినది, అతిముఖ్యమైనది అయిన మీ నిర్ణయం ఏమి?*

స: చాలా ఉన్నాయిగాని, కేవలం వ్రాయటం కోసం నా బాంకు ఉద్యోగం మానివేయటం సాహసమైన నిర్ణయం.

***వచ్చే సంచికలో: నిడదవోలు మాలతి***

డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల
e-mail: rravella2@gmail.com.,
1-703-338-2194 (mobile and whatsapp)

## ఇండాలజీ - 2

# సర్ విల్లియమ్ జోన్స్

*- అవధానం రఘుకుమార్*

సర్ విల్లియవ్‌ు జోన్స్ ఎఫ్.ఆర్.ఎస్., ఎఫ్.ఆర్.ఏ.ఎస్., ఎఫ్.ఆర్.ఎస్.ఇ., (28 సెప్టెంబరు, 1746–27 ఏప్రిల్ 1794) అనే అతను ఆంగ్లో–వెల్ష్ భాషా శాస్త్రవేత్త. ఇండాలజీ అనే విషయంలో ఆద్యులలో ఒకరు. ఈయన ఈస్ట్–ఇండియా కంపెనీ – బ్రిటిష్ ప్రభుత్వం 1773లో ఏర్పాటు చేసిన "ది సుప్రీం కోర్టు ఆఫ్ జ్యుడికేచర్ అట్ ఫోర్ట్ విల్లియమ్, కలకత్తా, బెంగాల్"కు తాత్కాలిక జడ్జిగా కూడా పని చేశారు. ప్రాచీన భారతదేశ చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, సాహిత్యం ఇలా ఇండాలజీకి సంబంధించిన అనేక విషయాలపై అధ్యయనం చేశారు. యూరోపు భాషలకు, భారతదేశ భాషలకు వాటి మధ్య బలమైన సంబంధం ఉందని ప్రతిపాదించిన తొలి యూరప్ భాషాశాస్త్రవేత్త. ఈ సంబంధాలని వివరించే ప్రయత్నంలో భాగంగా ఆయన – "ఇండో – యూరోపియన్ భాషలు" అనే ఒక క్రొత్త పదాన్ని ప్రయోగించారు. 1784వ సం॥లో కలకత్తాలో "ది ఏసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్" అనే ఒక సంస్థని స్థాపించాడు.

ఈయన లండన్‌లో పుట్టాడు. వీరి తండ్రి పేరు కూడా విల్లియమ్ జోన్స్. ఈయన వేల్స్ ప్రాంతపు గొప్ప గణిత శాస్త్రజ్ఞుడు. గణిత శాస్త్రంలో "పై" **(π)** అనే గుర్తును ప్రవేశపెట్టిన వ్యక్తిగా తండ్రి విల్లియమ్ జోన్స్‌కు పేరు ఉంది. కొడుకు విలియమ్ జోన్స్ కూడా బాలమేధావి. చిన్నప్పటి నుండి భాషలను సులువుగా నేర్చుకునే తెలివితేటలుండేవి. అలా ఆయన చిన్నవయస్సులోనే తన మాతృ భాష ఇంగ్లీషుతో పాటు, గ్రీకు, లాటిన్, పెర్షియన్, అరబిక్, హిబ్రూలలో పాండిత్యం, చైనా భాషలో ప్రాథమిక జ్ఞానం సంపదించాడు. చనిపోయేనాటికి ఈయనకు ఎనిమిది భాషలలో లోతైన పాండిత్యం ఉండేదని, మరో ఎనిమిది భాషలలో ప్రావీణ్యం ఉండేదని, ఇంకా పన్నెండు భాషలలో తగినంత ప్రవేశం ఉండేదనీ అంటారు. అంటే దాదాపు 28 భాషలలో ప్రతిభకలవాడు!

చిన్నప్పుడే తండ్రిని పోగొట్టుకున్న జోన్స్ 1773లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుండి ఎమ్.ఎ. పట్టా పొందారు. ఆర్థికావసారాల దృష్ట్యా కొంత కాలం ట్యూటర్‌గా పని చేస్తూ, అదే సమయంలో అంటే 1770లో పెర్షియన్ భాషలో మిర్జీ మెహిది ఖాన్ అస్త్రబాది వ్రాసిన "నాదిర్‌షా చరిత్ర"ని ఫ్రెంచ్‌లోకి అనువదించాడు. అప్పటికి ఆయన వయస్సు 24 సంవత్సరాలు. అప్పటికే ఆయన "ఓరియంటలిస్ట్"గా పేరు తెచ్చుకున్నాడు. ఆ తరువాత కూడా పర్షియా, తదితర మధ్య–ఆసియా భాషలలో అనేక రచనలు చేశాడు.

అంతకు ముందే 1770లో ఆయన న్యాయశాస్త్రంలో కూడా పట్టా పుచ్చుకున్నాడు. 1772లో "ఫెల్లో ఆఫ్ రాయల్ సొసైటీ"లో సభ్యుడిగా ఎన్నుకోబడ్డాడు. కొంత కాలం వేల్స్ ప్రాంతంలో సర్క్యూట్ జడ్జిగా పనిచేశాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్‌తో కలసి అమెరికా – ఇంగ్లాండ్‌ల వివాదాల్ని పరిష్కరించే విఫల ప్రయత్నం చేశాడు. ఆపైన 1783లో "సుప్రీంకోర్టు ఆఫ్ ఫోర్టు విలియమ్స్, కలకత్తా, బెంగాల్"కు తాత్కాలిక జడ్జిగా నియమింపబడ్డాడు. అలా ఆయన తన న్యాయమూర్తి పదవిరీత్యా ఇండియా వచ్చాడు. అందే సంవత్సరం అన్నా మెరియా షిప్లీ అనే అమ్మాయిని పెళ్లి చేసుకుని ఇండియా వచ్చాడు. జోన్స్ భారతదేశపు

జీవితాన్ని, సంఘటనలను రికార్డు చేయటంలో అన్నా మెరియా చాలా సహాయపడింది.

ఇండియాలో, కలకత్తాలో తనకు జడ్జిగా నియామకం రావడం ఒక రకంగా జోన్స్ కల నెరవేరినట్టయింది. 15 జనవరి, 1784వ తారీఖున కలకత్తా సుప్రీంకోర్టు "గ్రాండ్ జ్యూరీ" గదిలో – విశాలమైన అందమైన బల్ల ముందు కుర్చీలో ఠీవిగా కూర్చున్న జోన్స్ – ఆ గదిలో ఉన్న ఇతర ప్రముఖులు – గవర్నర్ – జనరల్ వారెన్ హెస్టింగ్స్, జాన్‌థన్ డంకన్ (ఆ తరువాతి కాలంలో బాంబే గవర్నరు), జస్టిస్ జాన్ హైడ్‌ల మధ్య సగర్వంగా ఉన్నాడు. ఒక క్రొత్త దేశం రావడం, అక్కడి క్రొత్త భాషలు, గ్రంథాలు చదవడం అంటే జోన్స్‌కి చాలా సరదా. అందులోనూ అతని "స్వప్నదేశం" – ఇండియా.

భారతదేశం, దాని సాహిత్యం, అందం, చరిత్ర అతనిని చాలాకాలం నుండి ఆకర్షిస్తున్నాయి. నిజానికి ఆసియా మొత్తం అతనికి చాలా ఇష్టం. అప్పటికే అనేక సంవత్సరాలుగా గంటలకొద్దీ ఆసియా సాహిత్యం చదివాడు. తనకు దొరికిన ప్రతి పుస్తకం చదివాడు. అయినా ఆయన దాహం తీరలేదు. ఆ సాహిత్యం అతనికి తృప్తినివ్వలేదు. ఇండియాకి వెళ్ళాలి, అక్కడే వీలయితే స్థిరజీవితం ఏర్పాటు చేసుకోవాలి అని తను చేయవలసిన పనులు, చదువవలసిన పుస్తకాలు ఒక కోరికల పట్టీని ముందే తయారు చేసుకున్నాడు. అందులో హిందూ, ముస్లిం ధర్మశాస్త్రాలు, ప్రాచీన చరిత్ర, వాటికి సంబంధించిన ఋజువులు, సృష్టి జలమయమయ్యిన ఆ కథ, బైబిల్‌లోని "నోవా ఆర్క్"లాంటి – మత్స్యపురాణ కథ, రాజకీయాలు, భౌగోళికశాస్త్రం, గణితశాస్త్రం, వైద్యశాస్త్రం,... ఇలా ఎన్నో!

ఇండియాకు రాగానే ఆ ఇరవై ఒక్క తుపాకీ ధ్వనుల స్వాగతం, గవర్నర్ – జనరల్‌తో సమావేశం, హుగ్లీ నది, దట్టమైన అడవులు, అందులోని పులులూ,... ఇలా అన్నీ గుర్తుకు వస్తూ ఆసియాటిక్ సొసైటీలో తన తొలి ఉపన్యాసంలోనే "అన్ని శాస్త్రాలకు నెలవు, ఉపయోగపడే, ఆనందాన్ని ఇచ్చే అన్ని కళలకూ కేంద్రం – ఆసియా" అన్నాడు. ఎవరో "అన్ని పరిశీలనలకు, పరిశోధనలకూ, మన వద్ద ధనం లేదు, శాశ్వతమైన నివాసం లేదు!" అన్నాడు. ''ఆదర్శాలు ఉన్నతమైనవైతే, అలాంటి సమస్యలను అధిగమించవచ్చును ఏదోలా!'' అని జవాబిచ్చాడు జోన్స్. "అయితే మరి ఈ సమావేశాన్ని ఏమని పిలవాలి?" అన్న ప్రశ్న. "ది ఏసియాటిక్ సొసైటీ!" అని జవాబు. అలా ప్రారంభం అయ్యింది "ది ఏసియాటిక్ సొసైటీ, కలకత్తా, బెంగాల్".

> *"అన్ని శాస్త్రాలకు నెలవు, ఉపయోగపడే, ఆనందాన్ని ఇచ్చే అన్ని కళలకూ కేంద్రం – ఆసియా" అన్నాడు. ఎవరో "అన్ని పరిశీలనలకు, పరిశోధనలకూ, మన వద్ద ధనం లేదు, శాశ్వతమైన నివాసం లేదు!" అన్నాడు. "ఆదర్శాలు ఉన్నతమైనవైతే, అలాంటి సమస్యలను అధిగమించవచ్చును ఏదోలా!" అని జవాబిచ్చాడు జోన్స్. "అయితే మరి ఈ సమావేశాన్ని ఏమని పిలవాలి?" అన్న ప్రశ్న. "ది ఏసియాటిక్ సొసైటీ!"*

జోన్స్ ఇండియాకి వచ్చిన తొలి రోజుల నుండే ఇక్కడి సంస్కృతితో బాగా ఆకర్షింపబడ్డాడు. యూరోపియన్ మేధావులు అప్పటికి ఇంకా భారతదేశాన్ని అర్థం చేసుకునే బలమైన ప్రయత్నం చేయలేదు. అటువంటి కాలంలోనే 1784 జనవరీ 15వ తారీఖున ఆయన కొద్దిమంది మిత్రులతో కలిసి ''ఏసియాటిక్ సొసైటీ'' అనే సంస్థను కలకత్తాలో ప్రారంభించాడు. అప్పటికే బెంగాలు ప్రాంతలో "నదియా హిందూ విశ్వ విద్యాలయం" అనే సంస్థలో సంస్కృత పండితుడిగా పేరున్న "రామలోచన" అనే అతని గురుత్వంలో వేదాలను అభ్యసించడం మొదలు పెట్టాడు. చాలా త్వరగా సంస్కృతంలో మంచి పాండిత్యం సంపాదించాడు. తన సహచర ఓరియంటలిస్ట్ (ప్రాచ్యజ్ఞాని) శామ్యూల్ డేవిస్ అనే వ్యక్తితో పది సంవత్సరాలు జ్యోతిష్య శాస్త్రంపై ఉత్తర ప్రత్యుత్తరాలు నెరిపాడు. అలాగే పండిత జగన్నాథ తర్క పంచనన్ అనే బెంగాల్‌కు చెందిన సుప్రసిద్ధ హిందూ న్యాయశాస్త్ర నిపుణుడు, సంస్కృత పండితుడు ద్వారా ప్రాచీన హిందు ధర్మ శాస్త్రాలని చదివాడు, పరిశోధించాడు. ఆ తరువాత పది సంవత్సరాలు జోన్స్ భారతదేశానికి సంబంధించిన అనేక విషయాలపై

పుస్తకాలను ఒక వరదలాగా సృష్టించాడు. దాదాపు ప్రతి సాంఘిక శాస్త్ర అంశం మీద ఒకటి కంటే ఎక్కువ పుస్తకాలు, "ఆధునిక" పద్ధతులలో పరిశీలించి, పరిష్కరించాడు. ప్రాంతీయ చట్టాలు, ధర్మ శాస్త్రాలు, సంగీతం, సాహిత్యం, వృక్ష శాస్త్రం, భౌగోళిక శాస్త్రం... ఇలా అనేక అంశాలపై రచనలు చేశాడు. అనేక సంస్కృత, బెంగాలీ మూల గ్రంథాలను ఇంగ్లీషులోకి అనువదించాడు. కొన్నిసార్లు "జోన్స్ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్" అనే కలం పేరును కూడా ఉపయోగించాడట. ఈయన 47 సంవత్సరాల వయస్సులో 27 ఏప్రిల్ 1794న కలకత్తాలో చనిపోయాడు.

జోన్స్ ''ఇండాలజీ'' (లేదా "ఓరియంటలిజం") అనే జ్ఞానానికి చేసిన అతి గొప్ప సైద్ధాంతిక సహకారం లేదా సేవ లేదా సృష్టించిన సమస్య (1) భారతీయ భాషలు ముఖ్యంగా సంస్కృతం, ప్రాకృతం తదితరాలు ఇండో - యూరోపియన్ భాషల సముదాయంలో భాగం అని తీర్మానించడం మరియు (2) "ఆర్యుల ఆక్రమణ" (లేదా "ఆర్యన్ ఇన్వేషన్") అనే మాటను తొలిసారిగా ప్రయోగించడం.

> *జోన్స్ "ఇండాలజీ" (లేదా "ఓరియంటలిజం") అనే జ్ఞానానికి చేసిన అతి గొప్ప సైద్ధాంతిక సహకారం లేదా సేవ లేదా సృష్టించిన సమస్య (1) భారతీయ భాషలు ముఖ్యంగా సంస్కృతం, ప్రాకృతం తదితరాలు ఇండో - యూరోపియన్‌భాషల సముదాయంలో భాగం అని తీర్మానించడం మరియు (2) "ఆర్యుల ఆక్రమణ" (లేదా "ఆర్యన్ ఇన్వేషన్") అనే మాటను తొలిసారిగా ప్రయోగించడం.*

1786లో ఆసియాటిక్ సొసైటీ మూడవ వార్షికోత్సవంలో సంభాషిస్తూ సంస్కృత, గ్రీకు, లాటిన్ భాషలన్నీ ఒకే మూలాల నుండి లేదా మూల భాషా సముదాయం నుండి వచ్చాయనీ - దానినే "ఇండో యూరోపియన్ భాషా సముదాయం" అంటారు అని ప్రతిపాదించాడు. అంతేకాదు తిరిగి అవి అన్నీ గోథిక్ లేదా సెల్టిక్ (అంటే జర్మనీ లేదా ఇంగ్లీషు) భాషలతోనూ, పర్షియన్ భాషతోను సంబంధం కలిగి ఉన్నాయనీ ప్రతిపాదించాడు. నిజానికి ఈ ప్రతిపాదన క్రొత్తదేమీ కాదు అంటారు మరికొంతమంది భాషానిపుణులు. 1653లో వ్యాన్ బాక్స్ హార్న్ అనే అతను, ఇంకా అనేకమంది తొలి యూరోపియన్ భాషానిపుణులు పదహారవ శతాబ్దంలోనే ఇలాంటి ప్రతిపాదనలు చేశారు అంటారు. 1767లో క్యూరో అనే ఫ్రెంచ్ భాషా నిపుణుడు, భాతరదేశంలో చాలా కాలం ఉండి, ఇక్కడి భాషలను పరిశోధించి ఈ మాటను అన్నట్టూ చెబుతారు. అయితే జోన్స్ ప్రత్యేక కాంట్రిబ్యూషన్ ఏమిటంటే, ఈ భాషలన్నింటినీ సమీక్షిస్తూ ఒక ప్రోటో - భాష (సామాన్య భాష)ను ప్రతిపాదించడం. అనేకమంది భాషానిపుణులు, అప్పుడూ, ఆ తరువాత జోన్స్ ప్రతిపాదనను - అంటే ఈ ప్రోటో - భాష ప్రతిపాదనను అంత సీరియస్‌గా తీసుకోలేదు. తమాషా ఏమిటంటే జోన్స్ - ఈ ప్రోటో - ఇండో యూరోపియన్ భాషా ప్రతిపాదనలో ఈజిప్షియన్, జపాన్, చైనా భాషలను చేర్చడం, అదే సమయంలో హిందీ, హిందూస్థానీ భాషలను, స్లావిక్ (యూగో స్లేవియా) తదితర (ప్రాంత) భాషలను కలపకపోవడం కొంత సమస్యాత్మకంగానూ మారింది. అంతేకాక ఆయన చేసిన ఇంకొక అశాస్త్రీయ ప్రతిపాదన - ఇక్కడ దేశీయంగా ఉత్తర భారత దేశంలో ఉన్న స్వచ్ఛమైన హిందీ భాషను చాలా పురాతన కాలంలో విదేశాల నుండి దండయాత్రలు చేసిన రాజ్యాలు, ప్రజలు తొలగించి, సంస్కృతాన్ని ప్రవేశపెట్టారని చెప్పడం. అన్ని తప్పుల తడకలతోను తరువాతి కాలపు భారతీయ మేధావులపై, భాషా శాస్త్ర నిపుణులపై, చరిత్ర, సంస్కృతిని వ్యాఖ్యానించేవారిపై జోన్స్ ప్రభావం తీవ్రంగానే ఉంది. ఇప్పటికీ అది కొనసాగుతోంది.

ఈ "ప్రోటో-ఇండో-యూరోపియన్" అనే భావనని పాశ్చాత్య, ముఖ్యంగా జర్మన్, బ్రిటిష్ ఇండాలజిస్టులు చాలా బలంగా విశ్వసించారు. ప్రచారం కూడా చేశారు. కానీ సంస్కృతం అనేది గ్రీకు, లాటిన్ భాషలకంటే నిర్మాణ పరంగా, వ్యక్తీకరణపరంగా, సంక్షిప్తతపరంగా ఎంతో ఉన్నతమైనదని అనేకమంది భావిస్తారు. గ్రీకు, లాటిన్ భాషలకంటే మరింత ఆధునికంగా సరళీకృతంగా, సంస్కరింపబడిన భాషగా చాలామంది ఒప్పుకుంటారు.

కొన్ని పదాలపరంగా ఒక "కామన్ రూట్" ఉంది అని అనుకున్నా ప్రోటో-ఇండో-యూరోపియన్ అన్న భావన మాత్రం తరువాతి కాలంలో చాలా చిక్కులే తెచ్చిపెట్టింది. తరువాతి కాలంలో ఈ సిద్ధాంతాన్ని విమర్శిస్తూ చాలా విస్తృతమైన సాహిత్యం వచ్చింది.

ఇక జోన్స్ రెండో ప్రతిపాదన - "ఆర్యుల ఆక్రమణ" (లేదా ఆర్యన్ ఇన్వేషన్) కూడా భారతదేశ సమాజంలో, దాని అంతర్గత ఐక్యతలో ఇక ఎప్పటికీ పరిష్కరించలేని కొత్త సమస్యను సృష్టించింది. ఆర్య, ద్రావిడ అనేవి రెండు జాతులుగా, ఆర్యులు, ద్రవిడులని ఆక్రమించి ఓడించి, దక్షిణ భారత ప్రాంతాలవైపు తరిమివేసి తమ ఆర్యసమాజాన్ని విస్తరించారు అనే ప్రతిపాదన శాస్త్రీయంగా సమస్యాత్మకమైంది. ఇలా ఒకరకమైన జాతి విద్వేష విధానాలకు ఇది తెరలేపింది. ఒక భాషాపరమైన పరిశోధన, తద్వారా వచ్చిన "ప్రోటో-ఇండో-యూరోపియన్ భాషలు" అనే భావన, ఈ "ఆర్యుల ఆక్రమణ" సిద్ధాంతముతో కలిసి భారత సమాజంలో కలగించిన అలజడి సామాన్యమైనది కాదు. దీని ప్రభావంతో ఈ దేశంలో జాతుల సమస్య తీవ్రంగా, కొన్ని సాధారణ పరిమితులు దాటిన వైషమ్యాలకీ దారి తీసింది. దాని ప్రభావం ఇప్పటికీ బలంగానే ఉంది. నిజానికి సమస్య తీవ్రత ఇంకా పెరుగుతూనే ఉంది.

> *ఇక ఆర్యుల భారత దేశ ఆక్రమణ సిద్ధాంతమూ చాలా వివాదాస్పదమయినదే. భారతదేశ చరిత్ర రచనలో 20 శతాబ్దంలో మర్క్సిస్టులది ప్రధాన పాత్ర. చాలామంది మార్క్సిస్ట్ రచయితలు - డి.డి. కోశాంబి, దేబీ ప్రసాద్ చట్టోపాధ్యాయ, రోమిల్లా థాపర్, ఝా, ఇర్ఫాన్ హబీబులు, తదితరులు కూడా ఈ ఆర్యుల ఆక్రమణ సిద్ధాంతాన్ని ఎక్కువ భాగం ఒప్పుకున్నారు.*

నిజానికి "ఆర్యులు" అనే జాతి ఉందా? మానవ సమూహాలు భౌగోళికంగా అనేక ప్రాంతాలలో స్థిరీకరణ పొందిన తరువాత అనేక భౌతిక, వాతావరణ విషయాల కారణంగా భాహ్య చిహ్నాలు - అంటే ముక్కు, రంగు, ఎత్తు... ఇలా అనేక అంశాలలో తేడాలు ఉండవచ్చును. వాటి ఆధారంగా మనుషులను జాతులుగా విభజించడానికి, విభిన్న జాతులుగా అర్థం చేసుకోడానికి శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయి అన్నది ఇప్పటికీ ఇటు భాషాశాస్త్రంలోను, అటు ఆంత్రపాలజీ (మానవ శాస్త్రం), సోషియాలజీలోను, జీవశాస్త్రంలోనూ సుదీర్ఘమైన చర్చకు ఆధారం అయ్యింది.

అనేక మంది ఆధునిక శాస్త్రవేత్తలు ఈ భాషారమైన విషయాన్ని జాతుల సమస్యగా వ్యక్తీకరించడానికి ఒప్పుకోవడం లేదు. ఉదాహరణకు హన్నా అరెంట్ అనే జర్మన్ రాజకీయ శాస్త్రవేత్త - తన - "ది ఆరిజిన్స్ ఆఫ్ టోటాలిటే రియనిజం" అనే పుస్తకంలో ఈ "జాతి" లేదా "రేస్" అనే సమస్య మూలాలకు వెళ్ళి చర్చిస్తుంది. మనుషులలో "జాతులు" అనే సమస్యే అశాస్త్రీయం. ఈ ఆలోచనకు ఆద్యులు జర్మనులు, దీన్ని పతాక స్థాయికి తీసుకుపోయిన వ్యక్తి - హిట్లర్. ఇలాంటి అశాస్త్రీయమైన వాదనలే యూరోప్‌లో యూదుల వ్యతిరేకతకి, అనేక అమానవీయ పరిణామాలకి దారితీయటానికి కారణం అని యూరోప్ చరిత్ర చెబుతోంది, అంటుంది అన్నా ఆరెంట్.

నిజానికి మనుషులలో జాతి (రేస్) అనే ఆలోచన యూరోప్‌లో 18వ శతాబ్దంలోనే బలంగా రూపుదిద్దుకుంది. అంతకుముందు లేదు. యూరోపియన్ దేశాలు భారతదేశంతో సహా అనేక ఆఫ్రికా దేశాలలో అధికారాన్ని విస్తరించే సమయంలో, తమ ఆధిపత్యానికి నైతికత, సాధికారికతను ఆపాదించుకునే క్రమంలో భారతదేశంలో "ఆర్య" సిద్ధాంతాలని ప్రతిపాదించారు అనే ఒక బలమైన వాదన ఉంది. తద్వారా వారు ఈ దేశంలోని కొన్ని ఉన్నత కులాల సహకారాన్ని, అంగీకారాన్ని, సమన్వయాన్ని సంపాదించుకోగలిగారు అనేది కూడా ఒక వాదన. 1853లో గోబినో అనే ఫ్రెంచ్ రచయిత రచనలు కూడా ఈ భావనలకి బలం చేకూర్చినట్టు కొద్దిమంది భావిస్తారు. ఇలాగే డిస్రైయిలీ, ఎడ్మంట్ బర్క్‌లాంటి అనేకమంది యూరోపియన్ల రచనలూ ఈ అశాస్త్రీయ వాదాలకి తెరలేపాయి, బలాన్ని ఇచ్చాయి. యూరోప్ ముఖ్యంగా ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు ఆఫ్రికాను వలస ప్రాంతంగా మార్చుకునే దశలో ఈ జాతివాదం మరింత

అసహ్యంగా తయారయ్యి, ఇక హిట్లరుతో జర్మనీలో భరించలేని స్థితికి చేరుకుంది.

ఇక ఆర్యుల భారత దేశ ఆక్రమణ సిద్ధాంతమూ చాలా వివాదాస్పదమయినదే. భారతదేశ చరిత్ర రచనలో 20 శతాబ్దంలో మర్క్సిస్టులది ప్రధాన పాత్ర. చాలామంది మార్క్సిస్ట్ రచయితలు – డి.డి. కోశాంబి, దేబీ ప్రసాద్ చట్టోపాధ్యాయ, రోమిల్లా థాపర్, ఝా, ఇర్ఫాన్ హబీబులు, తదితరులు కూడా ఈ ఆర్యల ఆక్రమణ సిద్ధాంతాన్ని ఎక్కువ భాగం ఒప్పుకున్నారు. అంబేడ్కర్ తరువాతి దళిత బహుజన సిద్ధాంత వేత్తలు, చరిత్రకారులు దీనికి బలం ఇచ్చారు. కాని లియాన్ పాలియకోవ్ అనే రష్యన్ ఫ్రెంచ్ చరిత్రకారుడు తన "ది ఆర్యన్ మిత్" (1971) అనే పుస్తకంలో ఆర్యన్ దురాక్రమణ సిద్ధాంతాన్ని చాలా తీవ్రంగా ప్రశ్నించాడు. యూరోప్‌లో ఆంటీ – సెమెటిక్ (అంటే సెమెటిక్ వ్యతిరేకత) (సెమిటిక్ అంటే హిబ్రూ, ఆరబిక్, అర్గమిక్ భాషలు మాట్లాడే ప్రజలు) జాతులు అనే వాదం చేసిన ఘోరం గుర్తించిన పాలియకోవ్ ఇది భాషల మధ్య భేదాలని, మానవ జాతుల సమస్యగా అర్థం చేసుకోవడం వల్ల జరిగిన తప్పిదంగా భావించాడు. చివరికి ఇదే రెండవ ప్రపంచ యుద్ధపు "హోలోకాస్ట్" (వినాశము)కు కారణం అని చెబుతాడు. అయితే ఈ "ఆర్యన్" "అనార్యన్" జాతుల సమస్య కేవలం ఇండాలజీవల్లే రాలేదనీ, ఇటూ భాషా శాస్త్రవేత్తల (ఫిలాలజిస్ట్‌లు), ఆంత్రపాలజీల సమానమైన పొరబాట్లవల్ల జరిగింది అనీ కొందరు అంటారు. భాషానిపుణులు "ఇండోజర్మన్" అనే జాతి భావననూ ఈ ఆర్యన్ అనే భావనను దాదాపు ఒకసారి తెరపైకి తెచ్చారనే మాట ఉంది. రబాల్ – ప్యూరన్ (2008) రచన "ఆర్కైవ్స్ ఆఫ్ అరిజిన్స్" అనేది ఒక ఫ్రెంచ్ రచన అనువాదం. అందులో ఈ భాషానిపుణులు, ఆంత్రపాలజిస్ట్‌ల పాత్ర చర్చించబడింది. ఈ మధ్యకాలంలో ఈ పాశ్చాత్య చరిత్రను, చరిత్రను చదివే విధానాన్ని తిరస్కరించే వాదనలని కొంతమంది హిందూ చరిత్రకారులు కూడా ముందుకు తెస్తున్నారు. ముఖ్యంగా మైఖేల్ డానినో, కొన్రాడ్ ఎల్ట్‌స్‌లు, జోయదీప్ బాగ్చి, విశ్వ అడ్లూరి, తంగరాజ్, శ్రీకాంత్ తలగేరి, హరిశంకర్, సుదర్శన్, వసంత్ షిండే, మురళి.. ఇలా చాలామంది ఈ మధ్యే హైదరాబాద్‌లో (7 డిసెంబరు, 2019) "భారత్–బియాండ్ ఆర్యన్ ఇన్వేషన్ మిత్' అనే ఒక సెమినార్‌లో కూడా ఈ చర్చే ప్రధాన అంశం. ఏది ఏమైనా విల్లియమ్ జోన్స్ ప్రతిపాదనలు – "ప్రోటో – ఇండో – ఆర్యన్ భాష సమూహం", "ఆర్యుల ఆక్రమణ" సిద్ధాంతాల ప్రభావం ఇంకా భారతదేశ భాషావేత్తలపైనా, చరిత్రకాలరులపైనా మత–కుల సమస్యల చర్చలలోనూ చాలా బలంగా వుంది. పై రెండేకాక జోన్స్ ప్రతిపాదనలలో ఇంకా అనేకమైన అసంబద్ధ – అశాస్త్రీయ విషయాలు ఉన్నాయి. ఉదాహరణకు – ఈజిప్ట్ దేశపు పూజారి వర్గం చారిత్రక పూర్వ దశలలోనే భారతదేశానికి వచ్చి ఇక్కడ పూజారి వర్గంగా మారారని, అలాగే చైనీయులు ముందుంగా హిందువులనీ, క్షత్రియులని ఆయన ప్రతిపాదనలు. అంతేకాదు ఎంత హిందూ ధర్మ శాస్త్రాలనీ, సంస్కృత సాహిత్యాన్ని చదివినా – జోన్స్ బైబిల్‌లోని సృష్టికి సంబంధించినవాదమే సరి అయినదని బలంగా నమ్మేవాడు. అందువల్ల అతని, వివరణలన్నీ ఆ భావన ఆధారంగా జరిగిందనీ కొందరు వాదిస్తున్నారు. అలాగే భారతదేశపు పౌరాణికత విషయంలోనూ జోన్స్ బైబిల్ ఆధారిత లెక్కలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. ఆయన లెక్కల ప్రకారం భారతదేశపు చరిత్ర క్రీస్తుపూర్వము 2000 సంవత్సరాలు దాటడానికి వీలు లేదు. ఎందుకంటే బైబిల్ మరియు బిషప్ ఉషర్ లెక్కల ప్రకారం సృష్టి క్రీస్తు పూర్వము 4004లోనూ, మహాప్రళయం క్రీస్తుపూర్వం 2350లలో జరిగింది. కనుక భారతదేశ చరిత్ర కూడా ఆ తరువాతే మొదలు అయ్యుండాలి అని ఆయన వాదన. అయితే ఈ వాదన సరికాదని తరువాతి కాలపు చరిత్ర కారులు చెబుతున్నారు.

27 ఏప్రిల్ 1794న కలకత్తాలోనే శాశ్వత నిద్రకు చేరకున్న సర్ విల్లియమ్ జోన్స్ సృష్టించిన ప్రకంపనల ధాటికి ఈ దేశం, ప్రజలూ, మేధావులు, చరిత్రకారులు – ఇంకా చర్చోపచర్చలలో మునిగి తేలుతూనే ఉన్నారు.

*(ఇంకా వుంది)*

డా. అవధానం రఘుకుమార్
హైదరాబాద్. ఫోన్: 944 101 5709.



డా. సూరి భగవంతం

### పరిశోధకుడు, సత్యశోధకుడు

# డా. సూరి భగవంతం

*– నాగసూరి వేణుగోపాల్*

తెలుగు నాట శాస్త్రవేత్తగా గణనీయమైన పేరుగాంచిన వ్యక్తి డాక్టర్ సూరి భగవంతం. వీరు సి.వి. రామన్ శిష్యులుగా, అంతేవాసి శాస్త్రవేత్తగా; యుద్ధ విజ్ఞాన శాస్త్ర దార్శనికులుగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగపు నిర్మాతగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నిర్దేశకులుగా, నేషనల్ జియోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మూలపురుషుడుగా చిరస్మరణీయులు!

1909 అక్టోబర్ 14న కృష్ణాజిల్లా నూజివీడు సమీపంలోని ఆగిరిపల్లిలో జన్మించిన భగవంతం చదువు చాలా సంప్రదాయబద్ధంగా మొదలైంది. ఆనాటి విధానం ప్రకారం పురాణేతిహాసాలు, వేదాలు సంస్కృతాంధ్ర భాషల్లో నేర్చుకున్నారు. తర్వాత ఆంగ్ల పాఠశాలలో చేరారు. అప్పట్లో ఒక్క నిజాం కాలేజీ తప్ప, మిగతా కళాశాలలు ఉర్దూ మాధ్యమంలో సాగేవి. నిజాం కాలేజి మద్రాసు విశ్వవిద్యాలయం అనుబంధంగా ఆంగ్ల మాధ్యమంలో సాగేది. భాగ్యనగరంలో బి.ఎస్సీ. పూర్తి అయిన తర్వాత భగవంతం చదువు కలకత్తాలో సర్ సి.వి. రామన్ దగ్గర సాగింది. ఒక వ్యాసరచన పోటీలో సాధించిన బహుమతి ఆయనను సర్ సి.వి. రామన్ చెంతకు చేర్చింది. ఈ గురుశిష్యుల అనుబంధం ఎంతో అర్థవంతంగా, విజ్ఞానదాయకంగా నడిచిందనీ, అది జీవితాంతం కొనసాగిందని గర్వంగా చెప్పవచ్చు. సర్ సి.వి. రామన్‌గారితో జీవితాంతం మిత్రత్వం కలిగినవారు చాలా తక్కువమంది అని అంటారు. కలకత్తాలో రామన్ దగ్గర ఉన్నప్పుడే మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు భగవంతం.

సర్ సి.వి. రామన్ కలకత్తా నుంచి బెంగుళూరు తరలివెళ్లి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ నేతృత్వ బాధ్యతలు స్వీకరించారు. తనతోపాటు భగవంతాన్ని కూడా బెంగుళూరు తీసుకువెళ్ళాలని రామన్ తలంచారు. అయితే, అప్పట్లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి భగవంతం సేవలు అవసరమయ్యాయి. 1932లో తన 22వ ఏట భగవంతం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర శాఖలో అధ్యాపకులుగా చేరారు. 1938లో ఆయన ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. అంత చిన్న వయస్సులో ప్రొఫెసర్‌గా ఉన్నతి పొందడం అపూర్వమైన విషయమే. ఈ సంఘటనకు కొద్దిగా ముందే ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు పరిశోధనలో గౌరవ డాక్టరేటు బహుకరించింది. అప్పట్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర పరిశోధనలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉండేది.

భగవంతం బోధనా విధానం ప్రత్యేకంగా చెప్పుకోదగ్గది. ఆయన ప్రసంగానికి 'అరటిపండు ఒలిచి పెట్టినట్టు' అనే తెలుగు సామెత చక్కగా అతుకుతుందని భగవంతం శిష్యుడు, చిరకాల మిత్రుడు మామిడిపూడి కృష్ణమూర్తి వ్యాఖ్యానించారు. నిజానికి బోధనా సామర్థ్యం ఆయనకు సహజంగానే అబ్బిన విద్యగా పరిగణించాలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, ఖచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభ ఆయనకు సొంతం. ఆయన తరగతులకు ఇతర శాఖల నుంచి కూడా విద్యార్థులు హాజరయ్యేవారని అంటారు, ఇతర శాఖల అధ్యాపకులు కూడా తనకన్నా పెద్దవారై ఉండి కూడా వీరి తరగతులకు వచ్చేవారని చెబుతారు. ఇతని బోధనా విధానాన్ని అనుకరించినవారు ఎందరో

ఉన్నారు. 1941లో అంటే తన 32వ ఏట ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాశాలలన్నింటికీ ప్రిన్సిపాల్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించడం గొప్ప విషయం. నిజంగా ఆ సమయంలో ఒకవైపు స్వాతంత్ర్యోద్యమం, మరోవైపు అంతర్జాతీయ సంక్షోభం నెలకొని ఉన్నాయి. ఒకవైపు విద్యార్థుల అలజడి, మరోవైపు ప్రభుత్వం ఒత్తిడి - ఈ రెండిండి మధ్య విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్‌గా తన పరిపాలన కౌశలం చూపి, విజయులయ్యారు. భగవంతం వారి మీద సర్ సి.వి. రామన్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డిగార్ల ప్రభావం ఉండేది. దానికి కారణం వీరి ముగ్గురితోనూ ఆయనకున్న అనుబంధమే.

1948-49లో ఒక సంవత్సరంపాటు లండన్‌లోని భారత రాయబారి వి.కె. కృష్ణమీనన్ కార్యాలయంలోని వైజ్ఞానిక సలహాదారుగా పనిచేశారు. నిజానికి ఈ సంవత్సరం కాలం భగవంతంగారు జీవితాన్ని చాలా ప్రభావితం చేసింది. లండన్‌లో ఉన్నప్పుడు రష్యాతో సహా చాలా ఐరోపా దేశాల్లో భగవంతం పర్యటించి, విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు. 1949లో భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయం వదిలి, హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర శాఖ అధిపతిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వారికి విశేషమైన రీతిలో వనరులు కల్పించడంతో వారి ప్రగతి విశిష్టంగా భాసించింది. అప్పట్లో అధ్యాపకులందరూ ఎం.ఎస్సీ. డిగ్రీ బోధన చేస్తున్నవారే. భగవంతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరిన నాలుగైదు సంవత్సరాల్లోనే భౌతికశాస్త్ర శాఖలో 12 మందికి డాక్టరేట్ డిగ్రీ లభించడం ఆయన కృషికి నిదర్శనం. దీని తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం వాతావరణమే పూర్తిగా మారిపోయి, పరిశోధనల దిశగా సాగింది.

1952లో భగవంతం ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్‌గా బాధ్యతలు తీసుకోవడంతో వారి బోధనా ప్రస్థానం ముగిసింది. ఒకవైపు పరిశోధనల్లో నిర్దేశకత్వం, మరోవైపు విశ్వవిద్యాలయ పరిపాలనా దర్శకత్వం కొనసాగాయి. ఆయన వైస్-ఛాన్సలర్‌గా ఉన్న కాలంలో కూడా ఆయన నిర్దేశకత్వంలో కొందరికి పరిశోధనలో డాక్టరేట్లు లభించడం విశేషం.

భగవంతంగారికి జ్ఞాపకశక్తి, సమయస్ఫూర్తి ఎంతో ఎక్కువని చెబుతారు. అతి తక్కువ వ్యవధిలో కావల్సిన రీతిలో ప్రయోజనాత్మకమైన సలహాలు అందజేసేవారు. ఏక కాలంలో ఎంతోమందికి వివిధ పనులు అప్పజెప్పడమేకాక, వాటికి గడువులు కూడా విధించారు. ఏమాత్రం ఆలస్యమైనా, ఆయన క్షణంలో గుర్తుచేసి, ఆ వ్యక్తికి కబురు చేసేవారు. ఏ ఇతర అంశాలకు సంబంధించిన సంభాషణలో ఉన్నా, ఆ విషయానికి న్యాయం చేకూర్చేలా నిర్ణయాలు తీసుకునేవారు. దానికి ఆయనకున్న క్రమశిక్షణే తార్కాణం. అందుకే కాంతి వేగానికి తగిన రీతిలో ఆయన సాగేవారని అంటారు.

1957లో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆ పదవిలో ఆయన గురువు సర్ సి.వి. రామన్ పనిచేయడం ఖచ్చితంగా విశేషమే. అప్పటికే ఆయనకు పరిశోధకుడిగా, పరిపాలనాదక్షుడిగా పేరుంది. ఈ రెండు సామర్థ్యాలు ఆయనను అక్కడ కూడా విజయుణ్ణి చేశాయి. ఇక్కడ పనిచేస్తుండగానే వి.కె. కృష్ణమీనన్ దేశ రక్షణ శాఖామాత్యులుగా నియమితులయ్యారు. ఆయన భగవంతంగారిని ఒత్తిడి చేసి రక్షణశాఖ పరిశోధనా సంస్థ అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగానూ చేరమన్నారు. నిజానికి వీటిపట్ల ఆసక్తి లేకపోయినా, కృష్ణమీనన్‌తో ఉన్న స్నేహం కారణంగా 1961లో బెంగళూరు నుంచే రక్షణశాఖ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించారు.

అయితే రెండు బాధ్యతలను ఏకకాలంలో నిర్వహించడం కష్టమని భావించిన భగవంతంగారు కృష్ణమీనన్ ప్రోద్బలంతో 1962లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ డైరెక్టర్ పదవిని వదులుకుని ఢిల్లీ వెళ్లారు. 1962 అక్టోబర్‌లో చైనాతో భారత్ యుద్ధం గురించి మనకు తెలిసిందే. ఈ యుద్ధం తర్వాత కృష్ణమీనన్ పదవికి రాజీనామా చేయడం, తర్వాత వై.బి. చవాన్ రక్షణ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వాస్తవానికి భగవంతంగారికి కృష్ణ

మీనన్‌తో ఉన్నంత సాన్నిహిత్యం చవాన్‌గారితో ఉండేది కాదు. అయినా, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ) అధిపతిగా కొనసాగి భగవంతం ఎంతో ప్రగతి సాధించారు

విశాఖపట్నం నుంచి లేహ్, తేజ్ పూర్‌వరకూ ఇరవైకి పైగా ప్రయోగశాలలను ప్రారంభించారు. అంతకుమించి యుద్ధరంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పనికరాలు, పర్వత ప్రాంతాల్లో సైనికులకు ఆరోగ్య, ఆయుధాలువంటి అనేక విషయాల్లో ఆయన దృష్టి పెట్టిన విజయం సాధించారు. వారి దార్శనికత తర్వాత భారత్ విజయాలకు ఆధారమైంది. తొమ్మిది సంవత్సరాలు ఈ బాధ్యతలు నిర్వహించి 1969 అక్టోబర్‌లో పదవీ విరమణ చేశారు. భగవంతం ఈ చర్యలు తీసుకోకపోయి ఉంటే తర్వాత కాలంలో దేశానికి చాలా సమస్యలు ఉత్పన్నమై ఉండేవని (చాలాకాలం తర్వాత ఆ బాధ్యతలు చేపట్టిన) డాక్టర్ వి.ఎస్. అరుణాచలం పేర్కొనడం ఆయన కృషికి గొప్ప నివాళి.

ఈ సందర్భంలో ఇంకో విషయం కూడా చెప్పుకోవాలి. ప్రొఫెసర్ పి.ఎం.ఎస్. బ్లాకెట్, పండిత నెహ్రూగారికి అప్పట్లో ఒక సలహా ఇచ్చారట, డి.ఆర్.డి.ఒ, తన సొంత పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా, దిగుమతుల మీద ఆధారపడాలని చెప్పారట. అయితే, భగవంతం ఈ 'గొప్ప' సలహాని తిరస్కరించి, తన విజ్ఞత ప్రకారం నిర్ణయాలు తీసుకున్నారు. దానికి మన భగవంతం గారిని అభినందించాలి.

పిమ్మట సుమారు ఎనిమిది సంవత్సరాలపాటు విజ్ఞానాన్ని దేశ ప్రగతినికి ఎలా వినియోగించుకోవచ్చో అనేక దేశాలు పర్యటించి ప్రసంగించారు. వివిధ దేశాల సమస్యలు చర్చించి, వాటికి పరిష్కారాలను ఆయా ప్రభుత్వాలు సూచించారు.

భగవంతం తెలుగు, సంస్కృత అభినివేశం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆయన సమయస్ఫూర్తి కూడా విశేషమే, జీవితపు చివరి రోజుల్లో కొంత కాలం సత్య సాయిబాబా దగ్గర ఉన్నారు. అప్పట్లో బాబా తెలుగు ప్రసంగాలకు తక్షణమే ఆంగ్ల అనువాద ప్రసంగాలు చేసేవారు. ఈ పోకడ కొన్ని దృక్పథాల నుంచి విమర్శలు ఎదుర్కొంది. అనేక సామాజిక కార్యక్రమాలను స్వచ్ఛందంగా కూడా చేపట్టారు.

సుమారు 300 పరిశోధనా పత్రాలతోపాటు గ్రూప్ థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే విలువైన మూడు గ్రంథాలు రచించారు. ఈ మూడు గ్రంథాలు చాలా భాషల్లోకి అనువదింపబడ్డాయి, డాక్టర్ సూరి భగవంతం 1989 ఫిబ్రవరి 6న తుదిశ్వాస విడిచారు.

డాక్టర్ నాగసూరి వేణుగోపాల్
ఫోన్: 944 073 2392.

భారతదేశంలో తొమ్మిది నృత్యాలను శాస్త్రీయ నృత్యాలుగా గుర్తిస్తారు. అవి- ఉత్తర దేశంలో కథక్, ఈశాన్య రాష్ట్రాలలో మణిపూరి, చాహు, శత్రియ, దక్షిణ మధ్య దేశంలో ఒడిస్సీ, దక్షిణాదిన భరత నాట్యం, కథకళి, కూచిపూడి, మోహినిఆట్టం. అసలు శాస్త్రీయ నృత్యం అంటే ఏమిటి? ఈ గుర్తింపు ఇచ్చేది ఎవరు? దేనిమీద ఆధారపడి ఈ గుర్తింపు వస్తుంది - అనే విషయాలు తెలుసుకుందాం-




మన దేశంలో సంగీతం, నృత్యం - ఈ రెండూ అనేక రకాలుగా ప్రాంతీయ అభిరుచులకు అనుగుణంగా - అనాది నుంచి మనుగడలో ఉన్నాయి. కొన్నిటిని జానపద నృత్యాలంటాం, కొన్నిటిని శాస్త్రీయ నృత్యాలంటాం. ఇవికాక దేశీయ నృత్య రీతులూ ఉన్నాయి, కర్ణాటకలో యక్షగానం, తమిళనాట మేలట్టూరు భాగవత మేళ, అస్సాంలో అన్కియా నాట్ - ఇలా ఎన్నో. ఒక విషయం గుర్తుంచుకోవాలి, శాస్త్రీయం కానివన్నీ జానపదాలు కావు. కొన్ని దేశీయ నృత్యాలు....

ఇలాంటి విషయాలెన్నో ఈ గ్రంథంలో సచిత్రంగా ఉన్నాయి.

(ప్రతులకు: మిసిమి కార్యాలయం)



యలవర్తి నాయుడమ్మ

## దార్శనికుడు
# యలవర్తి నాయుడమ్మ

*– కాట్రగడ్డ శేషగిరిరావు*

చివరి భాగం

**నాయుడమ్మ గారు నాకు ఇచ్చిన చివరి పరిచయ పత్రం**

మన దేశం నుండి శుద్ధి చేసిన తోళ్లు, వాటి ఉత్పత్తులను అర్జెంటీనాకు ఎగుమతి చేయగల అవకాశాలను గురించి సి.ఎల్.ఆర్.ఐ. తరఫున అధ్యయనం చేసే అవకాశం నాకు దక్కింది. అప్పుడు నేను నాయుడమ్మగారిని కలిసి అర్జెంటీనాలో ఆయనకు తెలిసినవాళ్ళుంటే, వాళ్లకు నా పర్యటన గురించి తెలుపుతూ పరిచయ పత్రాలను ఇవ్వమని కోరాను.

నేను అడిగిన మరుసటిరోజే నాయుడమ్మగారు తన స్నేహితుల జాబితాను తయారుచేసి అర్జెంటీనాలో నాకు సహాయపడగలిగే వాళ్ళ గురించి రెండు పేజీల నోట్ పంపారు. తన స్నేహితులకు నన్ను పరిచయం చేస్తూ ఉత్తరాలు అందజేశారు. లెదర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా. ఆల్బర్టో సోఫియా నాయుడమ్మ గారికి మంచి స్నేహితుడు. ఆయనను నాకు అవసరమైన సహాయాన్ని అందించమని అభ్యర్థిస్తూ ఉత్తరం వ్రాసి దాన్ని 1985 జూన్ 10న ఆయన రష్యా వెళ్లేముందు నాకు ఇచ్చారు. రష్యా నుండి నాయుడమ్మ గారు జూన్ మూడవ వారానికి ఐ.డి.ఆర్.సి. గవర్నర్ల బోర్డు మీటింగు హాజరు కావడానికి కెనడాలోని ఒట్టావాకు చేరి బోర్డు మీటింగు హాజరైన తర్వాత మోంట్రియల్, లండన్ మీదుగా జూన్ 23న ఇండియాకు బయల్దేరాలి.

నేను జూన్ 21న అర్జెంటినాలో బ్యూనస్ఐర్ చేరుకున్నాను. జూన్ 24వ తేదీన డా. సోఫియాను కలుసుకుని, నాయుడమ్మ గారి ఉత్తరాన్ని అందచేశాను. ఆయన కొంతసేపు మౌనంగా ఉండి, నాకోసం కాఫీ తెప్పించి, నేను కాఫీ తాగిన తర్వాత "నేను ఒక దుర్వార్త విన్నాను. ఒక ఏర్ ఇండియా విమానం సముద్రంలో కూలిపోయింది. నాయుడమ్మ ఆ విమానంలో ఉన్నారని నాకు అందిన వార్తను నేను నమ్మలేకపోతున్నాను" అన్నారు. నేను నిశ్చేష్టుడనయ్యాను. నేను ఆ షాకు నుండి తేరుకోవడానికి చాలా సమయం పట్టింది. ఆయనను కలిసేంతవరకు నాకు ఆ వార్త తెలియదని ఆయన గ్రహించారు.

"నాయుడమ్మ మరణం ఇండియాకే కాదు. అభివృద్ధి చెందుతున్న దేశాలన్నిటికీ తీరని లోటు" అని డా. సోఫియా నాయుడమ్మ గారితో తనకున్న పరిచయాన్ని గుర్తు చేసుకుని సంతాపాన్ని వ్యక్తం చేశారు.

నేను అర్జెంటీనాలో ఉన్నప్పుడు ఆ దేశంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ జనరల్‌ను కూడా కలిస్తే బాగుంటుందన్న నాయుడమ్మ గారి సలహాపై నేను ఆయనను కలిశాను. "నాయుడమ్మ FAO, UNIDO లాంటి సంస్థల ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రయోజనకరమైన ప్రణాళికలను తయారు చేయించి, వాటి అమలుకు అంతర్జాతీయ సంస్థల ద్వారా ఆర్థిక సహాయం అందించే ఏర్పాటు చేశారు. ఆయన మా మార్గదర్శి. మేమొక మంచి మిత్రుణ్ణి కోల్పోయాం" అని ఆయన శోకతప్త హృదయంతో అన్నారు.

* * *

**నాయుడమ్మ గారి తీరని కోర్కెలు**

నాయుడమ్మ గారు తన పేరుతో సైన్స్ ఫౌండేషన్ స్థాపించాలనుకున్నారు. నాయుడమ్మ గారి రెండవ కుమారుడు రమేష్. ఆయన రమేష్ పెండ్లి చేయాలనుకున్నారు. కానీ ఈ రెండు విషయాలలో కూడా విధి అనుకూలించలేదు. నాయుడమ్మ గారు ప్రభుత్వోద్యోగంలో ఉన్న సమయంలో ఎంతోమంది పారిశ్రామికవేత్తలు, స్నేహితులు ఆయన పేరుతో ఒక ట్రస్టును స్థాపించాలని ఉత్సాహపడ్డారు. కానీ అందుకు నాయుడమ్మ గారు ఒప్పుకోలేదు. అధికారంలో ఉండగా అలా చేయడానికి తనకు మౌలికమైన అభ్యంతరముందని చెప్పి, ఆ ప్రతిపాదనను మొగ్గ తొడగకముందే తుంచివేశారు. సర్వీసు నుండి రిటైర్ అయిన తర్వాత తన పేరిట సైన్స్, టెక్నాలజీ ఫౌండేషన్ స్థాపించాలని, ఆ సంస్థ ద్వారా సమాజ సేవ చేయాలని నాయుడమ్మ గారు ఉబలాటపడ్డారు. ఆయన తన మిత్రులను, తానంటే అభిమానించే పారిశ్రామికవేత్తలను సంప్రదించగా వారి నుండి సానుకూలమైన స్పందన లభించింది. వారితో చర్చించేందుకు వీలుగా ఒక సమావేశం ఏర్పాటు చేయమని ఆయన నన్ను కోరారు. నేను డా. శాంతప్ప అధ్యక్షతన మద్రాసు యూనివర్సిటీ క్యాంపస్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశాను. ఆ సమావేశంలో నాయుడమ్మగారిని మాట్లాడమని ఆహ్వానించగా, ఆ సభలో ఆయన తన మనోగతాన్ని అందరితో పంచుకున్నారు. తాను కల్పన చేస్తున్న ఫౌండేషన్ ఆశయాలు, వాటిని సాధించడానికి ప్రణాళికలు స్థూలంగా వివరించారు. ఆహ్వానితులు ఆయన అభిమతానికి మద్దతు తెలిపి, అప్పటికప్పుడే తమ విరాళాలు ప్రకటించడానికి సిద్ధపడ్డారు. నాయుడమ్మ గారు అలా తన సముఖంలో విరాళాలు ప్రకటించడం, ఎవరెంత విరాళమిచ్చారో తెలియచేయడం తనకు ఇబ్బందికరంగా ఉంటుందని చెప్పి, తర్వాత సమావేశంలో తాను సభలో లేనప్పుడు ఆ పని చేస్తే హుందాగా ఉంటుందని చెప్పారు. ఆవిధంగా ఆ రోజు ట్రస్టు ఆలోచన కార్యరూపం దాల్చలేదు.

*తాను కల్పన చేస్తున్న ఫౌండేషన్ ఆశయాలు, వాటిని సాధించడానికి ప్రణాళికలు స్థూలంగా వివరించారు. ఆహ్వానితులు ఆయన అభిమతానికి మద్దతు తెలిపి, అప్పటికప్పుడే తమ విరాళాలు ప్రకటించడానికి సిద్ధపడ్డారు. నాయుడమ్మ గారు అలా తన సముఖంలో విరాళాలు ప్రకటించడం, ఎవరెంత విరాళమిచ్చారో తెలియచేయడం తనకు ఇబ్బందికరంగా ఉంటుందని చెప్పి, తర్వాత సమావేశంలో తాను సభలో లేనప్పుడు ఆ పని చేస్తే హుందాగా ఉంటుందని చెప్పారు.*

ఇది జరిగిన కొన్ని రోజులకు అనూహ్యంగా నాయుడమ్మ గారు ఢిల్లీ వెళ్ళి జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బాధ్యతలు చేపట్టారు. అక్కడ ఆయనకు పని వత్తిడి కారణంగా ట్రస్టు ఏర్పరిచే విషయంపై అడుగు ముందుకు పడలేదు. 1985 జూన్‌లో ఆయన COSTED కాన్ఫరెన్సుకు బయలుదేరే ముందు నేను కలిసినప్పుడు ఆయన "ఫౌండేషన్ స్థాపించే ప్రయత్నంలో స్తబ్ధత నెలకొంది. ఆశించిన ప్రగతి కనుచూపుమేరలో లేదు" అని తన అసంతృప్తిని వెల్లడించారు. అప్పుడే నా విదేశ పర్యటన ఉంది. అది ముగిసి, తిరిగి వచ్చిన వెంటనే ఫౌండేషన్ స్థాపన కార్యక్రమంపై నా దృష్టిని కేంద్రీకరించాలని నిర్ణయించుకున్నాను. అదే మాట వారితో చెప్పాను. నేను అర్జెంటీనాలో ఉన్నప్పుడే ఆయన విమాన దుర్ఘటనలో మృతిచెందారు. నాయుడమ్మ గారు గతించిన కొద్ది నెలల అనంతరం శాంతప్ప గారి ఆధ్వర్యంలో సి.ఎల్.ఆర్.ఐ.లో నాయుడమ్మ ఫౌండేషన్ స్థాపించే ప్రయత్నంగా అంతకుముందు మద్రాసు యూనివర్సిటీ క్యాంపస్‌లో సమావేశమైన వారితో ఇంకొక సమావేశం ఏర్పాటు చేశాను. సమావేశం జరుగుతుండగా సి.ఎస్.ఐ.ఆర్. డైరెక్టర్ జనరల్ డా. వరదరాజన్ ఆహ్వానం లేకుండా పానకంలో పుడకలా పిలవకపోయినా మధ్యలో వచ్చి అసందర్భమైన విషయాలు మాట్లాడి, చర్చించవలసిన అంశాలకు ప్రాధాన్యత లేకుండా చేసి నాకే కాకుండా ఆహ్వానితులకు కూడా కూడా ఆశాభంగం కలిగించారు.

తర్వాత కాలంలో నాయుడమ్మ గారి అభిమానులకు ఫౌండేషన్ స్థాపించే విషయంపై శ్రద్ధ సన్నగిల్లింది. అందువల్ల నేను మళ్ళీ ఈ విషయంపై సమావేశం నిర్వహించలేదు. ఈ విధంగా నాయుడమ్మ గారి కోర్కె ఆయన జీవితకాలంలో నెరవేరలేదు. ఆయన మరణం తర్వాతైనా ఆయన కోర్కెకు రూపమివ్వాలన్న నా సంకల్పం కూడా ఫలవంతం కాలేదు. నాయుడమ్మ గారు తన రెండవ కుమారుడు పెండ్లి విషయంలో క్షోభ అనుభవించారని నాకు తోచింది. ఆయన రెండవ కుమారుడు రమేష్ అమెరికాలో చదువు ముగించుకుని మద్రాసు వచ్చాడు. అతనికి పెళ్ళీడు వచ్చింది. కాకపోతే రమేష్ ఏ ఉద్యోగంలోగాని, వ్యాపారంలోగాని కుదురుకోలేదు. ఒకరోజు నాయుడమ్మగారు నాతో "రమేష్‌కు ఇంకా పెళ్లి చెయ్యలేదు. ఆలస్యమయింది'' అన్నారు. అంతకుముందు నాయుడమ్మ గారు తన పర్సనల్ విషయాలు, కుటుంబ విషయాలు నాతో ఎప్పుడు కూడా మాట్లాడలేదు. అదే మొదటిసారి. కుమారునికి పెళ్లి చేయాలని అన్నారే గాని ఆ విషయంలో నేను నాయుడమ్మ గారికి ఎలా సహాయపడగలనో సూచించలేదు. అందువల్ల నేను మిన్నకుండిపోయాను. రమేష్ పెళ్ళి కోర్కె కూడా తీరకుండానే నాయుడమ్మ గారు మరణించారు.

* * *

**నాయుడమ్మ గారి వ్యాసాలు, ఉపన్యాసాల సంకలనం**

**(COMPENDIUM) ప్రచురణ**

నాయుడమ్మ గారు అంతర్ధానమైన మూడు వారాలకు నేను విదేశ పర్యటన నుండి తిరిగి వచ్చి ఆయన జ్ఞాపకాలు వెంటాడగా ఆయన ఆఫీసుకు వెళ్ళాను. అక్కడ ఆయన రాసిన వ్యాసాలు, ఉపన్యాసాల కాగితాలు ఒక మూలకు చేరి కుప్పతొట్టిలోకి చేరడానికి సిద్ధంగా ఉన్నాయి. నా బాధ వర్ణనాతీతం. వాటిని నేను జాగ్రత్తగా సేకరించి, తీసుకుని వెళ్లి నా ఆఫీసులో భద్రం చేశాను. నేను 1994లో రిటైర్ అయిన తర్వాత అవి మా ఇల్లు చేరాయి. అప్పుడప్పుడు వాటిని తీసి చదివితే నాయుడమ్మ గారి అనుభవం, పరిజ్ఞానం, విజ్ఞత అపారమని, అది గ్రంథస్థం కాకుండా మట్టి కొట్టుకుపోతోందే అన్న ఆవేదన నన్ను ఇబ్బంది పెట్టింది.

నేను సేకరించిన వాటిని ప్రింట్ చేయడానికి రెండు లక్షల రూపాయలకు పైగా ఖర్చు అవుతుంది. ఆ డబ్బుని ఎలా సమకూర్చుకోవాలన్న ఆలోచన నన్ను వదల్లేదు. 1986లో డా. వి.ఎల్. దత్తు గారు రెండు లక్షల రూపాయల మూలధనంతో నాయుడమ్మ మెమోరియల్ సైన్స్ ఫౌండేషన్ స్థాపించారు. నేను సర్వీసు నుండి రిటైర్ అయిన తర్వాత ఆయన నన్ను ఆ ట్రస్టుకు సభ్యుడుగా ఎంపిక చేసారు. సి.ఎల్.ఆర్.ఐ. డైరెక్టర్ డా. త్యాగరాజన్ సహకారంతో సి.ఎల్.ఆర్.ఐ.కి అనుబంధంగా Impact of Technology on Women's Employment అనే సర్వే ప్రాజెక్టును ట్రస్టు చేపట్టింది. అందులో 13 లక్షల రూపాయల నికరాదాయం మిగిలింది. తర్వాత నా పరపతితో ఆమ్స్టర్డాంలోని నెదర్లాండ్ యూనివర్సిటీతో కలిసి ట్రస్టు తరఫున Solid Waste Management in Chennai అనే అంశంపై అధ్యయనం చేయగా నాలుగు లక్షల రూపాయలు మిగిలాయి.

*అలా ట్రస్టు సంపాదించిన ఆదాయంతో నాయుడమ్మ మెమోరియల్ సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేను సేకరించిన నాయుడమ్మ గారి వ్యాసాలను, ఉపన్యాసాలను క్రోడీకరించి, వాటికి ఆయన ఫోటోలను జతపరిచి పుస్తకంగా 1000 కాపీలను ప్రింట్ చేసాము. వాటిని సి.ఎస్.ఐ.ఆర్.లోని 40 లెబొరేటరీలకు, ఐఐటీలకు, విశ్వవిద్యాలయాలకు, కేంద్ర ప్రభుత్వంలోని సైన్స్, టెక్నాలజీ సంస్థలకు, కెనడాలోని IDRCకి, విదేశాలలో ఉన్న నాయుడమ్మ గారి అభిమానులకు ఉచితంగా పంపించాము.*

అలా ట్రస్టు సంపాదించిన ఆదాయంతో నాయుడమ్మ మెమోరియల్ సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేను సేకరించిన నాయుడమ్మ గారి వ్యాసాలను, ఉపన్యాసాలను క్రోడీకరించి, వాటికి ఆయన ఫోటోలను జతపరిచి పుస్తకంగా 1000 కాపీలను ప్రింట్ చేసాము. వాటిని సి.ఎస్.ఐ.ఆర్.లోని 40 లెబొరేటరీలకు, ఐఐటీలకు,

విశ్వవిద్యాలయాలకు, కేంద్ర ప్రభుత్వంలోని సైన్స్, టెక్నాలజీ సంస్థలకు, కెనడాలోని IDRCకి, విదేశాలలో ఉన్న నాయుడమ్మ గారి అభిమానులకు ఉచితంగా పంపించాము. 2020 నాటికి ఈ విధంగా వితరణగా దాదాపు 900 కాపీలు పంచడం జరిగింది.

ఈ పుస్తకం ద్వారా వివిధ అంశాలపై నాయుడమ్మ గారి పరిజ్ఞానం, ఆయన దృష్టిలో సంఘ సంక్షేమానికి ఎటువంటి సైన్సు, టెక్నాలజి అవసరమో తెలుస్తుంది. నాయుడమ్మ గారు "Environment is not a piece of real estate. It has to be protected and promoted for the benefit of future generations" అని పదేపదే చెప్పేవారు. అంటే ప్రకృతి సంపద ఒక తరానికి చెందదని, దాన్ని రక్షించి ముందు తరాలకు అందించాలి అని నాయుడమ్మ హితవు చెప్పారు. ఈ పుస్తకం చదివితే ఇంతటి గురుతర బాధ్యతను ఎంత సులువుగా నిర్వర్తించగలమో బోధపడుతుంది. ఈ పుస్తకంలో ఉన్న నాయుడమ్మ గారి ఎన్నో వ్యాసాలు ఈ తరం వారికి కూడా కరదీపికలుగా ఉపయుక్తమవుతాయి. ఈ పుస్తకం ప్రచురణ నాయుడమ్మ గారి మరణానంతరం నాయుడమ్మ మెమోరియల్ సైన్స్ ఫౌండేషన్ అధ్వర్యంలో చదువరులకు నా సంకల్పబలంతో అందించగలిగానన్న భావన నాకు ఎంతో హాయినిస్తుంది. ఇది నేను ఆయనకు అర్పించిన నివాళి అనడం సాహసం అవుతుంది. బహుశా నాయుడమ్మ గారి స్మృతిచిహ్నంగా చంద్రునికో నూలుపోగు చందాన దీన్ని సమర్పించే భాగ్యం నాకు దక్కిందని నేను సంతోషపడుతున్నాను.

* * *

### డా. సోమరాజు సుశీల రచన 'ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డా. వై. నాయుడమ్మ'

డా. సోమరాజు సుశీల గారు చేయి తిరిగిన రచయిత. నాయుడమ్మ గారి ప్రోత్సాహంతో 1972లో పరిశ్రమను స్థాపించి "ఆ మహానుభావుడి ఆశీర్వచనబలంతో మేము తింటూ, మాతోపాటు మరో పదిమందికి అన్నం పెట్టగలుగుతున్నాం. చల్లని వేళ ఎప్పుడూ ఆయన్ని మేము తలచుకుంటూనే ఉంటాము" అని చెప్పిన నిగర్వి, మహిళా పారిశ్రామికవేత్త డా. సోమరాజు సుశీల. 2011లో హైదరాబాద్‌లో ఉన్న సి.పి. బ్రౌన్ అకాడమి 'తెలుగు జాతి రత్నాలు' పేరుతో తెలుగు ప్రముఖులపై పుస్తకాలను ప్రచురించారు. అందులో ఒక పుస్తకం 'ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డా. వై. నాయుడమ్మ'. ఆ పుస్తకం వ్రాసే బాధ్యతను సి.పి. బ్రౌన్ అకాడమి పెద్దలు డా. సోమరాజు సుశీలకు అప్పగించారు.

నాయుడమ్మ గారిపై విషయ సేకరణ ఆమెకు కష్టంగా పరిణమించింది. నన్ను కలిస్తే నాయుడమ్మ గారి గురించి కొంత సమాచారం లభించవచ్చని హైదరాబాద్‌లో ఎవరో ఆమెకు చెప్పారట. తదుపరి ఆమె మద్రాసు వచ్చి నన్ను కలుసుకున్నారు. ఆమెకు నా వద్ద ఉన్న నాయుడమ్మ గారి వ్యాసాలు, నోటు పుస్తకాలు అందచేశాను. ఆయన నాకు వ్రాసిన జాబులు కూడా ఆమెకు ఇచ్చాను. ఆమె వాటి కాపీలు తీసుకుని, ఒరిజినల్ కాగితాలు నాకు తిరిగి ఇచ్చేశారు. ఆమె వ్రాసిన పుస్తకంలో నేను ఆమెకు అందజేసిన సహకారాన్ని ఉటంకించారు. "అడిగినదే తడవుగా ఎంతో శ్రద్ధతో డా. వై. నాయుడమ్మ గారికి సంబంధించిన విషయాలన్నిటినీ నాకు ఇవ్వడమేకాక, అనేక సూచనలు, సలహాలు ఇచ్చిన డా. వై. నాయుడమ్మ గారి చిరకాల మిత్రులు, సహోద్యోగులు అయిన శ్రీ కాట్రగడ్డ శేషగిరిరావుగారికి (చెన్నై) నా ప్రత్యేక కృతజ్ఞతలు" అని ఆమె వ్రాశారు.

*"అడిగినదే తడవుగా ఎంతో శ్రద్ధతో డా. వై. నాయుడమ్మగారికి సంబంధించిన విషయాలన్నిటినీ నాకు ఇవ్వడమేకాక, అనేక సూచనలు, సలహాలు ఇచ్చిన డా. వై. నాయుడమ్మగారి చిరకాల మిత్రులు, సహోద్యోగులు అయిన శ్రీ కాట్రగడ్డ శేషగిరిరావుగారికి (చెన్నై) నా ప్రత్యేక కృతజ్ఞతలు" అని ఆమె వ్రాశారు.*

డాక్టర్ సోమరాజు సుశీల పుస్తకం మొదలుపెట్టడమే ఇంపుగా ఉంటుంది. "కళ్ళు మూసినా, తెరచినా కెమికల్ ఈక్వేషన్సును చూస్తూ, అన్నిటిలోనూగల రసాయనాలను వాసనలబట్టి పసిగడుతూ, డబ్బులు చూసి కంగారుపడే మాలాంటివాళ్ళం ఒక చిన్న పరిశ్రమను పెట్టాలనుకోవడం,

పెట్టడం, నడపడం ప్రపంచంలోనే గొప్ప వింత. మమ్మల్ని మేమే నమ్మలేని పరిస్థితుల్లో మొదటి పరిచయంలోనే మా మీద మాకన్నా ఎక్కువ నమ్మకాన్ని గుప్పించి, తగు సమయంలో తగు ప్రోత్సాహాన్నిచ్చిన మానవతామూర్తి డా. యలవర్తి నాయుడమ్మ. ఆయన ఇచ్చిన ధైర్యం ఆధారంగా జీవితాన్ని ఫలవంతంగా నడిపిన మాకు, మా కృతజ్ఞతలు చెప్పుకునే అవకాశమే దొరకలేదు" అని ఆమె వ్రాసారు. డాక్టర్ సోమరాజు సుశీల గారి పుస్తక రచనకు నాకు చేతనైనంత సాయం చేసి, ఆ విధంగా నాయుడమ్మ గారికి నేను కృతజ్ఞతలు తెలుపగలిగానని నాకు తృప్తిగా ఉంది.

* * *

## 'ప్రజల శాస్త్రవేత్త డా. నాయుడమ్మ జీవిత చరిత్ర' రచన

నాయుడమ్మ గారిపై డా. సోమరాజు సుశీల గారి పుస్తకం చదివిన తర్వాత, అది ఇంగ్లీషులో ఉంటే నాయుడమ్మ గారి గొప్పతనం తెలుగు తెలిసిన వాళ్ళకే కాకుండా దేశ విదేశాలలో తెలుస్తుందని తోచి, నేను డా. సోమరాజు సుశీల గారిని కలిసి నాయుడమ్మ గారి జీవితాన్ని ఇంగ్లీషులో వ్రాయవలసిందిగా కోరాను. ఆమె సూటిగా "నేను కాదు. కాటా చంద్రహాస్‌ని కలవండి. ఆయన నా రచనను ఇంకా విస్తరించి వ్రాయగల సమర్థుడు" అని చెప్పారు.

*ఆయన ఇచ్చిన సమాచారం నాయుడమ్మ జీవిత కథని అల్లడానికి ఆధారమైంది. తెలియని ఒక వ్యక్తి జీవితం గురించి రాసేటప్పుడు ఎన్నో ప్రశ్నలు, మరెన్నో అనుమానాలు రచయితని వేధిస్తాయి. రాస్తున్నది సత్యమా లేక అతిశయోక్తా? ఈ విషయం రాయటంలో ఔచిత్యం ఉందా లేదా? ఇలాంటివన్నీ శేషగిరిరావు గారితో చర్చించాను.*

నా సహచరుడు డా. సుబ్బరామ నాయుడుకు చంద్రహాస్ స్నేహితుడు. నేను, నా సహచరుడు డా. సుబ్బరామ నాయుడు చంద్రహాస్‌తో ఫోన్‌లో సంప్రదించాము. నా వద్ద ఉన్న నాయుడమ్మ గారి గురించి ఉన్న సమాచారం అందచేస్తానని, తెలిసిన విషయాలు చెబుతానని, నా జ్ఞాపకాలు రచనకు ఉపయోగపడతాయని, రచన మొదలుపెట్టిన తర్వాత మరింత సహకారం అందిస్తానని మాట ఇచ్చి, నాయుడమ్మ గారి జీవిత చరిత్ర వ్రాయమని అడిగాను. పుస్తకం తయారై ముద్రణ జరిగిన తర్వాత నాయుడమ్మ మెమోరియల్ సైన్సు ఫౌండేషన్ రూ.30,000కు సరిపడే కాపీలు కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చాను. మొదట్లో ఆయన ఈ బాధ్యతను మోయడానికి ఇష్టపడలేదు. కాని మా ప్రోద్బలంతో ఒప్పుకుని మొదలుపెట్టారు. పుస్తకం కోసం చంద్రహాస్ విస్తృతంగా విషయ సేకరణ చేశారు. నాయుడమ్మ గారి కుటుంబ సభ్యులను, ఆయనతో పరిచయం ఉన్న ప్రముఖులను కలిసి వారి నుండి సమాచారం సేకరించారు. నాయుడమ్మ గారి కుటుంబ సభ్యుల నుంచి కొన్ని ఫోటోలను సేకరించారు. నా పాత్ర గురించి పుస్తకంలో చంద్రహాస్ ఇలా చెప్పారు: "నాయుడమ్మ జీవిత కథకు మౌలిక సమాచారమంతా శేషగిరిరావు గారు సమకూర్చారు. వాటిల్లో కొన్ని నాయుడమ్మ రాసిన లేఖలు, వ్యాసాలు, నోట్ పుస్తకాలు ఉన్నాయి. అవన్నీ నా రచనకు పుష్కలంగా దోహదం చేశాయి. నాకు ఇతరత్రా సాయంచేయగలిగే వారి జాబితా కూడా వారే ఇచ్చారు. ఆయన ఇచ్చిన సమాచారం నాయుడమ్మ జీవిత కథని అల్లడానికి ఆధారమైంది. తెలియని ఒక వ్యక్తి జీవితం గురించి రాసేటప్పుడు ఎన్నో ప్రశ్నలు, మరెన్నో అనుమానాలు రచయితని వేధిస్తాయి. రాస్తున్నది సత్యమా లేక అతిశయోక్తా? ఈ విషయం రాయటంలో ఔచిత్యం ఉందా లేదా? ఇలాంటివన్నీ శేషగిరిరావు గారితో చర్చించాను. ఆయన నివాసం చెన్నై. నాదేమో హైదరాబాద్. అందువల్ల టెలిఫోన్లో కూడా సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. వారి సలహాలు, వ్యాఖ్యలు నా కథనానికి మెరుగులు దిద్దాయి. వారికి నా కృతజ్ఞతలు."

పుస్తకం వ్రాసిన తర్వాత దానికి ప్రొఫెసర్ సి. సుబ్బారావు గారు ఉద్వేగభరితమైన ముందుమాట వ్రాశారు. ఆ తర్వాత జరిగిన సంఘటనలు రచయిత చంద్రహాస్ మాటల్లోనే తెలుసుకుందాం. "వ్రాతప్రతిని తెలిసిన వాళ్ళకు చూపెట్టాను. చదివిన వాళ్ళు బాగుందన్నారు. అప్పుడు దాన్ని కొన్ని ప్రచురణ సంస్థలకు

పంపాను. పుస్తకాన్ని పబ్లిష్ చేస్తారనే ఆశతో పెంగ్విన్ సంస్థకు కూడా పంపాను. కానీ ఊహించిన అద్భుతం జరగలేదు. రెండు, మూడు నెలలు వేచి చూసిన తర్వాత పెద్ద పబ్లిషర్లు కాదు కదా చిన్న పబ్లిషర్లు కూడా పుస్తకాన్ని పబ్లిష్ చెయ్యరన్న ఆలోచనతో పుస్తకాన్ని నేనే పబ్లిష్ చేసి బరువు దించుకుందామని నిర్ణయం తీసుకున్నాను. ఆ అలోచన రావడమే ఆలస్యం నేను వ్రాతప్రతిని పట్టుకుని హైదరాబాద్‌లో ఉన్న ప్రముఖ ముద్రణాశాల ప్రగతి ప్రింటర్స్ అధినేత శ్రీ పర్చూరి నరేంద్ర గారిని కలిశాను. ఆయనతో నాకు పూర్వ పరిచయం లేదు. మానుస్క్రిప్టు ఆయనకు అందించి 'ఈ పుస్తకం ముద్రించాలి. మూడు వందల కాపీలకు నాయుడమ్మ సైన్స్ ఫౌండేషన్ రూ.30,000 ఇస్తారు. నా స్నేహితులకు ఇవ్వడానికి నాకు 100 కాపీలు కావాలి. దానికి నేను రూ. 10,000 ఇస్తాను. వెరసి రూ. 40,000 ఇస్తాను. 400 కాపీలు ప్రింటు చేసి ఇవ్వగలరా?' అని నేను వారిని సూటిగా అడిగాను. నరేంద్ర గారు మానుస్క్రిప్టుని అటూ ఇటూ తిరగేసి 'మీరు 40,000 రూపాయలు ఇవ్వండి. ఆ మొత్తానికి మేము నాణ్యమైన పేపర్ మీద వెయ్యి కాపీలు ప్రింట్ చేసి ఇస్తాము' అన్నారు. ఇది నేను ఊహించని మలుపు. ఆయన ఉదారతకు నేను ఆశ్చర్యపోయాను. అది ఆయన పసికట్టి 'నాయుడమ్మ గారు మాకు తెలుసు. ఆయన మాకు కావలసినవారు. అందువల్ల ఇది చేస్తున్నాము' అని నాతో అన్నారు. అంతే. ఇంకో మాట ఆయన మాట్లాడలేదు. రవీంద్ర అనే మేనేజరుని పిలిచి 'ఈ పుస్తకం మనం వేస్తున్నాము' అని చెప్పి నన్ను అతనితో వెళ్ళమన్నారు. అంతా కలిపి మూడు నిమిషాల వ్యవధిలో జరిగిన విషయమిది. నేను నరేంద్ర గారి గది నుంచి బయటికి వచ్చి ప్రెస్సులో కవరు పేజీ డిజైనర్ దగ్గర పని మొదలుపెట్టాను. ఇది జరిగిన కొద్ది రోజులకు వెయ్యి కాపీలు తీసుకు వెళ్ళండి అని ప్రెస్సు నుండి నాకు సందేశం అందింది. వెయ్యిలో 100 కాపీలు నరేంద్ర గారికి ఇచ్చి వాటిని ఆయనకు తెలిసినవాళ్ళకు ఇవ్వమని చెప్పి, ఆయనకు నా కృతజ్ఞతలు తెలిపి బయటపడ్డాను. నాయుడమ్మ సైన్స్ ఫౌండేషన్‌కు 300 పైగా కాపీలు పంపించి నా బరువు దించేసుకున్నానని హాయిగా గాలి పీల్చుకున్నాను." అలా సాదాసీదాగా మొదలైన The People's Scientist Dr. Y. Nayudamma - A Biography పుస్తకం యాత్ర కొద్ది రోజులకే మంచి పుస్తకమని పేరు సంపాదించుకుంది. నాకు తెలిసిన ఎకానమిస్టు, IAS ఆఫీసర్ డా. కె. లక్ష్మీనారాయణ పుస్తకం చదివి, నాయుడమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన గురించి ముఖ్యంగా యువత తెలుసుకోవాలని పట్టుబట్టి 2013 ఏప్రిల్ 15న హైదరాబాద్ ఆవాసా హోటెల్లో పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. దానికి అప్పటి DRDO ఛైర్మన్ డా. సరస్వత్ అధ్యక్షత వహించారు. తెలుగు నేలలో అంత గౌరవప్రదమైన ఆవిష్కరణ ఇంకొక పుస్తకానికి అంతవరకు లభించలేదని ఆ సాయంకాలం సభలో పాల్గొన్నవారు అన్నారు. ఆరోజు ఫంక్షన్ యూ ట్యూబ్‌లో దొరుకుతుంది. అది చూస్తే ఆ వ్యాఖ్యలో ఏమాత్రం అతిశయోక్తి లేదని సులభంగా బోధపడుతుంది. ఆ సభలో నాయుడమ్మ గారి మనుమరాలు అంజన, ఆమె భర్త ప్రఖ్యాత సినీ నటుడు నాని పాల్గొన్నారు. సభలో అంజన మాట్లాడుతూ "పుస్తకం చదివినంతసేపు మా తాతగారితో అడుగడుగూ నడిచిన అనుభూతిని పొందాను" అని సంతోషంగా చెప్పారు.

ఇక పుస్తకం జైత్రయాత్ర మొదలయింది. మొదట అచ్చు వేసిన కాపీలు అయిపోయాయి. ప్రిజం బుక్స్ తరపున శ్రీ బి. రవీంద్రనాథ్ పుస్తకం మళ్ళీ ప్రచురించడానికి ముందుకు వచ్చారు. ప్రిజం బుక్స్ నాలుగు వేల కాపీలు కొత్తగా ప్రచురించింది. శ్రీ ఎన్.వి.ఎస్.రెడ్డి హైదరాబాద్ మెట్రో అధినేత. ఆయన ఢిల్లీలో జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు నాయుడమ్మ గారు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్. ఎన్.వి.ఎస్.రెడ్డి గారికి నాయుడమ్మగారంటే వల్లమాలిన అభిమానం. వారు ప్రత్యేకంగా 1000 కాపీలు ప్రింటు చేయించి హైదరాబాద్ మెట్రో తరపున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని సీనియర్ అధికారులకు పంచారు. 2014లో నాయుడమ్మ గారి జీవిత చరిత్రను తెలుగులో చంద్రహాస్ రచించారు. దాన్ని విశాలాంధ్ర పబ్లిషర్స్ ప్రింటు చేశారు. 'ప్రజల శాస్త్రవేత్త డా. నాయుడమ్మ జీవిత చరిత్ర' తెలుగు పుస్తకాన్ని హైదరాబాద్ మెట్రో తరపున శ్రీ ఎన్.వి.ఎస్.రెడ్డి 35,000

(ఔను, ముప్పై అయిదు వేలు!) కాపీలు స్పెషల్ ఎడిషన్‌గా ప్రింటు చేయించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకి అందే ఏర్పాటు చేశారు. ఆ విధంగా నాయుడమ్మ గారు ఈ తరం పిల్లలకు పరిచయమయ్యారు. అంటే నాయుడమ్మ గారి ప్రస్తావన కనీసం రానున్న యాభై ఏళ్ళు ఎక్కడో ఒకచోట చల్లటి వేళలో వినబడుతుందని నా ఊహ.

* * *

### సెలవు

నాయుడమ్మ గారితో భౌతికంగా నా అనుబంధం 24 ఏళ్ళు నడిచింది. తన భావాలను ఎదుటివారికి సౌమ్యంగా, అనునయంగా చెప్పే గొప్ప సంస్కారం, తనకు తెలియని విషయాన్ని ఎవరు చెప్పినా స్వీకరించే ఔదార్యం, మంచీ చెడులను సూక్ష్మంగా పసిగట్టగల విజ్ఞత, సత్కార్యం చేసేందుకు పడే తపన, అంతరంగపు ఔన్నత్యాన్ని సూచించే ఆజానుబాహువైన దేహ సౌందర్యం... నాయుడమ్మ గారి గురించి చెప్పాలంటే ఇలాంటివి చాలానే ఉన్నాయి.

*నాయుడమ్మ గారు స్నేహశీలి, ఆశ్రిత రక్షకుడు. నిండుగా హాయిగా నవ్వే మనసున్న వ్యక్తి. ఆఫీసులో అంతర్ముఖుడు, బయట హాస్యప్రియుడు. స్వతః అందగాడు. చక్కగా డ్రస్ చేసుకునేవారు. ఆఫీసులో సూటు బూటు వేసుకుంటే దొరబాబులా ఉండేవారు. యలవర్రుకు బయల్దేరినప్పుడు పంచకట్టు, లాల్చీతో పదహారణాల తెలుగురైతు రూపంలో నిండుగా సాక్షాత్కరించేవారు.*

నాయుడమ్మ గారు స్నేహశీలి, ఆశ్రిత రక్షకుడు. నిండుగా హాయిగా నవ్వే మనసున్న వ్యక్తి. ఆఫీసులో అంతర్ముఖుడు, బయట హాస్య ప్రియుడు. స్వతః అందగాడు. చక్కగా డ్రస్ చేసుకునేవారు. ఆఫీసులో సూటు బూటు వేసుకుంటే దొరబాబులా ఉండేవారు. యలవర్రుకు బయల్దేరినప్పుడు పంచకట్టు, లాల్చీతో పదహారణాల తెలుగురైతు రూపంలో నిండుగా సాక్షాత్కరించేవారు. విలువలకు ప్రాధాన్యతనిచ్చిన మనిషి. కోపం వచ్చినా నోరు పారేసుకున్న సందర్భాలు చాలా తక్కువ. సొంత ఆస్తి అంటూ మిగిలింది లేదు. కానీ తెలిసిన వాళ్ళ గుండెల్లో చెరగని ముద్ర వేసి 1985లో అకస్మాత్తుగా తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయారు నాయుడమ్మ గారు.

మంచి మనుషులతో పరిచయం పూర్వజన్మ సుకృతమంటారు. నేనే జన్మలో చేసుకున్న పుణ్యమో గాని నాకు నాయుడమ్మలాంటి సజ్జనునితో పరిచయం కలిగింది. వయసులో, అనుభవంలో, హోదాలో ఆయనతో నాకు సామ్యం లేదు. కానీ ఆ అంతరాలు మా అనుబంధానికి అడ్డు రాలేదు. ఆయన నన్ను ఆదరించారు. అది నా భాగ్యం. నాయుడమ్మ గారు గతించిన పిమ్మట కూడా చాలా సమయాల్లో ఆయన అలోచనలు, అనునయ వాక్యాలు దారిదీపాలై నాకు నా మనస్సులో జరుగుతున్న సంఘర్షణకు పరిష్కారం చూపాయి. నాయుడమ్మ గారి జీవితం విస్తృతంగా తెలిసేందుకు మూలకారణం నేను అనే తలపు నాకు ఆనందాన్నిస్తుంది. హనుమంతుడు చిరంజీవి అంటారు. కానీ వాల్మీకి, తులసీదాస్ చెప్పకపోతే ఆయన చిరంజీవి అని ఎలా తెలిసేది? నాయుడమ్మ గారి ప్రశస్తి దేశం ఎల్లలు దాటింది. ఆయన ఖండాంతర యశస్సును ఆర్జించారు. కాని ఎంత గొప్పవాళ్ళైనా చరిత్ర మరుగున పడడానికి ఎంతో కాలం పట్టదు. నేను పూనుకోవడం వల్ల నాయుడమ్మ గారు మరణించి 35 ఏళ్ళు దాటినా ఆయన జ్ఞాపకాలు పదిలంగానే ఉన్నాయి. ఆ జ్ఞాపకాలు పుస్తకరూపంలో కూడా ఉన్నందున ఆయన జీవితం భావి తరాలకు కూడా స్ఫూర్తిదాయకంగా ఉంటుందని నేను విశ్వసిస్తాను. నాయుడమ్మ గారి జీవితంలోనే కాకుండా, ఆయనపై వచ్చిన పుస్తకాల్లో కూడా నేను ఒక చిన్న పాత్రను పోషించాను. అది చాలు నా జీవితానికి.

సెలవు.

* * *

### డా. యలవర్తి నాయుడమ్మ - జీవిత విశేషాలు

1960 రోజుల్లో మద్రాసు నుంచి కలకత్తాకు వెళ్లే హౌరా మెయిలులో ఎవరైనా ప్రయాణీకుడు గుంటూరు జిల్లా నిడుబ్రోలుకు ఫస్టు క్లాసు టికెట్టు కొంటే రైలు నిడుబ్రోలు స్టేషన్లో ఐదు నిమిషాలు ఆగేది. ఆ వసతి రైతు బాంధవుడు ఎన్.జీ. రంగా గారి కోసం ఏర్పాటైంది.

సాధారణంగా రంగా గారే గాక ఇంకో వ్యక్తి కూడా ఆ వసతిని ఉపయోగపరచుకునేవారు. ఆయన పొడగరి, అందగాడు. గూడ పంచెకట్టు, పైన లాల్చీతో ట్రైనులో నుండి దిగి, బయటికి వచ్చి జట్కా బండిలో ఇంటూరులో ఉన్న చెల్లెలిని చూసి అక్కడినుండి యలవర్రుకు పొలాల మీదుగా, గట్ల మీద దారి పొడుగునా రైతులను, కూలీలను ఆప్యాయంగా పలకరిస్తూ రెండు మైళ్ళ దూరం నడిచి యలవర్రులో ఇల్లు చేరుకునేవారు. ఆయన సౌందర్యారాధకుడు. సి.ఎల్.ఆర్.ఐ. ప్రాంగణంలో అందంగా ఉన్నదేదైనా ఎదురుపడితే ఒక్కక్షణం ఆగి, దాన్ని చూసి 'అందంగా ఉంది' అని చెప్పి ముందుకు సాగేవారు. ఆయన మెచ్చుకున్న వస్తువు ఒక పువ్వు కావచ్చు. చెట్టుకొమ్మపై ఊగుతున్న పిట్ట కావచ్చు. దారిన వెళ్తున్న విద్యార్థిని కట్టుకున్న చీర కావచ్చు. ఆయన మెచ్చుకోలులో ఆనందాన్ని ఆస్వాదించిన మాధుర్యం కనిపించేది. స్వచ్ఛత ప్రతిబింబించేది.

ఆయన భారతదేశపు తోలు పరిశ్రమని ప్రపంచ పటంలో చేర్చిన ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ. సి.ఎల్.ఆర్.ఐ. డైరెక్టరుగా తన నియామకం జరిగిన సందర్భంలో, మర్యాదపూర్వకంగా ఒక మంత్రిని చూడ్డానికి వెళ్తే, తనను కలవడానికి ఒక అమ్మాయి వస్తోందని సరదాపడి సదరు మంత్రి చక్కగా మొహం కడుక్కుని, తల దువ్వుకుని వాకిలికేసి చూస్తున్న సమయంలో తాను గదిలో అడుగు పెట్టడం చూసి ముందు ఖంగు తిని, తర్వాత మంత్రి మహా నీరసపడ్డారని నాయుడమ్మ గారే స్వయానా చెప్పేవారు. సభల్లో తన పేరుపై సరదాగా జోకులు వేసి, అమ్మాయి కోసం ఎదురు చూస్తున్న ప్రేక్షకులను నిరుత్సాహపరిచినందుకు మన్నించమని కోరేవారు. నాయుడమ్మ 1922 సెప్టెంబర్ 10న అంజయ్య, రాఘవమ్మలకు పుట్టిన మొదటి బిడ్డ. యలవర్రులో ప్రాథమిక విద్యాభ్యాసం తర్వాత నాయుడమ్మ తురుమెళ్ళ కారొనేషన్ హైస్కూలులో చదువుకున్నారు. గుంటూరు ఏ.సీ. కాలేజీలో ఇంటర్మీడియట్ చదివారు. ఆ తర్వాత కాశీ వెళ్లి అక్కడ బనారస్ హిందూ యూనివర్సిటీలో ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ చదివి డిగ్రీ తీసుకున్నారు. మద్రాసు తిరిగివచ్చి, న్యాయవాది అవ్వాలని లా కాలేజీలో చేరి కొన్నాళ్ళకే కాలేజీ మానేశారు నాయుడమ్మ. అప్పుడు కాకతాళీయంగా ప్రొఫెసర్ శేషాచలం చౌదరితో ఒక సమావేశం ఆయన జీవితాన్ని మార్చివేసింది. ఆయన ప్రోద్బలంతో మద్రాస్ లెదర్ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్‌లో 1943లో 17 రూపాయల జీతంపై నాయుడమ్మ కెమిస్ట్రీ డెమాన్స్ట్రేటర్ ఉద్యోగంలో చేరారు. నాయుడమ్మకు 1945లో సీతాదేవితో వివాహం జరిగింది. 1946లో ఇన్‌స్టిట్యూట్ తరపున ట్రైనింగ్ కోసం నాయుడమ్మ లండన్ వెళ్ళారు. అది ఆయన జీవితంలో గొప్ప మలుపు. ట్రైనింగు తర్వాత అక్కడినుంచి పైచదువుల కోసం అమెరికా వెళ్లారు. అమెరికాలో లీహాయ్ యూనివర్సిటీలో ఎం.ఎస్. పట్టా పొంది, తదనంతరం పిహెచ్.డి. చేసారు. అమెరికాలో కొన్నాళ్ళు ఒక టాన్నింగ్ కంపెనీలో పనిచేసారు. అక్కడ చర్మ పరిశ్రమలో టెక్నాలజిని ఎంతా చక్కగా ఉపయోగిస్తున్నారో అర్థం చేసుకున్నారు. ప్రయోగశాలలలో నిర్వహించే పరిశోధనల ఫలితాలు కాలయాపన జరుగకుండా చర్మ పరిశ్రమకు లభించి అవి తోలు పరిశ్రమ అభ్యున్నతికి ఎలా తోడ్పడుతున్నాయో ఆకళింపు చేసుకున్నారు. అప్పటికి ఆరు సంవత్సరాలుగా నాయుడమ్మ విదేశాల్లో ఉన్నారు. కానీ స్వప్నసీమ అని పేరొందిన అమెరికాలో స్థిరపడాలని నాయుడమ్మ ఎప్పుడు కూడా అనుకోలేదు. అందుకే అమెరికాలో లభించే మంచి ఉద్యోగావకాశాలను వదులుకొని ఆయన 1951లో ఇండియాకు తిరిగి వచ్చి సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో అసిస్టెంట్ డైరెక్టరుగా ఉద్యోగంలో చేరారు. చర్మ పరిశ్రమకు కొత్త కెరటంలాగా దూసుకువచ్చారు.

విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలు పేదల జీవితాలలో వెలుగులు నింపాలని నాయుడమ్మ అహర్నిశలు శ్రమించారు. కొత్త కొత్త ప్రయోగాలు నిర్వహించి, ప్రయోగాల ఫలితాలను చర్మకారులకు అందచేసి వారి వృత్తికి గౌరవస్థానం కల్పించాలని నాయుడమ్మ కలలు గన్నారు. నాయుడమ్మకు అదృష్టం కలిసి వచ్చింది. 1956లో అతి చిన్న వయసులో ఆయన సి.ఎల్.ఆర్.ఐ. డైరెక్టరుగా నియమించబడ్డారు. దానితో సి.ఎల్.ఆర్.ఐ. సంస్థకు మహర్దశ మొదలయింది. సి.ఎల్.ఆర్.ఐ.

ఆవరణలో అంతకు ముందెన్నడూ చొరబడని కొత్త గాలిని, వెలుగుని ప్రసరింపచేసి, గోడలకున్న బూజుని దులిపించి, సంస్థకు కొత్త చేవను తీసుకువచ్చిన వ్యక్తి నాయుడమ్మ. సి.ఎల్.ఆర్.ఐ.లో ఎన్నో సంస్కరణలను ఆవిష్కరించారు.

చర్మకారుల వృత్తిలో ఉన్న కష్టనష్టాలు, ప్రమాదాలు, అపరిశుభ్రమైన పరిసరాలు చర్మకారులను సభ్య సమాజానికి దూరం చేశాయి. తరతరాలుగా వస్తున్న ఆ వివక్షను దూరం చేయడానికి, చర్మకారుల వృత్తికి గౌరవప్రదమైన స్థానం కల్పించడానికి, నాయుడమ్మ చేసిన కృషి ఎనలేనిది. మారుమూల గ్రామాల్లో ఉన్న చర్మకారుల వద్దకు టెక్నాలజీని తీసుకు వెళ్ళి, కొత్త పద్ధతుల వల్ల కలిగే లాభాలను చర్మకారుల ముంగిట్లో ప్రదర్శించారు. వారి నైపుణ్యాలను మెరుగు పరచి తద్వారా వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడ్డారు. తనకు లభించిన ప్రతి అవకాశాన్ని సమాజంలోని అట్టడుగు వర్గానికి చెందిన చర్మకారుల అభివృద్ధి కోసం ఉపయోగించారు నాయుడమ్మ. వృత్తిపరంగా తాను చర్మకారుడనని సగర్వంగా ప్రకటించిన రైతుబిడ్డ నాయుడమ్మ. 1960 నాటికి నాయుడమ్మకు ముగ్గురు సంతానం. ఇద్దరు అబ్బాయిలు, మధ్యలో ఒక అమ్మాయి. భార్య సీతాదేవి గారు జబ్బు చేసి మంచానికి పరిమితమయ్యారు. మెదడులో కంతి. 1963లో ఆమె మరణించారు. నాయుడమ్మకు అది కష్టకాలం. కల్లోల సముద్రం లాంటి నాయుడమ్మ జీవితంలో డాక్టర్ పవనాబాయి ప్రవేశించి, ఆయన కుటుంబానికి, ఆయన జీవితానికి ఆలంబన అయ్యారు. ఆయన సంతానానికి తల్లిగా, ఆయనకు భార్యగా ఆమె చక్కగా ఒదిగిపోయారు. వారిది అన్యోన్య దాంపత్యం. పరస్పర గౌరవం వారి బంధాన్ని పటిష్టం చేసింది. "ఆమె తోడు దొరకడం నా అదృష్టం. నేను ఆమెను పెళ్లాడిన తర్వాత నా జీవితం సంపూర్ణంగా, సంతోషకరంగా పరివర్తన చెందింది. నేను ఈ ప్రేమమూర్తికి ఎంతో ఋణపడ్డాను. ఆమెపై నా ప్రేమను మాటలలో చెప్పలేను" అని ఆయన తన నడివయస్సులో 1967లోనే వ్రాసిన వీలునామాలో చెప్పారు. ప్రతిభగల శాస్త్రవేత్తలు అరుదు. వారిలో వాస్తవిక దృక్పథం కలిగిన వారు అంతకంటే అరుదు. ఒకవేళ ఉంటే వారికి పరిపాలనా దక్షత ఉండటం దాదాపు అసంభవం. కానీ నాయుడమ్మలోని ప్రతిభ, వాస్తవిక దృక్పథం, స్థిరచిత్తం, నికార్సయిన నిజాయితీ, పరిపాలనాదక్షత తదితర లక్షణాలు ప్రధాని ఇందిరాగాంధి దృష్టిని ఆకర్షించాయి. ఆయనను మద్రాసు నుంచి ఢిల్లీకి రమ్మన్నారు. 1971లో సి.ఎస్.ఐ.ఆర్. డైరెక్టర్ జనరల్ పదవి అప్పచెప్పారు. అప్పట్లో 36 జాతీయ పరిశోధన సంస్థలకు కేంద్ర సంస్థ సి.ఎస్.ఐ.ఆర్. వాటిలో దాదాపు 16 వేల మంది ఉద్యోగాలు చేస్తున్నారు. వారిలో ఎక్కువ మంది సైంటిస్టులు. సీ.ఎస్.ఐ.ఆర్. డైరెక్టర్ జనరల్ పదవి పెద్దదే కానీ 1971లో అదొక ముళ్ళ కిరీటం. సీ.ఎస్.ఐ.ఆర్. వ్యవహారాలు అస్తవ్యస్తంగా ఉండేవి. అది రాజకీయాలకు నిలయం. అందువల్ల సంస్థలో జాతీయ ప్రయోజనాలు మరుగున పడిపోయాయి. కానీ నాయుడమ్మ డైరెక్టర్ జనరల్‌గా చేరిన కొన్నాళ్ళకే సంస్థలోని పరిస్థితులను చక్కదిద్దారు. సైంటిస్టులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. పనికిరాని నిబంధనలను సవరించారు. అనవసరమైన ఉత్తర ప్రత్యుత్తరాలకు స్వస్తి చెప్పారు.

*ఈ ప్రేమమూర్తికి ఎంతో ఋణపడ్డాను. ఆమెపై నా ప్రేమను మాటలలో చెప్పలేను" అని ఆయన తన నడివయస్సులో 1967లోనే వ్రాసిన వీలునామాలో చెప్పారు. ప్రతిభగల శాస్త్రవేత్తలు అరుదు. వారిలో వాస్తవిక దృక్పథం కలిగిన వారు అంతకంటే అరుదు. ఒకవేళ ఉంటే వారికి పరిపాలనా దక్షత ఉండటం దాదాపు అసంభవం. కానీ నాయుడమ్మలోని ప్రతిభ, వాస్తవిక దృక్పథం, స్థిరచిత్తం, నికార్సయిన నిజాయితీ, పరిపాలనాదక్షత తదితర లక్షణాలు ప్రధాని ఇందిరాగాంధి దృష్టిని ఆకర్షించాయి.*

సి.ఎస్.ఐ.ఆర్. డైరెక్టర్ జనరల్‌గా ఆయన పనిచేసిన ఆరు సంవత్సరాలలో కౌన్సిల్ పనితీరులో ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారు. జాతీయ ప్రయోగశాలలను స్వయంప్రతిపత్తి దిశగా నడిపారు. సైంటిస్టులను ప్రయోగాలపై శ్రద్ధ పెట్టి ఫలితాలు ప్రదర్శించమన్నారు.

భారతదేశ నిర్మాణానికి శాస్త్ర విజ్ఞానాన్ని ఎలా వినియోగించుకోవాలి అన్నదే ఆయన నిరంతర ఆలోచన. విజ్ఞానశాస్త్రం, సాంకేతిక నైపుణ్యం సామాజిక అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని ఆయన తపన. శాస్త్రవేత్త వ్యక్తిగత లాభం గురించి ఆలోచించరాదని కచ్చితంగా చెప్పారు. నాయుడమ్మ ప్రవేశపెట్టిన శాస్త్రవేత్త–యాజమాన్య పథకంలో శాస్త్రవేత్త మూడు సంవత్సరాలు సెలవుపై వెళ్ళి సి.ఎస్.ఐ.ఆర్. ప్రయోగశాలలో ఆవిష్కరించిన టెక్నాలజీని ఉపయోగించి పరిశ్రమను స్థాపించవచ్చు. ఒకవేళ ఆ శాస్త్రవేత్త ప్రయత్నం బెడిసికొడితే అతను తిరిగి శాస్త్రవేత్తగా సంస్థలో చేరవచ్చు. ఈ పథకం ఆయన సృజనాత్మకతకు మచ్చుతునక.

నాయుడమ్మ గారి సేవలను గుర్తించి 1971లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ బిరుదుతో సత్కరించింది.

సి.ఎస్.ఐ.ఆర్. డైరెక్టర్ జనరల్‌గా చేరే ముందే ఆయన కొన్ని షరతులు విధించారు. అందులో మొదటిది తాను ఆ పదవిలో ఒక టర్మ్ మాత్రమే పనిచేస్తానని, దానికి ఒప్పుకుంటేనే ఆ పదవిలో చేరతానని చెప్పారు. ఆ షరతు ఒప్పుకున్నాకే అందులో చేరారు. ఆ టర్మ్ అయిపోగానే ఆయన పరిశోధనలు చెయ్యాలని మద్రాసుకు తిరిగివచ్చి సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థను స్థాపించి గ్రామీణాభ్యుదయానికి పథకాలు రచించడంలో నిమగ్నులయ్యారు. కానీ ఆ సంస్థ పూర్తిగా రూపుదిద్దుకోక ముందే మళ్ళీ ప్రధానమంత్రి ఇందిరాగాంధి నుండి పిలుపు వచ్చింది. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా బాధ్యత చేపట్టి అక్కడి పరిస్థితులను చక్కబెట్టమని ఆమె చెప్పారు. జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ఆయన 1981 జూన్ నుండి 1982 అక్టోబర్ వరకు పనిచేశారు. యూనివర్సిటీలో ఉన్న లోటుపాట్లను లోతుగా అధ్యయనం చేసి వ్యవస్థాగతంగా మార్పులను సూచించి ఆ పదవి నుంచి హుందాగా తప్పుకుని, తనకు ప్రీతిపాత్రమైన సి.డీ.ఏ. సంస్థలో పరిశోధనలు చేపట్టాలని తిరిగి మద్రాసు చేరుకున్నారు. మొదట ఉద్యోగంలో చేరిన 40 సంవత్సరాల తర్వాత 1984 సెప్టెంబరులో ప్రభుత్వ సర్వీసు నుంచి నాయుడమ్మ పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత 1985 జూన్ పదవ తేదీన రష్యాలో జరిగే COSTED సమావేశానికి, అక్కడినుంచి జూన్ 21న ఒట్టావాలో నిర్వహించే ఐ.డి.ఆర్.సి. బోర్డ్ గవర్నర్ల సమావేశానికి హాజరయ్యేందుకు నాయుడమ్మ ఇండియా నుండి బయల్దేరారు. 1985 జూన్ 23న ఎయిర్ ఇండియా విమానం కనిష్క AI 182 మొంట్రియల్ నుండి లండన్ మీదుగా ఢిల్లీ వెళ్ళాలి. ఆ విమానం ఐర్లండ్ గగనసీమలో అట్లాంటిక్ సముద్రంపై ఎగురుతున్నప్పుడు దాన్ని ఖలిస్తాన్ ఉగ్రవాదులు బాంబులతో పేల్చివేశారు. విమానం అట్లాంటిక్ సముద్రంలో కూలిపోయింది. విమానంలో ప్రయాణం చేస్తున్న ఒక్కరు కూడా బ్రతకలేదు. ఆ విమానంలో నాయుడమ్మ కూడా ప్రయాణం చేస్తున్నారు. సాధారణ నేపథ్యంగల నాయుడమ్మ స్వయంకృషితో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించారు. ఆయన అధ్వర్యంలో సి.ఎల్.ఆర్.ఐ. ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయమైన చర్మ పరిశోధనా సంస్థగా రూపుదిద్దుకుంది. శాస్త్ర విజ్ఞానాన్ని సామాన్యుడి అవసరాలకు ఉపయుక్తం కావాలని పట్టుబట్టిన అరుదైన శాస్త్రవేత్త నాయుడమ్మ.

*ఎయిర్ ఇండియా విమానం కనిష్క AI 182 మొంట్రియల్ నుండి లండన్ మీదుగా ఢిల్లీ వెళ్ళాలి. ఆ విమానం ఐర్లండ్ గగనసీమలో అట్లాంటిక్ సముద్రంపై ఎగురుతున్నప్పుడు దాన్ని ఖలిస్తాన్ ఉగ్రవాదులు బాంబులతో పేల్చివేశారు. విమానం అట్లాంటిక్ సముద్రంలో కూలిపోయింది.*

నాయుడమ్మ అకాల మరణంతో భారతదేశమే కాదు ప్రపంచ దేశాలన్నీ ఒక ప్రముఖ శాస్త్రవేత్తను, గొప్ప మానవతావాదిని, మార్గదర్శిని కోల్పోయాయి.

*సమాప్తం*

(కాట్రగడ్డ శేషగిరిరావు గారి చేరాతను సంస్కరించింది - కాటా చంద్రహాస్ - హైదరాబాద్. ఫోన్: 800 084 9678)



చిటిప్రోలు కృష్ణమూర్తి

# పద్యకవితా "పురుషోత్తముడు"

– బీరం సుందరరావు

చిటిప్రోలు కృష్ణమూర్తి గారు మన తరం పండితకవి. అజరామరమైన తమ రచనలతో పద్యానికి పట్టాభిషేకం చేసిన కవి. పల్లెటూరి పైరగాలి పరిమళాన్ని తెచ్చి తెలుగు పద్యానికి సరికొత్త సుగంధంగా అద్దిన కవి. స్వయం ప్రతిభతో ఎదిగి స్వీయ పరిశ్రమతో రసవత్కావ్యాలు సృష్టించి కవిత్వమే శ్వాసగా జీవించిన కవి. తెలుగు పద్యం నడకను వడీవంక లేని తమ నడతతో సమన్వయించుకుని ఋషిలా బ్రతికిన కవి. పల్నాటి సీమలో ''కవిగారు''గా గౌరవింపబడిన సాంప్రదాయ కవి. ఇటీవలే (2.9.2021) హైదరాబాదులో తుదిశ్వాస విడిచిన శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తిగారు కాంతులీనే తెలుగు పద్యానికి కాలాతీత రేఖలా నిలిచారు.

కృష్ణమూర్తి గారు పల్నాడులోని గామాలపాడు గ్రామ నివాసి. కీ.శే. చిటిప్రోలు వేంకటరత్నం కనకమ్మ దంపతులకు 1932 డిసెంబర్ 26న సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. స్వయంకృషితో తెలుగు, సంస్కృతం, హిందీ, ఆంగ్ల భాషల్లో పాండిత్యం సంపాదించారు. సమకాలీన మహాకవులు 'తెనుగులంక' తుమ్మల, జాషువా, ఏటుకూరి, కరుణశ్రీ, విశ్వనాథ, పల్నాటి సోదర కవులు, మొదలగువారితో సాన్నిహిత్యమున్న కవి. జాతిహితమే లక్ష్యంగా, దేశభక్తి ధ్యేయంగా, ప్రజాశ్రేయస్సు పరమార్థంగా రచనలు చేసిన కృష్ణమూర్తిగారు పద్యాన్ని పరమోత్కృష్ట భావవాహినిగా ఎంచుకున్నారు. వారి ప్రథమ కావ్యం "కైకేయి". కైక అంటే గయ్యాళి అని ప్రజా బాహుళ్యంలో వేరుదన్నిన దురభిప్రాయాన్ని తొలగించే ఉద్దేశంతో చేసిన ఈ రచన ఉత్తమ కావ్యంగా పండిత ప్రశంసలందుకుంది. అసూయాపరురాలిగా ప్రాచుర్యమందిన కైకేయి పాత్రను తనదైన ఒక విలక్షణ దర్శనంతో త్యాగమయ ప్రాణప్రతిష్ఠ చేసి సృజించిన ఈ కావ్యం ఉస్మానియా విశ్వవిద్యాలయం బి.ఏ. స్పెషల్ తెలుగు విద్యార్థులకు పాఠ్యాంశంగా నిర్దేశితమైంది. మాఘమహాకవి 'శిశుపాలవధ' (మూడు సర్గలు), మహాకవి కాళిదాసు 'మేఘసందేశం' సంస్కృత కావ్యాలను 'మాఘ–మేఘములు' పేరుతో తెలుగులోకి అనువదించారు. తరువాతి కాలంలో 'శిశుపాలవధ' సంపూర్ణ కావ్యాన్ని అనువదించారు. వాంఛేశ్వరకవి (కుట్టికవి) మహిషాసుర శతకాన్ని కూడా తెనిగించి అనువాద కవులకు ఒజ్జబంతిగా నిలిచారు. చిటిప్రోలు వారి దృష్టిలో అనువాదమంటే అనుకరణ కాదు, అనుసృజన. మూలంలోని మెళకువలు, మేలుములు అనువాదంలో అందగించాలి, పాఠకులకు అందాలి. సంస్కృత శ్లోకపు స్వారస్యం చెడకుండా తెలుగు పద్యపు రీవి ఇనుమడించే విధంగా రస పరిపోషణా, శైలీరమ్యతా పోటీపడుతుంటాయి చిటిప్రోలు కవిగారి పద్యంలో. మల్లినాథసూరి రసమయ వ్యాఖ్యలోని రమణీయకత కవిగారి అనువాదంలో కాంతిమంతమైంది.

చిటిప్రోలు కృష్ణమూర్తి గారి కవితామూర్తిమత్వానికి కీర్తిశిఖరమై వెలిగిన కావ్యం ''పురుషోత్తముడు''. కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారం రావడం ద్వారా "పురుషోత్తముడు" ఉత్తమ కావ్యం కాలేదు. గొప్ప కావ్యానికి ఉండవలసిన ఉత్తమ గుణాలన్నీ ఉన్నందునే "పురుషోత్తముడు" కావ్యానికి ప్రతిష్ఠాకరమైన ఈ అవార్డు వచ్చింది. చరిత్ర పుటల్లో దాగిన "పురుషోత్తము"డి వీరగాథకు ఈ కావ్యం దేశవ్యాప్తమైన గుర్తింపునిచ్చింది. పద్యమంటే ఏమిటో తెలియకుండానే పద్యం రాస్తున్న కవులు తెలుగులో చాలామంది ఉన్నారు. యతులూ ప్రాసలూ గణాలూ మాత్రమే పద్యం అనుకుంటే అదొక రుచి లేని పదార్థమవుతుంది. గణాలకంటే గుణాలు ముఖ్యమనుకునేవారికి పద్యమంటే అమృతం కుమ్మరించిన కమనీయ కవితారసధార. చిటిప్రోలువారు శిల్పప్రౌఢి ఎరిగిన, చేయి తిరిగిన పద్యకవి. దేశభక్తీ, వీరరస స్ఫూర్తీ, జాతీయ సమైక్యతా ఆకరంగా 1100

పద్యాల్లో "పురుషోత్తముడు" కావ్యాన్ని రాసిన కవిగారు ప్రతి పద్యంలోనూ ఉదాత్తతనూ, భావుకతనూ, రసాత్మకతనూ నింపి పాఠకుల గుండె పొలాలను తడిమారు, తడిపారు, తనిపారు. సౌందరనందం, శివభారతం, ఆంధ్రపురాణం, మహాత్మకథ వంటి మహాకావ్యాల సరసన నిలిచేలా కవిగారు "పురుషోత్తముడు" కావ్యంలో పద్యానికి రసాభిషేకం చేశారు. కవికి కీర్తినీ, జాతికి స్ఫూర్తినీ ఇచ్చే విధంగా సాగింది ఈ మహాకావ్య నిర్మాణం.

"శ్రీకరుడు దివ్య తేజోవిశిష్టుడైన" అనే శ్రీకారంతో ప్రారంభించి ''శ్రీ''ని విజయ సంకేతంగా నిలిపి, ధర్మవిజయుడైన పురుషోత్తముడి కీర్తి సూర్యునివలె ప్రకాశిస్తుందనే కావ్యాంశను మొదటి పద్యంలోనే ధ్వనిగర్భితంగా చెప్పిన సుకవివరుడు చిటిప్రోలు కవిగారు. అంభి అలెగ్జాండరుకు నమస్కరించిన క్షణం భారతమాతకు అవమానకరమైన క్షణమనే విషయాన్ని ***యవనవిభుడు దవుల నగపడినంతన / అంబికేలుదోయి యట్టె ముగిడె వీరభారతోర్వి విమలగౌరవలక్ష్మి / విప్పుగనుల గావికప్పు నిగిడె*** - అంటూ కవిగారు విశిష్టంగా తీర్చిదిద్దిన పద్యమిది. స్వార్థమెరుగని త్యాగచరితులు, దేశభక్తులు, మహావీరులు చరించిన పుణ్య ధరిత్రి ఇది. ఈ విషయాన్ని కవిగారు పురుషోత్తముడిచేత ఈ విధంగా పలికిస్తారు: ***పుణ్యభూమి, కర్మభూమి, ఉజ్వల యోగభూమి, భరతభూమి భూతలమున / త్యాగయోగములకు దక్క నించుక మెప్పు / పుట్టదిచట రాగభోగములకు***

ఈ పద్యం పురుషోత్తముడు కావ్యాత్మ. మహాకవితా రచనాదీక్షబూని కవిగారు రాసిన కావ్యంలోని ఒక మచ్చుతునక. "పురుషోత్తముడు కావ్యంలోని పలుకుబడికి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం వచ్చిందే తప్ప, ఎవరో చేసిన 'పలుకుబడి'తో కాదు'' - అని ప్రఖ్యాత కవి డా. నాగభైరవ గారు వ్యాఖ్యానించటాన్ని ఈ కావ్యగుణానికి నిదర్శనంగా భావించుకోవాలి. అవార్డు వచ్చిందని విని "అలాగా" అన్న నిరాడంబరకవి కృష్ణమూర్తిగారు. భారతీయ జీవన విధానాన్ని, సంస్కృతీ సంప్రదాయాల ఔన్నత్యాన్ని, తలవంచని వీరుల జాతీయ తాభావాన్ని మానవతా రాగంలో మేళవించి కనుమరుగవుతున్న చరిత్రను వ్యాఖ్యాన సుందరంగా రచించి చిటిప్రోలువారు మాన్యులయ్యారు. కవి పండిత లోక సమ్మానులయ్యారు. 'కవి రాజశేఖర', 'కవితాసుధాకర'వంటి బిరుదులందిన చిటిప్రోలువారు పురుషోత్తమ మహారాజులాగే ధర్మవర్తనులు. సత్య మార్గానుయాయి. కవికి ఉండవలసిన ఉత్తమ గుణాలన్నీ కలిగిన సహజ పాండితీ సంపన్నులు. అభిమానధనులు. సత్కార్యాలు చేశారు. సత్కావ్యాలు రాశారు . ఎప్పుడూ ఎవరినీ యాచించలేదు. సత్కారాల్ని ఆశించలేదు.



చిటిప్రోలు కృష్ణమూర్తి గారు (కుడి వైపు) 17.2.2009న ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం (2008) సంస్థ అధ్యక్షులు శ్రీ సునీల్ గంగోపాధ్యాయ గారి నుండి అందుకుంటున్నప్పటి చిత్రం

కవితారచన వారి జీవితంలో భాగమైంది. అక్షరమే వారికి దేవాలయమైంది. వ్యవసాయం వృత్తిగా, కవిత్వం ప్రవృత్తిగా పల్లెపట్టునే జీవితం కొనసాగించారు. చదువుకుని పల్లెలో స్థిరపడ్డ మరో వ్యక్తి లేక, ఉన్న పోస్టాఫీసు మరో గ్రామానికి తరలిపోయే ప్రమాదాన్ని నిరోధించాలన్న గ్రామ శ్రేయస్సు దృష్ట్యా స్వీకరించిన పోస్టుమాస్టరు ఉద్యోగం ఆర్థికంగా సేద్యానికి కొంత చేదోడైంది. ఖడ్గపాండితి నెరపిన నాయకురాలు నాగమ్మ పుట్టిన గామాలపాడులో కవిగారి కవనపాండితి శోభించింది. కదనరంగంలో నాగమ్మ, కవనరంగంలో కృష్ణమూర్తిగారు యశశ్శరీరులయ్యారు.

"వేయి వసంతముల్ ప్రతిభ నిల్పు తెలుంగు ధరిత్రి గుండెలన్" - కవిగారికి పద్యాక్షతలు చల్లిన విఖ్యాతకవి వృషాద్రిపతిగారి గుండె చప్పుళ్ళివి.

తెలుగు పద్యానికి వెలుగుదారి చూపించిన "పద్యకవితా పురుషోత్తముడు" చిటిప్రోలు కృష్ణమూర్తి గారికి ఆత్మీయ అక్షరనివాళి.


చిట్టిప్రోలు కృష్ణమూర్తి గారి కుమారుడు
చిట్టిప్రోలు సుబ్బారావు - ఫోన్: 970 104 9000.


*


డా. బీరం సుందరరావు
చీరాల. ఫోన్: 984 803 9080.

# అరుణ రావెల - స్నేహలత

– పున్నా కృష్ణమూర్తి

జీవితంలో తీయనిది "స్నేహ"లతే !

సిగ్గుతెరలలో కనులు వంచుకుని.... అన్నట్లుగా కన్పిస్తున్న అమ్మాయి అరుణ. అబ్బాయి రావెల సోమయ్య.

ఇరువురి వివాహానికి అతిథులుగా అమెరికా నుంచి సోషలిస్ట్ రచయిత్రి మార్గో స్పిన్నర్, హైదరాబాద్ నుంచి మ్యాన్ కైండ్ ఎడిటర్ బద్రి విశాల్ Pitti వచ్చారు.

నాస్తిక కేంద్రం భావ కిరణం జొన్నలగడ్డ రామలింగయ్య ఆధ్వర్యంలో కట్నకానుకలు లేకుండా వివాహం జరిగింది. తుళ్లూరు గ్రామస్తులు వెయ్యినూటపదహార్లు చదివించారు! సోషలిస్ట్ భావ ప్రచారం కోసం!!

ఈ కార్యక్రమానికి అధ్యక్షురాలిగా ఒక అపురూప లావణ్యరాశి విచ్చేసారు 'మెద్రాస్' నుంచి. ఆమె స్నేహలత. పఠాభి హృదయేశ్వరి. అరుణకు 1961లో స్నేహలతతో అదే పరిచయం. ఎమెర్జెన్సీలో నిర్బంధాలకు వేధింపులకు గురై, 1977లో తుదిశ్వాస విడిచేవరకు వీలైన అన్ని సందర్భాల్లోనూ అరుణ, స్నేహలతను కలుస్తూనే ఉన్నారు.

వారి స్నేహం గురించి దాదాపు పదేండ్ల క్రితం అరుణ గారు ఇలా అన్నారు.

సోమయ్యగారు రామ్ మనోహర్ లోహియా అనుచరులు. లోహియాతో, పఠాభి రామరెడ్డి, స్నేహలతలతో వారికి పరిచయాలుండేవి.

రాజకీయ జీవితాలలో ప్రేమలకు తీరిక ఎక్కడిది? అనుకున్నారేమో వరసైన నన్నే ప్రేమించారు సోమయ్య గారు!

ఎంతవరకు చదువుకోవాలనుకుంటే అంతవరకు చదువు అన్నారు. ఆయన పరిచయం కారణంగా స్నేహలత మా వివాహానికి వచ్చారు.

పెళ్లయిన కొత్తలో పఠాభిగారింటికి వెళ్లాం. తమ వివాహం గురించి స్నేహలత చెప్పారు. మెద్రాస్ ప్లేయర్స్ సభ్యురాలైన తనతో పఠాభి ప్రేమలో పడ్డారట. స్నేహ తండ్రి తమిళియన్. తల్లి బెంగాలీ క్రిస్టియన్. పట్టాభి తండ్రి గాంధేయవాది. నెల్లూరు పర్యటన సందర్భంగా గాంధీ గారు వారి ఇంట్లోనే బస చేశారు. స్నేహ – పఠాభిల వివాహానికి పఠాభి తల్లితండ్రులిరువురూ 'నో' చెప్పారట.'

అరుణా, తుళ్ళూరులో మీ వివాహమే గ్రాండ్‌గా జరిగింది. నలుగురు స్నేహితులతో మేము ఆర్యసమాజం పద్ధతిలో పెండ్లి చేసుకున్నాం, అన్నారు స్నేహలత.

అరుణ స్నేహితురాలు కాకపోతే స్నేహలతకు వచ్చే లోటేమీ ఉండదు. కానీ ఆమె స్నేహం లేకపోతే నేను లేను. స్నేహ స్ఫూర్తితో విశాఖ ఉక్కు, అంగ్రేజీ హఠావో ఉద్యమాల్లో పాల్గొన్నాను.

ఆంధ్రవిశ్వవిద్యాలయం వక్తృత్వ పోటీల్లో ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. స్నేహలత ఎఫెక్ట్ !

గోడె నరహరి, సీవీకే రావు, అప్పారావు తదితరులతో వేదికలెక్కి ఉపన్యసించేదానిని. లోక్‌దళ్ పార్టీ తరఫున ప్రచార సభల్లో జార్జి ఫెర్నాండేజ్ వచ్చేవరకు నాతో మాట్లాడించేవారు. ఫెర్నాండేజ్ రాగానే వేదిక దిగి, తదుపరి గ్రామం వెళ్లేదానిని. సభకు ఫెర్నాండేజ్ వచ్చేవరకూ ఉపన్యసించేందుకు.

'అరుణా నువ్వు సభలతో సరిపెట్టుకో, శాసనసభకు వస్తే మాకు ఇబ్బందే' అని వావిలాల గోపాల క్రిష్ణయ్య చమత్కరించేవారు.

పెండ్లిలో అరుణ వంచిన తల ఎత్తలేదు. ఇప్పుడు చూడండి ఎంత డేరింగ్‌గా తయారయ్యిందో 'షీ ఈజ్ మై షో పీస్' అనేవారు స్నేహలత.

'పఠాభి – స్నేహ' ఒకరు మరొకరు. లోహియా పఠాభితో అన్నారొకసారి 'సోషలిస్టులు చాలామంది ఉంటారు. సోషలిస్టు కుటుంబం మాత్రం మీదే అని.

స్నేహ మరణించాక 'నేనిపుడు పంజరంలో మిగిలిన ఒంటరి పక్షిని' అని వ్యధ చెందారు పఠాభి. రెండు గదుల ఇంటిలో సౌకర్యంగా ఉన్న గదిని మాకు ఇస్తూ, గుడ్ నైట్ చెప్పి ఉదయాన్నే గుడ్మార్నింగ్ చెప్పిన స్నేహను ఎలా మరువగలము.

పల్లెటూరి మనస్తత్వంతో పెరిగిన నాకు, విశ్వభావనలు పరిచయం చేసింది స్నేహ. వీధిబడులు మినీ భారతదేశాలు అనే లోహియా హితవును పాటిస్తూ, మా పిల్లలను వీధిబడులకి పంపాము.

స్టూడెంట్‌గా, అధ్యాపకురాలిగా మూడు తరాల యువతులను గమనించాను. మా తరంలో ఎక్కువమందికి చదువు విలువ తెలిసేది కాదు. చదువుకున్నాం... అన్పించేవారు తొలి తరం ఆడపిల్లలు. తరువాత తరంలో ఆడపిల్లలకు చదువు విలువ తెలిసినా, తల్లితండ్రుల విలువ తెలిసేది కాదు. ఇగ్నోర్ చేసేవారు. ఇప్పుడు ఆడపిల్లలూ



రావెల సోమయ్య దంపతులు

మగపిల్లలూ బాధ్యతగా చదువుకుంటున్నారు. పెద్దవాళ్ళనూ గౌరవిస్తున్నారు.

కొందరు ఉన్మాదులబారిన పడిన ఆడపిల్లలను చూస్తుంటే 'స్నేహ'రాహిత్యం గుర్తుకు వస్తుంది. ఉత్సాహంగా, ఇన్‌స్పయిరింగ్‌గా కనిపించే ఆడపిల్లల్లో స్నేహలత కనిపిస్తుంది.

* * *

# 'రాజకీయ గుండమ్మకథ'

భారతీయ చలనచిత్ర చరిత్రలో అన్నదమ్ములను దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది'బి.ఎన్' సోదరులను మాత్రమే! ఒకరు బి.ఎన్.రెడ్డి. మరొకరు బి.నాగిరెడ్డి. తన తండ్రి బి.నాగిరెడ్డిపై సాయిచంద్ రూపొందించిన డాక్యుమెంటరీ ఇటీవల ప్రదర్శించిన సందర్భంగా విశ్వనాథరెడ్డి (విశ్వం) నగరానికి విచ్చేశారు. సినిమా పబ్లిసిటీలో వాసన్ మెచ్చిన మేటి, స్వయంగా చిత్రకారుడు, 'చందమామ' వారసుడు అయిన 'విశ్వం'తో ఇంటర్వ్యూ సారాంశం :

● రెండు శత జయంతులు!

భారతీయ సినిమా శతజయంతి–నాయన నాగిరెడ్డి శతజయంతి ఈ సంవత్సరమే! ఈ సందర్భంగా ప్రదర్శించిన డాక్యుమెంటరీలో నాయన మాటలను వినడం ఆనందాన్ని కలిగించింది. తొలి భారతీయ సినిమా 'ఆలం అరా'లో పనిచేసి తొలి తెలుగు సినిమాను







రూపొందించిన హెచ్.ఎం.రెడ్డితో మూలా నారాయణస్వామి–పెద నాయన కవలవడం, ఆ తర్వాత మూలా నారాయణస్వామి, పెదనాయన, నాయన వాహిని స్టుడియోస్‌ను స్థాపించడం, నాయన–చక్కన్న (చక్రపాణి) స్థాపించిన విజయలో అనివార్యపరిస్థితుల్లో వాహిని లీనమై 'విజయ–వాహినీ స్టుడియోస్'గా ఏర్పడడం తెలుగు సినిమా చరిత్రలో తొలి ఘట్టాలు.

● 'బి.ఎన్' కన్‌ఫ్యూషన్

నాయన నాగిరెడ్డి, పెదనాయన బి.ఎన్.రెడ్డిల గురించి ఒకరినొకరుగా పొరబడుతున్నారు. సినిమా పత్రికలు–వెబ్‌సైట్లలో ఈ పొరపాట్లు ఇప్పటికీ చోటుచేసుకుంటున్నాయి. బి.ఎన్.రెడ్డి ప్రధానంగా దర్శకుడు. చిత్తూరు నాగయ్యను పరిచయం చేస్తూ వందేమాతరం, దేవత, బంగారుపాప,రంగుల రాట్నం, బంగారు పంజరం తదితర చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన దర్శకత్వం వహించిన మల్లీశ్వరి 1953లో చైనీస్ సబ్‌టైటిల్స్‌తో బీజింగ్‌లో 13 ప్రింట్లతో విడుదలైంది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1974) స్వీకరించిన తొలి దక్షిణాది సినీ ప్రముఖుడు. పద్మభూషణ్ వరించిన తొలి సినీ ప్రముఖుడు.

నాయన బి.నాగిరెడ్డి విజయావాహినీ స్టుడియోల అధినేత.

నిర్మాత.పాతాళభైరవి–మిస్సమ్మ–మాయాబజార్–గుండమ్మకథ–రామ్‌ఔర్‌శ్యామ్–శ్రీమాన్ శ్రీమతి–జూలీ–మదువె మదినోడు తదితర వివిధ భాషల చిత్రాలు తీశారు. విజయ హాస్పటల్స్ ద్వారా వైద్యరంగానికి చందమామ ద్వారా బాలసాహిత్యానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయాలు. నాయన చేసిన అన్ని మంచి పనుల్లోనూ చక్కన్న (చక్రపాణి) )పాత్ర నిరుపమానం. చక్కన్న లేనిది తాను లేను అనేవాడు నాయన.

● రూపొందని చిత్రం 'కులాల కథ!

పెదనాయనకు వ్యాపారం అంటే ఆసక్తి లేదు. సాహిత్యం, లలిత కళలు అంటే మక్కువ. నాయన చిన్నప్పటి నుంచి రంగూన్(బర్మా-మయన్మార్)కు ఉల్లిపాయలు ఎగుమతి చేయడం తదితర వ్యాపారాల్లో తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఏర్పడిన డిమాండ్‌ను గుర్తించి ప్రింటింగ్ ప్రెస్ పెట్టారు. రచయిత చక్రపాణి అలా నాయనకు పరిచయం. ఇరువురి బంధం తెలుగు సినిమా రంగంలో బాలసాహిత్యంలో (దాదాపు భారతీయభాషలన్నిటిలో వెలువడిన చందమామ) కొత్త చరిత్రలు సృష్టించింది. వీటన్నిటి కంటే ముఖ్యంగా రెండు కుటుంబాల మధ్య స్నేహం. నాయన పేరు ద్వారానే కులం తెలుస్తోంది కదా. చక్కన్న కమ్మ కులస్తుడు. మా రెండు కుటుంబాల్లో ఏనాడు పొరపొచ్చాలు రాలేదు. ఈ నేపథ్యంలోనే నాయన ఒకసారి చక్కన్నతో అన్నారు. మన రాష్ట్రంలో సమస్యలన్నిటికీ కారణం మన రెండు కులాలే. మనం కలసి ఉన్నట్లు రెండు కులాలవారు కలిస్తే ఎంత బాగుండు! ఈ అంశంతో గుండమ్మకథలాంటి ఒక సినిమా తీద్దాం అన్నారు. దురదృష్ట వశాత్తూ ఆ కల నెరవేరక ముందే చక్కన్న దూరమయ్యారు. ఇప్పుడైనా ఈ అంశంతో ఎవరైనా చిత్రంగా తీస్తే తెలుగువారికి మహోపకారం చేసిన వారవుతారు.

● ఎం.జి.ఆర్ యజమాని

చక్కన్న మహానుభావుడు.మేధావి. కంప్యూటర్‌కంటే వేగమైన పనిశైలి. **చక్కన్న లేని ఒంటరితనం ఆరోగ్యంపై ప్రభావం చూపింది.** మెదడుకు రక్తసరఫరాలో అవాంతరం ఏర్పడింది. కుర్తాళం జలపాతంలో స్నానం ఉపకరిస్తుందని వైద్యులు చెప్పారు. నాయనతో కుర్తాళం వెళ్లేవాడిని. ఫలితంగా సాన్నిహిత్యం ఏర్పడింది. అప్పుడు నాయన చెప్పిన మాటల్లోంచి ఏర్చికూర్చి చిన్నిపుస్తకం రాశాను. దినమణి అనే తమిళ దినపత్రిక 'ఎం.జి.ఆర్ యజమాని' అనే శీర్షికతో కొన్ని వ్యాసాలను ప్రచురించింది. ఎన్టీర్ 'ఫాదర్' అని పిలిచినట్లు ఎంజీఆర్ నాయనను 'మొగలాలి' (యజమాని )అని పిలిచేవారు.

● ' చందమామ'కు స్పాన్సర్స్ రారే!

నా హైస్కూల్ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూసి, సిని పబ్లిసిటీ, ప్రెస్ పనులను చూసుకోమన్నారు నాయన. అలా చందమామతో పరిచయం. చక్కన్న, కో.కు,సుబ్రహ్మణ్యం లాంటి పెద్దలు చిట్టిపొట్టి కథలు రాయించేవారు. 'నాన్న-చక్కన్నలు మాకు 'చందమామ' వారసత్వాన్నిచ్చారు. మా తర్వాత తరం ఆ బాధ్యతలను స్వీకరించడంలో కొంత గ్యాప్ ఏర్పడింది. కార్గిల్ యుద్ధానికైనంత ఖర్చును క్రికెట్ ఆటను స్పాన్సర్ చేసేందుకు కార్పొరేట్ కంపెనీలు ఖర్చుపెడుతున్నాయి. చందమామ వంటి పత్రికకు ఒడిదుడుకులు! చందమామ ఆగకూడదు అనే మా నిశ్చితాభిప్రాయం. ఆ నిబద్ధతతోనే ఒక సంస్థకు 'చందమామ' బాధ్యతలు అప్పగించాం. ఇటీవల కేవలం ఇంగ్లిష్‌లో మాత్రమే వస్తోందని తెలుస్తోంది. చిక్కుముడుల మబ్బులను తొలగించుకుని చందమామ తిరిగి వెన్నెలలు కురిపిస్తుంది!

పున్నా కృష్ణమూర్తి, ఫోన్: 768 095 0863.



# చలనచిత్ర గీతాలలో శాస్త్రీయ సంగీతం - 9

– ఎమ్. పురుషోత్తమాచార్య

### ఓ) త్యాగరాజస్వామి

(1767–1847)

తెలుగు భాషలోని మాధుర్యాన్ని ఇతర భాషల వారికి రుచి చూపించి, చక్కని మాటకు, కమ్మని రాగంతో భావావిష్కరణ చేసిన నాదయోగి శ్రీత్యాగరాజస్వామి. వీరి పూర్వీకులు రాయలసీమకు చెందినవారు. తిరువయ్యూరులోని శాంతమ్మ (సీతమ్మ), రామబ్రహ్మం దంపతులకు మూడవ కుమారునిగా జన్మించారు. ఆ ఊరిలో వెలసిన త్యాగరాజేశ్వరస్వామి వరప్రసాదం కనుక వీరికి ఆ పేరే పెట్టారు. త్యాగయ్య శొంఠి వెంకట రమణయ్యవద్ద సంగీతాన్ని, తల్లివద్ద నుంచి వీణావాదనను, పౌరాణికుడైన తండ్రివద్ద నుంచి సంస్కృతాంధ్ర సాహిత్యాలను చక్కగా అభ్యసించారు. త్యాగయ్యగారు రాజాశ్రయాన్ని, సిరిసంపదలను తిరస్కరించి నిరాడంబరంగా తమ కృతులను రామభక్తి సామ్రాజ్య సాధన కోసం ఉపయోగించి, జీవితాన్ని ధన్యం చేసుకున్నారు. తిరుపతి, కంచి, మదురై మొదలైన పుణ్యక్షేత్రాలెన్నో దర్శించి, పంచరత్నమాలికలెన్నో రచించినారు. వాటిలో ఘనరాగ పంచరత్నాలు, కోవూరు పంచరత్నాలు మొదలైనవి ప్రసిద్ధి పొందాయి. వీటితో పాటు దివ్యనామ సంకీర్తనలు, ఉత్సవ సంప్రదాయ కీర్తనలు మొదలైన కృతులు కూడా రచించినారు. వీరి జీవిత కాలంలో మొత్తం ఇరవైనాలుగు వేల కృతులను ద్రాక్షాపాక శైలిలో రచించినారు. ప్రహ్లాద భక్తి విజయం, నౌకాచరిత్రము అనే సంగీత నాటకాలను కూడా రచించినారు. వీణకుప్పయ్య, సుబ్బరామ భాగవతార్ మొదలైనవారెంతోమంది శిష్యులు ఆయన వెంటనే ఉండి స్వరసాహిత్యాలను అక్షరబద్ధం చేశారు.

### 1. సంగీతజ్ఞానము భక్తి వినా

**చిత్రం : త్యాగయ్య (1946)**

గానం, సంగీతం : చిత్తూరు నాగయ్య

ధన్యాసి–ఆది

*సంగీతజ్ఞానము భక్తి వినా*
*సన్మార్గము గలదె మనసా* ॥సంగీ॥
*భృంగి, నటేశ, సమీరజ, ఘటజ, మ*
*తంగ నారదాదులుపాసించే* ॥సంగీ॥
చ॥ *న్యాయాన్యాయము దెలుసును జగములు*
*మాయామయమని దెలుసును దుర్గుణ*
*కాయజాది షడ్రిపుల జయించే*
*కార్యము దెలుసును త్యాగరాజునికే* ॥సంగీ॥

**భావం:** ఓ మనసా! భక్తి లేని సంగీత జ్ఞానంతో మంచి మార్గం లభించదు. పరమేశ్వరుని పరివారంలోని భృంగి, సదాశివుడు, ఆంజనేయుడు, అగస్త్యుడు, మతంగ మహర్షి, నారదుడు మొదలైనవారు ఉపాసన చేసిన సంగీత జ్ఞానమంతా భక్తిమయమే. న్యాయం, అన్యాయం తెలుస్తున్నది. ప్రపంచం మాయతో నిండినదనీ తెలుస్తున్నది. కామక్రోధాదులైన ఆరుగురు శత్రువులను జయించే మార్గం కూడా తెలుసును. అందుకే సంగీతంలో భక్తియే ప్రధానం కావాలి. ఎట్లా తోస్తే అట్లా పాడడం సంగీతం అనిపించుకోదు. ఏ సంగీతమైనా ఆ కళమీద భక్తిశ్రద్ధలు చాలా అవసరం. అని సోదాహరణంగా సూత్రాన్ని ప్రతిపాదిస్తున్న త్యాగయ్యగారి ఈ మాట సర్వకాలాల్లోనూ వర్తిస్తుంది. ఇప్పటికీ ఈ సూత్రాన్ని అనుసరించని సంగీతం ఎంత పేలవంగా మారిందో అందరికీ తెలిసిందే. త్యాగయ్యగారి మీద అమితమైన ప్రీతి ఉన్న నాగయ్యగారు

త్యాగయ్య చరిత్రనంతా సిద్ధపరచుకుని సినిమా తీద్దామని పూనుకుని కె.వి. రెడ్డినిగాని, బి.ఎన్. రెడ్డినిగాని దర్శకుడుగా చేయాలనుకున్నారు. కాని వారు సుముఖంగా ఉన్నట్లనిపించలేదు. పూర్ణా పిక్చర్స్ మంగరాజుగారు "నువ్వే తియ్యి, నేను డిస్ట్రిబ్యూట్ చేస్తా" అన్నాడు. భాగ్యలక్ష్మి చిత్రనిర్మాత కూడా నాగయ్యగారినే తియ్యమన్నాడు. అప్పుడు నాగయ్యగారే ధైర్యం చేసి తానే దర్శక, నిర్మాతగా మారి రచన, సంగీతం కూడా తామే నిర్వహించారు. న్యూటోన్ స్టూడియోస్ పేరిట, డి.ఎల్. దాసు నిర్వహణలో "త్యాగయ్య" సినిమాను 1946 నవంబరు 15న విడుదల చేశారు. జయమ్మ, హేమలత మొదలైనవారు ఎంతో సహకరించారు.

త్యాగయ్యగారి నిర్దేశ్యం ప్రకారమే నాగయ్యగారు ఈ కీర్తనను ధన్యాసిరాగంలోనే ఆలపించారు. ధన్యాసి రాగం క్లిష్టమైనదే అయినా అందమైన రాగం. ఏ మాత్రం స్వరం చలించినా 'తోడి'లోకి మారిపోతుంది. ఇది హనుమత్తోడి అనే 8వ మేళకర్త జన్యం.

*ఆరో : సగామపనీస*

*అవ : సనీదపమగారిస*

ఈ రాగంలో 'మీనలోచన' అనే శ్యామశాస్త్రి కృతి; 'తారక మంత్రము' అనే రామదాసు కీర్తన ప్రసిద్ధమైనవి.

సినిమా పాటలు అంతగా లేవు. జయగణ నాయక ('నారదుడు కలగానము' చరణం)........ నర్తనశాల నాగయ్య తన తండ్రిగారైన రామలింగశర్మగారి వద్దనే సంగీతం నేర్చుకున్నారు. శర్మగారు ఆనాటి కాలంలో గొప్ప పేరున్న హరికథా కళాకారులు మాత్రమేకాక మంచి వయొలిన్ విద్వాంసులు కూడా. నాగయ్య 'సివందొరై' అనే హార్మోనియం రిపేరర్ సహకారంతో హార్మోనియం వాయించడం నేర్చుకున్నారు. మదనపల్లిలో సబ్‌కలెక్టరుగా పనిచేస్తున్న బోల్డన్ దొర దగ్గర పాశ్చాత్య సంగీతం కొంతవరకు నేర్చుకున్నారు. మహారాజపురం విశ్వనాథ అయ్యర్ వద్ద కర్ణాటక సంగీతంలోని మెలకువలను తెలుసుకున్నారు. తరువాత హమీద్‌ఖాన్ అనే ప్రముఖ గాయకులవద్ద హిందూస్తానీ సంగీతం నేర్చుకున్నారు.

"సినిమాలకు సంగీత దర్శకత్వం వహించేటప్పుడు పూర్తిగా శాస్త్రీయం పనికిరాదు. చాలా తేలికైన బాణీలను ఇవ్వాలి." అని అంటూ బి.యన్. రెడ్డి, నామనాథ్‌లు నాగయ్యకు సలహా ఇచ్చారు. మహారాజపురం విశ్వనాథ అయ్యర్, ద్వారం వెంకటస్వామి నాయుడు, పారుపల్లి రామకృష్ణయ్య, చౌడయ్య, మణి అయ్యర్, అరియక్కుడి రామానుజ అయ్యంగార్, బెంగుళూరు నాగరత్నమ్మ, మొదలైనవారిని స్టూడియోకు పిలిపించి త్యాగరాజ కీర్తనలు పాడించుకుని, తాను పాడుతూ. సలహాలు తీసుకుంటూ త్యాగయ్య సినిమా సంగీతాన్ని నిర్వహించారు. కనుక ఈ సినిమాలోని నాగయ్యగారు పాడిన కీర్తనలన్నీ చక్కని ప్రామాణికతను కలిగియున్నాయనే భావించాలి. కృతులుగా ఆలోచిస్తే త్యాగయ్య రచనలన్నీ పూర్తిగా శాస్త్రీయపరమైనవి. సినిమాల్లోకి తెస్తున్నందువల్ల కీర్తనలుగా, లలిత గీతాలుగా అవతరించక తప్పలేదు. అవి సామాన్యునికి అందాలి కనుక ఆ విధానం అనివార్యమే అవుతుంది. అందువల్ల నాగయ్యగారు ఈ కృతులన్నిటినీ ఆలపించడంలో మరీ లోతులకు పోక భాషకు, భక్తికి ప్రాధాన్యమిస్తూ పాడారు. అయినా లయను, బాణీని చెడిపోనివ్వకుండా చాలా జాగ్రత్తపడ్డారు. ఈనాటి కాలంలో శాస్త్రీయ గాయకులు పాడుతున్న ధోరణికి ఇవి కొంచెం భిన్నంగా కనిపిస్తాయి. కారణం, ఒక్కరి ప్రభావంతో పాడినవి కావు కనుక. ఒక అక్షరం వదిలి పల్లవిని ఎత్తుకున్నారు నాగయ్యగారు. అలాగే అనుపల్లవిని, చరణాన్ని కూడా అక్షరం జాగా వదిలే ఎత్తుకున్నారు. ఇప్పుడు కొందరు దీన్ని సమంలో పాడుతున్నారు. కాని రికార్డింగు లోపమో, పొరపాటు జరిగిందో కాని, అనుపల్లవిలోని 'ఘటజమతంగ' దగ్గర తడబాటువల్ల రెండక్షరాల జాగ వచ్చి ఘాతమీది మొదటి వేలిపై 'తంగ' మొదలవుతుంది. ఇది కావాలని కూడా చేసియుండవచ్చు. సంగీత రసాస్వాదనలో ఇదేమంత చెప్పుకోదగిన అంశం కాదు. "మనసా, ఉపాసించే, దెలుసును'' పదాల దగ్గర చూపిన సంగతులు అతిమనోహరంగా ఉన్నాయి. ఇదే కీర్తనను బాపుగారి 'త్యాగయ్య' (1981) సినిమాలో బాలసుబ్రహ్మణ్యంగారు ఆలపించారు. కె.వి. మహదేవన్ సంగీతాన్ని నిర్వహించారు. ఈ కీర్తన కోసం బాపు సంగీతాభ్యాస దృశ్యాన్ని కల్పించారు. ఆ కళాకారులకు త్యాగయ్య హితబోధ చేస్తున్నట్లుగా

ఈ కీర్తనను చిత్రించారు. 'శంకరాభరణం' సినిమాలో సంగీత విద్వాంసుని పాత్రను ధరించిన సోమయాజులుగారి మీద త్యాగయ్యను ఆవహింపజేయాలనే అత్యాశ బాపు, రమణలను ఊరుకోనివ్వలేదు. ఏదో తెలియని అంచనా వాళ్ళ మనసుల్లో తారట్లాడింది. ఫలితంగా 'త్యాగయ్య' మళ్ళీ 1981లో పుట్టింది. కాని 'భక్తి లేని సంగీత జ్ఞానం'లాగానే ప్రేక్షకుల తిరస్కరణకు గురయింది. అన్ని కృతులను కీర్తనలుగా కూడా కాకుండా బాలసుబ్రహ్మణ్యంగారు మామూలు 'పాటలు'గా పాడారు. శాస్త్రీయ సంగీత రాగాల సొగసులు ఆయన గొంతులో గంభీరంగా పలికే ధోరణి అంతగా అనిపించక పేలవంగా ఉండిపోయాయి. ఘంటసాల. జేసుదాసు, బాలమురళి ప్రభృతుల కంఠమాధుర్యాన్ని సంపూర్ణంగా ఆస్వాదించిన అభిమానులకు ఇది బాగా ఆశాభంగం కలిగించింది.

సంగీత విద్యార్థులకే ఓ పట్టాన పట్టు దొరకని రాగం ధన్యాసి. ఈ రాగాన్ని వింటే శ్రోతలు 'ధన్యోస్మి' అనుకోవాల్సిన పకడ్బంది రాగం. నర్తనశాల సినిమాలోని 'జయగణనాయక' పాటలో 'భృంగీశుడు' అనే చిన్న భాగంలో ధన్యాసి రాగాన్ని ఘంటసాల అద్భుతంగా రుచి చూపారు. అది ఆయన గాత్రధర్మం. బాలూగారు కూడా తక్కువవారేం కాదు. కాకపోతే ఆయనతో సినిమావాళ్ళు 'శాస్త్రీయాన్ని' ఎక్కువగా పాడించలేదు. శంకరాభరణం లాంటివి కూడా లలితమే కాని శాస్త్రీయం కాదు. బాలూగారు తమ గాత్రధర్మ పరిధిలోనే త్యాగయ్య కృతులకు కొంతవరకు న్యాయం చేశారనే చెప్పవచ్చు. అయినా ఆయన ధర్మం ఆయన సక్రమంగా నెరవేర్చారు.

బాలూగారు ఈ కీర్తనను చిత్తూరు నాగయ్యగారి ధోరణిలోనే పాడారు. పల్లవిని నేటి విధానంలోకి కొంత మార్చుకుంటూ పాడినా మార్గం అదే. విచిత్రమేమిటంటే, నాగయ్యగారు అనుపల్లవిలో 'మతంగ'లో తకారాన్ని మొదటి వ్రేలికి దెచ్చిన తడబాటును కూడా యథాతథంగా అనుసరించడం. అయినా బాలూగారి నిజాయితిని శంకించనవసరం లేదు. ఎంతో భక్తి, శ్రద్ధలతోనే ఆలపించారు. కాని, ఎవరు సూచించారో కాని, చరణంలోని అన్ని పాదాలు ఒక అక్షరం జాగా వదిలి పాడవలసి యుండగా, మూడవ పాదాన్ని సమంగా ఎత్తుకున్నారు. 'సమీరజ' పదాన్ని రెండవసారి పాడేటప్పుడు రాగచ్ఛాయను సంపూర్ణంగా పలికే అవకాశాన్ని బాలూగారు ఎందుకో సరిగా ఉపయోగించుకోలేదు. నాగయ్యగారు పాడినవికాక కొత్తవి చేర్చడం ఈ సినిమాలోని విశేషం. ఆయన పాడినవి కొన్ని వదిలేశారు కూడ.

### *2. ఎన్నగ మనసుకు రాని*

**చిత్రం : త్యాగయ్య (1946)**

**గానం : నాగయ్య, జయలక్ష్మి**

**సంగీతం : చిత్తూరు నాగయ్య**

**నీలాంబరి–ఆది**

*ఎన్నగ మనసుకు రాని*
*పన్నగశాయి సొగసు*
*పన్నుగా కనుగొనని*
*కన్నులేలే? కన్నెమిన్నలేలే? ॥ఎన్న॥*

*1. సరసీజ, మల్లె, తులసి*
*విరజాజి, పారిజాతము*
*విరులచే పూజించని*
*కరములేలే? ఈ కాపురములేలే? ॥ఎన్న॥*

*2. మాలిమిని త్యాగరాజు*
*నేలిన రామమూర్తిని*
*లాలించి పొగడని*
*నాలికేలే? సూత్రనాలికేలే? ॥ఎన్న॥*

**భావం**: శ్రీహరి సౌందర్యం మనసుకు హత్తుకోకపోతే, ఆ జన్మ ఎందుకు? ఆయన సొగసును చూడలేని కన్నులు కూడా ఎందుకు? తామరలు, మల్లె, తులసి, విరజాజి, పారిజాత సుమాల చేత హరిని పూజించని చేతులెందుకు? శ్రీరామచంద్రుడినిగూర్చి పొగడలేని నాలుక ఎందుకు? చేతిలో జపమాల కూడ ఎందుకు? పోతనగారి 'కమలాక్షునర్చించు కరములు కరములు' అనే పద్యం ఈ భావం వినగానే చప్పున వచ్చితీరాలి. కావ్య పురాణ మర్మజ్ఞుడైన త్యాగయ్యపై వాటి ప్రభావం లేకుండా ఎలా ఉంటుంది? శ్రీరాముని సొగసు చూడలేని కన్నులే కాదు, మనస్సు కూడా వ్యర్థమనే చెబుతూ స్వామి అందాన్ని చూడలేకపోయిన కన్యలు కూడా వ్యర్థులైనవారే అనే

విషయాన్ని మధురభక్తి భావపరంగా గడుసుగా చెప్పినారు త్యాగయ్య. 'సరసీజ, మల్లె'లాగానే 'పారిజాత విరులు' అనేది కూడా మిశ్రసమాసం అని అనిపించకుండా గాయకులు 'పారిజాతము' అని సవరించి పాడడం బాగుంది.

'ఏలే' పదాన్ని జానపదం నుంచి "ఎందుకు?" అనే అర్థంలో స్వీకరించారు. అన్నమయ్య కీర్తనల్లో ఈ పదం ఎక్కువగా కనిపిస్తుంది. 'మూసిన ముత్యానకేలే'వంటివి ఎన్నో ఉన్నాయి. త్యాగయ్యగారు తన కృతులలో యతి కన్న ప్రాసకు ఎక్కువ ప్రాముఖ్యమిచ్చారు. కనుక ప్రతికృతిలోనూ ప్రాస విధిగా కనిపిస్తుంది. ఏవో కొన్నిటిని మాత్రం మినహాయించవచ్చు. బహుశా తీవ్రమైన భావావేశంలో పుట్టి ఉంటాయి. కృతి లక్షణాలైన పల్లవి, అనుపల్లవి, చరణం అనేవాటిని చక్కగా పాటించారు. ఈ కృతిని నాగయ్య జయలక్ష్మితో కలిసి పాడారు. నీలాంబరి రాగం ధీరశంకరాభరణజన్యం. ఇది శాంతరసం ప్రధానమైనదని, రాత్రివేళల్లో పాడదగినది అని, పెద్దలు చెబుతారు.

*ఆరో : సగమపనిస*

*అవ : సనిపమగమపదనిదపమగరిగస*

ఏ రాగానికీ లేని ప్రత్యేక సంగతిని ఈ రాగానికి పొదిగారు. ఈ సంగతిలో అన్యస్వరమైన కైశిక నిషాదం స్పర్శ ఉంటుంది ఇదిగో, ఇలాగ......

*రిగమపదని*

*దపమగరిగమపద*

*పమగరిగమ గరిగస*

ఈ స్వరసంచారం సుశ్రావ్యంగా సాగుతుంది. స్వరాలు ముందు వెనుకలుగా ఊగుతూ సంచరించడంవల్ల ఈ సంచారానికి 'ఊయల అలంకారం' అని పేరుపెట్టారు. అందుకే ఈ రాగాన్ని ఎక్కువగా జోలపాటలకు ఉపయోగిస్తారు. ఈ రాగంలో "శృంగారలహరిలో" అనే లింగరాజుగారి కృతి, 'ఉయ్యాలలూగవయ్య' అనే త్యాగయ్య కృతి ఎంతో ప్రసిద్ధిని పొందాయి.

**సినిమా పాటలు**: 1. సిరిసిరి లాలీ.......... భక్తప్రహ్లాద, 2. చిన్నారి పొన్నారి పాటలో 'అమ్మా మన్ను తినంగ నే శిశువునో'..... స్వాతిముత్యం, 3. ఓ చెలియా నా ప్రియ..... ప్రేమికుడు, 4. శశివదనే............. ఇద్దరు – నాగయ్యతో నటించిన జయలక్ష్మిగారే నిజజీవితంలో ఆయన సహధర్మచారిణి. ఆమె ఈ 'ఎన్నగ మనసుకు రాని' కృతిని ఎంతో మృదుమధురంగా ఆలపించారు. ముఖ్యంగా పల్లవి, చరణాల కొసల్లో కనిపించే "లేలే" అక్షరాల మీద ఆవిడ గమ్మత్తైన సంగతులను పలికించారు. ఈ కృతిని ఏ బిట్టూ లేకుండా నిరాడంబరంగా పాడారు. ఆదితాళపు నడకను కచ్చితంగా పాటించినారు. మూలంలో ఉన్న మూడు చరణాలలో మొదటి చరణాన్ని వదిలేశారు. ముగింపులో పైన చెప్పుకున్న 'ఉయ్యాల అలంకారం' సంగతిని కైశికనిషాద స్పర్శతో మనోహరంగా వినిపించారు. అయితే చివరి చరణంలో 'మాలిమితో' అని ఉండగా 'మాలిమిని' అని చిన్న మార్పు చేశారు. బహుశా పాఠాంతరమేమో!

### 3. శ్రీనారదమౌని

**చిత్రం : త్యాగయ్య (1946)**

**గానం, సంగీతం :చిత్తూరు నాగయ్య**

**భైరవి–ఆది**

*శ్రీనారదమౌనీ గురురాయ*

*కంటి మేనాటి తపమో గురురాయ* ॥శ్రీ॥

1. *మనసార గోరితి గురురాయా నేడు*

*కనులార కనుగొంటి* ॥శ్రీ॥

2. *రాజిల్లు వీణె గల గురురాయా త్యాగ*

*రాజుని బ్రోచిన సద్గురురాయ* ॥శ్రీ॥

**భావం:** ఓ నారదమౌనీ! గురువర్యా! ఏనాటి తపఃఫలమో కాని నిన్ను దర్శింపగలిగినాను. మనస్ఫూర్తిగా నిన్నే తలంచినాను. ఇప్పుడు కన్నులార నిన్ను దర్శించాను. చక్కని ప్రకాశమానమైన వీణతో దర్శనమిచ్చిన నారదమౌనీ! త్యాగరాజునైన నన్ను రక్షింపవచ్చితివి. సంగీత సాధన చేస్తున్న త్యాగరాజస్వామి ఇంటికి మహతీధర యతీంద్రస్వామి అనే యతి వచ్చి సంగీతం గురించి ముచ్చటించాడు. ఆయనను భోజనం చేసి వెళ్ళమని త్యాగరాజు కోరగా యతీంద్రులు కావేరీనదికి వెళ్లి స్నానం చేసి వస్తానని వెళుతూ రెండు గ్రంథాలిచ్చి జాగ్రత్తగా కాపాడుకొమ్మని చెప్పి వెళ్ళిపోయాడు. ఎంతసేపటికీ

యతీశ్వరులు రాకపోతే నిరీక్షించిన త్యాగయ్య ఆ పుస్తకాలను తిరగేసి చూశాడు. అవి *స్వరార్ణవం*, *నారదీయం* అనే సంగీత గ్రంథాలు. పరమానందభరితుడైన త్యాగయ్య ఆ వచ్చిన యతీంద్రుడు నారదమునిగా గుర్తించాడు. వెంటనే ఎంతో ఆనందంగా పాడుకుంటున్న కీర్తన ఇది.

ఈ కృతి భైరవి రాగంలో ఉంది. ఈ రాగం 20వ మేళకర్త అయిన నఠభైరవి రాగజన్యం. ఇది సంపూర్ణరాగం. ఆరోహణలో అన్యస్వరమైన చతుశ్రుతి దైవతం ఉపయోగించడం దీని ప్రత్యేకత. అవరోహణలో మాత్రం యథావిధిగా శుద్ధ దైవతమే ఉంటుంది. ఈ రాగంలో శ్యామశాస్త్రిగారి స్వరజతి 'కామాక్షి'; 'బాలగోపాల' అనే దీక్షితార్ కృతి ప్రసిద్ధి పొందాయి.

సినిమా పాటలు: *1. నినుజేర మనసాయెరా... బొబ్బిలియుద్ధం* – మూలంలో నాలుగు చరణాలుండగా నాగయ్యగారు మొదటి, చివరి చరణాలను మాత్రం తీసుకుని ఆలపించారు. ఎందుకోగాని, ఈ చరణాల చివర్లో ఉన్న 'సద్గురురాయ'ను మొదటి చరణంలో వదిలేశారు. 'తపము, కనుగొంటి' పదాల గానంలో నాగయ్యగారి స్వరసంతకం మనోహరంగా వినిపిస్తుంది. తాళం విషయం అంతగా పట్టించుకున్నట్లు లేదు. పల్లవి, అనుపల్లవి, చరణాలలోని ప్రతిపాదం ఘాత తరువాత ప్రారంభించే పద్ధతిని ప్రదర్శిస్తూనే మొదటి చరణంలోని రెండవ పాదాన్ని రెండవ వ్రేలిమీద ఎత్తుకున్నారు. మొదటి పాదం చివర ఉన్న 'నేడు' పదాన్ని పాడడం ఆలస్యం చేయడంవల్ల ఈ తేడా వచ్చిందని గమనించవచ్చు. అందుకే 'సద్గురురాయ'ను వదిలేయాల్సి వచ్చింది కూడ. అయితే రెండవ పాదం 'కనులార' పదంతో ప్రారంభం కావలసియుండగా నాగయ్యగారు 'నేడు'తో ప్రారంభించినట్లుగా భావిస్తే పైన పేర్కొన్న అవరోధం తొలగిపోతుంది. ఇదే కీర్తనను బాపుగారి 'త్యాగయ్య' సినిమా కోసం బాలసుబ్రహ్మణ్యం ఆలపించారు. దీన్ని కూడా నాగయ్యగారి ధోరణిలోనే ఆలపించారు. 'రామ' దగ్గర రాగచ్ఛాయగల అనుస్వరాన్ని, 'గురురాయ' దగ్గర రెండు ఆవర్తాల ఆలాపనను చక్కగా ప్రదర్శించారు. అయితే, మొదటి చరణాన్ని ఘాత తర్వాతకాక సమంగా ఎత్తుకున్నారు. మిగతాదంతా యథాతథంగానే పాడారు. పల్లవిని, రెండో చరణాన్ని మాత్రం ఒకసారి సమంగానూ, మరోసారి అక్షరం తరువాతనూ ఎత్తుకున్నారు. ఇది శాస్త్రీయంగా సరిపడని విషయం. మొదటి చరణాన్ని సమంగానే పాడారు. 'రాజుని' దగ్గర అక్షరం వదిలి పాడే బదులు, 'త్యాగ' దగ్గర అక్షరం వదిలి పాడారు. మొత్తం మీద ఈ కృతి గానంలో, లయగతిలో ఏకసూత్రతను సరిగా పాటించకున్నా గానరీతి మాత్రం శ్రావ్యంగా ఉంది.

### 4. బాలకనకమయచేల

**చిత్రం : త్యాగయ్య (1946)**

**గానం, సంగీతం : చిత్తూరు నాగయ్య**

**అఠాణ–ఆది**

*బాలకనకమయచేల సుజనపరి*
*పాల శ్రీరమాలోల విధృతశర*
*జాల శుభద కరుణాలవాల ఘన*
*నీల నవ్యవనమాలికాభరణ*
*ఏలా నీ దయ రాదు పరాకు జేసే*
*వేలా సమయము గాదు* ॥ఏల॥

చ॥ *రారా దేవాదిదేవా రారా మహానుభావా*
*రారా రాజీవనేత్రా రఘువరపుత్రా*
*సారతర సుధాపూర హృదయపరి*
*వార జలధిగంభీర దనుజసం*
*హార దశరథకుమార బుధజనవి*
*హార సకలశ్రుతిసార నాదుపై* ॥ఏల॥

**భావం:** ఓ బాలరామా! బంగరు పట్టు పీతాంబరము ధరించినవాడా! సుజనుల రక్షించు స్వామీ! లక్ష్మీలోలుడా! ధనుర్బాణాలు ధరించిన రామా! శుభకరమైన దయగలవాడా! నీలమేఘశరీరముగల వనమాలాధరా! నాపై నీ దయ రాదు ఎందులకయ్యా? విముఖునిగా ఉండే సమయమిది కాదు సుమా! మహానుభావుడవైన దేవాదిదేవా! రావయ్యా. అమృత హృదయం కలవాడా! సముద్రంవంటి గంభీర స్వభావంకలవాడా! దనుజాంతకుడవైన వేదవిహారా! నామీద దయరాదేలనయ్యా? ఇందులో నాపై దయరాదు ఎందులకు? అని అడగడమే ప్రధానాంశం. మిగతాదంతా స్వామివారి శుభగుణాలు నిండిన సంబోధన పదాల




సమాహారమే. నాగయ్యగారు "బాల కనకమయ" దగ్గరి నుంచి "ఏల దయరాదు"వరకు గుక్కతిప్పుకోకుండా పాడి వదిలేశారు. ఈ బాణీలో ఉన్న విశేషం మిగతా కృతులలో కనిపించదు. ఎక్కువ భాగం కృతులలో పల్లవి, అనుపల్లవి తక్కువ మాటలతో 3,4 పంక్తులలో కనిపిస్తాయి. కాని ఈ కీర్తనలో ఆరు పంక్తుల సుదీర్ఘ సమాసాలు బిగుతుగా ఉండి, పంచమ, తారషడ్జమాల మధ్యనే బాణీ సంచరిస్తుంది. త్యాగయ్యగారి రచనలు కుదురుగా కూర్చుని రచన కోసం రచన చేస్తున్నట్లు ఉండదు. భక్తిమయ భావనా ప్రపంచంలో విహరిస్తూ, మనోవేదిక మీద కనిపించే దృశ్యాల్ని అక్షరబద్ధం చేసినట్లుగా అనిపిస్తుంది. ఈ పరిస్థితి తపోమూర్తులకే సాధ్యం. ఆయన కృతులన్నీ ఇట్లా తపస్సులో, ధ్యానంలో కనిపించిన దృశ్యాలే అనవచ్చు. ఇదే కీర్తనను బాపుగారి త్యాగయ్యలో బాలూగారు క్రొత్త రకంగా పాడారు. పల్లవిని మాత్రం నాగయ్యగారిలాగానే గుక్కతిప్పుకోకుండా పాడారు. చరణం పాడాక 'ఏల నీ దయరాదు'ను లయ వాద్య సహకారం లేకుండా సాకీలాగా పాడారు. చరణాన్ని పల్లవిలాగే ద్రుతగతిలో పాడారు.

ఇదే కీర్తనను కె. విశ్వనాథ్‌గారి 'సాగరసంగమం' (1983) సినిమా కోసం ఎస్. జానకి మధురంగా ఆలపించారు. అయితే మంజుభార్గవి శాస్త్రీయ నృత్యానికి ఈ కృతిని అనుసంధించడం జరిగింది. ఇక్కడో విశేషం చెప్పాలి. త్యాగయ్యగారి కాలంలో ఆయన కృతులను అభినయించాలని నర్తకీమణులు ఎంతో ఉత్సాహపడేవారు. కాని త్యాగయ్య దానికిష్టపడలేదు. ఆ రోజుల్లో నృత్యాలన్నీ శృంగారమయంగా ఉన్నాయి కనుక భక్తిభావాన్ని ప్రదర్శించరనే విశ్వాసంతో త్యాగయ్యగారు తన కృతులను నర్తకులకు ఇచ్చేవారు కారు. అందుకని త్యాగయ్యకు తెలియకుండ తంజావూరు కృష్ణమూర్తి అనే శిష్యుడు నృత్యకళ పట్ల ఉన్న అభిమానంతో 'నగుమోము గనలేని' కృతిని మంజూష అనే నర్తకికి రహస్యంగా అందించాడు. శరభోజీ మహారాజు ఘనంగా నిర్వహించిన జైత్రయాత్ర ఉత్సవాల్లో మంజూష ఆ కృతిని అద్భుతంగా అభినయించింది. ఇది తెలుసుకున్న త్యాగయ్య కోపగించుకోలేదు కాని భక్తిని రక్తిలోకి దించినందుకు చాలా ఆవేదన పొందారు. అటువంటిది త్యాగయ్యగారు సిద్ధి పొందాక బెంగుళూరు నాగరత్నమ్మ అనే నృత్యవిదుషీమణి తన సంపద సర్వస్వాన్ని వినియోగించి త్యాగయ్యగారికి కోవెలలాంటి సమాధిని నిర్మించడం విచిత్రమే అనిపిస్తుంది.

'సాగరసంగమం'లో మళ్ళీ నర్తకి మీదనే ఆయన కృతిని చిత్రించాల్సి వచ్చింది. అంతే మరి..... ఏ రచనైనా ఇంట్లో ఉన్నంతసేపే స్వీయ లక్ష్యాన్ని వహిస్తుంది. సమాజంలోకి వెళితే రూపు మారక తప్పదేమో! వేదిక మీద మంజుభార్గవి, వంట యింట్లో కమలహాసన్ ఇద్దరూ ఈ కృతికి చక్కని అభినయాన్ని ప్రదర్శించారు. జానకి తన మృదుమధురమైన కంఠంతో చక్కని వాచికాభినయాన్ని ప్రదర్శిస్తూ ఆలపించడం చెప్పుకోదగ్గ విశేషం. ఈ కృతిని తెరకెక్కించడంలో ఏ మాత్రం శాస్త్రీయతకు భంగం కలక్కుండా, అనవసరమైన పాశ్చాత్య మిశ్రిత ప్రయోగాల ప్రసక్తి లేకుండా ఇళయరాజాగారు గౌరవ ప్రదంగా నిర్వహించారు. ప్రారంభంలో మృదంగం రెండు ఆవర్తాలుగా వినిపిస్తుంది. "ఆలాపనా ప్రతిభ, ఆలపింపజేసే ప్రతిభ" ఈ రెండూ ఇందులో ప్రముఖంగా కనిపిస్తాయి. పాటంతా ఆదితాళపు అక్షరకాలాన్ని అనుసరిస్తూనే సాగింది. ఈ కృతిని కచేరీలో పాడేటపుడు కొందరు విద్వాంసులు 'సుజనపరి....... పాల" అంటూ విడదీసి పాడతారు. తెలుగు

రానివారే కాదు, వచ్చినవారు కూడా అలా పాడడం విచారించదగ్గ విషయం. కాని జానకమ్మగారు 'సుజనపరిపాల'ను విరిచి పాడడం చేయలేదు. మరో సంగతి ఏమిటంటే, 'సుజనపరిపాల' తరువాత 'బాల' వదిలేసి 'కనకమయచేల' అని పాడడాన్ని కొందరు తప్పుపట్టేవారున్నారు. కాని, అది తప్పేమీ కాదు, పైగా సమంజసమే. ఎందుకంటే, 'బాల' అనేది వేరే పదం. అది లేకున్నా 'కనకమయచేల' అర్థం ఏమీ మారదు. అయితే కొందరు గాయకులు 'సుజనపరిపాలబాల' అని వదిలేస్తున్నారు. ఇది అసంగతమే అనిపించినా కొంతవరకు ఫరవాలేదు. మరో కీర్తనలో గమనించండి.

*'నీ వల్ల గుణదోషమేమి' కీర్తన చరణంలో*

*"రాజిల్లు శ్రీత్యాగ /*'రాజ నుతచరణ'ను పాడేటప్పుడు అనేక సంగతుల ప్రదర్శన కోసం 'రాజిల్లు శ్రీత్యాగరాజిల్లు శ్రీత్యాగ' అని పాడుతున్నారు. అప్పుడేమైంది? 'శ్రీత్యాగరాజు గారి ఇల్లు' అనే అర్థంలోకి కీర్తన వెళ్ళిపోయింది. పదాల్ని విభజించడంలో ఇంతటి పరమార్థాన్ని తెలుసుకుని గాయకులు పాడాలని చెబితే 'చాదస్తం' అని కొట్టిపారేసే వాళ్ళ సంఖ్య ఎక్కువైపోతున్నది.

ఈ దోషాలేవీ రాకుండా పల్లవిని అర్థవంతంగా వివిధ సంగతులతో 'బాలకనకమయ'ను పాడించారు రాజాగారు. చరణానికి ముందుగా నాలుగు ఆవర్తాలలో వీణ, వేణువుల కలయికతో చక్కని స్వరసంపుటిని అందించగా 'రారా' పదాన్ని మూడు రకాలుగా ఒక్క ఆవర్తంలో ఉచ్చరిస్తూ పాడిన తీరు ముచ్చటగా ఉంది. అభినయం కోసమే అయినా తాళ చమత్కృతిని చక్కగా ఆవిష్కరించారు. పల్లవి సమంలో ప్రారంభంకాగా, చరణం మూడక్షరాల జాగా నుండి ప్రారంభం కావడాన్ని స్వరకర్త చక్కగా నిర్వహించారు. 'దేవాదిదేవ' పదాన్ని పాడడంలో అఠాణా రాగపు సొగసును గాయనీమణి ఎన్నో హొయలు మీరగా ప్రదర్శించారు. తరువాత వినిపించే సాహిత్యంలో 'రార' పదాన్ని అత్యంత భావాత్మకంగా, మంజుభార్గవి, జానకి ఇద్దరు కూడా కూడబలుక్కుని అభినయించారు, ఆలపించారు అన్నంత సహజ సుందరంగా సాగిపోయింది. నృత్యప్రదర్శనలో నట్టువాంగం చేసే నాట్యగురువు, గాయని, వాద్యాలవారు ప్రత్యక్షంగా చూస్తూ కళాప్రదర్శన చేస్తారు. అలా జానకి కూడా వేదిక మీద కూర్చుని నర్తకీమణిని చూస్తూ ఆలపించారా అని అనిపించేంత గొప్పగా ఈ కృతిని జానకమ్మ పాడారు. చివరలో స్వరకల్పనలు, జతులు పాడడం కృతికి మరింత శోభను కలిగించాయని చెప్పవచ్చు.

**5. సాధించెనే ఓ మనసా**

**చిత్రం : త్యాగయ్య (1946)**

**గానం, సంగీతం :చిత్తూరు నాగయ్య**

**ఆరభి–ఆది**

*సాధించెనే ఓ మనసా ॥సా॥*

*బోధించిన సన్మార్గవచనముల*

*బొంకు జేసి తా పట్టిన పట్టు ॥సా॥*

**భావం:** ఓ మనసా! పరమాత్మ తాననుకున్నది సాధించాడు. తాను బోధించిన విషయాలన్నీ అబద్ధాలు చేసి తనవద్దకు ఎవరూ రావద్దన్నట్లు మంకుపట్టు పట్టాడు.

నాగయ్యగారు ఈ కృతిని ఇంతవరకే సినిమాలో ఉపయోగించారు. ఇది త్యాగరాజస్వామివారి ఘనరాగ పంచరత్న కీర్తనలలో మూడవది. దీనిలో భక్తి శోధన, వ్యాజనింద, నిందాస్తుతి, ఉత్సాహ ప్రకటన అనే అంశాలు కనిపిస్తాయి. భగవంతుని అవతారాలలోని లీలావిలాస వైభవాలను కీర్తిస్తూనే ఇటువంటివారు నాకు అందకుండ బాధిస్తున్నారు అనే ఆవేదనను త్యాగయ్యగారు వ్యక్తపరచారు.

ఈ కృతి ఆరభిరాగంలో ఉన్నది. ఈ రాగం 29వ మేళకర్త అయిన ధీరశంకరాభరణరాగజన్యం.

*ఆరో : సరిమపదస*

*అవ : సనిదపమగరిస*

అవరోహణలో కాకలి నిషాదాన్ని ఉండీ లేనట్టుగా స్పర్శామాత్రంగా పాడాలి కాని న్యాసంగా పాడకూడదు. అయితే నేడు చాలామంది నిషాదాన్ని తగలకుండానే పాడి 'ఆరభి' అంటున్నారు. కాని అప్పుడది 'సామరాగం' అవుతుంది. విజ్ఞులైన సంగీత విద్వాంసుల సహకారంతో నిషాద స్పర్శను అభ్యసించాలి.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
నల్లగొండ. ఫోన్: 939 661 1905.

తొలి తెలుగు సాంఘిక నవలా రచయిత్రి

# దేవమణి సత్యనాథన్

*– పొదిలి నాగరాజు*

కోస్తా ప్రాంతంలో ఆధునిక సాహిత్య ప్రక్రియలు మొదలైన చాలా కాలానికి కూడా రాయలసీమలో ఆధునిక వాసన లేనేలేదనే అభిప్రాయం నిన్నటి, మొన్నటివరకు సాహిత్యకారుల్లో ఉండేది. నవల, విమర్శ, కథానిక, నాటకం మొదలైన ఆధునిక ప్రక్రియలు అన్ని ప్రాంతాలతో సమానంగా రాయలసీమలో కూడా వచ్చాయనే అవగాహన కలుగుతున్నది. వీటిలో నవల, విమర్శ నాటకం రాయలసీమ నుండే మొదలయ్యాయి. ఆధునిక వచన కావ్యంగా ప్రసిద్ధి చెందిన నవల ప్రపంచస్థాయి నుండి ప్రాంతీయ స్థాయివరకూ అనేకమంది రచయితల్ని ప్రేరేపించింది. నవల భారత దేశంలో 1865లో బంకించంద్ర ఛటర్జీతో మొదలైందని విమర్శకుల అభిప్రాయం. దీనిని మార్గదర్శకంగా తీసుకొని తొలి తరంలోనే (దేశ) నవలా రచయితలు సమాజాన్ని చిత్రించే అద్భుతమైన నవలల్ని మనకు అందించారు. నవలా చరిత్రలో పురుషుల చరిత్ర రికార్డు అయినంతగా నవలా రచయిత్రుల చరిత్ర రికార్డు కాకపోవడం శోచనీయం. నవలా చరిత్ర రచనల లోపంవల్ల తొలితరం నవలా రచయిత్రుల నవలలు సమాజానికి పరిచయం కాలేకపోయాయి. వీటిపైన పరిశోధన కూడా పరిమితంగానే జరిగింది. కానీ ప్రపంచ నవలా సాహిత్యం ముందుగా రచయిత్రితోనే మొదలయిందనే విషయనాన్ని గమనించాలి. క్రీ.శ.11వ శతాబ్దం మొదటి భాగంలో 'మురాసాకిషుకుచు' అనే జపాన్ రచయిత్రి 'గెంజిమోనో గోతారి' (గెంజిగాథ అనే నవల రాశారు. ప్రపంచ నవలా సాహిత్యంలో ఈ నవల మొదటిదని పాశ్చాత్య విమర్శకుల అభిప్రాయం. ఈ నవల 'గెంజి గాథ' అనే పేరుతో తెలుగులోకి అనువాదం అయింది. రచయిత్రితో మొదలైన నవలా సాహిత్యంలో రచయిత్రుల స్థానం పరిమితంగా కనిపించడం ఆశ్చర్యపడాల్సిన విషయం. ఇదే పరిస్థితి భారతదేశంలో కూడా ఉంది. భారతదేశ తొలి నవలా రచయిత్రి విషయం పెద్దగా చర్చకు రాలేదనిపిస్తుంది.

తెలుగులో తొలి నవలా రచయిత్రి 'జయంతి సూరమ్మ' అని సాహిత్యకారుల అభిప్రాయం. రాయలసీమలో తొలితరం నవలా రచయితల గురించి వాదోపవాదాలు జరిగాయి. ప్రస్తుతం పరిశోధనలూ జరుగుతున్నాయి. కానీ తెలుగులో తొలి నవలా రచయిత్రుల గురించి ఎవరూ పెద్దగా పేర్కొనడంలేదు. తెలుగు సాహిత్యం కూడా దీని గురించి అంతగా పట్టించుకోలేదు. తెలుగులో మొదటి నవలా రచయిత్రి 'జయంతి సూరమ్మ', ఈమె రాసిన నవల 'సుదక్షిణా చరిత్రము' (1906). దీని తర్వాత మల్లవరపు సుబ్బమ్మ 'కళావతి చరిత్ర' (1914), ఎ.పి. పిరాట్టమ్మ 'శోభావతి' (1924), కనుపర్తి వరలక్ష్మమ్మ 'వసుమతి' (1924) మొదలైన నవలలు తొలి తరంలో వచ్చినట్లు 'సమాలోచనం' అనే వ్యాస సంపుటిలో జి. లలిత 'నవల– మహిళ' అనే వ్యాసంలో పేర్కొన్నారు. జయంతి సూరమ్మ 'సుదక్షిణా చరిత్రము' (1906) తర్వాత రాయలసీమకు చెందిన దేవమణి సత్యనాథన్ రాసిన 'లలిత' (1908) నవల వచ్చింది. అయితే జయంతి సూరమ్మ రచించిన సుదక్షిణా చరిత్రమును చదివి, ఆ నవలా కథ ఇది అని ఎవరూ ఎక్కడా పేర్కొన్నట్లు తెలియటంలేదు. ఆ నవలలోని ఇతివృత్తం, కథావస్తువు ఏ రంగానికి సంబంధించినదో కూడా తెలియటం లేదు. ప్రస్తుతం మనకు తెలుస్తున్నది ఒకటే అది ఇది 1906 వచ్చిందని. అంతకుమించి ఈ నవలా విశేషాలపై ఎటువంటి సమాచార ఆధారమూ లేదు. ఇలా ఆలోచించినపుడు ప్రస్తుతం మనకు లభిస్తున్న ఆధారాలు ప్రకారం 1908లో దేవుమణి సత్యనాథన్ రచించిన 'లలిత' తెలుగులో రచయిత్రి రచించిన తొలి సాంఘిక నవల అవుతుంది. లోతుగా పరిశోధిస్తే లభిస్తున్న ఆధారాల ప్రకారం దేవమణి సత్యనాథన్ తొలి తెలుగు

నవలా రచయిత్రి అయ్యే అవకాశం ఉంది. ఈ నవల గురించి ఎవ్వరూ ఎక్కడా చర్చించలేదు. పైగా దేవమణి సత్యనాథన్ రాసిన తొలి తెలుగు సాంఘిక నవల 'లలిత' (1908)ను, వదిలేసి 1924లో ఎ.పి. పిరాట్టమ్మ రాసిన 'శోభావతి' నవలను తొలి తెలుగు సాంఘిక నవలగా గుర్తించారు సాహిత్య చరిత్రకారులు. ఈ నవలను రాసిన దేవమణి సత్యనాథన్ రాయలసీమలో తొలి నవలా రచయిత్రి. అంతేకాదు ఆమె తొలి తెలుగు సాంఘిక నవలా రచయిత్రి కూడా. దేవమణి సత్యనాథన్ రాసిన 'లలిత' నవలను 'సీమ నవల తొలిదశ' అనే వ్యాసంలో (సూర్య, జనవరి 28, 2013) క్రీ.శ. 1927కి చెందినదిగా పేర్కొన్నాను. కానీ ఆ అభిప్రాయాన్ని కొంత పరిశోధన ద్వారా మార్చుకోవలసి వచ్చింది. 1927లో 'లలిత' నవల ద్వితీయ ముద్రణ జరిగింది. 1928లో 'లలిత' నవల 10వ తరగతికి పాఠ్యగ్రంథంగా ఉన్నింది. నవలలోని అంతర్గత ఆధారాన్నిబట్టి ఈ నవల మొదటి ముద్రణ 1908లో జరిగినట్లు తెలుస్తుంది. ఈ నవలలో 'లలిత' రాజమండ్రిలో ఉపాధ్యాయినిగా పనిచేస్తూ బళ్ళారి జిల్లాలోని కమలాపురంలో ఉన్న తన బావ హరిదాసుకు 1908 జూలై 12న ఉత్తరం రాసినట్లు నవలలో ఉంది. దీనినిబట్టి ఈ నవల 1908లో వచ్చింది. అప్పటి ప్రొద్దుటూరు తాలుకా బోర్డు ప్రెసిడెంటు కూరం నరసింహాచార్యులు 'లలిత' నవలకు ముందుమాట రాశారు. అందులో ఆయన రచయిత్రి గురించి చెబుతూ 'గ్రంథములు వ్రాయుటకిది ప్రథమ ప్రయత్నం అని గ్రంథకర్తియే చెప్పుచున్నది – ఈ వధూమణి మా మండలములోని స్త్రీలకు మార్గదర్శినియైయందఱి కృతజ్ఞతకు బాత్రురాలగుచున్నది' అని అన్నారు. దేవమణి సత్యనాథన్ రచనా ప్రస్థానంలో 'లలిత' నవల తొలి ప్రయత్నం. ఈ రచయిత్రి దత్తమండలాలలోని రచయిత్రులందరికీ మార్గదర్శకం అవుతుందన్న నరసింహాచార్యులు అభిప్రాయాన్నిబట్టి ఈ రచయిత్రికి ముందు రాయలసీమలో రచయిత్రులు లేరని తెలుస్తుంది. కాబట్టి రాయలసీమ తొలి నవలా రచయిత్రి, తెలుగులో తొలి సాంఘిక నవలా రచయిత్రి దేవమణి సత్యనాథన్. దేవమణి సత్యనాథన్ అనంతపురంజిల్లాలోని ధర్మవరంవాసి అని కూరం నరసింహాచార్యులు 'లలిత' నవలకు వ్రాసిన ముందుమాటలో చెప్పారు. తర్వాత ఈమె మద్రాసులో స్థిరనివాసం ఏర్పచుకున్నారు. ఈమెను హన్నమ్మ, డేవిడ్ అనే దంపతులు దత్తత తీసుకొని పెంచిపెద్ద చేశారు. పెంపుడు తల్లిదండ్రుల వల్ల ఈమె వ్యక్తిత్వం హిందూ క్రైస్తవ సమన్వయాత్మకమైంది. రచయిత్రి జనన, మరణాల తేదీలు లభ్యం కాలేదు. కానీ ఈమె 20వ శతాబ్దానికి పూర్వార్థంలో జీవించిన తొలి తరం తెలుగు రచయిత్రులలో ఒకరని 'తెలుగు సాహిత్య కోశము' (1850–1950 వరకు) అనే గ్రంథంద్వారా తెలుస్తోంది. రచయిత్రి ఈ నవలను తనను పెంచిన తల్లిదండ్రులకు అంకితం చేశారు.

1908లో దేవమణి సత్యనాథన్ రాసిన 'లలిత' నవల స్త్రీ విద్యా ప్రభావాన్ని ఆవిష్కరిస్తూ, స్త్రీ వ్యక్తిత్వాన్ని నిరూపిస్తూ ఉంది. అక్కను, తల్లినీ పోగొట్టుకున్న లలితకు తండ్రి కూడా పిచ్చివాడైపోగా, అన్నదమ్ములు బిచ్చగాళ్ళైపోగా తనను బలవంతం చేస్తున్న వసంతుని బారినుండి తప్పించుకొని మేనమామ కొడుకు హరిదాసును అనేక సాహసాల తర్వాత వివాహం చేసుకుంటుంది. చదువు ఇచ్చిన సంస్కారమువల్ల సమస్యలను చూసి బెదిరిపోకుండా సమాజంలోని మంచివాళ్ళ సహకారంతో సమస్యల నుండి గట్టెక్కిన స్త్రీ కథ ఈ 'లలిత' నవల. ఈ నవలలో హరిదాసుడు, లలిత ప్రధాన పాత్రలు. సౌందర్యవతి అయిన లలిత హరిదాసుపై తనకున్న ప్రేమను నిలబెట్టుకోవడానికి, హరిదాసునే పెళ్ళిచేసుకోవడానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటుంది, చివరికి జయిస్తుంది. లలిత తండ్రి సోమనాథుడు తాగుబోతు. ఈ పాత్ర ద్వారా తాగుడువల్ల వచ్చే నష్టాలను, కష్టాలను రచయిత్రి చిత్రించారు. లలిత నవల సంఘసంస్కరణ నవల. ముఖ్యంగా సమాజంలో మద్యపానంవల్ల వచ్చే నష్టాలు, స్త్రీవిద్యవల్ల కలిగే సుఖాలు ఈ నవలలో చిత్రితమయ్యాయి. జూదం, చెడుసావాసాలు, చెడు ఆలోచనలు, ప్రాణహానికి దారితీస్తాయని ఈ నవలలో రచయిత్రి సూచన ప్రాయంగా తెలియజేశారు. లలిత తండ్రి సోమనాథుడు విజయనగరంలో రక్షకభట ఉద్యోగి. అయితే మితిమీరిన తాగుబోతు. ప్రభుత్వం ఇచ్చే జీతం చాలక

పేదలను లంచాల కోసం పీడించేవాడు. సోమనాథుడు పెట్టే బాధలకు ఓర్వలేక ఆటవికులు సోమనాథుని మీద పగతో సోమనాథుని కూతురైన లలితను కాళికాదేవికి బలి ఇచ్చి సోమనాథునిపై పగతీర్చుకోవాలనుకుంటారు. సోమనాథుడు తాగుడు కోసం ఆటవికులను వేధించడమే వారి పగకు కారణం. తాగుబోతుల లక్షణాలను రచయిత్రి తెలియజేస్తూ – 'త్రాగుబోతుల నడవళ్లు శోచనీయములు. అతడొక్కొక మారు మధువును గ్రోలుచు దాని మూలమున జనించిన మైకముచే దూగుచుండును. చిరపరిచయులగు మధుపాన మిత్రులంగాంచిన, దూలుచు వారివెంట బికారివోలె దిరుగుచుండును. మితిమించిన మత్తుచే గ్రిందపడి పొరలుచుండును. దుర్భాషలనాడుచుండును. లజ్జలేక తిరుగుచుండును. అతిహేయములగు విషయములం జిక్కి యొక్కొకతటి వెఱ్ఱివానివొలె వెదలుచుండును. వెఱ్ఱి వేయివిధములన్నట్లా తడిట్లున్మత్తుడగుటచే చెడునడతలకడలి రక్షకభట వర్గము నుండి ప్రభుత్వమువారీతని దొలగించిరి. ఇపుడు సోమనాథుని పిచ్చి పెచ్చుపెరిగినితడు వీధివీధులందిరుగ జొచ్చెను. చూచినవారిపై నెల్లను బాషాణములం బ్రయోగింపసాగెను. చిరపరిచితులగువారు తన్ను బ్రేమింప జొచ్చిన పలువూఱు వారిని దిట్టుచుండెను. ఇట్లందతికయిష్టుడై స్వకుటుంబమునకు దూరుడై పుత్రులనెన్నక లలితయందలి ప్రీతిని దోలి, హేయ గుణపూరితుడై, తుదకాతుడు దేశముల వెంబడి దిరుగజొచ్చెను. ఆహా! మధుపానము కుటుంబముల కెట్టియరిష్టమును దెచ్చున్నదో చూడుడు'. సోమనాథుడి తాగుడువల్ల కూతురు చనిపోగా, భార్యను పొగొట్టుకొని పిచ్చివాడై దేశదిమ్మరి అవుతాడు. రాజమండ్రిలో ఉంటున్న లలిత పిచ్చివాడైన తండ్రిని గుర్తుపట్టి వైద్యం చేయించి మామూలు మనిషిగా చేస్తుంది. సోమనాథుడు రాజమండ్రి న్యాయస్థానంలో ఉద్యోగం చేస్తూ కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాడు. లలితకు ఇష్టంలేని సంబంధం చూసి పెళ్ళిచేసుకోవాలని బలవంతం చేస్తాడు. తన మాటలు వినని లలితపై కేసు పెడతాడు ఓడిపోతాడు. మళ్ళీ తాగుడుబోతై దేశదిమ్మరి అవుతాడు. దేవమణి సత్యనాథన్ 'లలిత' నవలలో స్త్రీ చదువుకోవాలనే సందేశాన్ని ఇచ్చారు. నిజానికి స్త్రీ చదువు సమాజానికి, కుటుంబానికి చాలా అవసరం. ఈ నవలలో లలిత చదువుకోవడంవల్ల ప్రతి విషయంలో సమయస్ఫూర్తిని పాటించింది. సమయానికి తగిన నిర్ణయాలు తీసుకొని ఆపదల నుండి గట్టెక్కింది. పట్టుదలతో తాను ప్రేమించిన బావనే పెళ్ళిచేసుకుంది దేవమణి సత్యనాథన్ సృష్టించిన లలిత పాత్ర ఆదర్శవంతమైంది. అందుకే 'లలిత' నవల సంఘ సంస్కరణ నవల.

దేవమణి సత్యనాథన్ 'లలిత' నవలలో రాయలసీమ ప్రాంతానికే ప్రాముఖ్యతను ఇచ్చారు. లలిత ఉత్తర సర్కారులోని విజయనగరంలో పుట్టి అక్కడే చదువుకుంటుంది. విజయనగరంలో తల్లి, దండ్రి, అక్క, అన్నదమ్ములు అందరూ దూరమైన తర్వాత దుర్మార్గుడైన వసంతుడు పెట్టే బాధలను భరించలేక ప్రాణ, మాన పరిరక్షణకు పురుషునిగా రూపాన్ని మార్చుకొని తన బావ హరిదాసుడు ఉంటున్న కమలాపురానికి వస్తుంది. ఈ కమలాపురం రాయలసీమ ప్రాంతం బళ్ళారి జిల్లాలో ఉంది. లలిత బావ హరిదాసుడు లలితను మరచిపోలేక, తన తండ్రి వల్ల ఇంట్లో స్థానం ఇవ్వలేక స్నేహితుడి సహాయంతో లలితను రహస్యంగా కమలాపురం నుండి రాజమండ్రికి చేరుస్తాడు. లలిత రాజమండ్రిలో కష్టాలను ఎదిరించి, గెలిచి చివరికి కమలాపురం చేరుకుంటుంది. అక్కడే తన బావను పెళ్ళి చేసుకుంటుంది. లలిత విజయనగరంలో పుట్టినా, రాజమండ్రిలో కొంతకాలం నివసించినా మొత్తానికి కమలాపురమే ఆమె జీవితానికి ఆధారమైన ప్రాంతం. కాబట్టి రచయిత్రి ఈ నవలలో కమలాపురాన్నే కేంద్రంగా చేసి రాయలసీమ ప్రాంతానికి ప్రాధాన్యతనిచ్చారు. దేవమణి సత్యనాథన్ తొలి సాంఘిక నవలా రచయిత్రని 'లలిత' సాంఘిక నవల ద్వారా తెలుస్తోంది.


డా. పొదిలి నాగరాజు
అధ్యాపకులు, శ్రీ అదేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాల, పాలకొల్లు.

భారత జాతీయ సంపద

# అమృతా షేర్‌గిల్

– తంగెడ విశ్వేశ్వర ప్రసాద్



అమృతా షేర్‌గిల్

ఇరవైయవ శతాబ్దపు మేటి మహిళా పెయింటర్, భారత మహిళా పెయింటర్లకు మార్గదర్శి అమృతాషేర్ గిల్. చిన్నతనం నుండే బొమ్మలు వేయడంలో ఆసక్తి చూపింది. 19వ ఏట వేసిన ఇద్దరు యువతులు (Young Girls) పెయింటింగ్‌తో పేరు పొందింది. అమృతాషేర్ గిల్ హంగరీ, బుడాపెస్టులో సంస్కారవంతమైన మేధావి కుటుంబంలో 1913లో జన్మించింది. తల్లి హంగరీ దేశపు యూదు మూలాలు కలిగిన ఓపెరా గాయని, తండ్రి భారతీయ జాట్ రాజకుటుంబీకుడు, సంస్కృత, పార్శీ భాషల్లో పండితుడు. వీరు మొదటిసారిగా లాహోర్‌లో కలుసుకుంటారు. అమృత వారి తొలి సంతానం. అమృత చెల్లి ఇందిర. ఇందిర సంతానమే ఆర్టిస్టు వివాన్ సుందరం. అమృత భిన్నదేశాల, సంస్కృతుల మధ్య పెరగడంతో ఆమె వనితనంతో ప్రాకృశ్చిమ సౌందర్య శైలులు, సాంప్రదాయాలు ప్రతిబింబిస్తాయి.

అమృత బాల్యం కొంత బుడాపెస్టులోనూ కొంత భారతదేశంలోనూ గడుపుతుంది. మేనమామ ఎర్విన్ బాక్టే (Ervin Bocktay) భారత దేశాభిమాని. 1926లో అతడు సిమ్లా వచ్చినప్పుడు అమృతలోని ప్రతిభను గుర్తించి ఆర్టుపై అభిమానాన్ని పెంచి ప్రోత్సహిస్తాడు. అమృత చిన్న వయసులోనే ఇంటి పనివారిని మోడళ్లుగా చేసుకుని వారి చిత్రాలను వేస్తుంది. అమృతకు చిత్రలేఖనంపైగల అభిరుచిని తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తారు. షేర్‌గిల్ కుటుంబం ఆర్థిక సమస్యలవల్ల హంగరీ నుండి సిమ్లా చేరుకుంటుంది. అమృత చిత్రలేఖనంతో పాటు, పియానో, వయోలిన్ వాయించడం నేర్చుకుంటుంది. చెల్లితో కలిసి సంగీత కార్యక్రమాల్లో, నాటక ప్రదర్శనలు పాల్గొనేది. మేజర్ విట్ మార్ష్ వద్ద చిత్రలేఖన విద్యనభ్యసిస్తుంది. సిమ్లా జీవితం ఆహ్లాదకరంగా గడుపుతుంది. నాస్తిక భావాలవల్ల కాన్వెంట్ స్కూలు నుండి బహిష్కరించబడుతుంది. 16వ యేట చిత్రకళలో శిక్షణ పొందడానికి పారిస్ వెళ్తుంది. అక్కడి 'ఆర్ట్ అకాడెమీ'లో చిత్రకళ మీద పట్టు సాధించి, మెరుగులు దిద్దుకుంటుంది. ఆ సమయానే సెయిజాన్, టిషన్, గుగేన్‌లాంటి ప్రముఖ పెయింటర్లను అధ్యయనం చేస్తుంది. సాంప్రదాయ కళలో వారు తమ ప్రతిభతో కొత్తపుంతలు తొక్కడం గమనిస్తుంది. గుగేన్ తాహెతీ స్త్రీల ప్రభావంతో తాను కూడా తనదైన చాలా సాధారణ శైలిని పెంపొందించుకోగలుగుతుంది, కానీ అమృత చిత్రాలు సరళంగా కన్పిస్తూనే మెదడుకు పనిచెప్పేంత క్లిష్టతను కలిగి ఉంటాయి. ఆ వయసుకే అసాధారణమైన పరిపక్వతతో చిత్రలేఖనంలో రాణించడం అరుదైన విషయం.

1937లో లాహోర్ తొలి ప్రదర్శనలో అమృత చిత్రాలు వెలుగులోకి వస్తాయి. నాటి భారతీయ మౌలిక కళా దృక్పథాన్ని సమూలంగా మార్చగలిగాయి. ఆమె శైలి ఒక బడికి కట్టుబడని తూర్పు పడమరల స్వేచ్ఛా సంగమం. తన అనుభవాలను నూతన మార్గంలో ఆవిష్కరించినా తన చిత్రాల్లో భారతీయతను ప్రముఖంగా ప్రదర్శించింది. ముఖ్యంగా స్త్రీల మనోభావాలను ఒంటరితనాన్ని మౌన నిర్ణయాలను చూపించింది. లాహోర్ ప్రదర్శన చూడవచ్చిన గొప్పవాళ్ళందరూ ఆమె చిత్రాలతో పాటు ఆమెను చూడవచ్చినవారే! అమృత ఎన్నుకున్న ప్రాకృశ్చిమాల మిశ్రమ శైలి ప్రపంచ యుద్ధాల సంధికాలంలో గొప్ప ఆకర్షణగా నిలిచింది. నిరంతర ప్రయాణాలవల్ల అమృత గొప్పగొప్ప కళాకారులతో పరిచయాలు పెంచుకుని వారి ప్రభావాల్ని, సంస్కృతులను జీర్ణించుకోగలుగుతుంది. ఆమె పనితనంలో ఫ్రెంచి, హంగేరీ, భారతదేశాల ప్రభావం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. కార్ల్ ఖండాలా వాలావంటి ఆధునిక కళాకారులను స్వయంగా కలిసి అభిప్రాయాలను పంచుకోగలిగింది. చిత్రలేఖనమే కాకుండా చిత్రకళ మీద

అనేక వ్యాసాలు ప్రచురించింది. స్నేహితులు, కుటుంబ సభ్యులకు రాసిన లెక్కలేనన్ని లేఖల ద్వారా తన విశాల భావాల్ని, దృక్పథాన్ని పంచుకుంది.

**అమృతా షేర్ గిల్ ప్రతిభ:**

19332-36 దశనాటి తొలి ప్రభావాలు ఐరోపా శైలులు పోకడలు స్పష్టంగా కన్పిస్తాయి. 1930 పారిస్‌లో గడిపిన సమయాన బోహీమియన్ వర్గాలతో కలిసిమెలిసి తిరిగింది. 1932 నాటి చిత్రం యంగ్ గరల్స్‌తో అమృత ప్రతిభ ఒక్కసారిగా గుప్పుమంటుంది. విమర్శకుల మెప్పును, గ్రాండ్ సాలన్ (Grand Salon) వారి బంగారు పతాకాన్ని గెలుచుకుని, ఆ వెంటనే గ్రాండ్ సాలన్ సహాయకురాలిగా ఎన్నికవుతుంది. ఆసియా నుండి ఆ పదవిని పొందిన పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందింది. అదే సమయంలో అనేక స్వీయచిత్రాలు. స్నేహితుల పోర్ట్రెయిట్లు, పారిస్ జీవితాన్ని ప్రతిబింబించే చిత్రాలు, నిశ్చలన, నగ్న చిత్రాలనూ రూపొందించింది. సంతోషం, విషాదం చూపిస్తూ వేసిన చిత్రాలు ఆమె స్వీయానురక్తిని బహిర్గతం చేస్తాయి అని నేషనల్ మ్యూజియం, ఢిల్లీ అభిప్రాయపడింది. పారిస్ ప్రొఫెసర్ అమృత చిత్రాలలోని వర్ణ సౌందర్యాన్ని మెచ్చుకుంటూ "ఆమె స్వభావానికి మౌలికంగా పాశ్చాత్య భావసంపదకన్నా, భారతదేశ మూలాలు సరిపోతాయి" అని వ్యాఖ్యానిస్తాడు. భారతదేశం పట్లగల అపారమైన అభిమానం 1933 నుండి అమృతను వెంటాడుతూ ఉంటుంది. పెయింటర్‌గా తన గమ్యస్థానం భారతదేశమేనన్న స్థిర చిత్తంతో 1937 చివర్లో భారతదేశం చేరుకుంటుంది. కలకత్తా స్టేట్స్‌మన్ పత్రికా విలేఖరితో ఏర్పడిన పరిచయంతో అతనిలో కలిసి గడిపిన కొద్దికాలంలో అతడి పోర్ట్రెయిట్‌ను చిత్రిస్తుంది. కొత్త ఉద్యోగం కొరకు అతడు ఇంగ్లండు వెళ్ళిపోగా 1935 సెప్టెంబర్‌లో అతడికి వీడ్కోలు చెబుతుంది. ఆర్ట్ కళా విమర్శకుడు ఖండాల్‌వాలా ప్రోద్బలంతో తన మూలాలు వెదుక్కుంటూ భారత పర్యటనకు బయలుదేరుతుంది. భారతీయ కళారీతుల్ని, సాంప్రదాయాన్ని ఆకళింపు చేసుకోవాలన్న తృష్ణ ఆమెను జీవితాంతం వెంటాడుతూ ఉంటుంది. మొగల్ కళారీతులు, అజంతా కుడ్యచిత్రాలు అమృతను బాగా ఆకర్షిస్తాయి. 1937లో దేశ పర్యటన తర్వాత పెండ్లికూతురి అలంకరణ, బ్రహ్మచారులు, అంగడికి వెళ్తున్న పల్లెవాసుల చిత్రత్రయంలో ప్రాచీన కళాసాంప్రదాయాన్ని పాటించింది. పేదల నిరాశా నిస్పృహల్లో, పేదరికంలో సానుభూతి చూపించింది. ఆ చిత్రాల్లో భారతీయ ఆత్మను ఆవిష్కరించడం అమృత లక్ష్యంగా కన్పిస్తుంది. 'పికాసో, మాటెస్, బ్రాక్‌లు ఐరోపాకు చెందినవారు, నేను భారతదేశానికి చెందినదాన్ని, భారతదేశంలోనే పెయింటర్‌గా గడపగలను' అని చెప్పుకుంది. భారతదేశంలో అమృత జీవితం అలా కళాచరిత్రలో నూతన దృక్పథానికి తెరతీసింది. 25 ఏండ్ల వయసులో హంగరీకి చెందిన బంధువు విక్టర్ ఇవాన్‌ను పెండ్లి చేసుకుంది. అంతకు ముందే అతని కారణంగా రెండుసార్లు గర్భస్రావం చేయించుకుంటుంది. భర్తతో కలిసి గోరఖ్‌పూర్ సమీపాన సరయూలో తన పూర్వీకుల యింట జీవితం గడిపింది. ఈ దశలో తన చిత్రాలతో రవీంద్రనాథ్ టాగోర్, జెమినీ రాయ్‌లు. బెంగాల్ చిత్ర కళారంగాన్ని ప్రభావితం చేసినట్లుగా – భారత చిత్రాకళాక్షేత్రాన్ని ప్రభావితం చేసింది. అమృత స్త్రీల పోర్ట్రయిట్లు రవీంద్రుని చిత్రాలను పోలి ఉంటాయి. ముదుర రంగుల్ని, కైరాస్క్యూరో టెక్నిక్‌ను ఉపయోగించడంలో రవీంద్రుని ప్రభావం కన్పిస్తున్నది.

సరయూలో ఉన్నప్పుడు పెయింట్ చేసిన పల్లెదృశ్యం, స్త్రీ ప్రాంగణం. మధ్యాహ్నపు కునుకు (Village Scence, The Ladies Enclosure, Seista) చిత్రాల్లో పల్లె ప్రజల తీరిక జీవితం ప్రతిబింబిస్తుంది. భారతదేశపు గొప్ప పెయింటర్ అని ప్రశంసలు అందుకున్న అమృత చిత్రాలు మాత్రం అంతగా అమ్ముడుపోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. తన కుటుంబం బ్రిటిష్ పాలనకు విధేయంగా ఉన్నా, అమృత మాత్రం కాంగ్రెస్ సానుభూతిపరురాలిగా మిగిలిపోయింది. నిరుపేద, నిస్సహాయ జనాన్ని అభిమానించింది. ఆమె ప్రతిభకు అందానికి ముగ్ధుడైన నెహ్రూ (ఇంకా అప్పటికి ప్రధాని కాలేదు) 1940లో గోరఖ్‌పూర్ పర్యటనలో ఆమెను చూడటానికే సరయూ వెళ్తాడు. ఒక దశలో ఆమె చిత్రాలు, కాంగ్రెస్ పార్టీ ప్రచారానికీ, గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమానికి

పరిశీలింపబడతాయి. నెహ్రూతో ఆత్మీయత ఉన్నా అతడు అందగాడు కాదన్న నెపంతో అతని పోర్ట్రెయిట్ చిత్రించడానికి యిష్టపడదు. 1937లో జరిగిన షేర్‌గిల్ చిత్ర ప్రదర్శనను నెహ్రూ సందర్శిస్తాడు. వారి మధ్య నడచిన ఉత్తర ప్రత్యుత్తరాలను అమృత తలిదండ్రులు తగలబెట్టారు. అదేసమయంలో అమృత బుడాపెస్టులో పెళ్ళి సంబరాల్లో మునిగి ఉంటుంది. 1941లో అమృత భర్తతో కలిసి లాహోర్ చేరుకుంది. అప్పట్లో లాహోర్ అఖండ భారత్‌లో సాంస్కృత కేంద్రం. ఆ సమయంలో 23 చిత్రాలను రచించింది. అమృతకు ఆడమగ స్నేహితులతో సంబధాలు అనేకం. వారిలో చాలామందిని తన చిత్రాలలో చూపించింది. ఇరువురు స్త్రీలు (Two Women) చిత్రంలో ఉన్నది తానూ, ప్రియురాలు లూసీ అనుకుంటారు. షేర్‌గిల్ చివరి దశలో వేసిన చిత్రాల్లో తాహితీ జనం, ఎర్ర ఇటుకల యిల్లు, కొండ దృశ్యం, పెండ్లికూతురు మొదలైనవి కొన్ని. నిండా ముప్పై నిండకుండానే 1941లో షేర్‌గిల్ మరణించే సమయానికి ఒకే ఒక చిత్రం అసంపూర్తిగా మిగిలిపోయింది. లాహోర్ షేర్‌గిల్ ఎగ్జిబిషన్ ప్రారంభానికి ముందు తీవ్రమైన అనారోగ్యంలో కోమాలోకి వెళ్ళిపోతుంది. డిసెంబర్ 5న అర్ధరాత్రి మరణిస్తుంది. ఆమె మరణానికి కారణం గర్భ విచ్ఛిన్న ప్రయత్నం కావచ్చని కొందరంటే, తల్లిమాత్రం డాక్టర్, అమృత భర్త విక్టర్ ఇగాన్ చంపేశారు అంటుంది. చిన్నవయసులో అమృతాషేర్ గిల్ మరణించడంతో భారత చిత్రకళాక్షేత్రం పెన్నిధిని కోల్పోయినట్లైంది. జీవించిన కొద్దికాలం, 28 సంవత్సరాలలో 172 పెయింటింగులను సృజించిన అమృతా షేర్‌గిల్. 20వ శతాబ్దపు చిత్రకళపై పూర్తి అవగాహన కలిగి తన తర్వాతి తరాల మీద చెరగని ముద్ర వేసింది. అమృత చిత్రాల్లో వంద వరకు భారతదేశ మ్యూజియాల్లో, నేషనల్ ఆర్ట్ గ్యాలరీలో, మరికొన్ని ఇతర సంస్థల్లో ఉండిపోయాయి. అవేవీ భారతదేశం వదలి బయటకు పోకుండా ప్రభుత్వం నిషేధం విధించింది. జీవితరంగం, చిత్రకళారంగం రెంటిలో షేర్‌గిల్ తన కాలంకన్నా ముందే నిలిచింది. మేటి చిత్రకారిణిగా తన ప్రతిభకు హద్దులు లేవని నిరూపించుకుంది. అందుకు ఉదాహరణ టేట్ మాడరన్ ఆమె చిత్రాలను ప్రదర్శించడం. షేర్‌గిల్ 108వ జయంతి సందర్భంగా 2021లో నేషనల్ గాలరీ, న్యూఢిల్లీ, టేట్ మ్యూజియం లండన్ ఆమె చిత్రాలు ప్రదర్శనను నిర్వహించి ఆమెను అసాధారణ ప్రజ్ఞాశాలిగా కీర్తించాయి. గూగుల్ డూడుల్ అమృతను ఇండియన్ ఫ్రిదాగా అభివర్ణిస్తూ ఇరువురి మధ్యగల పోలికలతో వ్యాసం వెలువరించింది.

**గౌరవాలు:**

భారత ప్రభుత్వం అమృతా షేర్‌గిల్ చిత్రాలను జాతీయ సంపదగా ప్రకటిస్తే, భారత తపాలాశాఖ అమృత పెయింటింగుతో ఉన్న పోస్టల్ స్టాంపును (1978) విడుదల చేసింది. ఢిల్లీలో ఒక రోడ్డుకు అమృతా షేర్‌గిల్ మార్గ్ అని పేరు పెట్టింది. షేర్‌గిల్ చిత్రాలను విలువైనవిగా గుర్తించిన భారత ప్రభుత్వం వాటిని విదేశాల్లో అమ్మడాన్ని నిషేధించింది. అంతకు ముందే పది చిత్రాలు విదేశాల్లో అమ్ముడుపోయాయి. 2006లో పల్లె దృశ్యం (Village scene) పెయింటింగ్ ఢిల్లీలో 6.9 కోట్ల రూపాయలకు అమ్ముడుపోయింది. అప్పటికి అది పెద్ద మొత్తంలో అమ్ముడుపోయిన భారత కళాఖండం. బుడాపెస్ట్‌లోని భారత సాంస్కృతిక కేంద్రం పేరును అమృతా షేర్‌గిల్ సాంస్కృతిక కేంద్రంగా మార్చారు. 2013లో UNESCO షేర్‌గిల్ శతజయంతి సందర్భంగా, ఆమె గౌరవార్థం ఆ సంవత్సరానికి అమృతా షేర్‌గిల్ సంవత్సరంగా గుర్తింపు ఇచ్చింది. 2018లో ముంబాయి సథ్‌బీ వేలంలో అమృత చిత్రం 'ద లిటిల్ గర్ల్ ఇన్ ద బ్లూ' 18 కోట్ల 69 లక్షల రూపాయల రికార్డు ధరకు అమ్ముడుపోయింది. 1934లో ఉన్నప్పుడు సిమ్లాలో అమృత చిత్రించిన తన కజిన్, 8 సంవత్సరాల బబిత్ పోర్ట్రెయిట్ అది. ఇండియాలో అప్పటివరకు అమ్ముడుపోయిన ఖరీదైన పెయింటింగు అది. అదీ అమృత గొప్పదనం.

**భారతదేశ ఫ్రిదాకాలో అమృతా షేర్‌గిల్ ఫ్రిధాకాలో - అమృతా షేర్‌గిల్‌ల మధ్య పోలికలు :**

ఇరువురి జీవితాల్లో విచిత్రమైన పోలికలు కన్పిస్తాయి. అమృతా షేర్‌గిల్‌ను ఫ్రిదాకాలోతో పోలుస్తూ అమృతా షేర్‌గిల్‌ను భారతదేశపు ఫ్రిదాగా చెప్పుకోవడం కూడా

చూస్తాము. ఫ్రిదాకాలో మెక్సికో చిత్రకళారంగంపై చెరగని ముద్రవేసినట్లుగా అమృత కూడా ఆధునిక భారతీయ చిత్రకళను ప్రభావితం చేసింది. 2018లో అమృత చిత్రాలను మొదటిసారి, సథ్; సంస్థ వేలానికి పెట్టినప్పుడు అమృతా షేర్‌గిల్‌ను భారతదేశపు ఫ్రిదాకాలోగా అభివర్ణించింది. ఇరువురు పెయింటర్లూ, తమతమ దేశ సంస్కృతులను పెయింటింగుల ద్వారా చూపించారు. స్త్రీత్వాన్నీ, దుఃఖాన్నీ జయించి పురుషాధిక్య చిత్రకళా రంగంలో ప్రముఖులుగా వెలుగొంది తమ కాలంకన్నా ముందు నిలిచారు. ఇరువురూ సమకాలికులే అయినా వివిధ దేశాలకు చెందినవారు. అమృత వేర్వేరు దేశాల తల్లిదండ్రులకు జన్మించినట్లుగా, ఫ్రిదాకాలో కూడా రెండు దేశాల తల్లిదండ్రుల (దేశాలకు, జర్మనీ మూలాలున్న తండ్రికి; స్పెయిన్ – అమెరికా తల్లిదండ్రుల సంకర సంతానమైన తల్లికీ) సంతానం. ఇరువురూ తమ సంస్కృతుల అభిమానులు. వారి పనితనం తమను తాము వ్యక్తీకరించుకోవడానికి దోహదపడుతుంది. ఫ్రిదా తండ్రి వృత్తిపరంగా ఫోటోగ్రాఫర్, అమృత తండ్రి ఫోటోగ్రఫీ మీద అభిమానంకలవాడు. ఇరువురూ కుటుంబ సభ్యుల ఫోటోలు తీసినవారే. అమృత, ఫ్రిదాలు తమ తండ్రుల నుండి ఫోటోగ్రఫీ శైలిని నేర్చుకున్నవారే. పోర్ట్రెయిట్లు చిత్రించడంలో ఆసక్తి చూపించి, ఆ దిశలో విజయం సాధించారు. ఫ్రిదా 1907లో జన్మించినా 1910లో పుట్టినట్టు చెప్పుకుంది. మెక్సికో తిరుగుబాటుకు తనకు సంబంధం ఉన్నదని చెప్పుకోవడానికి అమృత కూడా మొదటి ప్రపంచ యుద్ధానికి కొంచెం ముందు బుడా ఫెస్టలో జన్మించింది, బాల్యం అక్కడే గడిపింది. 1930నాటికి పారిస్‌లో పెయింటింగ్ నేర్చుకుని ఇండియా చేరుకుంటుంది. ఆర్టిస్టిక్ మిషన్ పేరుతో దక్షిణ భారత పర్యటన చేస్తుంది. దక్షిణ భారత జన జీవితాన్ని కాన్వాసు మీద చూపించటం ఆ పర్యటన ఉద్దేశం. ఫ్రిదా మెక్సికో జనానీకాన్ని చిత్రించడానికి కారణం ఆమె భర్త రివేరా. విదేశాలు మెక్సికో సంస్కృతి, జంతువులు, పక్షులు, పూలు ఫ్రిదా పెయింటింగుల్లో కన్పిస్తాయి. మహిళా పెయింటర్లు తమ నగ్న చిత్రాలను రచించడం 1930–40లో అసాధారణ విషయం. అమృత స్వీయ నగ్నచిత్రం (Self portrait as a Ttahitian)లో తనను తాహితీ మహిళగా చూపిస్తుంది. అది స్త్రీత్వానికి, స్త్రీ శక్తికి బలమైన వ్యక్తీకరణ. ఫ్రిదా తన భావోద్రేకాలను శారీరక బాధను స్వీయ చిత్రాల్లో ప్రదర్శిస్తుంది. ద బ్రోకెన్ కాలమ్ నగ్న చిత్రంలో తన విచ్ఛిన్నమైన దేహాన్ని చూపిస్తుంది.

అమృత భారతీయ ఆత్మతో తదాత్మ్యం చెందినట్లు తన కట్టుబొట్లతో చూపిస్తే, ఫ్రిదా మెక్సికో సాంప్రదాయ దుస్తుల్ని ధరించి, తమ మూలాలు గొప్పతనాన్ని చాటుతుంది. ఇరువురూ తమ మూలాలను తెలిపే సాంప్రదాయ వస్త్రధారణను గర్వంగా భావించారు. వాటి ద్వారా వారి మూలాలను, సంస్కృతినీ ప్రదర్శించారు. ఫ్రిదా వలసవాదానికి వ్యతిరేకి అమృత బ్రిటిష్ రాజ్యానికి వ్యతిరేకి. నిర్మోహమాటంగా తమ భావాలను, ఆశలను, ఆశయాలను వెలిబుచ్చడమేగాక తమకు నచ్చిన విధంగా జీవించారు. ప్రేమలోని తీవ్రతను, గాఢతను, ఒడిదుడుకుల జీవితన్ని అనుభవించారు. వివాహానికి ముందే లైంగిక సంబంధాలు కలిగి ఉండి, పెండ్లి తర్వాత కూడా వివాహేతర సబంధాలు కొనసాగించారు. విచ్చలవిడి (బొహీమియన్) జీవితం గడిపారు. ఇరువురూ బైసెక్సువల్స్ కమ్యూనిజం అభిమానులు. ప్రథమశ్రేణి పెయింటర్లు. అమృతా షేర్‌గిల్ పిన్నవయసులోనే సోల్ సిస్టర్స్ పెయింటింగుకు 1932లో పారిస్ గ్రాండ్ సాలన్, గోల్డ్‌మెడల్, సభ్యత్వం అందుకుంటే, లూవర్ మ్యూజియంలో ప్రదర్శించబడిన పెయింటింగుతో ఫ్రిదాకాలో ఆ గౌరవం పొందిన తొలి మెక్సికన్ ప్రతినిధిగా చరిత్ర సృష్టిస్తుంది.

అనారోగ్యం, అబార్షన్లు, శరీర దుర్భలత్వం, అకాల మరణంలో కూడా దగ్గరి పోలికలు కన్పిస్తాయి. ఇరువరూ కచ్చితంగా చెప్పలేని కారణాలతో మరణిస్తారు. అమృత 1941లో 28వ ఏట తన చిత్ర ప్రదర్శనకు ముందు మరణిస్తే ఫ్రిదా 47వ ఏట తన చిత్ర ప్రదర్శన తర్వాత మరణిస్తుంది. భారతదేశం, మెక్సికో రెండు దేశాలూ అమృత, ఫ్రిదా పెయింటింగులను తమ తమ దేశ వారసత్వ సంపదగా ప్రకటించాయి.

టి. విశ్వేశ్వర ప్రసాద్ - హైదరాబాద్. ఫోన్: 798 139 8250.

మన దేశంలో

# పర్యావరణోద్యమాలు

– పూషదపు సుబ్బారావు

*మాతా భూమిః పుత్రో అహం పృధివ్యాః*
*పర్జన్యః పితాస ఉనఃపిపర్తు*

**నా** తల్లి భూమి, నేను పుడమి తల్లి బిడ్డను, వర్షాధిపతియైన ఇంద్రుడే నాకు తండ్రి వీరిరువురూ మాకు సంవృద్ధిని కలిగింతురు గాక.

– *అధర్వవేదం – భూమి సూక్తము*

సూర్య మండలంలో జీవార్భావ, వికాసాలకు కావలసిన మూలకాలన్నీ పుష్కలంగా ఒక్క భూమండలంలోనే ఉండటంచేత ఇక్కడ కోట్ల సంవత్సరాల నుండి ప్రకృతితో మమేకమై జీవులు మనుగడ సాగిస్తున్నాయి. అనంత కాలగమనంలో అంతరిక్ష భౌమిక ఉత్పాతాలవలన భూమి నష్టపోయనా మరో విధంగా పునరుజ్జీవనం పొందుతూ వచ్చింది. వాక్కుతో, మేధస్సుతో ప్రపంచాధిపత్యం పొందిన మానవుడు నాగరికత మోజులో పంచభూతాలనూ పంకిలం చేయడం మొదలుపెట్టాడు. నక్షత్రాలు మొదలు భౌమిక ప్రాకృతిక వస్తువులన్నింటిలోనూ దివ్యత్వాన్ని సందర్శించి, ఆరాధించిన సమాజం మనది. పెరిగిన జనాభా, అవసరాలు, పోటీతత్వం ఒక ప్రక్క అజ్ఞానం, వనరుల దోపిడీ మరోప్రక్క భారతదేశంలో పర్యావరణ విధ్వంసానికి బీజాలు వేశాయి. ఎన్నో జాతుల వృక్షాలు, వనమృగాలు, జలచరాలు, కొండలు, నదులు మొదలైన స్థావర జంగమ రూపాలెన్నింటికో దైవత్వాన్ని ఆపాదించడంవల్లనే ఇంకా చాలావరకు ప్రాచీన జీవజాతులు నేటికీ ఈ దేశంలో మిగిలి ఉన్నాయని చెప్పక తప్పదు. "మానవ స్వార్థాన్ని మత భావనలు బలంగానే అడ్డుకున్నాయి". పుణ్యక్షేత్రాలలో దైవతంతో పాటు స్థల వృక్షం కూడా పూజనీయమైనదే. ఓషధులు మానవాళికి చేస్తున్న ఉపయోగాన్ని కూడా భారతీయ ఋషులు గుర్తించినందునే ఆయుర్వేదం ఉపవేదంగా వృద్ధి చెందింది.

"పాండు మధ్యమునితో ఖాండవ దహనం జరిపించిన వాళ్ళం ప్రాయశ్చిత్తంగానేమో దేవేంద్రుని పై యుద్ధం చేసి మరీ పారిజాత వృక్షాన్ని దివి నుండి భువికి తెచ్చుకున్న వాళ్ళం. విశ్వమానవేతిహాసంలో మహనీయుడైన బుద్ధభగవానుని రావివృక్షంలో దర్శించిన వాళ్ళం మనం". గజ, వ్యాఘ్ర, సింహ, అశ్వ, వరాహ, భల్లూక, వానర, మత్స్య, కూర్మ, మకర, ఖేచర, సర్ప ఇలా భూచర, జలచర, ఉభయ చర ప్రాణులెన్నో ఈ దేశంలో దేవతల సరసన పూజలందుకుంటున్నాయి. ఇదంతా నాణానికి ఒక ప్రక్క మాత్రమే. మరోప్రక్క స్వార్థం, సంపద సృష్టించాలన్న తపనతో సర్వ జీవ విధ్వంసం ప్రారంభమైంది. చరిత్రలో తెలిసినంతవరకూ ఈ దేశంలో పర్యావరణహితం కోసం జరిగిన ఉద్యమాలను పరిశీలిద్దాము.

**అమృతాదేవి అమరత్వం:** తాము ప్రత్యక్ష దైవాలుగా ఆరాధిస్తున్న వృక్షాలను తమను పాలించే ప్రభువే రాజభవన నిర్మాణానికి నరికించాలని ప్రయత్నించగా క్రీ॥శ॥ 1730లో రాజస్థాన్ రాష్ట్రంలో బిష్ణోయ్ తెగవారు ఎదురు తిరిగారు. వారికి అమృతాదేవి అను వీరనారి నాయకత్వం వహించి చెట్లను నరికే గొడ్డళ్ళకు తన తలను అడ్డుపెట్టి పుణ్యలోకాలకు పోగా, 363 మంది అదే మార్గంలో శిరచ్ఛేదం పొంది అమరులయ్యారు. తప్పు తెలుసుకున్న రాజపరివారం వనచ్ఛేదాన్ని ఆపిందిగానీ, బిష్ణోయి తెగ నేటికీ తమ సదాచారాన్ని పాటిస్తూనే ఉంది. 1500 ఎ.డి.లో "జంభోజి" అనే వైష్ణవ సాధువు ఈ తెగకు 29 నియమాలు ఏర్పరిచాడు. (రాజస్థానీ భాషలో బిష్–20/నోయి–09)

కట్టెపుల్లలు కొట్టవలసి వస్తుందని శవ దహనాన్ని కూడా నిషేధించుకున్న హిందూ తెగ ఇది. రాజస్థాన్‌లోని ఆరావళి అరణ్యాలలోని "కంకాని" గ్రామంవద్ద "భగోడాకి ధని" అనే ప్రాంతంలో సల్మాన్‌ఖాన్ కృష్ణజింకను వేటాడి 5సం॥లు జైలు శిక్షకు పాత్రుడవ్వడం దేశమంతా మారుమ్రోగిన ఉదంతం. ఆనాడు సదరు చలన చిత్ర రారాజు రక్షిత కృష్ణజింకను వేటాడాడని ధైర్యంగా న్యాయస్థానానికొచ్చి చెప్పినది పూనమ్‌చంద్ బిష్ణోయి అనే పూర్వాచార పరాయణుడన్నది కొందరికే తెలుసు. ఈ ఉద్యమం వెలిగించిన స్ఫూర్తి జ్వాల ఆరకుండా కాపాడాలని కేంద్ర ప్రభుత్వం దేశంలోనే అత్యున్నత పర్యావరణ అవార్డును "అమృతాదేవి బిష్ణోయ్ వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ అవార్డు"గా ఇస్తున్నది.

**పాలక్కడ్ ఉద్యమం:** కేరళలోని పాలక్కడ్ జిల్లాలో ప్రవహించే పెరియార్ నదికి ఉపనది అయిన "కుధిపుజ" నదిపై నిర్మించ తలపెట్టిన జల విద్యుత్ ప్రాజెక్టు వెనుక జలాలవలన ఎంతో విలువైన అడవి మునిగిపోతుందని గ్రహించిన పర్యావరణ ప్రేమికులు 1978లో ఉద్యమం ప్రారంభించారు. "వైటేకర్" దీనికి నాయకత్వం వహించాడు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎన్నో అరుదైన జీవ జాతులకు ఆవాసమైన ఈ ఉష్ణమండలాటవీ ప్రాంతాన్ని 1985లో "సైలెంట్ వ్యాలీ నేషనల్ పార్కు"గా ప్రకటించి రక్షించింది.

**చిప్కో ఉద్యమం:** మన దేశంలోనే కాదు. ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించిన వనసంరక్షణా ఉద్యమమిది. నాటి ఉత్తరప్రదేశ్‌లోని దేవభూమి (నేటి ఉత్తరాఖండ్) ప్రాంతంలోని చమోలీ జిల్లాలో 1973లో సుందర్‌లాల్ బహుగుణ నాయకత్వంలో, గౌరీదేవి, ఛండీ ప్రసాద్ భట్ మొదలైన పర్యావరణహితులు దీనిని నడిపారు. చిప్కో అంటే "హత్తుకొను" అని అర్థం. హిమాలయ పర్వతారణ్యాలను అడ్డూ అదుపు లేకుండా నరికేస్తున్న దళారీల బారీ నుండి చెట్లను రక్షించడానికి స్థానికులు చెట్లను కౌగలించుకొని ఎవరినీ నరకనిచ్చేవారు కాదు. భగీరథిపై నిర్మించిన జల విద్యుత్ ప్రాజెక్టు "తెహ్రీడ్యామ్" నిర్మాణం చాలా కాలం ఆలస్యం కావడానికి ఈ ఉద్యమం ప్రేరణయ్యింది.

**జంగిల్ బచావో ఉద్యమం:** నేల రకాన్నిబట్టి, శీతోష్ణస్థితినిబట్టి అడవులలో ఒక్కోచోట ఒక్కోరకమైన చెట్లు పెరుగుతాయి. బీహార్‌లోని "సింగ్‌భం" జిల్లాలోని అటవీ భూములలో అనాదిగా సాల (తెల్ల, నల్లమద్ది) వృక్షాలు పెరుగుతాయి. అప్పటి ప్రభుత్వం లాభదాయకమైన కలపనిచ్చే టేకు మొక్కలను సాలవనాల స్థానంలో పెంచాలని భావించి ఉన్నఫళాన మొత్తం అడవిని నరికించేయడానికి ప్రణాళిక సిద్ధం చెయ్యడంతో 1980లో గిరిజనులు సాలవృక్షాలను హత్తుకొని ఎవరినీ చెట్ల దరిదాపులకు రానీయ్యకుండా తీవ్ర నిరసన తెలియచెయ్యడంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకొన్నది.

**అప్పికో ఉద్యమం:** దక్షిణాదిలో దట్టమైన అడవులకు నిలయమైన కర్నాటక రాష్ట్రంలో ఉత్తర కన్నడ జిల్లా, శివమొగ్గ (షిమోగా) జిల్లాల్లో ఇది ప్రారంభమైంది. 1950 నాటికి పై రెండు జిల్లాల్లో 80% భూమి దట్టమైన అడవితో నిండి ఉండేది. ఈ వనరులు కాగితం, ప్లేవుడ్ పరిశ్రమలను ఆకర్షించాయి. అక్కడున్న వాగులపై జల విద్యుత్ ప్రాజెక్టులు కట్టి కొంత అడవి నరికి వేశారు. ఉపాధి పేరుతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలవలన 1980 నాటికి అటవీ విస్తీర్ణం 25% పడిపోయింది. ఎటు చూసినా బోడి కొండలు దర్శనమిచ్చాయి. చిప్కో ఉద్యమ విజయాల పట్ల ఆకర్షితుడైన పాండురంగ హెగ్గడే అను పర్యావరణ ప్రేమికుడు ఉత్తర కన్నడ జిల్లా "సల్కాని" ప్రాంతంలో "అప్పికో" చలువాలి ఉద్యమానికి 1983 సెప్టెంబర్‌లో నాంది పలికారు. కన్నడంలో అప్పికో అంటే కౌగిలించుకొను అని అర్థం. ఈ ఆందోళన ఫలితంగా ప్రభుత్వం తిరిగి వన సంరక్షణకు పచ్చ జండా ఊపింది.

**నవధాన్య ఉద్యమం:** మన దేశం జీవ వైవిధ్యానికే కాదు వివిధ రకాల ఆహార ధాన్యములకు కూడా పెట్టింది పేరు. విష రసాయాలతో జరుగుతున్న వ్యవసాయం బహుళ జాతి సంస్థల గుత్తాధిపత్యంపై వందనాశివ గొంతెత్తారు. దేశీయమైన సేంద్రియ వ్యవసాయానికి ఊతమిచ్చి, జీవవైవిధ్య రక్షణకు 1984లో ఆమె ఉద్యమాన్ని నిర్మించారు. దేశమంతా తిరిగి 3వేల రకాల వరి

వంగడాలను సేకరించారు. 60 ధాన్యపు బ్యాంకుల నేర్పరిచి వాటిని భద్రపరిచారు. 1952లో డెహ్రాడూన్‌లో పుట్టిన ఈమె కెనడాలో పి.హెచ్.డి., పూర్తి చేశారు. 33సం॥ వయస్సులోనే "దూన్‌లోయలో" జరుగుతున్న అక్రమ గనుల గురించి సుప్రీంకోర్టుకు లేఖ వ్రాశారు. చిప్కో ఉద్యమం నుండి స్ఫూర్తి పొంది పర్వతాలనూ కాపాడాలని ఉద్యమం ప్రారంభించారు. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో లాభాల కోసం బహుళ జాతి కంపెనీలు ప్రోత్సహిస్తున్న "రసాయన సేద్యం కలిగించే నష్టాలు" గురించి మాట్లాడి క్రొత్త ఆలోచనలకు తెర తీశారు. నవ ధాన్య ఉద్యమాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించి శాస్త్రవేత్తలను, మేధావులను ఆకర్షించారు. ఫోర్బ్స్ పత్రిక ప్రపంచ స్థాయిలో ప్రభావితం చేయగల 7గురు మహిళలలో ఒకరిగా, టైమ్ మాగజైన్" "ఎన్విరాన్‌మెంట్ హీరో"గా ఈమెను ప్రకటించాయి. ఇది మొదలు వివిధ రాష్ట్రాలలో ఔత్సాహికులైన రైతులు, విద్యావేత్తలు సేంద్రీయ విధానాలు, దేశీయ విత్తనాల పరిరక్షణ పెద్ద ఎత్తున చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం "పరంపరాగత్ కృషి వికాస్ యోజన" చేపట్టి దేశం మొత్తం మీద సేంద్రీయ వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తున్నది. నేడు పాలేకర్‌లాంటి వ్యవసాయ నిపుణులు హరిత విప్లవం విష ఫలితాలనిచ్చిందని, ఆరోగ్యకరమైన ఆహారానికి జాతి దాదాపు దూరమైపోయిందని రైతులను చైతన్యపరుస్తున్నారు.

**నర్మదా బచావో ఆందోళన:** నర్మదా నదముపై గుజరాత్ ప్రభుత్వం, కేంద్ర సహకారంతో నిర్మించ తలపెట్టిన బహుళార్ధ సాధక ప్రాజెక్టు అయిన "సర్ధార్ సరోవర్ డ్యామ్"కు వ్యతిరేకంగా లక్షలాది గిరిజనం పక్షాన మేధాపాట్కర్, బాబా ఆమ్టే, అరుంధతిరాయ్ ప్రారంభించారు. ఈ ఆనకట్ట వెనుక జలాలవలన వేల ఎకరాల అటవీ భూములు వన సంపద, వందల గిరిజన గ్రామాలు మునిగిపోతాయన్న భయంతో ఈ ఆందోళన ప్రారంభమై మేధాపాట్కర్ నాయకత్వంలో జలదీక్షలు, నిరసన, నిరాహార దీక్షలతో ఉధృతమైంది. 56 ఏండ్ల తరబడి కొనసాగింది కానీ గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్రలలో కరువు పీడిత జిల్లాలలోని కోట్లాది జనం సాగునీరు, త్రాగునీటి అవసరాలు, ప్రధాని నరేంద్రమోది దృఢ సంకల్పం ముందు వీగిపోయింది.

**గంగా పరిరక్షణ్:** పుణ్య గంగానది పాపపంకిలంతో నిండిపోవడంతో స్థానికుల మద్దతుతో శ్రీమతి "రమారౌటా" నాయకత్వాన 1988లో కాన్పూర్‌లో ప్రారంభమైన ఈ ఉద్యమం గంగా పరివాహక ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఆందోళనలకు నాంది పలికింది. కేంద్ర ప్రభుత్వం "గంగాశుద్ధి" పేరుతో వేలకోట్ల బడ్జెట్‌ను ప్రారంభించడం మొదలు, ఎందరో సాధు సంతుల నిరసన దీక్షలు, కొందరి బలిదానాలుతో సాగుతూ వచ్చి ''నమామిగంగే'' కార్యక్రమంలో కలిసిపోయింది.

**ఇటీవలి పరిణామాలు:** ప్రపంచంలో 6 విభిన్న భౌగోళిక ప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణా పోరాట యోధులకు అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో ఏడూ ఏప్రిల్ 24న "గోల్డ్‌మన్ ఎన్విరాన్‌మెంట్ ప్రైజ్" ఇస్తారు. దీనికి "గ్రీన్ నోబుల్" అని పేరు. ఒడిస్సాలోని నియమగిరి కొండలలో నివసించే ఆదిమ గిరిజన తెగ "డొంగ్రియా కోంధ్"ల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తూ, అటవీ విధ్వంసానికి పాల్పడుతున్న "వేదాంత అల్యూమినియమ్ ఫ్యాక్టరీపై "ప్రపుల్లసమంతర" తన "లోక్‌శక్తి అభియాన్" సంస్థ ద్వారా పోరాటం జరిపి 2013లో మూయించి వేశారు. ఇందుకుగాను 2017 గోల్డ్‌మన్ ఎన్విరాన్‌మెంట్ ప్రైజ్ అందుకున్నారు. అయితే ఈ బహుమతి ఇంతకు ముందు మేధాపాట్కర్ (1992లో తొలిగా) రమేష్ అగర్వాల్ (2014) మొదలైన 6గురు భారతీయులకు దక్కడం గమనార్హం.

**పశ్చిమ ఘట్టా జాగృతి వేదిక:** కన్నడ నాట ప్రాచీన యక్షగానం పునరుద్ధారకుడు ఆధునిక కన్నడ నవలకు ఆద్యుడైన గొప్ప కవి "డా॥ శివరామకారంత్" గొప్ప పర్యావరణవేత్త. దక్షిణ కన్నడ జిల్లా "శాలిగ్రామ" వాసి అయిన ఈయన రచనలు, ఉపన్యాసాలతో స్ఫూర్తి పొందిన విద్యావేత్తలు పశ్చిమ కనుమల్లో జరుగుతున్న అక్రమ గనుల త్రవ్వకాలు అభివృద్ధి పేరుతో అటవీ విధ్వంసంపై "పశ్చిమ ఘట్టా జాగృతి వేదిక"ను స్థాపించి పోరాడుతున్నారు. ఇటీవల కేరళలో సంభవించిన వరదల విలయాన్ని ఆయన ముందే అంచనావేసి హెచ్చరించారు.

**మన్యం బాక్సైట్ ఉద్యమం:** ఆంధ్రప్రదేశ్‌లోని

విశాఖపట్టణం, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో 4,000 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 568 మిలియన్ టన్నుల బాక్సైట్ నిల్వలున్నాయి. వీటిని వెలికితీసి విక్రయించడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చునని భావించిన రాష్ట్ర ప్రభుత్వం. కేంద్రం ఆధ్వర్యంలోని "నాల్కో"కు 2007లో కౌలుకిచ్చింది. ఇక్కడ త్రవ్వకాలు ప్రారంభమైతే సహజ వనరులతో, ప్రకృతి రమణీయతతో వర్ధిల్లే తూర్పు కనుమలు సర్వనాశనమౌతాయని భావించిన గిరిజనం పోరాటం ప్రారంభించారు. వారికి మావోయిస్టుల మద్దతు లభించడంతో ప్రభుత్వాలు ఒప్పందం రద్దు చేసుకున్నాయి. కేంద్రం మన్యం బాక్సైట్ నిల్వలపై అధ్యయనానికి "కలా కమిటీ" వేసింది. అప్పటికే మన్యంలో లాటరైట్, తెల్ల గ్రానైట్ త్రవ్వకాలను వ్యతిరేకిస్తున్న గిరిజనులు, బాక్సైట్ గనుల విషయమై మరింత గట్టిగా (2017) ప్రతిఘటించడంతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నెమ్మదించింది. అయినా మావోయిస్టులు - అరుకు ఎమ్.ఎల్.ఎ.ను, మాజీ ఎమ్.ఎల్.ఎ.ను కాల్చి చంపడంతో ఈ ఉద్యమం హింసాత్మకంగా మారింది.

**ముగింపు:** మన దేశంలో 1990-2015సం॥ మధ్య 1,29,000చ॥కి॥మీ॥ అటవీ సంపద నాశనమయ్యింది. 2019 అంచనాల ప్రకారం దేశ భౌగోళిక విస్తీర్ణంలో అడవుల వాటా 21.67% అంటే 7,12,249 చ॥కి॥మీ॥. అందులో దట్టమైన చెట్ల వాటా 2.89% మాత్రమే. 2017 - 2019 మధ్య మన దేశ అటవీ విస్తీర్ణం 0.65% పెరిగింది. ప్రపంచంలో మరెక్కడా పెరగని ఎర్రచందనం ఆంధ్రప్రదేశ్‌లో నిత్యం లూటీకి గురౌతున్నది. ఆంధ్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ వాటా (2021) 17.88% ఉండగా తెలంగాణలో 18.36% ఉంది. మన దేశంలో నదులు పెద్ద ఎత్తున కాలుష్యానికి గురౌతున్నాయి. సరస్సులు ఎండిపోతున్నాయి. ఈ తరుణంలో కర్ణాటక రాష్ట్రం కొడగు ప్రాంతంలోని బ్రహ్మగిరి వద్ద 300 ఎకరాలలో నరికేసిన అటవీ భూములను కొని తిరిగి వనాన్ని పెంచిన పామిలా (అమెరికా) అనిల్ (ఇండియా) దంపతులు మనందరికీ ఆదర్శప్రాయం. దేశంలోనే తొలి "ప్రైవేట్ వైల్డ్ లైఫ్ శాంక్చురీ"గా పిలువబడుతున్న ఈ వనం పునరుద్ధరణతో చుట్టుప్రక్కల ప్రాంతాలలో తిరిగి వర్షాలు ప్రారంభమయ్యాయి. ప్రకృతి మాత మరలా పునర్జన్మ ఎత్తింది.

**(విపిన దేవతల మధ్య ఆకుపచ్చటి సింహాసనంపై కొలువు తీరుతున్న సుందర్‌లాల్ బహుగుణగారికి ఈ వ్యాసం అంకితం)**

పూషడపు సుబ్బారావు
అవనిగడ్డ, కృష్ణాజిల్లా. ఫోన్: 810 626 2243.

## ఇద్దరు వ్యక్తులు

కొండ నుండి దిగుతూ వున్న ఒంటరి వ్యక్తిని
నువ్వు చూసావా?

నేను కవిత చెబుతాను / ఒక బ్రహ్మాండమైన కవిత

ఆ చెట్టు క్రింద కూర్చున్న ఆ ఇద్దర్నీ
ఆ ఇద్దర్ని మాత్రమే / నువ్వు ఏమంటావు?

ఎన్ని గంటలు ఎన్ని దినాలు ఎన్ని శతాబ్దాలుగా
ఆ ఇద్దరూ అక్కడ కూర్చొన్నారో / నువ్వేమైనా చెప్పగలవా?

కొంచం ఆలస్యంగా లేస్తారు ఇద్దరు వ్యక్తులు
మొత్తం పట్నాన్ని వీపు మీద మోస్తూ
ఏదో ఒక నది వైపో, కొండవైపో నడుచుకుంటూ
వెళ్ళిపోతారు ఇద్దరు వ్యక్తులు

ఇద్దరు వ్యక్తులు ఈ ప్రపంచాన్ని ఏం చేస్తారో
నువ్వు ఏమీ చెప్పలేవు! / ఇద్దరు వ్యక్తులు తిరిగొస్తారు
మిట్టమధ్యాహ్న వేళ రోడ్డు ప్రక్కన
నీకు అకస్మాత్తుగా తారసపడతారు

అయినా / ఇద్దరే ఎందుకు / ఎల్లప్పుడూ ఇద్దరేనా
ఒకర్ని భాగం చేస్తే ఇద్దరవుతారా?

ఇద్దరు వ్యక్తులు / ఎన్ని పట్టణాల ధూళినీ ఉచ్ఛారణను
నీ భాషలోకి మోసుకొస్తారో నీకు తెలుసా?

ఇద్దరు వ్యక్తులు / రోడ్డు ప్రక్కన మౌనంగా వెళ్తున్న ఇద్దరు
వ్యక్తులు / నీ పట్టణాన్ని ఎంత అనంతం చేస్తున్నారో
ఎప్పుడైనా ఆలోచించావా?

జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత శ్రీ కేదార్ నాథ్ సింగ్ కవితకు అనువాదం - కిల్లాడ సత్యనారాయణ - ఫోన్: 833 398 7838.

# కాటమరాజు కథలు - మూడవ సంపుటం

*– తోట వెంకటస్వామి*

తెలుగు జానపద సాహిత్యానికి విశ్వవిద్యాలయ స్థాయిలో గౌరవం తీసికొని వచ్చిన మొట్టమొదటి మహానుభావుడు ఆచార్య బిరుదురాజు రామరాజుగారు. వీరు చేసిన "తెలుగు జానపద గేయ సాహిత్యము" అనే పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయంవారు 1956లో పిహెచ్.డి. డిగ్రీ యిచ్చారు. ఇది 1958లో గ్రంథరూపంలో వెలువడి ఎంతో ప్రసిద్ధి పొందింది. వీరి తరువాత జానపద సాహిత్య రంగంలో విశేషమైన కృషి చేసిన వ్యక్తి ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారు. వీరు రామరాజుగారి పరిశోధనలోని మూడవ ప్రకరణమైన చారిత్రక గేయములను గ్రహించి, ఎన్నో నూతన విషయాలను ఆవిష్కరిస్తూ ముందుకు వెళ్ళారు. తంగిరాలవారు "తెలుగు వీరగాథా కవిత్వము'' అనే అంశాన్ని గురించి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 1963 నుండి 1968 వరకూ, ఐదు సంవత్సరాలు అహో రాత్రులు కృషి చేశారు. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలన్నీ పర్యటించి సుమారు 40 తాళపత్ర గ్రంథాలను సేకరించారు; ఎన్నో మౌఖిక వీరగాథలను గ్రంథస్థం చేశారు. వీరి పరిశోధనకు 1969లో పిహెచ్.డి. డిగ్రీ వచ్చింది.

భారతీయులకు ప్రపంచ ప్రసిద్ధికెక్కిన రెండు గొప్ప ఇతిహాసాలున్నాయి:- (1) *వాల్మీకి రామాయణం*, (2) *వ్యాస మహాభారతం*. తెలుగువారికి ఈ రామాయణ *మహాభారతా* లతోపాటు మరో రెండు జాతీయమైన ఉత్తమ ఇతిహాసాలున్నాయి: అవి (1) *పల్నాటి వీరచరిత్ర*, (2) *కాటమరాజు చరిత్ర*. ఇవి ఒక్కొక్క వీరగాథలు కావనీ, ఇవి "వీరగాథాచక్రములు'' (Ballad-cycles) లేక "జానపద ఇతిహాసములు" (Folk Epics) అనీ ఆచార్య తంగిరాలవారు మొట్టమొదటసారిగా నిరూపించారు. అంతేకాదు పల్నాటి వీరకథాచక్రములో 25 వీరగాథలున్నాయని; కాటమరాజు కథాచక్రములో 32 వీరగాథలున్నాయని స్థాపించారు; ఆ కథల పేర్లు కూడా ఇచ్చారు. ఆచార్య తంగిరాలవారు పరిశోధన ప్రారంభించే నాటికి కాటమరాజు కథలలో వేటూరి ప్రభాకరశాస్త్రిగారి కృషివల్ల మూడు కథలు మాత్రమే ముద్రితమయ్యాయి. అవి: "ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట" – "భట్టురాయబారము" – "కోటపాటి తాటివృక్షం తెచ్చే కథ". తక్కినవేవియు సాహిత్య లోకానికి తెలియవు. సుబ్బారావుగారు ఎంతో పరిశోధించి 32 కథల పేర్లు ఇంచుమించుగా చెప్పగలిగారు. వాటిలో 20 కథలు సేకరించారు. వీటిని 1974-75 సంవత్సరాలలో వారి పండితమిత్రులైన డా. చన్నాప్రగడ తిరుపతిరావుగారి సహాయ సహకారాలతో చక్కగా పరిష్కరించి, 300 పుటల సమగ్రమైన పీఠికతో సిద్ధం చేశారు. ఈ కాటమరాజు కథలను అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీవారు రెండు సంపుటాలుగా ప్రచురించారు. ఒక్కొక్కటి సుమారు వేయిపుటలు (బౌండు పుస్తకం). 1976లో మొదటి సంపుటం, 1978లో రెండవ సంపుటం వెలువడి, ఆచార్య తంగిరాల సుబ్బారావుగారికి అఖండమైన కీర్తిప్రతిష్ఠలను సంపాదించి పెట్టాయి. నోరి నరసింహశాస్త్రిగారివంటి పండితులు వీరిని ఎంతగానో ప్రశంసించారు. అకాడెమీ అస్తమించి, తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించబడ్డాక, 1998లో (అంటే 20 ఏండ్ల తరువాత) తెలుగు విశ్వవిద్యాలయంవారు ఈ కాటమరాజు కథలు రెండు సంపుటాలనూ పునర్ముద్రించారు. మళ్ళీ ఇంకో 22 ఏండ్లు గడిచిన తరువాత యిప్పుడు తంగిరాలవారు తన 87 సంవత్సరాల వయసులో, నలుగురు మిత్రుల సహకారంతో ఈ కాటమరాజుకథల మూడవ సంపుటాన్ని ప్రచురించారు. ఈ గ్రంథం ప్రసిద్ధ చిత్రకారులు శ్రీ అరసవల్లి గిరిధర్‌గారి "కటియావులరాజు'' ముఖచిత్రంతో, వెనుక అట్టమీద కళాప్రపూర్ణ 'బాపు'గారి "కాటమరాజు" చిత్రంతో, కేస్ బైండింగ్‌తో సర్వాంగ సుందరంగా గత సంక్రాంతికి వెలువడింది. కీ.శే. ఆరాధ్యుల విచ్చయ్యగారు

(1963-70ల మధ్య, ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం కార్యదర్శి), కీ.శే. డా. కనకబండి మోహనరావుగారు, శ్రీ మట్టి గురవయ్యగారు, ప్రొ॥ మట్టెబోయిన జయదేవ్‌గారు సేకరించి యిచ్చిన నాలుగు తాళపత్ర గ్రంథాలను పరిష్కరించి, 74 పుటల విపులమైన, మిక్కిలి విలువైన పీఠిక వ్రాసి, ఈ "కాటమరాజుకథలు" - మూడవ సంపుటాన్ని నిర్మించారు ప్రధాన సంపాదకులైన మా గురుదేవులు ఆచార్య తంగిరాలవారు. ఇది మిక్కిలి విలువైన పరిశోధన గ్రంథం. సామాన్య పాఠకులు సులభంగా కథలను అవగాహన చేసుకొనేందుకు వీలుగా ప్రతికథలోను కథాగమనాన్ని సూచిస్తూ చక్కని ఉపశీర్షికలను ఉంచారు.

ఈ సంకలనంలో కాటమరాజు చరిత్రకు సంబంధించిన నాలుగు కొత్త వీరగాథలు ఉన్నాయి. అవి:-

**1) కఠియావులరాజు కథ:-**

ప్రొ॥ సుబ్బారావుగారు 1966లోనే ఇద్దరు భిన్నకవుల రచనలైన రెండు కఠియావులరాజు కథలను సేకరించి, తమ *కాటమరాజు కథలు* - మొదటి సంపుటం (1976)లో ముద్రించారు. ఈ సంపుటిలో ఉన్నది మరియొక కవి రచన. (ఆ కవిపేరు మాత్రం అవతారికలో లేదు.) దీనిని ఆరాధ్యుల పిచ్చయ్యగారు 1972-73 ప్రాంతంలో సేకరించారు. కఠియావులరాజు, కాటమరాజు పెదతండ్రియైన సింహాద్రిరాజు కుమారుడు; ఏకాంగవీరుడు. మహాభారతంలోని భీమార్జునులవంటి సాటిలేని మేటివీరుడు; మిక్కిలి బలశాలి. ఐతమరాజు "ఉర్లుకొండ యలమంచి"ని పాలిస్తున్నాడు. (ఇది నేటి తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో ఉంది.) ఓరుగల్లు నుండి బాచన్న అనే బ్రాహ్మణుడు గంగ తిరునాళ్ళు చూడటానికి యలమంచికి వచ్చి, ఓరుగల్లులో "కలియుగ బేతాళుడు" అనే మాస్టీడు కోటగుమ్మానికి తన బిరుదులను వ్రేలాడగట్టాడని, ఎంత గొప్ప వీరుడైనా సరే ఆ బిరుదుల క్రింద నుండి దూరి రావలెనని, లేనిచో తనతో ద్వంద్వ యుద్ధం చేసి గెలవాలని చెపుతున్నాడని అంటాడు. ఈ వార్త కఠియావుల రాజుకు తెలుస్తుంది. అతడు బేతాళుని గర్వం అణచాలని నిర్ణయించుకుంటాడు. అయితమరాజు, పల్లికొండ, యితర యాదవ వీరులతో కలిసి కఠియావులరాజు ఓరుగంటి శంభుని తిరునాళ్ళకు వెడతాడు. తన "గండకత్తెర" అనే గొప్ప పంచకల్యాణి గుఱ్ఱంపై స్వారీచేస్తూ ఓరుగల్లు నగరంలోకి ప్రవేశించబోతాడు. కాని అతని గుఱ్ఱం కోటగుమ్మం దగ్గరే ఆగిపోయింది! లోపలికి వెళ్ళటం లేదు. కారణమేమిటో తెలియక, కఠియావులరాజు గుఱ్ఱందిగి నాలుగువైపులా చూస్తాడు. గుఱ్ఱం తన ముట్టెను పైకెత్తి కోటగుమ్మంవైపు చూపెడుతుంది. అక్కడ బేతాళుని బిరుదులు వ్రేలాడుతూ ఉంటాయి. వాటి క్రింద నుండి దూరి వెళ్ళడం తనకు తన యజమానికి అవమానకరమని భావించి ఆ "గండకత్తెర" గుఱ్ఱం ఓరుగల్లు కోట గుమ్మం దగ్గరే ఆగిపోయింది! వీరుడు ఎంత గొప్పవాడో అతని గుఱ్ఱం కూడా అంతే గొప్పగా అంతే పౌరుషంతో ఉంటుంది. పలనాటి వీరకథలలో అలరాజు గుఱ్ఱం "సవరాల జిమ్మడు", పెద్దన్న బాదరాజు గుఱ్ఱం "కారుబొల్లడు" ఇటువంటి విశిష్టమైన గుఱ్ఱాలే! ఇవి వీరగాథలలో ప్రత్యేక పాత్రను పోషించాయి!

ఆ బిరుదులు తొలగించమని కఠియావులరాజు అక్కడనున్న భటుల ద్వారా బేతాళునికి కబురు చేస్తాడు. అతడు ఏ మాత్రమూ అంగీకరించడు. కఠియావుల రాజుకు కోపం వచ్చి, తన ఎడమ కాలితో ఆ బిరుదుల్ని తన్ని నేలకూల్చి, నగరంలోనికి ప్రవేశిస్తాడు. దీనితో బేతాళుడు మండిపడి, పౌరుషం పెరిగి కఠియావుల రాజును ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానిస్తాడు. ఇద్దరూ బేతాళుని కత్తుల గరిడిలో హోరాహోరీగా పోట్లాడుతారు. మొదట బేతాళుడు తన కత్తితో మూడు హస్తాలు చూపుతూ మూడు దెబ్బలు కొడతాడు. ఆ మూడు దెబ్బలూ చాకచక్యంగా తప్పించుకుంటాడు కఠియావులరాజు. "నాకు నీలాగ మూడు హస్తాలు చూడడం (మూడుసార్లు attack చేయడం) అవసరంలేదు. ఒకే ఒక్క దెబ్బతో నిన్ను చంపేస్తాను. కాని నిన్ను క్షమిస్తున్నాను. ప్రాణాల మీద తీపి ఉంటే వెళ్ళిపో!" అని ఓరుగల్లు ప్రజలందరి ముందు ప్రకటిస్తాడు కఠియావులరాజు. అహంకారియైన బేతాళుడు అతని క్షమాభిక్షను అంగీకరించడు. అందువల్ల కఠియావులరాజు విధిలేక అతనిని చంపుతాడు. బేతాళుని తమ్ములు

''కన్నమాధీరుడు'' – ''రంపాల కేశవుడు'' కూడా కటియావులరాజును ఎదిరించి చనిపోతారు. ఈ "కలియుగ బేతాళుడు" ప్రతాపరుద్రుని సేనానియైన "బేతాళరెడ్డి". అతనిని చంపినందులకు ప్రతాపరుద్రునికి కోపం వస్తుంది. అతడు అయితమ రాజును మాయోపాయంతో చంపాలని చూస్తాడు. అలుగుల సింహాసనం మీద కూర్చోమంటాడు; పెంకి గుఱ్ఱాన్ని బహూకరించి స్వారీ చేయమంటాడు; విషాన్నం పెట్టి తినమంటాడు. ఈ అన్ని ఆపదల నుండి మంత్రి పల్లికొండ అతనిని కాపాడుతాడు. యాదవులు శంభుని సేవించి తిరిగి వెళ్ళిపోతుంటే ప్రతాపరుద్రుడు వారి మీదికి సైన్యాలను పంపుతాడు. ఆ సేనలను కటియావులరాజు చిత్తుచిత్తుగా ఓడిస్తాడు. యాదవులు క్షేమంగా యలమంచికి చేరుకుంటారు. ఈ వీరగాథ చదువుతూ ఉంటే ఏదో గొప్ప హాలీవుడ్ యుద్ధచిత్రం చూస్తున్న అనుభూతి కలుగుతుంది!

**2) "పుల్లరికథ" లేక "జన్నివాడకథ":-**

దీనికే "కాటమరాజు దక్షిణాది ఆవులమేపు" అనే పేరు కూడా ఉంది. దీనిని ప్రొ॥ సుబ్బారావుగారు 1964లోనే కృష్ణాజిల్లాలో సేకరించి, తమ "కాటమరాజుకథలు" రెండవ సంపుటంలో (1978లో) ముద్రించారు. అయితే ఆ కథలో ప్రారంభంలో "ఇష్టదేవతా ప్రార్థన, కవి వంశాదికము, పుల్లరి ఒప్పందము'' అనే భాగాలు లోపించాయి. ఈ భాగాలు ఉన్న కథ (తాళపత్ర గ్రంథం) డా. కనకబండి మోహనరావుగారికి 1991లో లభించింది. దీనిని బట్టి కవి పేరు "కనకబండి గట్టయ్య (ఘట్టయ్య)" (ఇది "గంటయ్య" అని కూడా కావచ్చును.) ఈ కథలో పుల్లరి ఒప్పందం చాలా వివరంగా ఉంది. "నీరుకు పుట్టిన పూరెల్లమాది/ ఆవుకు పుట్టిన కోడెల్లమీది" అనే పుల్లరి ఒప్పందం చాలా వివరంగా ఉంది. యాదవులు అమాయకులు కదా అని నెల్లూరిరాజు నల్లసిద్ధి వేలాది వరహాలను పుల్లరిగా ఇవ్వాలని ఈ ఒప్పందంలో చేరుస్తాడు. నల్లసిద్ధి రెండవ భార్య కుందమాదేవి బోయలచేత కాటమరాజు ఆలమందలను పొడిపిస్తుంది. దీనితో కోపించిన కాటమరాజు నెల్లూరు వరిచేలను మేపించి, పుల్లరినీయక, ఎఱ్ఱగడ్డపాడుకు వెళ్ళిపోతాడు. తనకు జరిగిన ఆవుల నష్టానికి, నెల్లూరి రాజుకు ఈయవలసిన పుల్లరికి సరిపోయింది అంటాడు. దీనితో ఇద్దరికీ మధ్య యుద్ధం వస్తుంది.

**3) "బొంగరాల కథ":-**

ప్రొ॥ సుబ్బారావుగారు ఈ కథకు సంబంధించిన మూడు తాళపత్ర గ్రంథాలను 1966లో సేకరించి, తమ "కాటమరాజు కథలు" – రెండవ సంపుటం (1978)లో ముద్రించారు. కాని యివి అసమగ్రంగా ఉన్నాయి. శ్రీ మట్టి గురవయ్యగారు 2014లో సేకరించి యిచ్చిన తాళపత్ర గ్రంథంలో కథ సమగ్రంగా ఉంది. దీని రచయిత ''గొట్టిపాటి మల్లయ్య'' అని గ్రంథావతారికనుబట్టి తెలుస్తోంది. ధనముకొండలో బాలరాజులైన ముమ్మయ్య – పోచయ్యలు బొంగరాలాడటం, ఆ బొంగరం వెళ్ళి కోమటి అచ్చమ్మ కాలికి తగలడం, ఆమె వారిని దూషించడం, దానినిబట్టి అయితమరాజాదులు ఎఱ్ఱగడ్డపాటి రణభూమికి వెళ్ళారని బాలరాజులు తెలుసుకోవడం, తమను కూడా యుద్ధానికి పంపుమని సిరిదేవిని కోరడం, ఆమె ఎంతో కష్టం మీద అంగీకరించడం, బాలరాజులు పాలేటికి పయనమైపోతూ ఉంటే వివిధ శకునములు కావడం, ఆ శకున ఫలితాలను ముమ్మయ్య అడుగుతూ ఉంటే – పోచయ్య వివరించడం – అనే ఘట్టంలో మధ్యలో ఆగిపోతుంది సుబ్బారావుగారు సేకరించిన ''వేడుక బొంగరాల కథ''. శ్రీ మట్టి గురవయ్యగారు సేకరించిన "బొంగరాల కథ" ఇంకా ముందుకు సాగి, బాలరాజులు ఎఱ్ఱగడ్డపాడులో ఉన్న కాటమరాజును కలుసుకోవడం, పల్లికొండ పోలురాజు కథను వివరించి చెప్పడం, పంచలింగాల కొండమీద ఉన్న వీరశిలలను పూజించడం, అవి పలకడం, ఉత్పాతాలు పుట్టడం, యాదవులు యుద్ధసన్నద్ధులు కావడంతో ఈ కథ ముగుస్తుంది. ఈ ముమ్మయ్య – పోచయ్యల "బొంగరాల కథ", శ్రీనాథుడు రచించిన "బాలచంద్రుని యుద్ధం"లోని "బొంగరాల కథ"కు పూర్తి అనుకరణమనుట స్పష్టము.

**4) "పాపనూక వలపోత":-**

ప్రొ॥ తంగిరాలగారికి "పాపనూక కథ" లభించింది కాని ఆమె "వలపోతకథ" లభించలేదు. దీనిని ఆంధ్ర

విశ్వవిద్యాలయం నివృత్త తెలుగు ఆచార్యులు ప్రొ॥ ఎం. జయదేవ్‌గారు 2010 ప్రాంతంలో విజయనగరంజిల్లా గజపతినగరంలో పొడపోతులవారి దగ్గర నుండి సేకరించారు. పాపనూక, కథా నాయకుడైన కాటమరాజుకు చెల్లెలు. ఈమె దుష్టనక్షత్రంలో పుట్టిందనే భయంతో, జ్యోతిషులు చెప్పిన ప్రకారం, ఆమెకు పెళ్ళి చేయకుండా, ధనుమకొండ ఊరిబయట ఏడంతస్తుల ఒంటి స్తంభం మేడ కట్టించి, అందులో ఉంచుతారు. అలా ఆరునెలలు గడుస్తాయి. అప్పుడు ఎఱ్ఱగడ్డపాటి పోట్లాటలో యాదవులందరూ వీరస్వర్గమలంకరించారనే వార్త, కాశిలో ఉన్న భక్తిరన్నకు తెలిసి, అతడు ధనముకొండకు వస్తాడు. తల్లి సిరిదేవి అంతఃపురంలో పాపనూక కనిపించదు. తల్లిని ప్రశ్నిస్తాడు. ఆమె ముఖం వెలవెలపోతుంది. అప్పుడు పల్లికొండ భార్య "పందుముల ఎరినప్ప" పాపనూక దుష్ట నక్షత్రంలో పుట్టడంవల్ల ఊరిబయట ఏడంతరాల మేడలో ఉంచిన సంగతి చెపుతుంది. భక్తిరన్న తల్లి చేసిన పనికి మిక్కిలి దుఃఖించి, పాపనూకను తీసికొని రమ్మని "ఎరినప్ప"ను, పద్మరాఘవుని భార్య "పైడిఎల్లప్ప"ను, పాపనూక చెలికత్తెలను ఊరిబయట మేడ దగ్గరకు పంపుతాడు. ఎరినప్ప ఎంత నచ్చ చెప్పినా పాపనూక రాదు. తన బాధనంతా వెలిగ్రక్కుతుంది. కల్యాణనగరంలో కలబోతులవారింట (పెందోట ముద్దమ్మ దగ్గర) హాయిగా ఉన్న తనను తీసికొనివచ్చి, యిలా ఊరిబయట ఉంచినందుకు భక్తిరన్న మీద మిక్కిలిగా కోపిస్తుంది. పెద్దిరాజు యుద్ధంలో మరణించడం, తల్లి పెద్దమ్మ సహగమనం చేయడం వివరంగా చెపుతుంది. పాపనూక మేడదిగిరాదన్న విషయం తన దివ్యదృష్టితో గ్రహించిన భక్తిరన్న ధనముకొండతో పాటు పాపనూక మేడకూడ అగ్నిపాలు కావాలని శపించి, విభూతి మంత్రించి చల్లి పాలేటికి వెళ్ళిపోతాడు. ఎరినప్ప, ఇతర స్త్రీలు పాపనూకతో మాట్లాడుతూ ఉండగానే, ఆ ఒంటిస్తంభం మేడకు అగ్నిముట్టుకొని యాదవ కాంతలందరూ మంటలకు ఆహుతి అయిపోతారు. ఊరంతా కాలిపోతుంది. ఈ విధంగా నాలుగు నూతన వీరగాథలను సేకరించి, సుమారు రెండులక్షల రూపాయలు వెచ్చించి అందంగా ముద్రించిన ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావుగారిని మనసారా అభినందిస్తున్నాను.

ఇంకా సేకరించవలసిన ఆరు కథలను గురించివారు ఈ గ్రంథం చివర ఒక ప్రకటన కూడా చేశారు.

అవి: "సింహాద్రిరాజుకథ" – "నలనూకరాజుకథ" – "భైరవకురవ యుద్ధం" – "అగుమంచి వలపోత" – "పల్లికొండ పుట్టుక" – "గంగపుట్టుక". వీటిని ఎవరైనా సేకరించి పంపితే, తాను ముద్రిస్తానని వాగ్దానం చేస్తున్నారు ఆచార్య తంగిరాలవారు. వీటిని సేకరించడం కోసం యువపరిశోధకులు నడుములు బిగించాలి!




**కాటమరాజు కథలు - మూడవ సంపుటం**, ప్రధాన సంపాదకులు: ***ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు,*** *పుటలు: lxxiv + 330, వెల: ₹ 400/ – ప్రతులకు:* ***Prof. T.V. Subba Rao,*** *#1708, "Siitaavadhaanam", 11th Cross, 1st "G", Main Kengeri Satellite Town, BENGALURU - 560 060. Ph: 994 542 2742.*

---

## వెళ్ళడం

తను చెప్పింది – నేను వెళుతున్నానని
వెళ్ళడం ఎంత భీకరమైన క్రియో తెలిసి కూడా
'వెళ్ళు' అని బదులిచ్చాను.



జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత శ్రీ కేదార్ నాథ్ సింగ్ కవిత "जाना" కు అనువాదం –
కిల్లాడ సత్యనారాయణ - ఫోన్: 833 398 7838.

# మెలోడి మారాజు రాజన్

– *పిల్లా తిరుపతిరావు*

ఎందరో గొప్ప కవులు సృజియించిన ఉత్కృష్టమైన పాటలకు తమ అద్భుత సంగీత పరిజ్ఞానాన్ని మేళవించి స్వరపరచడంతో, అవి జనసామాన్యంలో ఉదాత్తమైన గీతాలుగా పురుడుపోసుకుంటాయి. ఆ పాటలు సంగీత లోకంలో విశేషాదరణ పొందడానికి కారణభూతులుగా నిలిచేది మాత్రం సంగీత దర్శకులే. అటువంటి కోవకు చెందిన ఉద్దండ సంగీతమూర్తులు ఎందరో సినీ వినీలాకాశంలో ధృవతారలుగా నిలిచారు. వారిలో 'రాజన్–నాగేంద్ర' సోదర ద్వయం ఒకరు. దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమలో తమదైన శైలిలో సంగీత ద్వయంగా సంగీత ప్రియుల మనసులలో చెరగని ముద్ర వేసిన రాజన్–నాగేంద్రలలో ఒకరైన 'రాజన్' (87) 2020 అక్టోబర్ 11వ తేదీ ఆదివారం రాత్రి 10–30 గంటలకు బెంగుళూరులో గుండెపోటుకు గురై కన్నుమూశారు. గతంలోనే 20 యేళ్లక్రితం అనగా 2000 సం: నవంబర్ 4వ తేదీన రాజన్ సోదరుడు నాగేంద్ర మరణించడం గమనార్హం. వీరిద్దరి సోదరుల మధ్య బంధం విడదీయరానిది. అవ్యాజానురాగాలు కలిగిన సంగీతమూర్తులు వీరిరువురూ. శరీరాలు వేరైనా ఇద్దరి ఆత్మలు ఒకటే. ఒకేమాట ఒకే బాటగా చిత్రసీమలో మూడు దశాబ్దాలకు పైగా తమ సినీ సంగీత ప్రస్థానాన్ని కొనసాగించిన మేరునగధీరులు రాజన్–నాగేంద్రలు. రాజన్ సోదరుడితో కలిసి తెలుగు చలన చిత్ర రంగంలో ఎన్నో మరపురాని మధురాతి మధురమైన గీతాలను స్వరపరిచి, తెలుగు ప్రేక్షకుల మన్ననలు విరివిగా పొందిన సంగీత ఘనాపాటి. వీరి సంగీత దర్శకత్వంలో వచ్చిన గీతాలన్నీ నూటికి నూరుశాతం ప్రజాదరణ పొందినవే. సుమారు 60 తెలుగు చిత్రాలకుగాను సంగీత సారథ్యం వహించి మెలోడీ బ్రహ్మగా, మెలోడీకి మారుపేరుగా రాజన్–నాగేంద్ర ప్రేక్షక లోకంలో సుస్థిరమైన స్థానాన్ని దక్కించుకున్నారు. మొత్తంగా తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, తుళు, సింహళ భాషలలో 375 చిత్రాలకుగాను సంగీత దర్శకత్వం వహించినవారు రాజన్ నాగేంద్ర. వీటిలో 200లకుపైగా చిత్రాలు కన్నడ చిత్రాలే. కన్నడ సినీరంగంలో మేటి సంగీత దర్శకుడిగా నిలిచి, అనన్య సామాన్యమైన సంగీత ప్రతిభావంతులుగా ప్రఖ్యాతినొందారు. 70 మరియు 80వ దశకంలో స్వరపరిచిన వీరి పాటలు బహుళ ప్రజాదరణ పొందాయి. వీరి పాటలను వినడానికి తెలుగు ప్రజలైతే చెవికోసుకొంటారు. రాజన్–నాగేంద్రలు దక్షిణాదినగల సినీ రంగంలో గొప్ప సంగీత జ్ఞానంగల సంగీత దర్శకులుగా పేరుగాంచారు. 1933వ సంవత్సరం మైసూర్ దగ్గరలోగల 'శివరాంపేట' గ్రామంలో రాజన్ జన్మించారు. రాజన్ ఇంటిపేరు ఐరావతం. వీరి పూర్వీకులు తెలుగువారే. చిత్తూరు జిల్లాలో నివసించేవారు. బ్రతుకుతెరువు నిమిత్తం ఎప్పుడో కర్ణాటకలో స్థిరపడ్డారు. రాజన్ తండ్రి పేరు రాజప్ప. ఆ రోజుల్లో రాజన్–నాగేంద్ర తండ్రి సంగీత విద్వాంసులుగా ప్రసిద్ధులు. రాజప్ప క్షణం తీరిక లేకుండా కచేరీలు చేసేవారు. చాలా మూకీ చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు కూడా. అతనిలాగే తన ఇద్దరు కుమారులను మంచి సంగీత ప్రావీణ్యతగల వ్యక్తులుగా తీర్చిదిద్దాలని కలలుగనేవారు. ఈ నేపథ్యంలోనే వారి కుమారులిరువురికీ హార్మోనియం మరియు వేణువుపై తొలి పాఠాలు నేర్పేవారు. అనివార్య కారణాలవలన రాజప్ప బెంగుళూరులో నివాసం ఏర్పరచుకోవాల్సి వచ్చింది. దాంతో పెద్దవాడైన రాజన్‌ను తాతగారి ఇంట్లో ఉంచేసి, చిన్నబ్బాయి నాగేంద్రను తనతో తీసుకుపోయారు. రాజన్ మైసూర్‌లో, నాగేంద్ర బెంగళూరులో సంగీత సాధన చేసేవారు. 1947 సంవత్సరంలో హెచ్.ఆర్. పద్మనాభ శాస్త్రిగారు వీరి సంగీతజ్ఞతను గుర్తించి, సోదర ద్వయాన్ని మద్రాసు తీసుకుపోయారు. ఆయన దగ్గర ఒక తమిళ చిత్రానికి పనిచేశారు కూడా. మద్రాసులో ప్రముఖ సంగీత విద్వాంసులు కళింగరావుగారి వద్ద శిష్యరికం చేసి, సంగీతంలోగల పలు మెళకువలు నేర్చుకొని, సంగీత నిష్ణాతులుగా తయారయ్యారు.



రాజన్-నాగేంద్ర సోదరులు

1952లో 'సౌభాగ్య లక్ష్మి' అనే కన్నడ చిత్రం ద్వారా సంగీత దర్శకుడిగా రాజన్–నాగేంద్ర పరిచయమయ్యారు. 1952–1999వరకు నిర్విరామముగా వీరి సంగీత దర్శకత్వ బాధ్యతల ప్రస్థానం కొనసాగింది. రాజన్–నాగేంద్రను తెలుగు తెరకు పరిచయం చేసినవారు మాత్రం ప్రముఖ జానపద

చిత్రాల దర్శకుడు బి. విఠలాచార్యగారు. 1957లో 'వద్దంటే పెళ్లి' అనే తెలుగు సినిమాకు సంగీత దర్శకత్వ బాధ్యతలు చేపట్టడం ద్వారా తెలుగు సినీరంగ ప్రవేశం చేశారు రాజన్ నాగేంద్ర. ఇది 1957-1994వరకు నిరాటంకంగా కొనసాగింది. 1994లో వచ్చిన 'అఆఇఈ' చిత్రం వీరికి చివరిది. మొదట్లో వరుసగా జానపద బ్రహ్మ బి. విఠలాచార్య దర్శకత్వంలో వచ్చిన చిత్రాలకుగాను సంగీత దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలోనే విశ్వవిఖ్యాత నటసార్వభౌమ 'ఎన్టీ రామారావు'గారి 'అగ్గిపిడుగు' చిత్రానికి సంగీత దర్శకత్వం వహించి అద్భుతమైన మెలోడీ గీతాలను స్వరపరిచారు. 'ఏవో ఏవో ఇది నాకేవో ఏవో అయినది'లాంటి అజరామరమైన ఆపాతమధుర గీతాలకు ప్రాణం పోసారు. 1976 సం.లో ఎ.వి.ఎమ్. చిత్ర నిర్మాణ సంస్థ నుండి వచ్చిన 'పూజ' చిత్రం రాజన్-నాగేంద్రలకు మంచి బ్రేక్ ఇచ్చింది. అందులో గీతాలన్నీ రసజ్ఞ ప్రేక్షక లోకాన్ని ఓలలాడించాయి. జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన నాలుగు స్తంభాలాట చిత్రం కూడా మ్యూజికల్ హిట్‌గా నిలచింది. తెలుగులో వర్ధమాన నటీనటుల చిత్రాలకు అద్వితీయమైన సంగీతాన్ని అందించి, వారి నట ప్రస్థానానికి మేలుబంతిగా నిలిచారు రాజన్ నాగేంద్ర. అప్పట్లో కృష్ణ, శోభన్‌బాబు, మురళీమోహన్, చంద్రమోహన్, చిరంజీవి మొదలగు  నటుల చిత్రాలకుగాను అద్భుతమైన సంగీతాన్ని సృజియించి, సంగీత దర్శకునిగా మిక్కిలి పేరుప్రఖ్యాతులు గడించారు. పూజ చిత్రంలో 'ఎన్నెన్నో జన్మల బంధం నీది నాది', నాలుగు స్తంభాలాటలో 'చినుకులా రాలి నదులుగా సాగి', పంతులమ్మలో 'ఎడారిలో కోయిల', నాగమల్లిలో 'నాగమల్లివో తీగమల్లివో', అల్లరిబావలో 'మధువనిలో రాధికవో', ఇంటింటి రామాయణంలో 'వీణ వేణువైన సరిగమ విన్నావా' ప్రేమఖైదీ చిత్రంలో 'నీ కళ్ళలో స్నేహం'లాంటి గీతాలు బహుళ ప్రేక్షకాదరణ పొందాయి. అవే కాకుండా అద్దాలమేడ, అగ్గిపిడుగు, మంచుపల్లకీ, మదన కామరాజు కథ, రెండు రెళ్ళు ఆరు, మూడుముళ్ళు, పులిబెబ్బులి, సొమ్మొకడిది సోకొకడిది తదితర చిత్రాల్లో వీరు స్వరపరిచిన గీతాలు సంగీతాభిమానుల హృదయాలను గెలుచుకున్నాయి. "ఆకాశ దింద ధరెగిళిద రంభె...ఆకాశవె బీళలి మేలె...ఎందెందూ నిన్నను మరెతు...తరికేరె ఏరి మ్యాలె..." అంటూ కన్నడ భాషలో స్వరపరిచిన పాటలకు ప్రేక్షకు లోకం పట్టం కట్టింది. కన్నడంలో రాజ్‌కుమార్, విష్ణువర్ధన్, అనంతనాగ్, శ్రీనాథ్, ద్వారకేష్‌లాంటి పేరెన్నికగన్న నటులు నటించిన చిత్రాలకు ఎక్కువగా సంగీత దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు రాజన్ నాగేంద్ర.

మధుర గీతాల స్వరకర్త, మెలోడీకి పట్టం గట్టిన స్వర చక్రవర్తి రాజన్న ఇకలేరు అనే వార్త తెలుసుకున్న దక్షిణాది సంగీత ప్రియులు, వారు స్వరపరిచిన గీతాలను వింటూ, ఆలపిస్తూ అశ్రునివాళులు అర్పించారు. ఇటీవల పరమపదించిన 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం'గారికి రాజన్-నాగేంద్ర అంటే మరీ ఇష్టం. బాలూ తొలినాళ్ళ సినీ కెరీర్‌లో రాజన్-నాగేంద్రగారి దర్శకత్వంలో వచ్చిన గీతాలు ఒక సినీ నేపథ్య గాయకుడిగా బాలూను అగ్రస్థానంలో నిలిపాయి. 1978లో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో నిర్మించిన 'పంతులమ్మ' మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. 'సిరిమల్లె నీవే విరిజల్లు కావే', 'మానస వీణ మధు గీతం'లాంటి గీతాలకు బాలూ జీవం పోశారు. అప్పట్లో 'పంతులమ్మ' చిత్రానికిగాను సంగీత దర్శకత్వ విభాగంలో రాజన్-నాగేంద్రకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డునిచ్చి గౌరవించింది. చక్రవర్తి, ఇళయరాజా, రాజ్-కోటి మొదలగు సంగీత దర్శకులు తెలుగు సినీ చిత్ర రంగంలో రాజ్యమేలుతున్న కాలంలో రాజన్-నాగేంద్ర అపురూపమైన పాటలను స్వరపరిచి గట్టి పోటీనిచ్చి నిలిచారు. సుదీర్ఘకాలం పాటు ఇద్దరి సోదరులు మిక్కిలి కృషిచేసి సినీరంగంలో అనేక విజయాలను నమోదు చేసుకున్నారు. అందువల్ల రాజన్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకనిగా చూడలేం. రాజన్ అంటే రాజన్-నాగేంద్రగానే ప్రేక్షక లోకం పిలుస్తుంది. రాజన్-నాగేంద్ర స్వర స్థాయిలను సులువుగా గుర్తించే విధంగా, ఓ ప్రత్యేక పద్ధతిని కనుగొన్నారు. ఆ పద్ధతులను గ్రంథస్తం చేశారు కూడా. ఆ గ్రంథరాజం మొదట్లో ఆంగ్ల భాషలోనూ, ఆ తర్వాత కన్నడ భాషలోనూ ప్రచురించబడి సంగీత ప్రియులను అలరించింది. భక్తి, ప్రేమ, విషాదం, శృంగారం మరియు యుగళ గీతాలతో విశేషంగా సంగీత ప్రియులను అలరించిన 'రాజన్' మృతి నిజంగా సినీ సంగీత లోకానికి తీరని లోటుగానే భావించాలి.

'జాతస్య మరణం ధృవం' అని గీతామాత చెప్పింది. కానీ ఇటీవల కాలంలో ప్రత్యేకించి చాలామంది సాహిత్య, సాంస్కృతిక కళారంగానికి చెందిన నిష్ణాతులైన కళాకారులు కానరాని లోకాలకు అరుదెంచడం మిక్కిలి బాధాకరం.

**పిల్లా తిరుపతిరావు - రాజాం. ఫోన్: 709 518 4846.**

# భాష: పరభాష ప్రభావం

– సగిలి సుధారాణి

ఈ రోజు ఉపయోగిస్తున్న తెలుగులో సంస్కృతం కన్నా ప్రాచీన భాషలైన ప్రాకృత, పాలీ భాషల పదాలు, మూల ద్రావిడ భాషాపదాలు సామాన్యులు గుర్తించలేనివి అనేకం ఉన్నాయని పరిశోధకులు చెబుతారు. సంస్కృతం కోసం ఒక అకాడమీనో లేక తెలుగు అకాడమీలో ఒక భాగాన్నో ఏర్పాటు చెయ్యడంతోపాటు సంస్కృతంకన్నా ప్రాచీనమైన ఆ భాషల కోసం కూడా ప్రత్యేక అకాడమీలో లేక తెలుగు అకాడమీలో విభాగాలో ఏర్పాటు చెయ్యడం సమంజసం.

తెలుగు భాషా పరిరక్షణకు, తెలుగు భాషాభివృద్ధికి ప్రస్తుతం రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ, అధికార భాషా సంఘం ఉన్నాయి. ఈ సంస్థలన్నీ ఒక 'ప్రామాణీకరణ సంస్థ' గొడుగు క్రింద ఏర్పాటు చేయడం అవసరం. "ఎల్ల భాషలకును జనని సంస్కృతంబు" అని నమ్మేవారిని ఆ నమ్మకంలోనే ఉండనీయండి. అలాగే సృష్టికి ముందే మా భాష పుట్టిందని చెప్పుకొనే తమిళ సోదరుల ఆనందాన్ని మనం ఎందుకు కాదనాలి? విచారించదగ్గ విషయం ఏమిటంటే సంస్కృత భాషపైన పాలీ, ప్రాకృత, బ్రహువీ, ద్రావిడ వగైరా భాషల ప్రభావం ఏమేరకు ఉన్నదో పరిశోధన జరిగినట్లు తెలియదు. ఒకవేళ పరిశోధన జరిగి ఉండకపోతే ఇకనైనా జరగాలి. అంతేగాని సంస్కృతం దేవభాష అని, దానిని తాకడమే మహాపాపమనీ ఎవరైనా భావిస్తే వారికి ఒక నమస్కారం! అసలు భాష ఎప్పుడు, ఎక్కడ పుట్టి రూపాంతరం చెందిందో ఖచ్చితంగా చెప్పలేం. మనిషి ఉనికి మొదలైనప్పటి నుంచీ ఒకరితో ఒకరు ఏవో సంకేతాలతో తమ భావాలను వ్యక్తం చేసేవారు. సంచార జీవయాత్ర క్రమంలోనే భాషకు బీజాలు పడి 'ఆదిమ భాషా స్వరూపం' ఏర్పడిందంటారు. సుదీర్ఘ కాలగమనంలో భిన్న ఖండాలు ఏర్పడటంతో మానవులు అనేక భిన్న వర్గాలుగా ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు తరలిపోవడం జరిగింది. ఆ భాష భిన్న ప్రాంతాలలో విభిన్న రీతులలో ప్రత్యేక భాషలుగా, శాఖోపశాఖలుగా విస్తరించిందని భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. అలా అతి ప్రాచీనమైన 'ఆదిమ' భాష నుండి విస్తరించిన శాఖలలో ముఖ్యమైనది 'ప్రాచీన ద్రావిడ భాష'.

సింధు నాగరికత తవ్వకాల అవశేషాలలో దొరికిన లిపి ప్రాచీన తమిళ భాష లిపికి చేరువగా ఉందని రష్యన్ శాస్త్రజ్ఞులు గుర్తించారు. ఆ విధంగా ప్రాచీన ద్రావిడ భాష నేటి పాకిస్థాన్ ప్రాంతంలో సైతం ఒకనాడు విలసిల్లిందని స్పష్టంగా తెలుస్తుంది. అంతేకాదు. అఫ్ఘానిస్థాన్, ఈశాన్య భారతం, జార్ఖండ్, కేరళ, తమిళనాడువరకు వ్యాపించిన అటవీ ప్రాంతాలలో ఆదిమవాసులు మాట్లాడే భాషలు ప్రాచీన ద్రావిడ భాషకు చేరువగా ఉన్నాయని నేటికీ గుర్తించవచ్చు. చిన్న ఉదాహరణ చెప్పాలంటే అదిలాబాద్ గోండులలో ఉన్న 'ఆత్రం' అనే ఇంటిపేరు జార్ఖండ్ ఆదివాసి జాతిలో ఉండటమే ఇందుకు నిదర్శనం. హిందూకుష్ పర్వత శ్రేణుల నుండి భారత ఉపఖండంలోని వాయవ్య, ఈశాన్య, దక్షిణ ప్రాంతాలవరకు జనం మాట్లాడుకొనే భాషలు అత్యంత ప్రాచీనమైన ద్రావిడ భాషామూలాలకు చెందినవని భాషా శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు. విస్తృతమైన పరిశోధనలు జరిగితే ఆఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ప్రాంతాల ఆదివాసులు మాట్లాడే భాషలపై మూలద్రావిడ భాషా ప్రభావం ఎంతగా ఉందో తెలిసే అవకాశం ఉంది. కాలగతిలో వేలాది ఏళ్ళ తర్వాత భారతదేశంలో, ముఖ్యంగా దక్షిణ దిక్కున ఈ ప్రాచీన ద్రావిడ భాష నిలదొక్కుకోగలిగింది. తరువాత వేలాది సంవత్సరాల పరిణామ క్రమంలో ప్రాచీన మూల ద్రావిడ భాష అనేకదశలలో ప్రయాణిస్తూ ముప్పైకి పైగా ద్రావిడ భాషలుగా రూపుదిద్దుకున్నది. మూలద్రావిడ భాషలోని పదాలు ధ్వనిలో, అర్థంలో పరిణామం చెంది ద్రావిడ భాషల్లో నిలచిపోయాయి. ఇందులో ముఖ్యమైనవి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, తుళు, కొడగు, ఇంకా దేశవ్యాప్తంగా ఉన్న అనేక ఆదివాసీ భాషలు. ద్రావిడ భాషల్లో ముఖ్యంగా పైన చెప్పిన తొలి నాలుగు భాషలు వాడుకలో ఉండడమే కాకుండా విడివిడిగా లిపిను కూడా కలిగి ఉన్నాయి. వీటితో పాటు అంతే ప్రాచీనమైన ఆదివాసులు మాట్లాడే గోండి, సవరవంటి అనేక గిరిజన భాషలు కూడా ఉద్భవించాయి. తెలుగు భాషను ప్రభావితం చేసిన భాషలు అనేకం. నేటి తెలుగు భాషలోని పదాలు కొంత భాగం మూలమాతృక

నుండి సంక్రమించినవి కాగా, మిగిలిన భాగం విభిన్న భాషల ద్వారా సంక్రమించినవి.

**తెలుగుపై ప్రాకృత భాషా ప్రభావం:**

ప్రాకృతభాష కూడా ప్రాచీన ద్రావిడ భాష నుండి రూపుదిద్దుకొన్నదే. దేశంలో అత్యధిక భాగం ప్రాకృత భాషే వాడుకలో ఉండేది. ఆంధ్ర చక్రవర్తులుగా పేరు పొందిన శాతవాహనుల భాష ప్రాకృతం. వీరి శాసనాలు, గ్రంథాలు ప్రాకృత భాషలోనే ఉన్నాయి. శాతవాహనుల తరువాత పాలించిన ఇక్ష్వాకులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు, వైదుంబులు మొదలైనవారు అన్ని రంగాలలో ఉపయోగించిన భాష ప్రాకృతం. విశేషం ఏమంటే ఆనాటి ప్రాకృత, సంస్కృత భాషా శాసనాలలో, ప్రాకృత గ్రంధాలలో కన్పించే వ్యక్తుల నామాలు, గ్రామ నామాలు తెలుగుకి సంబంధించినవే! అయితే ఆనాటి తెలుగు నేలను ఏలిన పాలకులు ప్రాకృత భాషా వ్యవహర్తలు కాబట్టి ప్రాకృత భాష ప్రభావం అధికంగా పొడసూపింది. ఆ కాలంలో ఆంధ్రుల (శాతవాహనుల) మొదటి రాజధాని ప్రతిష్ఠానపురం. ఇది నేటి 'పైఠాన్'. ఔరంగాబాద్ జిల్లాలో ఉంది. వేలాది తెలుగు కుటుంబాలు శతాబ్దాలుగా నేటి మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలలో కుదురుకొని ఉన్నాయి. ఆ కుటుంబాల వారసులు చాలామంది నేడు తెలుగుభాష మాట్లాడలేకపోవచ్చు కానీ వారి ఇంటి పేర్లను బట్టి వారివి తెలుగు మూలాలే అని తేటతెల్లమవుతాయి. 'కన్నంవార్' (ఉదా: మాజీ ముఖ్యమంత్రి కన్నంవార్) 'ముత్తెంవార్' (ఉదా: మాజీ నాగపూర్ లోక్‌సభ సభ్యుడు మరియు మాజీ కేంద్ర మంత్రి విలాస్ ముత్తెంవార్), 'ఎలుకుంచవార్' (ఉదా: నాటక ప్రయోక్త మహేష్ ఎలుకుంచవార్,), 'తైలంగ్' (ఉదా: ప్రముఖ కార్టునిస్టు సుధీర్ తైలంగ్) వనకుదురు (ఉదా: ప్రముఖ సినిమా డైరెక్టర్ వి. శాంతారాం) మునగంటివార్ (ఉదా: మహారాష్ట్ర రాజకీయ నాయకులు సుధీర్ మునగంటి వార్. వీరు విదర్భ చంద్రపూర్ ప్రాంతానికి చెందినవారు) దేవరస్ (దేవరాజు మధుకర్ దత్తాత్రేయ, ఆర్. ఎస్. ఎస్. మాజీ అధినేత)వంటివి కొన్ని ఉదాహరణలు మాత్రమే. 'వార్' ఇంటి పేరులో ఉన్నవారు తెలుగు మూలాలు కలిగినవారే. ఇక్కడ 'వార్' అనేదానికి అర్థం 'వారు' అని. 'తైలంగ్' అంటే 'తెలుంగు' వాళ్లని అక్కడి స్థానికులు చెబుతారు. ప్రాచీన ద్రావిడ భాషాశబ్దాలు ప్రధానంగాను, వాటితో పాటు ప్రాకృత భాషా శబ్దాలు, పాలీ భాషా శబ్దాలు కలిసి ఆధునిక తెలుగు భాషకు ఒక 'మూల స్వరూపాన్ని' కల్పించాయి. ఇప్పుడు ఈ భాషలు వినేవారికి ఇందులో కొన్ని తమిళ పదాలు ఉన్నాయనే ఒక భ్రమ కలుగుతుంది. కానీ ఇవి ప్రాచీన ద్రావిడ భాష వారసత్వంగా వచ్చిన దక్షిణాది భాషా పదాలతో పాటు తెలుగులో చేరుకొన్న స్వతంత్ర పదాలే. తమిళ, కన్నడ, మళయాళ భాషలు కూడా ఈ విధమైన తీరులోనే క్రమంగా ఒక నిర్దుష్టమైన రూపాన్ని సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

**తెలుగు భాషపై సంస్కృత ప్రభావం:**

తెలుగు భాషకు సంబంధించి మన దేశంలో జైన, బౌద్ధ మతాల ప్రాబల్యం తగ్గి, హైందవ సంస్కృతి, ఆరాధనా పద్ధతులు, ఆచార వ్యవహారాలు, పవిత్ర గ్రంథాలు ప్రజల నిత్య జీవితంలో ముఖ్యభాగం కావడంవల్ల సహజంగానే సంస్కృతం ప్రాధాన్యతను సంతరించుకొంది. అంతేగాక మనకు నేటి మహారాష్ట్ర, దండకారణ్య ప్రాంతం (చత్తీస్ గడ్) దానితోపాటు ఒరిస్సా రాష్ట్రం సరిహద్దులు కావటం కారణంచేత ఆయా భాషలలో ఉండే సంస్కృత పదాలు, పురాణాలలోని సంస్కృత పదాల ప్రభావం తెలుగులో క్రమక్రమంగా ఇమిడిపోయాయి. అయితే తెలుగు తల్లిభాషగా కలిగిన సామాన్య జనంతో పాటు ప్రాంతంతో నిమిత్తం లేకుండా ఆగ్నేయాషియా దేశాలలోను, ఉత్తర శ్రీలంకలోను, దక్షిణ భారతదేశం కొసలలోను కుదురుకొన్న తెలుగు వాళ్ళు మాట్లడే తెలుగు ఇలాంటి ప్రభావానికి పెద్దగా లోనుకాలేదు. తెలుగుతో పాటు కన్నడ, మలయాళ, తుళు, కొడగు, కొంకణి భాషలు కూడా ఈ సంస్కృత భాషా ప్రభావానికి లోనయ్యాయి. ఇందుకు కారణం ఆ ప్రాంత భౌగోళిక స్వరూప ప్రభావమే. అంతేకాకుండా హిందూ మత గ్రంథాల, ఆచారాల, పూజాపునస్కారాల ప్రభావం ఎలాగూ ఉంది.

సంస్కృతం ద్రావిడభాషలలాగ ప్రాచీనమైనది కాదు.

**ప్రత్యేకంగా తమిళం గురించి ఒక ముఖ్య విషయం:**

మిగతా భాషలతో పోల్చిచూస్తే తమిళ భాష స్వతంత్రంగా నిలచి ఉండటానికి ప్రాచీన ద్రావిడభాష ప్రభావం భౌగోళికంగా శ్రీలంకపైన, నేటి దక్షిణ తమిళనాడు పైన ఉండటం ఒక కారణంకాగా ఒక దశలో మధురై కేంద్రంగా తమిళనేలపై సాగిన గొప్ప సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం (సంగం) మరో ప్రధాన కారణం.

ఆ ఉద్యమ ప్రభావంతో ఆనాటివరకు ఉపయోగిస్తున్న తమిళంలోని అన్య భాషల ప్రభావం క్రమంగా తగ్గిపోసాగింది. ఆ విధంగా తమిళ భాషను ఒక స్వతంత్ర ద్రావిడ భాషగా నిలపాలని వారు ఆశించిన ప్రయోజనం చాలావరకు నెరవేరింది. అయితే కొన్ని చారిత్రక, భౌగోళిక కారణాలవలన అలాంటి ఉద్యమాలు తెలుగు రాష్ట్రాలలో, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో రాలేదు. ఏది ఏమైనప్పటికీ ఈ భాషలన్నీ కూడా మౌలికంగా ప్రాచీన ద్రావిడ భాష పైనే ఆధారపడి ఏర్పడ్డాయి అనేది తిరుగులేని నిజం. భావ వ్యక్తీకరణకు భాష అనేది కాలానుగుణంగా మారుతూ ఉంటుంది. సమాజాభ్యుదయానికి, భాషాభివృద్ధికి అవినాభావ సంబంధం ఉంటుందని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. ప్రపంచంలో ఏ భాష అభివృద్ధికైనా సహకరించేది పరభాషా సంపర్కమే! నేడు అంతర్జాతీయ భాషగా ఖ్యాతి చెందిన ఆంగ్లభాష అనేక లాటిన్, గ్రీక్, హిబ్రూవంటి ప్రాచీన భాషా పదాలతోపాటు ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ మొదలైన అనేక భాషలను, భారతీయ భాషా పదాలను తనలో ఇముడ్చుకొంది.

ఇలా ఇతర భాషా పదాలను తనలో ఇముడ్చుకొని ఇంగ్లీషు ఒక ప్రపంచ భాషగా రూపొందిన విషయం అందరికీ తెలిసిందే! పరభాషా ప్రభావిత భాషలు కానివంటూ ఎక్కడా లేవు. చివరికి ఆదివాసి తెగలు మాట్లాడే భాషలపై అక్కడి మెజారిటీ భాషల ప్రభావం తప్పదు. తెలుగు భాష కూడా ఇందుకు మినహాయింపు కాదు. మనం ఈ రోజు ఉపయోగిస్తున్న తెలుగులో మనం గుర్తించలేని ప్రాకృత, పాలీభాషల పదాలు అనేకం ఉన్నాయని, అయితే మనం గుర్తించదగిన పార్సీ, ఉర్దూ పదాలు దాదాపు రెండువేల దాకా ఉన్నాయని పరిశోధకులు చెబుతారు. ఏ జాతి చరిత్రలోనైనా భాష అనేది తనకు నిత్యజీవితంలో అనుభవంలోనికి రాని కొన్ని పదాలను ఇతర భాషల నుండి తీసుకొని తనలో ఇముడ్చకోవడం అనేది చాలా మామూలు విషయం. (ఉదా. మామూలు అనేది తెలుగు పదం కాదు) నిత్య జీవితంలోనూ, కచేరీలలోనూ (కోర్టులలో) ఉపయోగించే తెలుగులో అనేక పార్సీ లేక ఉర్దూ పదాలున్నాయి. (ఉదా. వకీలు, కచేరి, దావా, పిర్యాది, దస్తావేజు, దరఖాస్తు, మహజరు, ముద్దాయి, తాసిల్దారు, ఖర్చు, ఖరీదు, కబురు, బాపతు, ఫరవా, కిటికీ, దర్వాజా, కుర్చీ, మేజావగైరా) ఈ విధమైన సహజ భాషాపరిణామం ప్రపంచంలోని ఏ భాషకైనా వర్తిస్తుంది. తెలుగు భాష కూడా తను సుసంపన్నం కావడానికి అనేక భాషల నుండి పదాలను తీసుకోని తనలో ఇముడ్చుకొంది.

**ముగింపు:**

తెలుగులో మొట్టమొదటి పి.హెచ్.డి., చేసిన చిలుకూరి నారాయణరావుగారు తెలుగు పైశాచి, ప్రాకృత జన్యమని అభిప్రాయపడ్డారు. కోరాడ రామకృష్ణయ్య మొదలైనవారు చిలుకూరి వారి వాదాన్ని తిరస్కరించి తెలుగుకు ఆర్యభాషలకు ఏ విధమైన సంబంధం లేదని తెలుగు మూలద్రావిడ భాషకు సంబంధినదని అభిప్రాయపడ్డారు.

అసలు దేవభాష అనబడే సంస్కృతంలోను, ప్రాచీన భాష అనబడే తమిళంలోను ఇతర భాషల పదాలు ఎన్ని ఉన్నాయో సమగ్రమైన పరిశోధన జరిగితే బాగుంటుంది.

తెలుగుపై పాలీ, ప్రాకృత, పర్షియన్, ఉర్దు వగైరాల ప్రభావం ఉన్నట్లే తమిళ భాష పైన కూడా ఏదోమేరకు ఖచ్చితంగా ఉండి ఉండాలి. అందుకే ఈ వాస్తవ పరిస్థితిని భాషాశాస్త్రవేత్తలు పరిశోధించి సామాన్య ప్రజలకు వాస్తవాన్ని తెలియజెయ్యాలి. అంతేగాని అటు సంస్కృతమో, ఇటు తమిళమో తిరుగులేని అచ్చమైన భాషలని భావించడం సరికాదు. నేటి తెలుగు భాషపైన ప్రాచీన ద్రావిడ, ప్రాకృత, పాలీ, సంస్కృత భాషల ప్రభావం ఎంతటిదో చాలామంది పండితులకే తెలియదు. సామాన్య పాఠకుల సంగతి చెప్పేదేముంది! అంతలా తెలుగు భాషలో ఇతర భాషా పదాలు కలగలసిపోయాయి. పరిశోధకులు ఈ దిశగా పరిశోధనలు జరపవలసిన అవసరం ఉన్నది.

“విదేశీ వస్తు బహిష్కరణ చేసినట్టు ఏ భాషకైనా పరభాషా పదాలను బహిష్కరించడం అనేది సాధ్యం కాదు. పరభాషా పదాలను తనలో ఇముడ్చుకొనే లక్షణం ఇతర భారతీయ భాషలకన్నా తెలుగు భాషకే ఎక్కువగా ఉందని నా అభిప్రాయం. భారతీయ భాషల ద్వారా సైన్స్, మెడిసిన్, ఇంజనీరింగ్‌వంటి ప్రత్యేక బోధనాంశాలను నేర్చుకోవాలంటే హిందీతో పోటీ పడగలిగేది ఖచ్చితంగా ఒక్క తెలుగు మాత్రమే!”– కీ.శే. జె.బి. ఎస్. హాల్డేన్, ప్రఖ్యాత శాస్త్రవేత్త అంటారు!

డా. సగిలి సుధారాణి
హైదరాబాద్. ఫోన్: 949 042 8825.

# "ఆమె" లేఖలు

**– ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ**

బ్రిటిష్ సుందరి జూలియా థామస్ (21-10-1808, 29-1-1864) తన భర్త జేమ్స్ థామస్‌తో కలిసి 1836-39 మధ్య కాలంలో రాజమండ్రి, కడప, చిత్తూరు, బళ్ళారి, బెంగళూరు ప్రదేశాల్లో నివాసమున్నప్పటి అనుభవాల్ని, జ్ఞాపకాల్ని ఉత్తరాల ద్వారా ఇంగ్లాండులోని తన మిత్రులకు తెలియజేసింది. ఆ 27 లేఖలు 'లెటర్స్ ఫ్రం మద్రాస్ బై ఎ లేడి' పేరుతో 1843లో ఇంగ్లాండులో ప్రచురింపబడ్డాయి. గుప్త నామంతో అచ్చయిన ఈ 27 లేఖలు 1846లో 'జూలియా చార్లెస్ మెయిట్ ల్యాండ్' అన్న పేరుతో ముద్రింపబడ్డాయి. జేమ్స్ థామస్ 1840లో మరణించిన తర్వాత జూలియా చార్లెస్ మెయిట్ ల్యాండ్ అనే మత ప్రచారకుణ్ణి పెళ్లాడింది. జూలియా థామస్ రాసిన 'లెటర్స్ ఫ్రం బై ఎ లేడి'పలు ముద్రణలకు నోచుకున్నదంటే ఆ పుస్తకంలోని దక్షిణ భారత దేశ సాంఘిక జీవనం ముఖ్యంగా తెలుగు ప్రజల ఆచార వ్యవహారాలు, చదువు సంధ్యలు, కోర్టు కచ్చేరీ తిరుగుళ్లు, రచయిత్రికి హిందూమతం పట్ల వున్న జిజ్ఞాస, క్రైస్తవ మత అపార ప్రేమ వగైరా విషయాల ప్రకటన ముఖ్యమన్నమాట.

'ఆమె' లేఖలు మొత్తం 27. వీటిలో మొదటి 24 జాబుల్ని పెన్నేపల్లి గోపాలకృష్ణ, మిగిలిన మూడింటిని కాళిదాసు పురుషోత్తంగార్లు అనువాదం చేయకుండా, సొంత మాటల్లో చెప్పి వివరించారు. పైగా జూలియా థామస్ లేఖల్లో వ్యక్తం చేయబడ్డ బ్రిటిష్ ప్రజల జీవితం సంస్కృతి గురించిన విషయాలు ప్రస్తావించక పోవడం ఈ తెలుగు పుస్తక విశేషం. ఒక విదేశీ వనిత, ఉన్నతోద్యోగి భార్య తామున్న ప్రాంతంలోని దేశీ ప్రజల బాగోగుల గురించి చింతన చేయడం, వాళ్ల జీవితాల్ని సుఖసంతోషాలతో నింపాలనితలచడం, ప్రయత్నించడం ప్రశంసనీయమేమరి. జూలియా థామస్ భావజీవి మాత్రమే కాదు. ఆలోచనా జీవి కూడా. ఆమె గర్భిణిగా వుంటూ ఓడలోని కుక్కల, పిల్లుల అరపుల్నీ భరించగలదు. అలాగే మెడెయిరా ద్వీపం మొనాస్టరీలోని సన్యాసినుల చిరునవ్వుల్నీ, వాళ్లమ్మే రంగు రంగైన, సువాసనలు విరజిమ్మే పువ్వుల్నీ చూసి ఆనందించగలదు. వెన్నెల్లో ఓడ అందాన్ని ఆస్వాదించగలదామె. కేప్ ఆఫ్ గుడ్ హోప్‌లో గుర్రాలపై వూరంతా తిరుగుతూ అక్కడ మొట్టమొదట స్థావరం ఏర్పరుచుకొన్నది నల్లులే అని చమత్కరించగల మాటల మల్లక్క ఆమె. (పేజి: 22). జూలియా థామస్‌లోని వివిధ విషయాల జిజ్ఞాస పాఠకుల్ని అలరిస్తుంది. మద్రాసులో వీధుల ప్రక్క, ఇళ్ల ముందట పాములవాళ్ల పాములాటలు (పేజి: 26) ధనవంతుల ఇళ్లలో చేతికీ, కాలికీ కనపడే పనివాళ్లు, వాళ్ల కింద కూడా సేవకులు చూసి ఆమె ముక్కు మీద వేలువేసుకొంది. (పేజి: 26). జూలియా థామస్ పరిశీలనా దృష్టి చాలా సూక్ష్మమైనది. దేశీయులకు చదువు నేర్పించి, వాళ్లల్లో మూఢనమ్మకాల్ని తొలగించాలన్న ఆశయం జూలియా థామస్ కు వున్నా, క్రైస్తవ మత ప్రచారం పట్ల అభినివేశం ఎక్కువగా వుండేది. హిందూ మతంలోని అగ్రవర్ణాల వారిని ముఖ్యంగా బ్రాహ్మణుల్ని క్రైస్తవులుగా మార్చడం వల్లనే క్రైస్తవమత ప్రచారం సులభతరం అన్న అభిప్రాయం ఆమెది. జూలియాకు దేశీయ భాషల, ప్రజల, వాళ్ల ఆచారవ్యవహారాలపట్ల చిన్న చూపే. అవహేళనా దృష్టే. శ్రీమంతులైన ఆర్ముగం, సుబ్బులు తమ విశాల భవనంలో విందులో ఏర్పాటు చేసిన నృత్యకార్యక్రమంలోని సంగీతం ఆమెకు ఘోరాతి ఘోరంగా తోచింది. (పేజి: 36,37) ఆమె రాజమండ్రి సమీపం లోని రాజాల వైభవాడంబరాల్ని, రాజభవనంలోని రంగురంగుల చిత్రాల్ని ఏవగించుకుంది. (పేజి:66) ఇదంతా ఆమెకు అనవసర ఆడంబరం అనిపించింది. తన భర్త జడ్జి. నౌకర్లూచాకర్లు మొత్తం 27 మంది ఉండటం ఆమెకు అనవసరమని తోచింది. (పేజి: 66). జూలియా థామస్‌కు తాము రాజమండ్రిలో స్థాపించిన పాఠశాలలో చెప్పించే చదువు మేలురకమైనదనీ "వాళ్ల బదుల్లో బోధించే నానా చెత్తా కాకుండా అర్థవంతమైన పుస్తకాలు మాత్రమే ఇక్కడ చదువుతున్నా" రన్న అభిప్రాయం ప్రబల విశ్వాసం. (పేజి: 86). క్రైస్తవ మత ప్రచారానికి కావాల్సినంత గురువులు లేరనీ, అట్లే పాఠశాలల్లో పనిచేసే అధ్యాపకులు కూడా అవసరమన్న జూలియా థామస్ అభిమతం ఆహ్వానించదగిందే. (పేజి: 83).

*మిగతాది 75వ పుటలో...*



# నాటకరంగ చరిత్ర

## రాజమహేంద్రవరం

*- పతివాద సూర్యనారాయణ*

### రెండవ భాగం

ఔత్సాహిక నాటక యుగం (1880 - 1900), వృత్తి నాటక యుగం (1900 - 1928), కాంట్రాక్ట్ నాటక యుగం (1928 - 1943), ఔత్సాహిక నాటక పునరుద్ధరణ యుగం (1943 - 1960), 5. నాటక పోటీల యుగం (1960 నుండి...).

ఈ అయిదు నాటిక పరిమాణ దశల్లో రాజమండ్రి నటులు, సంస్థల పాత్ర ఏమిటో పరిశీలిద్దాం:

**ఔత్సాహిక నాటక యుగం (1880 - 1900):**

ఈ కాలంలో రాజమండ్రిలో వెలసిన సంస్థలు, నటులు ఔత్సాహిక నాటక యుగానికి ప్రతీకలే.

**వీరేశలింగం గారు స్థాపించిన విద్యార్థుల సంస్థ:**

వీరేశలింగంగారు 1880 సంవత్సరాంతంలో స్థానిక విద్యార్థులతో నాటక సంస్థ స్థాపించి, ధార్వాడ నాటక సమాజంవారు ప్రదర్శించి విడిచి వెళ్లిన తాటియాకు పాకలోనే (ధాన్యం పాకలవద్ద అనగా నేటి రంభ, ఊర్వశి, మేనక థియేటర్స్ ఆవరణలో) స్థానిక కళాశాల విద్యార్థులు సోమంచి శంకరం, అడవి కొలను కనకరాజు మొదలైనవారితో సర్వహంగులతో ధార్వాడ వారి ప్రభావంతో హర్షవిరచితమైన 'రత్నావళి'ని 'రత్నావళి'గాను, షేక్స్పియర్ నాటకం 'కామెడి ఆఫ్ ఎర్రర్స్' 'చమత్కార రత్నావళి'గాను మలచి ప్రదర్శింపజేశారు. ఆంధ్రదేశానికే తొలి ఔత్సాహిక నాటక సమాజమిది. ఆ నటులే (సోమంచి శంకరం, అడవికొలను కనకరాజు) ఔత్సాహిక నటులు తరువాత ఆ స్ఫూర్తితో రాజమండ్రిలోను, ఇతర ప్రదేశాల్లోను ఔత్సాహిక నాటక సమాజాలెన్నో ఏర్పడ్డాయి.

ఈ నాటక సమాజానికి సంబంధించిన సమాచారం ఎక్కువగా మనకు లభ్యం కాదు. శ్రీ పంతులుగారి స్వీయ చరిత్రే దీనికి ఆధారం. సమాజ స్థాపన గురించి చెబుతూ పంతులు గారు "నా మిత్రుల కోరికననుసరించి 1880వ సం.లో కడపటి భాగముననొక నాటక సమాజం స్థాపించి, ధార్వాడ నాటకులు వచ్చి నాటకాలాడి విడిచిపోయిన పాకలోనే *రత్నావళి, చమత్కార రత్నావళి* అనే రెండు నాటకాలు చేసి ఆడించాము. అట్టి నాటకంలాడుటకదియే ప్రథమ ప్రయత్నమైనను, మొత్తంమీద విజయప్రదముగానే జరిగినవని ఎల్లవారునభిప్రాయపడిరి". పంతులుగారు రచించిన "వ్యవహార ధర్మబోధిని" (ప్లీడర్ల నాటకం) ఏ ప్రథమ నాటక ప్రదర్శనమని మరో వాదన ఉంది. ఇది పాత్రలు కూర్చొని సంభాషణలు చదివిన ప్రయోగం. ఏది ఏమైనా ఇవన్నీ 1880లోనే ప్రదర్శించారు.

ఈ నాటక సమాజం ఎంతో కాలం సాగినట్లు కనపడదు. పంతులుగారి మాటల్లోనే ఇది విశదమవుతుంది. "ఈ నాటక ప్రయోగంవలన సహితం పట్టణంలో సంక్షోభం కలగకపోలేదు. ఆ నాటకాలలో పాత్రలు విస్తారంగా అనేకుల అభిప్రాయమవటంచేత, విద్యార్థుల సంరక్షకులు తమ బాలురచేత వేషాలు వేయించినందుకై నా మీద అభియోగం తెస్తామని నన్ను బెదిరించారు. నాటక ప్రదర్శనవలన విశేష లాభం కలుగునని, నీతివృద్ధి అవుతుందని నేను తలచి విద్యార్థులు నాటకములాడుట యందలి ఉత్సాహముచేతఁదమ పాఠములయందశ్రద్ధను జూపునట్లు కనబడినందున నాటక సమాజములయందటు తరువాత నేనంతగా నాదరము చూపుచు రాలేదు."

**హిందూ నాటకోజ్జీవక సమాజం (1884):**

శ్రీ వడ్డాది సుబ్బారాయుడు (వసురాయకవి) దీని వ్యవస్థాపకులు. శ్రీయుతులు కనపర్తి శ్రీరాములు, వడ్డాది సుబ్బారాయుడు, సుర్ల శ్రీనివాసరావు, సుసర్ల అనంతరావులు ముఖపాత్రధారులు. శ్రీ వ.సు. రాయకవి 'వేణి సంహారం' నాటకంలో ధర్మరాజు అశ్వత్థామ పాత్రలు ధరించేవారట. వీరి పాత్ర పోషణపై ప్రదర్శనను ప్రత్యక్షంగా చూచిన శ్రీ చిలకమర్తి వారు వారి స్వీయ చరిత్రలో "అశ్వత్థామ పాత్ర ధరించినపుడు వీరరౌద్రరసములను, ధర్మరాజుగనున్నప్పుడు శాంతకరుణరసములను ఆనాటి ప్రేక్షకులు మరువరు. నేను చూచిన 'వేణీసంహార' నాటక ప్రదర్శనములో నాటకాంతమున గ్రంథములో లేని యొక దండకముతో శ్రీకృష్ణుని స్తవము చేసిరి, ఆ దండకము ముక్కు తిమ్మన చేసిన పారిజాతాపహరణములోనిది. పద్యములు చదువుటలోను, దండకములు చదువుటలోను మిక్కిలి నేర్పుగల సుబ్బారాయుడుగారి నోటి నుండి వినినప్పుడు నా యొడలు పరవశమైనది."

ఈ సమాజం వసురాయకవి నాటకాలనేకాక, ఇతర కవుల నాటకాలు కూడా ప్రదర్శించేవారు. వావిలాల వాసుదేవశాస్త్రిగారి 'ఉత్తర రామచరిత్ర' వీరేశలింగంగారి 'ప్రహ్లాద', 'హరిశ్చంద్ర', సమాజ నటులు సుసర్ల అనంతరావు గారి 'పాండవాజ్ఞాతవాసము' ప్రదర్శించేవారట.

**రాజమహేంద్రవర హిందూ నాటక సమాజము:**

ఇది మరొక ప్రతిష్ఠాకరమైన సంస్థ. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారి గురుపాదులు ఇమ్మానేని హనుమంతరావునాయుడుగారు 1889లో ఈ సమాజం స్థాపించారు. ఈ సమాజ కవులు శ్రీ చిలకమర్తివారే. వీరు మొదట తోలేటి వెంకట సుబ్బారావు గారి 'హరిశ్చంద్ర', చిలకమర్తివారి 'కీచకవధ' ప్రదర్శించారు. ఈ సమాజంలో అధిక సభ్యులు పద్యాలు చదవలేనివారై వచన నాటకాలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేవారు. ఈ సమాజం ప్రస్తుత వీరేశలింగపుర మందిరం ప్రక్క దొడ్డిలో తాటియాకుల పాకవేసి ప్రదర్శినలిచ్చేవారట. ఇమ్మానేని వారు ముఖపాత్రలు ధరించేవారు. ప్రకాశంగారు స్త్రీ, పురుష పాత్రలు రెండింటినీ సమర్థవంతంగా పోషించేవారట. 'ప్రకాశముగారు నాటకములో నేరసము నభినయించినను మిక్కిలి సొగసుగ నభియించెడువారు. కరుణ రసమునకు వీరరసమునకును వీరికి పెట్టినది పేరు' – *చిలకమర్తి*

సాతాని రామానుజయ్య మంచి గాయకుడు. వీరు సూత్రధారిగా రంగప్రవేశము చేసేవారట. శ్రీ వల్లూరి సూర్యప్రకాశరావు హాస్యం. శ్రీ మద్దూరి నాగభూషణం (ప్రముఖ న్యాయవాది కీ.శే. మద్దూరి శివరామకృష్ణయ్యగారి తండ్రి, వీరు పద్యం శ్రావ్యంగా చదివేవారట. శ్రీ దుర్గి గోపాలకృష్ణ (చంద్రమతీ పరిణయము నాటకకర్త), శ్రీ ఐనవోలు తాతయ్య నాయుడు, శ్రీ యార్లగడ్డ సత్యరాజు, శ్రీ రాజగోపాలం, శ్రీ నెప్పల్లి కృష్ణయ్య, శ్రీ మాదిరెడ్డి చలపతిరావు నాయుడు (సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ కోకా సుబ్బారావుగారి చినతాత), శ్రీ పిల్లారిశెట్టి కృష్ణమ్మ నాయుడు, రాయవరపు హనుమంతరావు ముఖ్యనటులు.

ఈ సమాజంలో అది వెలమల సంఖ్య ఎక్కువని దీన్ని 'నాయుడుల కంపెనీ' అనేవారట. ఈ సమాజం ఇతర ప్రదేశాల్లో కూడా ప్రదర్శనలిచ్చేవారట. అటువంటి ప్రదర్శనలలో కాకినాడ ప్రదర్శన యొకటి. అక్కడ శ్రీ సింగీతం అబ్బాయి తదితరులతో తగువులాట – కొట్టుకోవడం – తిరిగి అబ్బాయి వర్గంలోని వ్యక్తి రాజమండ్రి రావడం – అతన్ని పచ్చడికింద చితకకొట్టడం – ఇవన్నీ ప్రకాశంగారి 'నా జీవితయాత్ర'లో విశదమవుతాయి.

నాయుడుగారు, ప్రకాశం పంతులుగారు, చిలకమర్తివారు – ఈ ముగ్గురి కలయిక చరిత్రలోనొక అపూర్వ సన్నివేశం. వీరివల్లే ఈ సమాజానికి ఉజ్జ్వలకీర్తి వచ్చింది. 1884 నుండి ఈ సంస్థ కార్యక్రమాలు కుంటుపడ్డాయి. 1901లో చిలకమర్తివారు దీని అధ్యక్షులై సంస్థను పునరుద్ధరించారు. తరువాతి కాలంలో స్వర్ణయుగానికి కారకులైన సత్యవోలు గున్నేశ్వరరావు, కృత్తివెంటి నాగేశ్వరరావుగార్లు ఈ సంస్థలో చేరి నాటకరంగంపై అనురక్తిని పెంపొందించుకున్నారు. వీరు పద్యనాటకాలు కూడా ప్రదర్శించడం ప్రారంభించారు. మొదట కుమ్మరిగుంట (ప్రస్తుత ట్రయినింగ్ కాలేజీ ఆవరణ)లోను, తదుపరి నాగుల చెరువు వద్ద సంస్థ

కార్యదర్శి శ్రీ సత్యవోలు లక్ష్మీపతిగారి దొడ్డిలో పెంకుటింటి నాటకశాల నిర్మించుకొని ప్రదర్శనలిచ్చేవారు. ఈ సంస్థలో స్త్రీ పాత్రలో తనకు తానే సాటైన ముప్పిడి జగ్గరాజుగారు పాత్రధారణ చేశారు. యాతగిరి పూర్ణయ్యగారు (ఆంధ్రకేసరి యువజన సమితి వ్యవస్థాపక కార్యదర్శి శ్రీ వై.యస్. నరసింహారావుగారి పితామహులు) ఈ సంస్థలోను పూర్వ సంస్థలోను పాత్రధారణ చేశారు. తరువాత కాలంలో వారు గయుని పాత్రలో ప్రసిద్ధులయ్యారు. ఈ సంస్థ 1908 వరకు కొనసాగింది. ప్రముఖ న్యాయవాదులు, రావు బహదూర్ ఆనందాచార్యులు కూడా వీరి 'గయోపాఖ్యానం' నాటక ప్రదర్శన మెచ్చుకున్నారు. ఈ సంస్థ హరిశ్చంద్ర, 'కీచకవధ', 'ద్రౌపదీ పరిణయం', 'గయోపాఖ్యాయనం', 'శ్రీరామజననము', 'పారిజాతాపహరణము', 'నలనాటకం', 'సీతా కళ్యాణం', 'సారంగధర' 'చమత్కార రత్నావళి' ప్రదర్శించేవారు. ప్రకాశంగారు ద్రౌపది, అర్జునుడు, చిత్రలేఖ, దశరథుడు, సత్యభామ, రత్నాంగి పాత్రలు పోషించారు, రంగ నక్షత్ర బిరుదును కూడా పొందారు. ఆనాటి ప్రకాశం గారి రూపురేఖలు ఎలా ఉండేవో చిలకమర్తి వారి ఈ వర్ణనే చెబుతుంది.

*సీ. ఈగవాలినగాని వేగ జారెడునట్లు*
*ముప్వంపు కురులను దువ్వినాడు*
*వర లలాటమునందు తిరుచూర్ణరేఖను*
*ముద్దుగారెడు భంగి దిద్దినాడు*
*అరుణ పల్లవమట్లు కరమురంజిల్లు చెం*
*గావి వస్త్రంబును గట్టినాడు*
*చార లంగరఖాను జక్కగా ధరియించి*
*వలెవాటుకండువ వైచినాడు*
*గీ. చెవులసందున గిరజాలు చిందులాడ*
*మొగము మీదను జిరునవ్వు మొలకలెత్త*
*టంగుటూరి.................... తరలివచ్చె*

ఈ తరానికి సంబంధించిన శ్రీ ముడుంబై రామానుజాచార్యులుగారు బాలాత్రిపుర సుందరీ నాటక సమాజం (1855) రాజమండ్రిలో స్థాపించి స్వయంగా నాయక భూమికలు ధరించేవారట. వీరు చిలకమర్తి వారి సమకాలికులు, టంగుటూరి ప్రకాశం పంతులుగారి గురువులు, తరువాత డిప్యూటీ కలెక్టరుగా పదవి నిర్వహించారు. ప్రముఖ నటులు శ్రీ ఎం.వి. నరసింహాచారిగారికి వీరు పెద తండ్రి, చిరంజీవిగారికి దత్తత తండ్రి.

**వృత్తి నాటకయుగం (1900–1828):**

నిజానికి ఇరవయ్యో శతాబ్ది ప్రారంభానికి కొంచెం ముందుగానే వృత్తి నాటకయుగం మరో అగ్రతాంబూలం పొందడమే!

**నేషనల్ థియేటర్** (రాజమహేంద్రవరం):

1898 ప్రాంతంలో తూర్పుగోదావరి జిల్లాలోని మానేపల్లి కాపురస్తులు శ్రీ ధరణిప్రగడ సూరయ్య 'నేషనల్ థియేటర్' పేరుతో నాటక సమాజాన్ని స్థాపించి, ఇన్నీసుపేటలో నాటకశాలను కూడా నిర్మించి ప్రదర్శనలిచ్చేవారు. సూరయ్యగారి ఊరి పేరు 'మానేపల్లి' కాబట్టి, ఈ సంస్థను మానేపల్లి కంపెనీగానే వ్యవహారంలో పిలిచేవారు. వీరు నటులకు జీతాలేర్పాటు చేసి ప్రథమ వృత్తి నాటక సమాజాన్ని ప్రారంభించినవారయ్యారు. నాయక పాత్రలో అంబడిపూడి కోటయ్యగారు (మంచి గాత్రము కలిగి, ఫిడేలు వాయిద్యంతో మంత్రముగ్ధుల్ని చేసేవారట) నాయిక పాత్రలో ముప్పిడి జగ్గరాజుగారు ముఖ్యులు. జగ్గరాజుగారి స్త్రీ పాత్ర అద్వితీయమట. ముమ్మూర్తులా స్త్రీలాగే దమయంతి, చంద్రమతి, ద్రౌపది, లీలావతి, సీత, మల్లమాంబ, రత్నాంగి పాత్రలను అపూర్వంగా ప్రదర్శించేవారట. శోక, కరుణ రసాలు ప్రదర్శించడంలో ఆయనకు ఆయనే సాటి. ఈ సమాజంవారు కాళ్లకూరి సాంబశివరావుగారి 'రంగరాయ కథన సమవాకారము', 'వీరేశలింగంగారి హరిశ్చంద్ర' ప్రధానంగా ప్రదర్శించేవారట. ఈ సంస్థ 1912 వరకు కొనసాగింది.

**హిందూ నాటక సమాజము** (రాజమహేంద్రవరం):

సత్యవోలు గున్నేశ్వరరావు (రాజమండ్రి కరణం), కృత్తివెంటి నాగేశ్వరరావులు శ్రీ చిలకమర్తి వారి దగ్గర నుండి ఈ సంస్థను స్వాధీనం చేసుకొని ఎంతో పెద్ద ఎత్తున ప్రారంభించారు. ఆ రోజుల్లోనే లక్షాయాభైవేల రూపాయలు ఖర్చుపెట్టి ఆధునిక రంగస్థల పరికరాలు కూర్చుకొని,

సమాజంలో నూరుమందివరకు సిబ్బందితో ఎంతో క్రమశిక్షణతో రిహార్సల్స్ చేయించి, ఉత్తమ ప్రదర్శనాలిచ్చేవారట. ఇది సిసలైన వృత్తి నాటక సంస్థ.

శ్రీ నాగేశ్వరరావు మంచి దర్శకులు, ప్రయోక్త – అయితే శ్రీ గున్నేశ్వరరావు సాధన సంపత్తిని చేకూర్చి, మంచి కార్యనిర్వహణ, దక్షత కలిగిన వ్యక్తిగా మంచి పేరు పొందారు. ఎ.యస్. రామ్ అనే ప్రసిద్ధ చిత్రకారుణ్ణి బొంబాయి నుండి రప్పించి తెరలు చిత్రింపజేసి రంగస్థలాన్ని శోభాయమానంగా రూపొందించేవారు. నాటక వాగ్గేయకారుడైన శ్రీ పాపట్ల కాంతయ్యను పాటలు కూర్చి, శిక్షణ ఇవ్వటానికి నైజాం నుంచి రప్పించారు. తెలుగు నాటకాల్లో నృత్యాలు ప్రవేశపెట్టింది కూడా వీరే. ముప్పయిమంది ఒకే వయసులోని బాలబాలికలు వేషాలతో నృత్యం చేసేవారట. 'ఆంధ్ర నట ప్రకాశిక'లో శ్రీ పసుమర్తివారు ఈ సంస్థ గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు వ్రాశారు.

"ఎ.ఎస్. రామ్ కుంచె చేత పుచ్చుకుంటే ఏడేడు పద్నాలుగు లోకాలూ రంగంలో మొలిచేటట్లు చేసేవాడు", దుస్తులు కూడా వీరి సలహాతోనే ఇతర ప్రదేశాల నుండి తెప్పించేవారట. 'రెప్పపాటులో మారే సీన్లు రామ్ సృష్టే'. మధ్యమధ్యలో హాస్యపాత్రలు కూడా నటించేవారట. వందలకు వందలు నటులకు అడ్వాన్సులిచ్చేవారట. అందరికి జీతాలేర్పాటు చేసి క్రమశిక్షణతో నడిపేవారట. పాపట్ల కాంతయ్యగారు పాటలు వ్రాసి పార్శీ పద్ధతిని బాణీలు కట్టి, అవసరమయినపుడు హార్మోనియం వాయిస్తూ ఉండేవారట. "ముందు నాటకం ఎలా ఉన్నా వీరి కీర్తనలు మాత్రం నాట్య పట్టాభిషేకాన్ని చేసుకొనే"వట! ఈ సమాజ నాటకాలకు టిక్కట్లు అడ్వాన్సు బుకింగ్ అటు బరంపురం నుండి ఇటు మద్రాసు నుండి కూడా ముందుగానే జరిగేవట! 'కనకతార', 'సారంగధర', 'బొబ్బిలియుద్ధం', 'గయోపాఖ్యానం', 'హరిశ్చంద్ర', 'వేణీ సంహారం' వీరి ప్రముఖ నాటకాలు ఉమ్రాలీషా కవి కూడా వీరికెన్నో నాటకాలిచ్చారు. శ్రీయుతులు బ్రహ్మజ్యోస్యుల సుబ్బారావు, ముప్పిడి జగ్గరాజు, వెల్లంకి వెంకటశ్వర్లు, నిడసనమెట్ల కొండలరావు, మద్దాలి శేషగిరిరావు, అవధాన్ల పురుషోత్తం, దుర్గి గోపాలకృష్ణరావు, వై. భద్రాచారి, కుంపట్ల సుబ్బారావు ముఖ్యనటులు. పసుమర్తివారన్నట్లు ఈ సంస్థ నాటక సమాజాలకి వర్తక మర్యాదలు తెచ్చిపెట్టింది. రాజమండ్రి నాటక చరిత్రలోనే కాదు ఆంధ్ర నాటక చరిత్రలోనే స్వర్ణయుగ ప్రారంభానికి దారి తీసింది. శ్రీ గున్నేశ్వరరావు, శ్రీ నాగేశ్వరరావుల అనుబంధం కొంతకాలమే కొనసాగి, 1912లో విడిపోయారు. నాగేశ్వరరావుగారు హిందూ నాటక సమాజాన్ని కొనసాగించారు. తరువాత భారతీ థియేటర్‌ను స్వయంగా నెలకొల్పారు. ఊరూర నాటక ప్రదర్శనలిచ్చేవారట. ఎంతో కీర్తి పొందారు. అలా ప్రదర్శనలిస్తుండగా ఏలూరు ప్రదర్శనలో వారి నాటకశాలకు నిప్పంటుకొని, వారు చేకూర్చుకొన్న రంగస్థల పరికరాలన్నీ భస్మీపటలమై, చాలా నష్టం వాటిల్లింది. నాగేశ్వరరావుగారు మిత్రుల సహాయంతో పునరుద్ధరించుకొని, రంగూన్‌వంటి ప్రదేశాల్లో కూడా ప్రదర్శనాలిచ్చి వచ్చారు. దేరా హాలును కూడా నిర్మించుకున్నారు.

**చింతామణి థియేటర్:**

శ్రీ సత్యవోలు గున్నేశ్వరరావు, కృత్తివెంటి నాగేశ్వరరావుగారితో విడిపోయిన తరువాత, ఈ సమాజాన్ని స్థాపించి, వారు మరణించేవరకు (1927) పూర్వ సంస్థకు ధీటుగా నడిపారు. కవికోకిల గుర్రం జాషువా గారిని కవిగా నియమించారు. హరికథా పితామహులు శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారు వీరి సమాజంలో భీమ పాత్ర ధరియించేవారట. ఈ సమాజం విజయనగరం కోటలో ముప్పయి నాటకాలు ప్రదర్శించింది. ఇది కూడా సిసలైన వృత్తి నాటక సంఘం. శ్రీ యుతులు ముప్పిడి జగ్గరాజు, వెల్లంకి వెంకటేశ్వర్లు, నిడసనమెట్ల, కొండలరావు, రాయప్రోలు సత్యనారాయణ, అంకరాజు రామారావు, మద్దాలి శేషగిరిరావు, ఓలేటి నారాయణమూర్తి, ఐనవోలు తాతయ్య నాయుడు, ముతిలి మల్లికార్జునరావు, భోగరాజు సుబ్బారావు, అవధానుల పురుషోత్తం, కుంపట్ల సుబ్బారావువంటి సుశిక్షితులైన నటులుండేవారు. వీరి ప్రదర్శనాలకు 'చింతామణి' థియేటర్ (అదే బాబ్జీ టాకీస్, జయా టాకీస్‌లుగా మారి, నేడు విజయా టాకీసుగా స్థిరపడింది) నిర్మించుకున్నారు. ఈ సందర్భంలో కవికోకిల

గుర్రం జాషువా కవి 'నా కథ'లో శ్రీ గున్నేశ్వరరావుగారిని వర్ణించిన తీరు, సమాజ కవులుగా చేరిన క్రమం ఈ పద్యాల్లో విశదమౌతుంది. వారి రూపం, వ్యక్తిత్వం ప్రస్ఫుటంగా చిత్రించారు.

*పిడికెడు మీసముల్ నయన వీధుల రాజస మానసంబునన్*
*జడది గభీరతాగుణము, వామనచాయ, శరీరదార్ఢ్యమున్*
*నడిమి వయస్సు చూపర మనంబులు లోగొనుమూర్తి తోడ నా*
*యెదద చలింపనిట్టులనియెన్ మృదువాక్పరిపక్వచిత్తుడై*

*చెలిమి న్నాదుభుజాగ్రమున్ గుదుపుచున్ చింతామణి నాట్య మం*
*డలికి న్నాటకముల్ రచింపుము కవీంద్రా! ముందుగా కొమ్మిదే*
*నెలజీతంబని రావ్యవింశతి నిడెన్ చిత్తంబు పొంగార నా*
*పలుకుందొయ్యలి తాండవించ నవభావస్వర్ణ భూషాఢ్యయై*

ఆ కాలంలోనే కొన్ని ఔత్సాహిక నాటక సంఘాలు కూడా వృత్తి నాటకాలనే అనుసరించి, అనుకరించాయి. వాటిలో రాజమండ్రిలో ముఖ్యంగా పేర్కొనవలసింది. "రాజమండ్రి ఎమెచ్యూర్స్ సంస్థ (1909). ప్రథమ నాటక విమర్శకులు, పోటీ నాటకాలకు ప్రమాణాలేర్పరచిన శ్రీ శ్రీపాద కామేశ్వరరావు, శ్రీ అంకరాజు రామారావులు దీని వ్యవస్థాపకులు. ఎన్నో ఉత్తమ ప్రదర్శనాలు శ్రీ శ్రీపాదవారి శిక్షణలో ప్రదర్శించేవారు. అదే సంస్థ 1920లో 'కేసరి' సమాజంగా రూపొందింది. శ్రీయుతులు అంకరాజు రామారావు, బ్రహ్మజ్యోస్యుల సుబ్బారావు, ఏలూరిపాటి వెంకటరత్నం, భమిడిపాటి కామేశ్వరరావు, పెమ్మరాజు రామారావు, పోణంగి జోగిరాజు, శరభరాజు, ప్రముఖ హరికథకులు బుద్ధవరపు కురంగేశ్వరరావు, మహిపాల రామన్న, పార్ఫీ శేషగిరిరావు, కొచ్చర్లకోట సత్యనారాయణ, జయంతి గంగన్న, మాచిరాజు రామచంద్రమూర్తి (బండరాముడు) దినవహి సత్యనారాయణ ఈ సంస్థ నటులు.

నటులుకాక, ఏభయిమందివరకు ఆ సమాజంలో దేశభక్తులు, విద్యాధికులే సభ్యులుగా ఉండేవారట. 'చిత్రనళీయం', 'రసపుత్ర విజయం', 'కాలేజీగరల్', 'శ్రీకృష్ణ తులాభారం' వీరి ప్రధాన ప్రదర్శనలు. శ్రీ శ్రీపాద కామేశ్వరరావుగారు స్వతహాగా మంచి నటులు కూడా వీరి అభిమాన పాత్రలు 'చాణుక్యుడు', 'రాణా ప్రతాప్', 'పేరిగాడు' (ప్రతాప రుద్రీయం) 'కీచకుడు', 'అశ్వత్థామ'. ఈ సంస్థవారు 1932లో నాటక ప్రదర్శనాలతో వచ్చిన ఇరవైరెండువేల రూపాయలు ధర్మకార్యాల నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా కలెక్టరుకు అందజేశారు.

**కాంట్రాక్టు నాటకయుగం** (1928 – 1943):

వృత్తి నాటకం ఉత్తమ ఆదర్శాలతో, ఉన్నత స్థాయిలో స్వర్ణయుగాన్ని సృష్టించి అనుకోని రీతిలో అంతరించడం ప్రారంభించింది. రాజమండ్రి హిందూ నాటక సమాజం, తరువాత గున్నేశ్వరరావుగారి చింతామణి నాటక సమాజం అనేక సమాజాలకి ఆదర్శమై, మార్గదర్శకమయ్యాయి. బెజవాడ (విజయవాడ) మైలవరం వారి బాలభారతీ సమాజం, ఏలూరు మోతే నారాయణరావు జమీందారుగారి సీతారామాంజనేయ నాటక సమాజం – ఇవన్నీ ఇంచుమించు ఒక్కసారే అంతరించడం ప్రారంభించాయి. అక్కడక్కడ 'సురభి సంస్థలు' (ఇప్పటికీ వర్థిల్లుతూన్న సంస్థలు), మరికొన్ని ట్రూపులుగా ఏర్పడిన సంస్థలు ముఖ్యంగా తెనాలి రామవిలాస సభ, బందరు డి.వి. సుబ్బారావుగారి (ప్రభాత్ థియేటర్, విజయవాడ రాజరాజేశ్వరి నాట్యమండలి' (పి. సూరిబాబు, రాజేశ్వరి), పీసపాటి నరసింహమూర్తిగారి సంస్థవంటి సంస్థలు తరువాత కాలంలో ఉత్సాహంగా ముందుకు వచ్చాయి.

ప్రసిద్ధ నటులు కూడా ట్రూపులు తయారు చేసుకొని, కాంట్రాక్టర్ల పాలనలోనే ప్రదర్శనలిచ్చేవారు. రాజమండ్రిలో కూడా వృత్తి నాటక సమాజం తరించిపోయాయి. నాటక ప్రదర్శన శాలలు సినిమా హాల్సయ్యాయి! హనుమాన్ టాకీస్ (జయశ్రీ), కృష్ణా సినిమా (సాయికృష్ణ), జయా టాకీస్ (విజయ) తరవాత రామా టాకీస్ (నాగదేవి), గజలక్ష్మీ టాకీసు (ప్రస్తుత అశోక స్థలంలో) ఎన్నో నాటక ప్రదర్శనాలు జరిగేవి. పెద్దపెద్ద నటుల ప్రదర్శనలు పోటాను పోటీగా జరిగేవి. బాగా పాడగలిగినవారికి, పేరుప్రఖ్యాతులున్నవారికి పెద్ద పారితోషికం ముట్టేది వారకే పెద్ద డిమాండుండి, నెలలో అన్ని రోజులు ప్రదర్శనాలుండేవి. పెద్ద నటులు రాజమండ్రి, విజయవాడ, తెనాలివంటి పట్టణాల్ని కేంద్రంగా పెట్టుకొని అక్కడ నుండి వారి కార్యకలాపాలు కొనసాగించేవారు. 1931లో

టాకీయుగం కూడా ప్రారంభమై, సినిమా ఆకర్షణ కూడా నాటక సంస్థల్ని నిర్వీర్యం చేసింది. బాగా పాడేవారు, మంచి వర్చస్సు, మేధస్సుగల నటులు సినిమాలకు వలస వెళ్లారు. పోటీ నాటకాలు, ఒక కాంట్రాక్టరు మీద మరొక కాంట్రాక్టరు దెబ్బతీయటం, మొత్తం మీద ఇద్దరూ నష్టపోవడం, కాంట్రాక్టరు గల్లా పెట్టి పెట్టుకొని పారిపోవడం నటులకు ఏమీ ముట్టకపోవడం, ప్రేక్షకుల బలవంతంతో నటులు ఏమీ చేయలేక ప్రదర్శనాలివ్వడం జరిగేది. ఒకే రోజున, ఒకే ఊరిలో రెండు ప్రదేశాల్లో 'కురుక్షేత్రం', 'గయోపాఖ్యానం'వంటి నాటకాలు ప్రసిద్ధులైన నటులతో పోటీ ప్రదర్శనాలుండేవి. రాజమండ్రిలో శ్రీ ముదునూరి సూరపరాజు (రాజుల భోజన హోటల్, బొమ్మనకు, ద్వారకా హోటల్‌కు మధ్య), శ్రీ వెంకట కృష్ణయ్య (ఆంధ్రప్రభ ఏజెంట్, కరస్పాండెంట్), బాబ్జీ ఇంకా కొందరు పై ఊళ్ల నుండి వచ్చినవారు కాంట్రాక్టు చేసేవారు. రానురాను కిరాయి నాటకాలుగా మారి, ముగ్గురు కృష్ణులు, ఇద్దరు అర్జునులు, ఇద్దరు రాములు, ఇద్దరు ఆంజనేయులు వేయడంతో ఒకరికొకరికి పొంతన లేక కంటిన్యూటీ లేక ప్రదర్శనలు అస్తవ్యస్తంగా ఉండి, వెర్రితలలు వేసేవి. హార్మోనిస్టులు కూడా ఎవరికి వారే విడిగా తెచ్చుకొనేవారు. శ్రీమతి పూర్ణిమ, శ్రీయుతులు డి.వి. సుబ్బారావు (బందరు), బందా, స్థానం, బెల్లంకొండ, మాధవపెద్ది, సి.యస్.ఆర్. రఘురామయ్యవంటి నటులు కూడా కాంట్రాక్టు నాటకాల్లో పాల్గొనక తప్పలేదు. పద్యాలున్న నాటకాలు 'కురుక్షేత్రం' 'గయోపాఖ్యానం' 'రామాంజనేయ యుద్ధం'వంటివే నిలిచిపోయాయి. సాంఘిక నాటకాలు అంతరించి పద్యాలున్న 'చింతామణి' నిలబడింది. ప్రేక్షకులు కూడా తెలివిమీరినవారై నాటక పుస్తకాలతో వచ్చేవారు ఏదైనా పద్యం విడిస్తే ఊరుకునేవారు కాదు, పట్టుబట్టి పాడించేవారు, తెలివైన సమయస్ఫూర్తి ఉన్న నటులైతే తప్పించుకొనేవారు.

[1]అలానే వన్స్‌మోర్ (తిరిగి పాడమని)లతో బాధించేవారు. శ్రీ భమిడిపాటివారన్నట్లు – సత్యవంతుడు పాటపాడి చచ్చిపడి ఒన్స్‌మోర్‌తో లేచి మళ్లీ పాడి తిరిగి మళ్లీ చచ్చిపోవాలన్నమాట.

1. శ్రీ గండికోట జోగినాథం (కాకినాడ) చింతామణిలో సుబ్బిశెట్టి పాత్రలో బహు ప్రసిద్ధులు. ఇలానే ప్రేక్షకులు పుస్తకంలో ఒక పద్యం పాడలేదని పాడమంటే "పుత్తకంలో లేనివి కొన్ని బాడానుగా, ఈటికింద జమకట్టుకొండి" అని సమయస్ఫూర్తిగా తిప్పికొట్టారు.

ప్రేక్షకుల్లో కొందరు, నటులతో వారికిష్టమైన 'ఈల పాట' (రఘురామయ్య), గుత్తివంకార్ కూర పాట (బందా కనక లింగేశ్వరరావు) హరిశ్చంద్ర వేషం వేసినా రాయబారంలో పద్యాలు (అబ్బూరి వరప్రసాదరావు)లచే పాడించడం పరిపాటయింది. ఈ నాటక ప్రదర్శనకు ముందు ప్రచారాలు విచిత్రంగా ఉండేవి. అందులో భాగంగా బ్రహ్మం అనే వ్యక్తి వేషం వేసి డప్పుతో ప్రచారం చేస్తూ ఆ నాటకాల్లోని పద్యాలు, ఆ నటులు పాడినట్లే అనుకరించి పాడి జనాన్ని కూడలిలో ఆకర్షించేవారు. మరో ప్రచారం "హాలు నిండిన వెనుక ఆయా గట్లపై కూర్చుండవలెను. షరా మామూలే" ఇలాంటివెన్నో ప్రేక్షకులకు ఆకర్షణగా ఉండేవి. ఈ యుగంలో ఒక్క సుగుణమేమిటంటే మహానటుడు శ్రీ బళ్లారి రాఘవాచారి కృషితోనైతేనేమి ఇతరత్రా ఒత్తిడివల్లనైతేనేమి స్త్రీలు రంగస్థలంపై నటించడానికి ముందుకొచ్చారు. చాలామంది వృత్తిగా స్వీకరించి, పురుషులతో సమాన స్థాయిని పొంది ఎంతో ఉన్నతిని చూశారు. అదేకాలంలో శ్రీ మద్దాలి శేషగిరిరావు, వెల్లంకి వెంకటేశ్వర్లు రాధాకృష్ణ నాటక సమాజాన్నీ స్థాపించారు. తెలుగు నాటక రంగ తొలి రోజుల్లో సహజ నటులే కాకుండా, వృత్తి నాటకపు రోజుల్లోను, కాంట్రాక్టు నాటకపు రోజుల్లోను ఇతరత్రా మహోజ్వలంగా వెలుగొందిన మహానటులు రాజమండ్రి, ఆ పరిసర ప్రాంతాలవారెందరో ఉన్నారు. వారిలో శ్రీ కత్తుల కృష్ణరావు భాగవతార్, దొమ్మేటి సత్యనారాయణ అభినవ దుర్యోధన బిరుదాంకితులు శ్రీ యన్.వి.యల్. నరసింహాచారి ఆంధ్ర చార్లీ బాబ్జీ, అభినవ ఆంజనేయ బిరుదాంకితులు పద్యపఠనలోను, నటనలోను వినూతన్న పోకడలతో ఆంజనేయ పాత్రకు గుర్తింపు తెచ్చి రామారామా అంటూనే రంగస్థలం పైనే ఆసువులు బాసిన శ్రీ బేతా వెంకటరావు (గండేపల్లి), అంగదుడు పాత్రకే అఖండకీర్తి

తెచ్చిన జి. వీర్రాజు (ఇనగంటివారిపేట), దేవత సుబ్బారావు, ద్వారపూడి సూర్యారావు, గుత్తుల వీర్రాజు, వితాల సూర్యనారాయణ ప్రభృతులున్నారు.

స్త్రీలలో శ్రీమతులు టేఇక అనసూయ, గంగారత్నం, సరసీరుహం, దొమ్మేటి భానుమతి, సుందరమ్మ (మాలపిల్ల సినిమా)వంటివారెందరో ఉన్నారు.

పౌరాణిక, పద్యనాటకాలకు హార్మోనియం, తబలావంటివి ఆ రోజుల్లోను తప్పనిసరి అయ్యాయి. ఆనాటి హార్మోనిస్టుల్లో శ్రీయుతులు నందివాడ సుబ్రహ్మణ్యం, కోటిలింగం, యం. నాగరాజు, భుజంగరావు, చింతా సుబ్బారావు, ధనువాడ రాఘవరావు, మృత్యుంజయుడు, సత్యహరనాథ్, టి.వి. రాజు (ప్రఖ్యాత సినీ మ్యూజిక్ డైరెక్టర్), కాళిదాసు, చిరుకు అప్పలస్వామి, శ్రీ గుడిమెట్ల గంగరాజు, ప్రస్తుతం పెండ్యాల భద్రం, గగనం రమణ, కలిగొట్ల రమణ, కర్రా నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, మల్లేశ్వరరావు, చింతలపాటి శ్రీరామమూర్తి, దానపల్లి శ్రీరాములు నాయుడులు ముఖ్యులు.

తబలిస్టులుగా శ్రీయుతులు కొండలరావు, బ్రహ్మం, చిట్టిబాబు, బాజీ, నట్టా కృష్ణ రాజమండ్రికి కీర్తిప్రతిష్టలు తెచ్చారు. తబలిస్టుగా రామానుజయ్య కూడా స్మరణీయులే.

మేకప్ ఆర్టిస్టులుగా శ్రీయుతులు నట్టా సూర్యం కుమార్జీలను చెప్పుకోవాలి. ఇప్పటికీ బుర్రే సత్యనారాయణ, కొండపల్లి నాగేశ్వరరావు, ఆశపు రాము అప్పారావు, సాంబం మేకప్ ఆర్టిస్టులుగా జీవనాన్ని గడుపుతున్నారు.

పతివాడ సూర్యనారాయణ
హైదరాబాద్. ఫోన్: 984 921 1500.

## "ఆమె" లేఖలు

*68వ పేజీ తరువాయి:*

జూలియా థామస్ రాసిన 'లెటర్స్ ఫ్రమ్ మద్రాస్' బై ఎ లేడి' (1843) మద్రాసు, రాజమండ్రి, చిత్తూరు, బళ్ళారి, బెంగళూరు ప్రదేశాల్లో తాను గడపిన జీవితంలోని అనుభవాల్ని, పరిశీలనల్ని రాయడం ఆమె దృక్పథాన్ని తెలియచేస్తుంది. ఇక్కడి హిందువుల పట్ల ఆమెకున్న సంకుచిత దృష్టి స్పష్టంగా కనపడుతుంది. ఒక వృద్ధ బ్రాహ్మణుడు హిందూస్తానీ గీతాన్ని – అందులోని చరణాల్ని, పదేపదే పాడటాన్ని ఆమె తెలివితక్కువగా భావించడం (పేజి: 126) ఆమెకు ఆ సంప్రదాయం గురించి అవగాహన లేక పోవడమే.

మనవాళ్లు క్రైస్తవం గురించి ఎవరైనా చెప్తే, పెడచెవిన పెడ్తారన్న ఆమె అభిమతం కూడా తప్పే– "ఈ నేటివులతో వచ్చిన చిక్కేమంటే, మనంచెప్పేది అర్థం చేసుకోవడానికి బదులుగా అందులో లోపాలు వెతికి ఏవో అర్థం లేని వ్యాఖ్యలు చేస్తుంటారు. అసలు మనం చెప్పేది వాళ్ల తల కెక్కించు కొంటున్నారా అనే సందేహం కలుగుతుంది. "(పేజి: 130) ఆమె ప్రశ్నను ఆమెకే తిరగేస్తే, ఆమె ఏం జవాబు చెప్పి వుండేదో? జూలియస్ థామస్ దంపతులు రాజమండ్రిలో 1838–39 లో ఒక రీడింగ్ రూమ్ నెలకొల్పి, పాఠకుల కోసం ఒక తెలుగు, కొన్ని ఇంగ్లీషు వార్తా పత్రికలు తెప్పించే వారన్న సంగతి మెచ్చుకోదగిందే. ఇంకా ఓ సంచార గ్రంథాలయాన్ని కూడా నడిపారంటే వాళ్లకు చేతులు జోడించాల్సిందే. నేటివ్ ఎడ్యుకేషన్ మద్రాసు ప్రెసిడెన్సీలో జాతీయ విద్య అవసరాన్ని నొక్కి చెప్తూ, మద్రాసు నుండి వెలువడే ఆంగ్ల వార్తాపత్రిక 'దిస్పెక్టేటర్' కు ఆమె రాసిన లేఖ (పేజి: 139,140) చాలా విలువైనదే.

జూలియా థామస్ రాసిన ఇంగ్లీష్ ఉత్తరాల్ని పెన్నేపల్లి గోపాలకృష్ణ, కాళిదాసు పురుషోత్తం గారు ఎంచక్కగానో సొంత మాటల్లో వివరించడం ఆహ్లాద కరంగా వుంది. కాని వీళ్లు ఇంగ్లీష్ మూలాన్ని యథాతథంగా అనువదించి వుంటే ఉభయతారకంగా వుండేది.




***'ఆమె' లేఖలు*** *ఇంగ్లీష్ మూలం : జూలియా థామస్, అనుసరణ, పెన్నేపల్లి గోపాలకృష్ణ, కాళిదాసు పురుషోత్తం, పేజీలు: 170, వెల : ₹ 125/–*
*ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్, ఎమెస్కో ప్రతులకు, ఎమెస్కో బుక్స్, 1-27, బానూకాలనీ, గగన్ మహల్ రోడ్ దోమలగూడ, హైదరాబాద్ –500029.*

ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ
బెంగుళూరు. ఫోన్: 996 408 2076.

## సాహిత్యంలో ఈ శతాబ్దం నోబెల్ తారలు – 2

# జె.ఎం. కుట్సీ

**(J.M. Coetzee) (1940-)**

*– ముక్తవరం పార్థసారథి*

రచయిత, భాషావేత్త, అనువాదకుడు జాన్ మాక్స్‌వెల్ కుట్సీ దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో జన్మించాడు. నోబెల్‌కన్నా ముందరే అత్యంత ప్రతిభావంతుడైన రచయితగా సాహితీ లోకం గుర్తించింది బుకర్‌తో సహా ఎన్నో పెక్కు పురస్కారాలు ఈయన్ను వరించాయి. డేనియల్ డీఫో, డోస్టే విస్కీ, ఫ్రాజ్ కాఫ్కా, సామ్యూల్ బెకెట్‌ల ప్రభావం ఈయన మీద బాగా ఉందంటారు. కేవలం పండిత ప్రశంసలేగాక 'డిస్‌గ్రేస్' వెయిటింగ్ ఫర్ ది బార్బేరియన్స్, డస్ట్ వగైరా నవలలు సినిమాలుగా కూడా వచ్చాయి.

తల్లిదండ్రులు ఆఫ్రికానీర్ సంతతివాళ్లు, ఇంట్లో ఇంగ్లీషు మాట్లాడినా, భవిష్యత్ రచయిత మాత్రం ఆఫ్రికానే మాట్లాడడం ఇష్టపడేవారు. కేప్‌టేన్ యూనివర్శిటీలో బాచిలర్స్ డిగ్రీ తీసుకొని, 1962లో IBMలో కంప్యూటర్ ప్రోగ్రామర్‌గా లండన్‌కు చేరుకొన్నాడు కుట్సీ. ఆ తర్వాత చాలాకాలం ఈయన వివిధ యూనివర్శిటీల నుండి మరికొన్ని డిగ్రీలు / డాక్టరేట్లు తీసుకొంటూ, బోధిస్తూ గడిపారు. ఈ కాలంలోనే ఆయన Samuel Bekett ఇంగ్లీషు వచనం మీద, కంప్యూటర్ సహాయంతో stylistic Analyticsకి చేశాడు.

అమెరికాలో స్థిరపడిపోవాలన్నది కుట్సీ కోరిక. కాని వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలలో పాల్గొన్న కారణంగా ఆయనకు పౌరసత్వం లభించలేదు. 1972లో కేప్‌టౌన్ తిరిగి వచ్చిన కుట్సీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా పనిచేసి 2002లో పదవీ విరమణనాటికి 'ఎమెరీటస్'గా ఎదిగి ప్రస్తుతం ఆయన ఆస్ట్రేలియా పౌరుడు.

తెలిసినవాళ్లందరూ ఆయన మౌనవ్రతం పాటిస్తున్న రుషిలా ఉంటాడంటారు. గొప్ప క్రమశిక్షణగల వ్యక్తి, మందు ముట్టడు, సిగరెట్టు కాల్చడు. శాకాహారి. ఎంత దూరమైనా సైకిల్ మీద పోవటానికే ఇష్టపడతాడు (అదే ఆయన ఆరోగ్య రహస్యం). ప్రతిరోజూ కనీసం గంటసేపైనా ఆయన నడవని రోజు లేదు. సన్నిహితులు కూడా ఆయన నవ్వటం అరుదుగా చూశారు.

1974లో 'డస్కలాండ్స్'తో ప్రారంభించి, ప్రతి మూడేళ్లకూ ఒక పుస్తకం ప్రచురించాడు కుట్సీ. ఆయన నవలల్లో ముఖ్యమైనవి: ఇన్ ది హార్ట్ ఆఫ్ ది కంట్రీ, లైఫ్ అండ్ టైంస్ ఆఫ్ మైకేల్ జె. ఫర్, ఏజ్ ఆఫ్ ఐరన్, మాస్టర్ ఆఫ్ పీటర్స్ బర్గ్, డిస్గ్రేస్, ఎలిజబెత్ కాస్టెల్లో, చైల్డ్ హూడ్ ఆఫ్ జీసస్, స్కూల్ డేస్ ఆఫ్ జీసస్, డెత్ ఆఫ్ జీసస్.

**నోబెల్ ఉపన్యాసం నుండి:**

అతడూ, అతడి అనుచరుడూ (రాబిన్ సన్ క్రూసో, అతని అనుచరుడు మాన్‌ఫ్రైడే – అనువాదకుడు.)

He and His man

కొత్త సహచరుడు దొరకడంతో చాలా సంతోషించాను. నాకు ఉపయోగకరంగా ఉండాలంటే అతడికన్నీ నేర్పించాల్సిందే. ముఖ్యంగా మాట్లాడటం నేర్పించాలి. నేను మాట్లాడితే అర్థం చేసుకోవడం నేర్పించాలి. నేర్చుకోవడంలో అతడు చాలా చురుకు.

డేనియల్ డీఫో, రాబిన్‌సన్ క్రూసో.

అతని అనుచరుడు ఇలా రాశాడు: బోస్టన్ అందమైన నగరం. ఇంగ్లండులోనే అత్యంత పొడవైన చర్చి, శిఖరం ఇక్కడే ఉంది. నావికులకది దారి చూపిస్తుంది. బోస్టన్

చుట్టూ ఉంటాయి ఫెన్ బురద నేలలు. ఇక్కడ రకరకాల పక్షులుంటాయి. వాటిని పట్టుకోవడానికి అక్కడి మనుషులు బాతుల్ని పెంచుతారు. యూరోప్ అంతటా, ప్రపంచమంతటా బురద నేలలున్నాయి. కాని వాటిని 'ఫెన్'లనరు. 'ఫెన్' అనేది ఇంగ్లీషు పదం. అది మరెక్కడికీ వలసపోదు.

ఈ పెంపుడు బాతులకు చేత్తో ఆహారం తినిపిస్తారు. అలాగే, ప్రతి ఏటా వాటిని హాలండ్, జర్మనీ పంపిస్తారు. ఇంగ్లీషు బాతులు అక్కడి బాతుల్ని చూసి జాలిపడతాయి. నదులు గడ్డకడతాయక్కడ. నేలమీద మంచు పరచుకొంటుంది. ఇంగ్లండ్‌లో ఎంత సుఖంగా ఉంటుందో తమ భాషలో ఆ విదేశీ పక్షులకు అర్థమయ్యేలా చెబుతాయి. ఇంగ్లీష్ బాతులకు సముద్ర తీరంలో బలవర్ధకమైన ఆహారం లభిస్తుంది. ఎక్కడ చూసినా తటాకాలు, పిల్లకాలువలు ఈదటానికి, కడుపునిండా తినటానికి మొక్కజొన్నకండెలు. "మంచంటే ఏమిటో మాకు తెలియదు."

''ఈ సంభాషణ అంతా బాతుల భాషలో కొనసాగుతుంది" అని రాస్తాడు అతడి అనుచరుడు. మొత్తం మీద పెంపుడు బాతులు. ఇతర జాతుల్నీ, పక్షుల్నీ తమ వెంట రమ్మంటాయి లేదా కిడ్నాప్ చేస్తాయి. ఎలాగైతేనేం, కొన్నాళ్లు ప్రయాణించి అవి ఇంగ్లండు చేరి అక్కడ విసిరి ఉన్న వలల్లోకే చేరుకుంటాయి. అప్పటికే నిరీక్షిస్తున్న బాతుల పెంపకందార్లు, వాళ్ల జాగిలాలు భయంకరంగా మొరుగుతూ పక్షుల మీదికి లంఘిస్తాయి. బెదిరిపోయిన పక్షులు ఎగిరిపోవడానికి ప్రయత్నించి వలల్లో చిక్కుకుంటాయి. పెంపకందార్లు వాటిని పట్టుకొని, పెంపుడు బాతుల్ని వదిలి, మిగిలినవాటిని చంపుతారు. ఆ తర్వాత అవి మార్కెట్లో వందలు, వేలుగా దర్శనమిస్తాయి. ఈ విషయాలన్నీ, పక్షి ఈక కలంతో, ముత్యాల్లాంటి దస్తూరితో రాస్తాడు అతడి అనుచరుడు.

అతడి పతనం ఇంకా కొనసాగుతుంది.

మొదటి కింగ్ జేమ్స్ పాలికలో, హాలిఫాక్స్ (నగరం)లో మరణ శిక్షలు పనులు చేయడానికి ఒక యంత్రం ఉండేది. అది ఎలా పనిచేస్తుందంటే: మరణశిక్ష పడిన నేరస్తుడు, అది కిందికి ఉన్నప్పుడు మెడ క్రింద పెట్టి పడుకుంటారు. తలారి శిరస్సు పైనుండి ఖడ్గాన్ని కిందికి విసురుతాడు. ఒక్క వేటుతో అది తలను వేరు చేస్తుంది. అయితే ఆనాటి హాలిఫాక్స్ సంప్రదాయం ప్రకారం ఖడ్గం తలమీద పడేలోగా నేరస్తుడు తప్పించుకోగలిగితే అతడిని విడిచిపెట్టేస్తారు. కానీ చరిత్రలో అలా జరగలేదు. అతని (అనుచరుడు కాదు అతను) చనిపోతే అప్పుడు నగరంలో తన గదిలో కూర్చొని ఇది చదువుతాడు. వయసు మీద పడుతోంది, వృద్ధాప్యం వచ్చేసినట్టే. ఎండల్లో తిరగడంతో మొహం నల్లబడిపోయింది. అప్పుడు వాడిన ఇప్పుడు గదిలో భద్రంగా ఉన్న రామచిలుక చచ్చిపోయింది. పూర్ రాబిన్! పూర్ రాబిన్ సన్ క్రూసో! ఎవరు నిన్ను రక్షిస్తారు? పూర్ రాబినస్ క్రూసో? అంటూ అరుగు మీద కూర్చుని అరిచేది.

ద్వీపం మీద సుదీర్ఘ కాలం గడిపిన తర్వాత తన రామచిలుక, కొన్ని ఖరీదైన వస్తువులూ వదిలిపెట్టుకున్నాడు. ఇంగ్లండు చేరుకున్న తర్వాత హంటిగ్టన్‌లో కొంతకాలం ప్రశాంతంగా గడిపాడు. ఇప్పుడు తన సంపన్నుడు. తన సాహసయాత్రల పుస్తకం ప్రచురించిన తర్వాత బాగా కలిసొచ్చింది. కాని సంవత్సరాల ద్వీపం మీద గడపడం వల్ల తనకు నీడలా ఉన్న అనుచరుడు ఇప్పుడు తనవెంట లేకపోవడంతో జీవితం నిస్సారంగా తయారైంది. అంతేకాదు, ఎంత డబ్బుంటేనేం, మరోవిషయం కూడా చెప్పక తప్పదు. వైవాహిక జీవితం ఒక నరకంలా ఉంది. ఇంట్లో ఉన్నా, అశ్వశాలల్లోనే ప్రశాంతంగా ఉంటున్నాడు. తన చూపు మేసే గుర్రాలు ఒకసారి భార్యకన్నా మెరుగనిపిస్తాయి. ద్వీపం మీద ఉన్నప్పుడే ఫ్రైడే వచ్చిందాకా, తనది నిశ్శబ్ద జీవితం – ఈ లోకంలోని అరుపులు, కేకలు, పనికిమాలిన కబుర్లకు దూరంగా.

ఇప్పుడు భార్య ప్రక్కన పడుకొంటే, గులకరాళ్ల వర్షంలో ఉన్నట్టుంది. క్షణం విరామం లేకుండా తలమీద పడుతూనే ఉంటాయి రాళ్లు. ఇక నిద్రపోయేదెలా!

మరికొన్నాళ్లకు, ఆమె మరణించినప్పుడు అతడికి గుండె పగిలిందని కాదుగాని, కాస్త బాధపడ్డా ఆ తర్వాత ఊరు వదిలి, బ్రిస్టల్ సముద్ర తీరంలోని జాలీటార్ హోటల్లో ఒక గది తీసుకొని నివసిస్తున్నాడు (హంటింగ్టన్‌లోని ఇంటిని కొడుకుకు ఇచ్చేశాడు) – తనకు పేరుప్రఖ్యాతులు

తెచ్చిన గొడుగునూ, పంజరంలో మరణించిన చిలుకనూ, మరికొన్ని అవసరమైన వస్తువులను మాత్రం వెంటతెచ్చుకున్నాడు. ఇప్పుడు తను ఒంటరి. సముద్రంలోని పడవలను చూస్తూ, పైపు కాలుస్తూ కూర్చుంటాడు. గదికే భోజనం తెప్పించుకుంటాడు. ఎవరితోనూ కలవటం ఇష్టంలేదు. ద్వీపం మీద ఒంటరిగా బతికి, ఏకాకితనానికి అలవాటు పడ్డాడు.

ఏమీ చదవాలనే కోరిక లేదు. కానీ సాహసయాత్రల గురించి రాయటంవల్ల, రాసే అలవాటింకా మిగిలున్నది. అదే అతని కాలక్షేపం. కొవ్వొత్తి వెలుగు, పక్షి ఈకల కలంతో, లింకన్ షైర్‌లో ఉన్న తన అనుచరుడికి ఒకటి రెండు పేజీలు రాస్తాడు. బాతులను చంపటం దగ్గర్నుంచి, శిరచ్ఛేదాలదాకా తన అనుచరుడు రిపోర్టులు పంపిస్తూనే ఉంటాడు. వృత్తిరీత్యా వర్తకుడు కావడంతో ఎప్పుడూ దాని గురించే ఆలోచిస్తాడు. ధాన్యం వ్యాపారస్తుడు, చర్మాల వ్యాపారస్తుడు, లైట్స్ అమ్ముకొనేవారు ఎవరైతేనేం – అందరూ ప్రయాణాలు చేయాల్సిందే. వ్యాపారంలో డబ్బులొస్తే, మరో భార్య వస్తే – అంటే అరుపులు, కేకలు, సాధింపులతో తనను వేధించిన భార్య వస్తే పిల్లల్ని ముఖ్యంగా ఆడపిల్లల్ని కంటే ఎక్కువ కాలం కాకపోయినా కొద్దిగానైనా ఆనందాన్నివ్వగలిగితే...

చలికాలంలో థేమ్స్ నది పొంగుతుంది. ఇటుక బడ్డీలు కొట్టుకుపోతాయి – లేదా చర్మకారుల గిల్టులు, ధాన్యం కొట్లు. తను పేదవాడైపోతాడు. అప్పులిచ్చిన్నవాళ్లు మీదపడి పీక్కుతింటారు కాకుల్లా, గద్దల్లా. తను ఇంటి నుంచి దూరంగా పారిపోతాడు. భార్యను, పిల్లల్ని వదిలి – ముష్టివాళ్ల కొంపల్లో – పేరు మార్చుకొని తలదాచుకొంటాడు. ఈ పరిమాణాలన్నీ – వరదలు, ఆస్తిపోగొట్టుకొని ముష్టివాడిగా మారటం, ఇంటికి, ఊరికి దూరంగా పారిపోవటం, చిరుగు పాతల జీవితం, ఒంటరితనం – ఇవన్నీ, పడవ ప్రమాదం తర్వాత ఇరవై–ఆరేళ్లు ద్వీపం మీద గడిపినప్పుడు పిచ్చెక్కిపోలేదా? (పిచ్చెక్కలేదని ఎవరనగలరు! ఎంతో కొంత మతి భ్రమించే ఉంటుంది!) లేదా తను మరో మనిషిగా – ఈసారి జీనులు చేసేవాడిగా వైట్‌చాపెల్ (నగరం)లో బతికితే... మంచి భార్య – వాగుడుకాయ కాదు – ఆమె ఆడపిల్లల్ని కంటుంది. తనను సంతోషపెడుతుంది – నగరంలో ప్లేగు వచ్చిందాకా.

1665వ సంవత్సరం. లండన్ ఇంకా అగ్నికాహుతి కాలేదు. అందుకు ముందరే ప్లేగు వచ్చింది. రోజురోజుకూ మృతుల సంఖ్య పెరిగింది. ధనిక పేద అనే తేడా లేదు. తన సంపద తనను రక్షించదు. భార్యాపిల్లల్ని ఊరికి పంపించి, తనూ మరెక్కడికో పారిపోవాలనుకుంటాడు. కానీ ఎక్కడికీ వెళ్లడు. 'మృత్యువుకు భయపడవద్దు...' అంటుంది బైబిల్ వాక్యం. "నీ కళ్ల ముందరే వెయ్యిమంది మరణించనీ, పదివేలమంది ప్రాణాలు వదలనీ, భయపడవద్దు."

ఈ బైబిల్ వాక్యం తనకేదో సందేశమిచ్చింది. లండన్‌లోనే ఉండి, ప్లేగు గురించిన రిపోర్టులు రాస్తాడు. 'వీథిలో నడుస్తున్నప్పుడు ఒక మహిళ, ఆకాశంవైపు చూస్తూ, ఒక దేవదూత జ్వాలా ఖడ్గంతో నావైపు నడుస్తున్నాడు' అంటోంది. అక్కడ మూగిన గుంపు 'అవునవును' అంటూ వంత పాడుతోంది. కాని జీనుల వ్యాపారికి ఆకాశంలో ఏమీ కనిపించదు. వింత ఆకారంలో కాంతివంతమైన మబ్బుతునక మాత్రమే కదులుతున్నది.

"ఇది అన్యాపదేశంగా మనకు వస్తున్న సందేశం" అంటున్నదొకావిడ. కానీ జీవితంలో అన్యాపదేశ సందేశాలుండవు అని రాస్తాడు తన రిపోర్టులో.

మరో రోజు– వీథిలో నడుస్తున్నప్పుడు ఒకావిడ 'రాబర్ట్, రాబర్ట్' అని ఎవరినో పిలుస్తుంది. కాలవలో పడవ నడుపుతున్న అతడు వచ్చి ఆమె ఇచ్చిన సంచీ తీసుకొంటాడు. ఆవిడ తన భార్యేనా. అందులో వారానికి ఒక కుటుంబానికి వారానికి సరిపడా ఆహారముంది. కానీ "దగ్గరకు రాదు. అందరికీ ప్లేగు వచ్చింది" అంటుంది. అది హృదయ విదారకమైన దృశ్యమే. క్రూసోకు ద్వీపం మీద తను బతికిన రోజులు గుర్తుకొస్తాయి. ఒక అనూహ్యమైన ఒంటరితనం. భరించలేనప్పుడు ఇంగ్లండువైపు తిరిగి చేతులూపిన సమయాలు లేదా సముద్రంలోకి ఏమైనా కొట్టుకొచ్చాయేమోనని వెదకటం...

ప్లేగ్ రిపోర్ట్ నుండి మరికొంత... చంకలు, గజ్జల్లో వాపుతో ప్లేగుబాధ భరించలేక వీధిలో కేకలు వేసిన వ్యక్తి,

బట్టలు విప్పేసి నగ్నంగా పరిగెత్తాడు. తిరిగి రమ్మని వేడుకుంటూ భార్యాపిల్లలు అతడి వెంటపడ్డారు. పడవ ప్రమాదం తర్వాత ద్వీపం మీద తనూ ఇలాంటి పిచ్చి పనులెన్నో చేశాడు. ఎవరూ లేనిచోట మనిషి ఒంటరిగా చావక తప్పదు కదా!

ప్లేగు కాలంలో ఎన్నెన్ని వింత సంఘటనలో! కొందరు ఆరోగ్యంగా ఉన్నామనుకున్నారు. కానీ వాళ్ల నెత్తుట్లో కూడా ప్లేగు ఉంది. అవును. అందరం మరణానికి సిద్ధంగా ఉండాలి. లేదా ఇక్కడ ఎలా ఉంటే అలా ఊపిరొదలాలి.

ఒకనాడు క్రూసోకు ద్వీపం మీద ఒక అడుగుజాడ కనిపించింది. అంటే అక్కడికి ఎవరో వచ్చారన్నమాట. నువ్వు ఒంటరివి కాదు. ఎన్ని సముద్ర యానాలు చేసినా ఎక్కడ దాగినా నీ కోసం ఎవరో ఒకరు వస్తారు! అని దాని సంకేతం. ప్లేగు రోజుల్లో జనం ఇళ్లు వదలి, భార్యాపిల్లల్ని వదిలి లండన్‌వైపు పరిగెత్తుకొచ్చారు. ఆ మహమ్మారి తగ్గిన తర్వాత అందరూ వాళ్లను పిరికిపందలన్నారు. కానీ ప్లేగు కాలంలో బతకటమే ఒక సాహసం కదా! అది సైనికుడి చేతిలోని ఆయుధం కాదు. మృత్యువు స్వయంగా అశ్వారూఢురాలై వచ్చింది. అవునూ, తను చదవటం, రాయటం నేర్పించిన మనిషి తనకన్నా బాగా ఎలా రాస్తున్నాడు? గల్లాపెట్టెలో దగ్గర డబ్బులు లెక్కపెడుతూ కూర్చోకూడదు. పదాలు, పదబంధాల మీద పట్టు సాధించాలి...

ఈ లోకంలో పిడికెడు కథలే ఉన్నాయి. కానీ మనుషుల్ని గుర్తుపట్టటమెలా? ఎవరు తను? ఎవరు తన అనుచరుడు? ఎవరు యజమాని? ఎవరు బానిస? ఇద్దరూ సోదరులా, కవలసోదరులా? చేతులు కలిపినవారా? బద్ధశత్రువులా? వీళ్లను ఏ పేరుతో పిలుద్దాం? తనూ, తన అనుచరుడూ – సముద్రంలో ఎదురెదురుగా కదిలిన రెండు పడవలు. ఒకరు తూర్పుకు ప్రయాణిస్తుంటే మరొకరు పడమటివైపుకు. రెండు పడవలూ దగ్గరకు వస్తాయి. పలకరించుకోవచ్చు. చేతులూపుకోవచ్చు. కానీ సముద్రం అల్లకల్లోలంగా ఉంది. తుఫాను వాతావరణం. సముద్రపు ఉప్పునీళ్లు కళ్లల్లోకి చిమ్ముతున్నాయి. తెడ్లువేస్తే చేపలు ఒడ్డుకు కొట్టుకుపోయాయి. పడవలు ఒకదానికొకటి తగిలినంత దగ్గరకు వచ్చినా ఇద్దరూ చేతులు కలపరు.

ముక్తవరం పార్థసారథి
హైదరాబాద్. ఫోన్: 917 761 8708.

## అత్తవారూరికి

(శహన – అట)



యశోద ఠాకూర్

పల్లవి: అత్తవారూరికి అంపేరు మావారు
అయ్యయ్యో యికనేమి సేయుదునే ॥అత్త॥

అనుపల్లవి : కత్తికోతగాడు మగడేమి చేసునో
పొత్తు మరువకుండు పోయివచ్చెద సామి ॥అత్త॥

చరణము 1: ఊరికి నేబోయి యున్నప్పటికైన
తీరినట్టు గుట్టు దెల్పకు సామి ॥అత్త॥

చరణము 2: సారెకు మా బావ సవతియత్తతోను
పోరాడి ఎటులైన బొంకి వచ్చెద సామి ॥అత్త॥

'కేళీగోపాలమ్' - మల్లాది రామకృష్ణశాస్త్రి

# చదవండి...

- మిసిమి

**దృశ్యం నుంచి దృశ్యానికి:** కవిత్వం. వి.ఆర్. విద్యార్థి. ఈ పేరుకు తగినట్లు విద్యార్థి కాదు. లబ్ధప్రతిష్టులైన



కవిగా చెప్పారు అంపశయ్య నవీన్. యాభైఏళ్లనాడు వీరు రాసిన *అపరిచితులు* ఇదీ కవితా సంకలనవే ఎందరో మన్ననలు పొందింది. కాళోజీతో కలిసి తిరిగిన విద్యార్థి - *అంతిమ విజయం మానవుడిదే* అంటున్న ఆశావాది విద్యార్థి.
*పేజీలు: 84, వెల: ₹ 60/- ప్రతులకు: శ్రీమతి వేలూరి రత్నమాల, వరంగల్. ఫోన్: 90002 83672.*

**శ్రీ సూర్య చరితము:** కామసాని కృష్ణారెడ్డి. వీరు



సంకలనకర్తగా వెలువరించిన ఈ సూర్య చరితము సూర్యభగవానుని చరిత్ర, పురాణాలు, ఉపనిషత్తుల నుంచి సంగ్రహించిన - ప్రోదిచేసిన ఈ సంకలనం తయారు చేశారు ఎంతో శ్రమకోర్చి.
*పేజీలు: 152, వెల: పేర్కొనబడలేదు. ప్రతులకు: కామసాని కృష్ణారెడ్డి, ఫోన్: 996 352 5666.*

**భారతదేశంలో బౌద్ధ నిర్మూలన:** గుమ్మా వీరన్న అనువాదం - ఆంగ్లం: దొప్పలపూడి సత్యనారాయణ. సత్యనారాయణ గారు బౌద్ధంలో ఎంతో పరిశోధన



చేశారు. 2001లోనే 'బౌద్ధం ఎందుకు అంతరించింది' (భారతదేశంలో) అనే పుస్తకం రాశారు. తర్వాత ఆంగ్లంలో ఇదే విషయంపై రాశారు. ఎంతో పరిశోధన చేసి గ్రంథాలు చదివి వీరు 'వెలుగు చూడని వాస్తవాలు' అని 2014లో రాశారు. 1995లో నాగపూర్‌లో ఇండియన్ బుద్ధిస్ట్ కౌన్సిల్‌కి ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు, ఇన్ని అర్హతలున్న సత్యనారాయణగారు 'ఈ బౌద్ధ నిర్మూలన'కు న్యాయం చేశారని చెప్పవచ్చు. గుమ్మా వీరన్న హేతువాది. పూర్తిగా వామపక్షి - రావిపూడి వెంకటాద్రి శిష్యులు అనవచ్చు. వారికీ 'బౌద్ధ నిర్మూలన' అనువాదం చేయగల నేర్పు దండిగా ఉంది.
*పేజీలు: 220, వెల: ₹ 120/- ప్రతులకు: డా. గుమ్మా వీరన్న, 5-4-1413, శారదానగర్, వనస్థలిపురం పోస్ట్, హైదరాబాద్ - 500 070. ఫోన్: 986 668 1927.*

**వేణుగోపాల శతకం:** మనకు శతకాలాలేమి కొదవ? కార్వేటి నగరం - చిత్తూరి జిల్లా నుంచి వచ్చిన పోలిపెద్ది వేంకటరాయ కవి "వేణుగోపాల! భక్త సంత్రాణ శాల" అనే మకుటంతో ఈ శతకం సీసపద్యాలలో వెలువరించారు.




అయితే సాంఘిక చరిత్ర - అప్పటి కట్టుబాట్లు తెలియచెబుతూ ఒక ప్రయోజనం కోసం రాసినట్లుగా ఉంటుంది. ఎన్నో రంగుల బొమ్మలు - వేణుగోపాలస్వామి ఆలయ చరిత్రలో భాగమయిన పెద్దల కుటుంబాలను పరిచయం చేస్తూ వేశారు.
*పేజీలు: 280, వెల: ₹ 300/- ప్రతులకు: విశాలాంధ్ర, సాహితీ ప్రచురణలు, నవచేతన బుక్ హౌస్ మరియు నవోదయ బుక్‌హౌస్‌లు.*

**ఇందులేఖ:** ఇది ఇదివరకే వెలుగు చూసిన పుస్తకం. ***మిసిమి*** లో సమీక్ష చేయబడిన చరిత్ర. మళ్లీ కృపాకరరావుగారు, పాటిబండ్ల క్రాంతికుమార్ స్మృతిగా ఈ గ్రంథాన్ని ప్రకాశింపజేశారు.




చక్కని ముఖచిత్రం, కేరళ స్త్రీ సమాజపు చరిత్ర తెలుసుకోవటానికి 'చందు మీనన్' రాసిన ఈ చారిత్రక నవల చదవాలి.
*పేజీలు: 282, వెల: ₹ 250/-*

*ప్రతులకు: ముద్రిక ఆఫ్‌సెట్ ప్రింటర్స్, 26-13-64/ఎ, సన్యాసిరాజు స్ట్రీట్, గాంధీనగర్, విజయవాడ - 03. ఫోన్: 944 015 9456.*

**దృక్కోణాలు:** అంపశయ్య నవీన్. ఇది అంపశయ్య నవీన్ గారి నాలుగు రచనల సారం. (దృక్కోణం - సాహిత్య కబుర్ల సహస్రాబ్ది మేటి రచయితలు - సత్యనారాయణ రెడ్డికి నేను రాసిన ఉత్తరాలు-)



సినిమాలో కురుసోవా చేసిన అపూర్వ ప్రయోగాన్ని సాహిత్యంలో నేనెందుకు చేయకూడదు - అనే ఆలోచన రావటమే ఒక భావవిప్లవం - అది నవీన్ చేసి చూపించారు. అలాంటిదే *దృక్కోణం* నవల. ఎవరి కోణం వారిది. ఒక దృశ్యాన్ని చూపేటప్పుడు ఇది ప్రయోగమే. అంపశయ్య నవీన్ 'కాలరేఖలు' నవలకు సాహిత్య అకాడెమీ పురస్కారం పొందారు. కాని వీరి 'అంపశయ్య' నవల వీరి ఇంటి పేరుగా మారింది. అన్ని విధాలా ఆయన యశస్వీగా నిలిచారు.

*పేజీలు: 221, వెల: ₹ 300/- ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, నవచేతన పబ్లిషింగ్ హౌస్, నవ తెలంగాణా బుక్ హౌస్‌లు. ఫోన్: 040 - 24652387, 040 - 29884453, 040 - 27660013.*

**భావసుమాంజలి:** సింగంపల్లి సత్యనారాయణ - వీరి కవితలు చాలా 'సింపుల్'గా ఉండి ఎంతో అర్థాన్ని స్ఫురింపజేస్తాయి. "గంధం అడవికి - వ్యర్థం -



అందం ఊర్వశుల మధ్య అనర్థం" ఇలా ఉంటాయి. జీన్స్ శృంకలాల పరంపరను సింపుల్‌గా చెప్పారు!

*పేజీలు: 104, వెల: ₹ 100/-*

*ప్రతులకు: సి. సత్యనారాయణ, 939 హెచ్2/సి, వివేకానంద వీధి, కొర్లకుంట, తిరుపతి-517 501. ఫోన్: 917 704 0578.*

**కరోన:** దీర్ఘ కవిత - ఎస్.ఆర్. పృథ్వి. కరోన మహమ్మారి కవుల్నీ ఆవహించింది. కవిత్వమంటే దినపత్రికల్లో వార్తలు కాదని అనుభవంతో, భావోద్వేగంతో నిండింది కవితగా వెలుగుతుందని



మనకు తెలియదా? ప్రతి వార్తను కవిత్వంగా మలచాలనుకోవడం మనకు వస్తువు కరవయినపుడే పృథ్వి గారు సాహిత్య లోకానికి కొత్తేమీ కాదు. రసరాజు కితాబిచ్చారు. అయినా ఇందులో ఆక్రోశం, ఆక్రందన తప్ప కవిత్వమనటానికి ఎక్కడా ఆస్కారం కనిపించడంలేదు.

*పేజీలు: 32, వెల: ₹ 50/- ప్రతులకు: పి. ఉషారాణి, 3-866, ఎమ్.జి. స్ట్రీట్, రామకృష్ణా నగర్, రాజమహేంద్రవరం - 533 101.*

**జరీపూల నానీలు:** వడ్డేపల్లి సంధ్య. బాలసాహిత్య రచయిత్రి అయినా తన ప్రతిభను కవిత్వం, విమర్శ రూపాల్లో ప్రదర్శిస్తున్నారు. ఎన్నో పురస్కారాలు పొందిన సంధ్యగారు - 'ఊపిరి పోగులు తెగటం' ఊర్లు జీవనదానం చేయటం, పండగంతా అమ్మ



ముఖంలోనే' మరి పిల్లలు వస్తే అంతే కదా - పెద్దరికం అంటే పెత్తనం కాదు - అనురాగం పంచడం - ఇలా ఉంటాయి - రాలిపోతున్న నేతన్నలు - రైతన్నలు..

*పేజీలు: 62, వెల: ₹ 75/-*

*ప్రతులకు: బాలేష్ చిప్ప, 10-1-17/జి, శ్రీహరి నగర్, రామ్‌నగర్, కరీంనగర్ - 505001. ఫోన్: 98480 82822, 70360 00123.*

**ఆకాశమంత చూపు:** బి. గోవర్ధనరావు. కవిత్వం.



విస్తృతమైన కాన్వాస్ వస్తువును ప్రతిమగానో భావచిత్రంగానో చేసేటప్పుడు వస్తువుని మించిన ప్రయోగం సునిశిత దృష్టి కవిత్వంలో పుష్కలంగా కనిపిస్తాయి.

*పేజీలు: 107, వెల: ₹ 60/-*

*ప్రతులకు: ఎన్. సన్యాసిరావు, ఎడిటర్, విశాఖ సంస్కృతి. ఫోన్: 960 307 6777.*

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

*మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల - ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ ద్వారా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com), ద్వారాగానీ తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.*

**చందా వివరాలు:**

₹ 360/- (సంవత్సర చందా),
₹ 720/- (రెండు సంవత్సరాలకు),
₹ 1080/- (మూడు సంవత్సరాలకు),
₹ 1440/- (నాలుగు సంవత్సరాలకు).
₹ 1,800/- (అయిదు సంవత్సరాలకు)

BHIM G Pay
Paytm UPI PhonePe

**Ph: 939 343 6969**

## మిసిమి ప్రచురణలు



**నోబెల్ వ్యాసాలు** | **మిసిమి** పార్థసారథి వ్యాసాలు | **చిత్రకళా నీరాజనం** | చార్లీ చాప్లిన్ | బైరన్ | **పురస్కార సాహిత్యం**



పారిజాతం | **షెల్లీ జీవిత కథ** | సిద్ధార్థ | దోసిట చినుకులు | **నృత్యభారతి**

ప్రతులకు:
**మిసిమి**
కార్యాలయాన్ని సంప్రదించండి.
ఫోన్:
994 951 6567.

**మిసిమి** మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**